www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్ సిటీ*

గురువారం | 24-1-2019 | పేజీలు: 16 + 20 | వెల: రూ. 6.50 | సంపుటి: 15 సంచిక: 197

శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా. 8.54 తదుపరి పంచమి; నక్షత్రం: పుబ్బ సా. 6.22 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 12.59-2.27; దుర్ముహూర్తం: ఉ. 10.37-11.21, మ. 3.03-3.48; అమృతఘడియలు: మ. 12.36-2.03; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.54; సూర్యాస్తమయం: 6.01

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

భారీ బడ్జెటే

2 లక్షల కోట్లకు చేరే అవకాశం



- అన్ని శాఖల నుంచి అందిన ప్రతిపాదనలు
- సాగునీటి రంగానికి రూ.26 వేల కోట్లు
- రైతుబంధు సాయానికి రూ.12 వేల కోట్లు
- రుణమాఫీకి తొలివిడతగా 6 వేల కోట్లు
- విద్యుత్తు రంగానికి రూ.5 వేల కోట్లు
- ఆసరా పెన్షన్లకు రూ.400 కోట్ల ప్రతిపాదన
- 'ఓట్ ఆన్ అకౌంట్'కే శాసనసభ అనుమతి
- మూడు నెలల కోసమే ఓట్ ఆన్ అకౌంట్!

'ఓట్ ఆన్ అకౌంట్' మూడు నెలలకా? ఆరు నెలలకా? అన్నది తేలాల్సి ఉంది. ప్రస్తుతానికైతే.. మూడు నెలల కోసం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కు శాసనసభ అనుమతి పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికలు, కేంద్రంలో ఏర్పడే నూతన ప్రభుత్వం, కేంద్రం ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్ వంటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని దీని కాలాన్ని నిర్ణయిస్తారు.

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కొత్త బడ్జెట్ తుదిరూపు దిద్దుకుంటోంది. ఇప్పటికే 32 శాఖల నుంచి ప్రతిపాదనలు ఆర్థిక శాఖకు అందాయి. ఈ మేరకు బడ్జెట్‌కు తుదిరూపు ఇవ్వడంలో ఆర్థిక శాఖ నిమగ్నమైంది. ప్రభుత్వ ప్రాథమ్యాలు, ఆయా శాఖల నుంచి అందిన ప్రతిపాదనలు, రాష్ట్ర రాబడుల ఆధారంగా 'ఓట్ ఆన్ అకౌంట్' బడ్జెట్‌ను తీర్చిదిద్దుతోంది. సాధారణంగా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినా.. 12 నెలల కాలం ఆధారంగా పూర్తి స్థాయి బడ్జెట్ వ్యయ అంచనాలనే రూపొందిస్తుంటారు. అందుకే ఆర్థిక శాఖ అధికారులు 12 నెలల కాలానికి బడ్జెట్ అంచనాలను రూపొందిస్తున్నారు. శాసనసభ నుంచి మాత్రం ఓట్ ఆన్ అకౌంట్ (అనామతు) బడ్జెట్‌కు అనుమతి పొందనున్నారు. అంటే.. పరిమిత కాలానికి నిధుల వ్యయం కోసం అనుమతి పొందుతారు. పూర్తి స్థాయి బడ్జెట్ దాదాపు రూ.2 లక్షల కోట్ల వరకు ఉండే అవకాశాలున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో ప్రభుత్వం రూ.1,74,453 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. కొత్త బడ్జెట్‌లో దానికి కనీసం 15 శాతం పెంపు ఉంటుందని ఆర్థిక శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అదే జరిగితే 2019-20 సంవత్సరపు పూర్తి స్థాయి బడ్జెట్ రూ.2 లక్షల కోట్లకు చేరనుంది. ఇందులో

మిగతా 2వ పేజీలో...





ప్రియాంకం ఆరంభం

ప్రత్యక్ష రాజకీయాల్లోకి సోనియా తనయ

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియామకం

- నెరవేరిన కార్యకర్తల చిరకాల ఆకాంక్ష
- తూర్పు యూపీ ఇన్‌చార్జిగా నియామకం
- తొలిసారి అధికారికంగా పార్టీ బాధ్యతలు
- పశ్చిమ యూపీ ఇన్‌చార్జిగా జ్యోతిరాదిత్య
- గులాంనబీ హరియాణకు 'బదిలీ'
- లోక్‌సభ ఎన్నికల కోసం కాదు
- ప్రియాంకకు సవాల్ అప్పగించాం
- బీజేపీలో భయం మొదలైంది: రాహుల్

టైమొచ్చింది.. ఇక రావాలి!

ఎస్పీ-బీఎస్పీ దూరం పెట్టడంతో నిర్ణయం

అమెరికా వెళ్లి చెల్లెలితో మాట్లాడాకే ఖరారు

అన్నకు ముద్దుల చెల్లెలు..

రాహుల్‌గాంధీకి తొలి నుంచి సహకారం

'ప్రియాంక రావాలి, ఆమే రావాలి'... 20 ఏళ్లుగా కాంగ్రెస్ కార్యకర్తలు పదేపదే చేసిన నినాదం! కాంగ్రెస్ పార్టీని కాపాడేది, పూర్వ వైభవం సాధించిపెట్టేది ఆమె నాయకత్వమే అని వారి నమ్మకం! ఇన్నాళ్లకు, ఇన్నేళ్లకు కార్యకర్తల కల నెరవేరింది.

న్యూఢిల్లీ, జనవరి 23: ప్రియాంకగాంధీ వాద్రా క్రియాశీల రాజకీయాల్లో అడుగుపెట్టారు. ఆమెను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. తూర్పు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ప్రియాంక సోదరుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ఈ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం రాహుల్ యూపీలో పర్యటిస్తున్న సమయంలోనే ఈ ప్రకటన విడుదలైంది. తద్వారా... జాతీయ రాజకీయాల్లో అతికీలకమైన, అతి పెద్దదైన యూపీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కాంగ్రెస్ సంకేతాలు పంపింది. మూడు దశాబ్దాల

మిగతా 2వ పేజీలో...

వారికి కుటుంబమే పార్టీ.. మాకు పార్టీయే కుటుంబం!

ప్రియాంకపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు 14

ఆన్‌లైన్ ట్రెండింగ్‌లో నంబర్‌వన్

కొత్త పదవితో దుమ్ములేపుతున్న ప్రియాంక 13

కాంగ్రెస్‌కు 11వ వారసురాలు





5

అరుణ్ జైట్లీకి ఆపరేషన్

- రెండు వారాల పాటు విశ్రాంతి
- ఆర్థిక శాఖ బాధ్యత గోయల్‌కు
- బడ్జెట్‌కు ముందు పరిణామం

జేఈఈ మెయిన్ తుది కీ విడుదల

హైదరాబాద్, జనవరి23(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్-2019 పరీక్షల ఫలితాల తుది కీ విడుదలైంది. ప్రాథమిక కీపై అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం ఫైనల్ కీలో 11 జవాబులను మారుస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తుది కీని వెబ్‌సైట్‌లో బుధవారం పెట్టింది. ఈ పరీక్షలో ఏపీకి చెందిన విద్యార్థి అత్యధికంగా 350 మార్కులు సాధించినట్లు, తెలంగాణలో కొంత మంది విద్యార్థులు అత్యధికంగా 334 మార్కులు సాధించినట్లు సమాచారం. తుదికీలో మార్పుల కారణంగా విద్యార్థుల మార్కులు, ర్యాంకుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

కాళేశ్వరానికి కొత్త రుణం 8685 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

40 వేల కోట్లు దాటనున్న ప్రాజెక్టు అప్పు.. జూన్‌కల్లా నీళ్లు ఇవ్వాలన్నది లక్ష్యం



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి మరో రూ.8,684.95 కోట్ల రుణం తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇప్పటికే రూ.32,617 కోట్ల రుణం తీసుకున్నారు. తాజాగా తీసుకుంటున్న అప్పుతో ఆ మొత్తం రూ.40 వేల కోట్లు దాటనుంది. సుమారు రూ.80 వేల కోట్ల అంచనా వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ప్రాజెక్టు ద్వారా సుమారు 18 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడంతోపాటు, మరో 18 లక్షల

మిగతా 2వ పేజీలో...

ఆరు నెలల్లో 10 వేల కోట్లు కావాలి

ఖరీఫ్ సీజన్‌కు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి సాగునీరు అందించాలన్న సీఎం లక్ష్యాన్ని చేరుకోవాలంటే మార్చి నెలాఖరు వరకు ప్రాజెక్టుకు రూ.6,138 కోట్లు అవసరమని, జూన్ నాటికి మొత్తం రూ.10 వేల కోట్లు కావాలని అధికారులు అంచనాకు వచ్చారు. ఏయే పనులను ఎప్పుడెప్పుడు చేయాలి? అందుకు కావాల్సిన నిధుల వివరాలతో ఇరిగేషన్ శాఖాధికారులు ప్రత్యేక నివేదికను రూపొందించి.. సీఎంకు సమర్పించారు.



కాంగ్రెస్ కుట్ర

- ఆ పార్టీ అండతోనే సుజా ఆరోపణలు
- 11మందిని చంపిస్తే కేసెందుకు పెట్టలేదు?
- హతుల కుటుంబాలు ఎక్కడున్నాయో చెప్పాలి
- నాకు కాకిరెడ్డి పేరుగల బావమరిదే లేదు
- సుజా ఆరోపణలతో హైదరాబాద్‌లో ఉద్రిక్తత
- ట్యాంపరింగ్ నిజమైతే నేనెలా ఓడిపోతా
- నాడు బాబు నెగ్గింది ట్యాంపరింగ్‌తోనేనా?
- బీజేపీ నేత కిషన్‌రెడ్డి.. సిబ్బల్‌పై డీజీపీకి ఫిర్యాదు

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ కుట్రలో భాగంగానే సైబర్ నిపుణుడుగా చెప్పుకుంటున్న సయ్యద్ సుజా తనపై ఆరోపణలు చేశారని బీజేపీ మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు మాజీ మంత్రి కపిల్ సిబ్బల్ లండన్ వెళ్లి సుజాతో మాట్లాడించారని ఆరోపించారు. సుజా చేసిన ఆరోపణలను కిషన్‌రెడ్డి ఖండించారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 2014లో అటు కేంద్రం.. ఇటు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉందని, ఈవీఎంల

మిగతా 2వ పేజీలో...

అంతా కలిసి తెలంగాణ తెస్తే..

కొందరి చేతిలోనే అధికారం!

- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి
- ఈశ్వరీబాయికి అదే అసలైన నివాళి: ఖర్గే
- ఈతరం నేతల్లో విలువలేవీ: జైపాల్‌రెడ్డి
- నయా ఫ్యూడలిజానికి మారుపేరు కేసీఆర్
- 16 ఎంపీ సీట్ల సవాలుకు సై: గద్దర్



ఈశ్వరీబాయి స్మారక పురస్కారంతో గద్దర్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, జైపాల్‌రెడ్డి, గీతారెడ్డి, జానారెడ్డి తదితరులు

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తొలి దశ నుంచి మలి దశ ఉద్యమం వరకు అనేక మంది పోరాడి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తే.. ప్రస్తుతం అధికారాన్ని కొందరే అనుభవిస్తున్నారని కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. పరోక్షంగా కేసీఆర్‌ను ఉద్దేశించి ఆయన ఈ విమర్శలు చేశారు. అంబేడ్కర్ సిద్ధాంతాలకు కట్టుబడి చిన్న రాష్ట్రాల కోసం జీవితాంతం పోరాడిన ఈశ్వరీబాయి లాంటి మహనీయుల కారణంగానే నేడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అంతం చేసి, నియంతృత్వ పాలనను తీసుకురావాలన్న కుట్ర జరుగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, అదే ఈశ్వరీబాయికి ఇచ్చే అసలైన నివాళి అని స్పష్టం చేశారు. తాను బీఏ చదువుతున్న రోజుల్లో ఈశ్వరీబాయి గుల్బర్గా వచ్చారని, ఆ సమావేశానికి తాను కూడా వెళ్లానని చెప్పారు. తెలంగాణ పోరాట యోధురాలు ఈశ్వరీబాయి శతజయంతి ఉత్సవం ఆమె కుమార్తె గీతారెడ్డి అధ్యక్షతన బుధవారం రవీంద్రభారతిలో జరిగింది. కార్యక్రమానికి ఖర్గే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ కోసం ఈశ్వరీబాయి నాటి పాలకులు, పోలీసులను ఎదిరించి పోరాడారన్నారు. గద్దర్ పేదల కష్టాలను పాటల రూపంలో అపురూపంగా పాడతారని ప్రశంసించారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈశ్వరీబాయి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తానూ ఎమ్మెల్యేగా

మిగతా 2వ పేజీలో...

పేదల కోటా కఠినం

- క్రీమీ లేయర్‌తో పోలిస్తే ఎంతో తేడా
- అన్ని వనరుల ఆదాయం లెక్కలోకి
- వేతనాలు, వ్యవసాయ రాబడి కూడా
- దిగువ మధ్య తరగతికి కోటా కష్టమే!



న్యూఢిల్లీ, జనవరి 23: ఆర్థిక బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోటాకు అర్హత సాధించాలంటే ఆదాయ పరిమితి రూ.8 లక్షలు! ఓబీసీలు రిజర్వేషన్ పొందాలన్నా ఇదే ఆదాయ పరిమితి! కానీ, ఈడబ్ల్యూసీ కోటా పొందడం తేలిక కాదు! ఎందుకంటే.. ఓబీసీలతో పోలిస్తే ఈడబ్ల్యూసీ ఆదాయ నిబంధనను కఠినతరం చేయడమే! కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం (డీవోపీటీ) జారీ చేసిన ఆఫీసు మెమొరాండం ప్రకారం.. స్థూల ఆదాయం రూ.8 లక్షల్లోపు ఉన్న కుటుంబాలు ఈడబ్ల్యూసీలకు కేటాయించిన 10 శాతం కోటాకు అర్హులు. ఇక్కడ ఆదాయమంటే అన్ని వనరుల నుంచీ లభించేదని ఆ పత్రాల్లో స్పష్టం చేసింది. దీనికి, ఓబీసీల్లో క్రీమీ లేయర్ (సంపన్న శ్రేణి)ను గుర్తించడానికి నిర్దేశించిన నిబంధనకు చాలా

మిగతా 2వ పేజీలో...

8 లక్షల ఆదాయం ఉంటేే పేదలా?

- 10% ఈడబ్ల్యూఎస్ కోటా రాజ్యాంగ విరుద్ధం
- దేశంలో 80% సంపద అగ్రవర్ణాల చేతుల్లోనే
- సుప్రీం కోర్టులో జస్టిస్ ఈశ్వరయ్య పిటిషన్

14

రెండేళ్లలో 2.50 లక్షల రైల్వే ఉద్యోగాలు

10% ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు

రైల్వే మంత్రి పీయూష్ గోయెల్



Paramjyothi
పరంజ్యోతి

సద్గురుకృపతోనే సర్వబంధ విమోచనం



శ్రద్ధావాన్ లభతేజ్ఞానం తత్పరస్యం యతేంద్రియః
జ్ఞానం లబ్ధ్వాపరాం శాంతి మచిరేణాధిగచ్ఛతి

శ్రద్ధగలవాడు, గురూపదిష్ట వేదాంత వాక్యాన్ని తెలుసుకొని అనుష్ఠించడంపై ఆసక్తి గలవాడు, ఇంద్రియాలను జయించినవాడు బ్రహ్మజ్ఞానాన్ని పొందుతున్నాడు. సంశయాత్మకు ఈ లోకంలోగానీ, పరలోకంలోగానీ శాంతి లేదని గీతాచార్యుడు జ్ఞానయోగంలో చెప్పాడు. ఎవరికి దేవునిపై పరమభక్తి ఉంటుందో.. ఎవరి హృదయంలో దేవునిపై ఉన్నట్టుగా ఆచార్యునిపై పరమభక్తి ఉంటుందో.. అలాంటివారే మహాత్ములుగా విరాజిల్లుతారని 'యస్యదేవే పరాభక్తిః' అనే శ్రుతి వచనం వల్ల తెలుస్తోంది. ఆగమ సంప్రదాయంలో 'గు' త్రయమని ఉంది. అంటే.. గురువు, పరమ గురువు, పరాపరగురువు. సామాన్యంగా విద్యను నేర్పేవాడు గురువు. తన తత్వాన్ని శిష్యునికి బోధించి నిరంతరం సాధన చేయించేవాడు పరమ గురువు. పరమాత్మ దివ్యతత్వాన్ని, నిరంతర సాధనాపరంగా బ్రహ్మతత్వాన్ని స్వయముగా తెలియపరచేవాడు 'పరాపర గురువు'. "ఎవరి దర్శన మాత్రం చేత హృదయంలో బ్రహ్మానందమైన జ్ఞానోదయం భాసిస్తుందో అలాంటివాడే సద్గురువు. సర్వజ్ఞుడే గురువు" అని గురుగీత చెబుతుంది.

యో గురుస్స శివః ప్రోక్తః య శ్శివస్స గురుస్మృతః
వికల్పం యస్తు కుర్వీత సభవేత్పాతకీ గురౌ

..ఎవడు శివుడో, వాడే గురువు. ఎవరు గురువో వాడే శివుడు. గురు శివులకు భేదాన్ని పంచువాడు మహాపాపాత్ముడని స్కాంద పురాణాంతర్గతమైన 'గురుగీత' తెలిపింది. చిత్తభ్రమలతో నిత్యమూ చిందులాడే మనసు.. తనను తాను తెలుసుకొనే యోగం పరమ గురు కటాక్షం వల్లనే కలుగుతుంది. సద్గురుకృపతోనే సర్వ బంధాలూ విడివడతాయి తప్ప వేరు మార్గము లేదు. కనుక పరమ గురు చరణార విందాను సంధాన చిత్తముతో అంతరంగం నింపుకోవాలి. అదే జీవుడికి మోక్షమార్గం చూపుతుంది. 'సంశయాత్మా వినశ్యతి'.. సంశయంతో కూడిన వారి మనసు వినాశకారి. పరమగురు కరుణ కలిగిన వారికి అణు మాత్రమూ సందేహం ఉండదు. శిష్యుడు పరిపక్వ దశకు చేరుకోగానే గురువే శివుడిగా మారి ఈశ్వర రూపాన్ని చూపించగలడు. ఆత్మయందు దివ్యచైతన్యాన్ని నింపగలడు.

- మేఘశ్యామ (ఈమని), 83329 31376

పాస్‌పుస్తకాలకు రూ.69 కోట్లు విడుదల

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పంపిణీ చేస్తున్న ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ కమ్ పట్టాదారు పాస్‌పుస్తకాల(ఈ-పీపీబీ) ముద్రణకు 69 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. చెన్నై, కర్ణాటక, విజయవాడతో పాటు పలు రాష్ట్రాల్లో పాస్‌పుస్తకాల ముద్రణ జరుగుతోంది. ఒక్కో పాస్‌పుస్తకాన్ని రూ.157.50లకు ఆయా ప్రింటర్స్ ముద్రిస్తున్నారు. నిబంధనల ప్రకారం ముద్రించిన పాస్‌బుక్కులకు రూ.85 కోట్ల దాకా ఇవ్వాలి. ఇంకా 16 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి.

కాళేశ్వరానికి కొత్త రుణం 8685 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఇప్పటికే సుమారు రూ.40 వేల కోట్ల నిధులను వ్యయం చేశారు. ప్రాజెక్టు కోసం ఇప్పటికే వివిధ బ్యాంకులు సుమారు రూ.20,550 కోట్ల మేర రుణాలు ఇవ్వడానికి ముందు కొచ్చాయి. అలాగే, కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి కూడా రూ.12,067 కోట్ల రుణం తీసుకున్నారు. ప్రాజెక్టు అవసరాలను బట్టి ఈ నిధులు విడుదలవుతున్నాయి. తాజాగా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి మరో రూ.8,684.95 కోట్ల రుణాన్ని తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో రూ.5,405.39 కోట్లను పంపు హౌస్‌లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం కోసం ఉపయోగించనున్నారు. మరో రూ.3,279.56 కోట్లను కాళేశ్వరం ప్యాకేజీ-21లో భాగంగా నిజామాబాద్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టిన పైప్డ్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం వ్యయం చేయనున్నారు.



300 పారాయణాలు.. 2.1 లక్షల సప్తశతి శ్లోకాలు

- మూడో రోజు వైభవంగా సహస్ర చండీయాగం
- సీఎం కేసీఆర్ దంపతుల పూజలు



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న కేసీఆర్ దంపతులు

జగదేవ్‌పూర్, మర్కుక్ హైదరాబాద్, జనవరి 23: ఎర్రవల్లిలోని ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరుస్తోంది. వేద మంత్రోచ్చారణల మధ్య అక్కడ మహారుద్ర సహిత సహస్ర చండీయాగం వైభవంగా కొనసాగుతోంది. మూడోరోజైన బుధవారం రుత్విక్కులు 300 పారాయణాలు.. 2.1 లక్షల సప్తశతి శ్లోకాలు.. 44ఏకాదశ హోమాలు నిర్వహించారు. ఉదయం 8గంటలకు యాగం ప్రారంభం కాగా సీఎం కేసీఆర్ దంపతులు, ఇతర కుటుంబ సభ్యులు యాగశాలకు చేరుకొని సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఉదయం జరిగిన కార్యక్రమాల్లో భాగంగా కేసీఆర్ దంపతులు చండీమాతకు మహా మంగళహారతినిచ్చారు. దంపతి, సుహాసిని, కుమారి పూజల నిర్వహణతో మూడో రోజు ఉదయం కార్యక్రమాలు ముగిశాయి. మహారుద్ర యాగంలో భాగంగా శాంతి పాఠంతో ప్రారంభమై ఆవాహిత దేవతా పూజనం 41 ఏకాదశ రుద్ర అభిషేకాలను పూర్తి చేసి, మధ్యాహ్నం మూడు గంటల వరకు 41 ఏకాదశ హోమాలు, క్రమార్చన హారతి, మంత్రపుష్పాలు జరిపారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. తీర్థప్రసాద వితరణతో మహారుద్రం మూడో రోజు పరిసమాప్తి అయింది. రాజశ్యామల యాగంలో భాగంగా రాజశ్యామల మూల మంత్ర జపం, మంట ప్రార్చనలు, మూల మంత్ర హవనాలు, శరభసాలువ మూల మంత్ర జపం హవనం, మాతంగి మహావిద్య హవనము, ప్రదోష కాల మంట ప్రార్చనలు, కుంకుమార్చన, సహస్ర నామార్చన, హారతి మంత్ర పుష్పం చతుర్వేద స్వస్తి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బగళాముఖి యాగంలో భాగంగా.. ఆవాహిత దేవతా పూజానంతరం 10 వేల జపం పూర్తి చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు హరిద్రన్నముతో రెండు వేల మూల మంత్ర హవనం పూర్తి చేశారు. రాత్రి ఏడున్నరకు హారతి మంత్ర పుష్పము, తీర్థ ప్రసాద వితరణతో ఈ కార్యక్రమం పూర్తయింది. కార్యక్రమాల్లో నాయిని, ఈటల, ఎంపీలు వినోద్ కుమార్, కవిత, సంతోష్ కుమార్ , అనురాగ్ శర్మ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ట్యాంపరింగ్‌కు సంబంధించి తాను 11మందిని హత్య చేయిస్తే అపుడే ఎందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు. సుజాతో కపిల్ సిబల్ చేయించిన ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. భారత ప్రజాస్వామ్యానికే తలవంపులు తెచ్చేలా కాంగ్రెస్ నేతలు సుజాతో మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. సుజా ఆరోపించినట్లు తాను 11మందిని హత్య చేయిస్తే.. హతులకు సంబంధించిన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆ కుటుంబాలు ఎక్కడున్నాయో చెప్పాలన్నారు. తనకు కాకిరెడ్డి పేరుగల బావమరిది ఎవరూ లేరన్నారు. 11మందిని చంపేసి కిషన్‌బాగ్ మతఘర్షణల్లో వారు చనిపోయినట్లు చిత్రీకరించారంటూ కట్టుకథలు ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిపై సీబీఐ దర్యాప్తు కోరతామని స్పష్టం చేశారు. మూడు పర్యాయాలు శాసన సభ్యుడుగా, మరో మూడుసార్లు పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహించిన తనపై కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు ఆపార్టీ దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమన్నారు. హత్యా రాజకీయాల సంప్రదాయం తమకులేదన్నారు. సుజా, కపిల్ సిబల్ వ్యాఖ్యలతో హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవీఎంల టాంపరింగ్‌కు అవకాశమున్న పక్షంలో కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎలా అధికారంలోకి వస్తుందని, తాను అంబర్‌పేటలో ఎలా ఓడిపోతానని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ విజయం సాధిస్తే ఈవీఎంలు బాగా పని చేసినట్టని, ఓడిపోతే ఈవీఎంలపై అనుమానాలా..? అని ఆయన ప్రశ్నించారు. ఏపీ సీఎం చంద్రబాబు 2014లో ఈవీఎంలను టాంపరింగ్ చేసి గెలిచారా? అని ప్రశ్నించారు.

విచారణకు డీజీపీ ఆదేశం

కిషన్‌రెడ్డి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా డీజీపీ మహేందర్‌రెడ్డి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్‌ను ఆదేశించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల్ని పరిశీలించి, న్యాయపరమైన సలహా తీసుకుని తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు.

డీజీపీకి కిషన్‌రెడ్డి ఫిర్యాదు

దేశ గౌరవాన్ని అంతర్జాతీయ స్థాయిలో తగ్గించేందుకు కుట్ర చేస్తున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలంటూ డీజీపీ మహేందర్ రెడ్డికి కిషన్ రెడ్డి ఫిర్యాదు చేశారు. హ్యాకథాన్ పేరుతో తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబ్బల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కపిల్ సిబల్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, కుట్ర పూరితంగా వారు చేస్తున్న చర్యలు మతపరమైన ఘర్షణలు ప్రేరేపించేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. 13 మే 2014న ఉప్పల్ గెస్ట్‌హౌస్‌లో 11 మందిని హత్య చేసినదాంట్లో తన ప్రమేయం ఉందని ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ హత్యలు వెలుగులోకి రాకుండా ఉండేందుకు కిషన్‌బాగ్‌లో మత ఘర్షణలు సృష్టించినట్లు చెబుతున్నారని ఫిర్యాదులో వెల్లడించారు. ఇదంతా చూస్తుంటే పక్కా పథకం ప్రకారం ఇరు వర్గాల మధ్య ఘర్షణలు సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్ర జరుగుతున్నట్లు తెలుస్తుందన్నారు. లండన్‌లో నిర్వహించిన హ్యాకథాన్ కార్యక్రమంలో కపిల్ సిబ్బల్ ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

ప్రియాంకం ఆరంభం

(మొదటిపేజీ తరువాయి)

కిందటిదాకా తమకు పెట్టని కోటగా ఉన్న యూపీలో పుంజుకోవడమే లక్ష్యమని చెప్పకనే చెప్పింది. ఇందులో భాగంగా మొట్టమొదటిసారిగా యూపీని తూర్పు, పశ్చిమగా విభజించారు. తూర్పు యూపీ ఇన్‌చార్జిగా ప్రియాంకను నియమించగా... పశ్చిమ యూపీ ఇన్‌చార్జి బాధ్యతలను మధ్యప్రదేశ్‌కు చెందిన యువనేత జ్యోతిరాదిత్య సింధియాకు అప్పగించారు. ఇప్పటిదాకా యూపీ బాధ్యతలు చూసిన సీనియర్ నేత గులాంనబీ ఆజాద్‌ను హరియాణా పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమించారు. ఇక... ప్రస్తుతం కర్ణాటక కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ఉన్న కేసీ వేణుగోపాల్‌కు పార్టీ ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎంతో సంతోషం: రాహుల్

ప్రియాంక నియామకం మరో రెండునెలల్లో రానున్న లోక్‌సభ ఎన్నికలను ఉద్దేశించి జరిగింది కాదని రాహుల్ స్పష్టం చేశారు. "పేదలు, యువత, రైతులకు అండగా నిలవడమే కాంగ్రెస్ సిద్ధాంతం. దీనిని యూపీ ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ప్రియాంక, జ్యోతిరాదిత్యకు బాధ్యతలు అప్పగించాం" అని తెలిపారు. అమేఠీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాజా పరిణామాలతో బీజేపీలో భయం మొదలైందని వ్యాఖ్యానించారు. ప్రియాంక ఎన్నికల్లో పోటీచేస్తారా అని ప్రశ్నించగా... "ఆమె కావాలనుకుంటే తప్పకుండా పోటీ చేయవచ్చు. యూపీ, గుజరాత్‌తోపాటు మరెక్కడా మేం వెనక్కి తగ్గడంలేదని చెప్పడమే నా ప్రధాన ఉద్దేశం"అని బదులిచ్చారు. కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా ఎస్పీ, బీఎస్పీలు పొత్తుపెట్టుకున్నందుకే ప్రియాంకను బరిలోకి దించారనే వాదనలను కొట్టివేశారు. "మాయావతి, అఖిలేశ్ పొత్తుతో దీనికి ఎలాంటి సంబంధం లేదు. సాధ్యమైన చోటల్లా ఎస్పీ, బీఎస్పీకి మేం సహకరిస్తాం. మా అందరి ఉమ్మడి శత్రువు ఒకరే" అని తెలిపారు.

కొందరి చేతిలోనే అధికారం!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నానన్నారు. రాజకీయాల్లో సైద్ధాంతిక స్ఫూర్తే ముఖ్యమని ఈశ్వరీబాయి చాటి చెప్పారని.. నేటితరం నేతల్లో అది కనిపించడం లేదని వాపోయారు. కాంగ్రెస్‌లోకి వస్తే అనేక పదవులు వస్తాయని తెలిసినా నమ్మిన సిద్ధాంతం కోసం అంబేద్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీలోనే కొనసాగిన గొప్ప వ్యక్తి ఈశ్వరీబాయి అని కొనియాడారు. జానారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఈశ్వరీబాయి అధికార పక్షాన్ని ప్రశ్నిస్తుంటే తాను చూశానన్నారు. నేటి తరం ఈశ్వరీబాయిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం నేతలు రాజకీయాలను బిజినెస్ చేశారని, బట్టలు మార్చుకున్నంత తేలికగా పార్టీలు మారుస్తున్నారని వీహెచ్ ఆవేదన వ్యక్తం చేశారు. తొలిదశ తెలంగాణ పోరాట యోధులను కూడా గుర్తుంచుకోవాలని కేసీఆర్‌కు హితవు పలికారు. లేకపోతే భవిష్యత్‌లో కేసీఆర్‌ను కూడా ఎవరూ గుర్తుంచుకోరని హెచ్చరించారు.

అంతా ఆయన ఇష్టారాజ్యమే: గద్దర్

ప్రస్తుతం రాష్ట్రంలో నియో ఫ్యూడలిజం పాలన సాగుతోందని, సీఎం కేసీఆర్ దానికి మారుపేరుగా నిలిచారని గద్దర్ విమర్శించారు. ఇప్పటివరకు కేబినెట్‌ను విస్తరించకుండా కేసీఆర్ 'అంతా నా ఇష్టం' అన్న రీతిలో వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఇదే నియో ఫ్యూడలిజానికి నిదర్శనమన్నారు. భౌగోళిక తెలంగాణను మాత్రమే సాధించామని, సామాజిక, సంపూర్ణ తెలంగాణను సాధించాల్సి ఉందని చెప్పారు. ప్రతిపక్షాన్ని లేకుండా చేయాలని చూడడం తగదన్నారు. ప్రశ్నించే ప్రతిపక్షమే లేకుంటే అసెంబ్లీ ఎందుకని ప్రశ్నించారు. ఓడిపోయినట్లు కనిపించినా కాలం ఎప్పుడూ ఓడిపోదని, అది ముందుకే పోతుందన్న విషయాన్ని గుర్తుంచుకొని నేటితరం సంపూర్ణ తెలంగాణ కోసం ఉద్యమించాలని గద్దర్ తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 16 ఎంపీ సీట్లు గెలుస్తామని సీఎం కేసీఆర్ విసిరిన చాలెంజ్‌ను స్వీకరిస్తున్నానన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన 'సేవ్ కాన్‌స్టిట్యూషన్-సేవ్ ఇండియా' నినాదంతో త్వరలోనే పల్లెపల్లెలో పర్యటిస్తానని, తన వెంట నడవాలని యువతరాన్ని కోరారు. 'కోపం లేకపోతే ఉద్యమించడం కష్టం. కేవలం కోపమే ఉంటే లక్ష్యాన్ని సాధించలేం. కోపానికి సిద్ధాంతం తోడైతేనే సామాజిక మార్పు సాధ్యమవుతుంది' అని రామన్ మెగసెసే అవార్డు గ్రహిత ప్రొఫెసర్ శాంతా సిన్హా అన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ఎదిరించేందుకు ఈశ్వరీబాయి అంబేద్కర్ సిద్ధాంతాన్ని అనుసరించి పోరాడారని గుర్తు చేశారు. ఈశ్వరీబాయిపై అగ్నిశిఖ పేరిట తీసిన షార్ట్ ఫిల్మ్‌ను, 'అగ్నిశిఖ' పుస్తకాన్ని, కేలండర్, ఈశ్వరీబాయి విగ్రహాన్ని ఖర్గే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గద్దర్‌కు ఈశ్వరీబాయి మెమోరియల్ అవార్డును ప్రదానం చేశారు.

పేదల కోటా కఠినం

(మొదటిపేజీ తరువాయి)

తేడా ఉంది. స్థూల ఆదాయం రూ.8 లక్షలు లేదా దానికి పైబడిన వ్యక్తులు క్రీమీ లేయర్ పరిధిలోకి వస్తారు. వీరు ఓబీసీ రిజర్వేషన్‌కు అనర్హులు. అయితే ఓబీసీల విషయంలో వేతనాలు, వ్యవసాయ భూమి ద్వారా వచ్చే మొత్తాన్ని ఆదాయంగా పరిగణించడం లేదు. అగ్రవర్ణాలకు వచ్చేసరికి తల్లిదండ్రుల జీతం, వ్యవసాయ భూమి ద్వారా వచ్చే ఏ ఆదాయాన్నైనా కలపడంతో ఆర్థికంగా బాగా బలహీన కుటుంబాలకే రిజర్వేషన్ దక్కుతుంది. అంతేకాకుండా.. ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో ఐదు ఎకరాల పొలం ఉన్నా, మున్సిపాలిటీల్లో 1000 చదరపు అడుగుల ఫ్లాట్ లేదా 100 చదరపు గజాలు, మున్సిపాలిటీయేతర ప్రాంతాల్లో 200 చదరపు గజాల నివాస స్థలం ఉన్నా ఆ కుటుంబాలు కోటా పరిధి నుంచి ఆటోమేటిక్‌గా తొలగింపునకు గురవుతాయి. ఇలా ఈ కఠిన నిబంధనలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీయేతరుల్లోని ఒక పెద్ద సెక్షన్‌ను కొత్త కోటాకు దూరం చేయనున్నాయి. ముఖ్యంగా దిగువ మధ్యతరగతి కుటుంబాలపై అనర్హత వేటు పడుతుందని భావిస్తున్నారు. అయితే అగ్రవర్ణాలకు ఆదాయ పరిమితి ఓబీసీలతో సమానంగా ఎలా ఉంటుందని పలువురు సామాజిక న్యాయ వ్యాఖ్యతలు ప్రశ్నిస్తున్నారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటు వల్లే ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించారని, ఆర్థిక ప్రాతిపదిక రాజ్యాంగంలో లేదని వారు గుర్తు చేస్తున్నారు.

ఐఐటీల్లో అదనంగా 5,100 సీట్లు

వచ్చే ఏడాది ఐఐటీల్లో 5,100 సీట్లు పెరగనున్నాయి. ఢిల్లీ యూనివర్సిటీలోనూ 16,000 సీట్లు, ఐఐఎంలలో అదనంగా 800 సీట్లు పెరుగుతాయని భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థల్లో 3 లక్షల అదనపు సీట్లు అందుబాటులోకి రానున్నాయని మానవ వనరుల శాఖ అంచనా.

భారీ బడ్జెటే

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానంగా సాగునీటి పారుదల, వ్యవసాయ, సంక్షేమ శాఖల పద్దులే భారీగా ఉండబోతున్నాయి. రానున్న ఐదేళ్లలో సాగునీటి రంగానికి రూ.2 లక్షల కోట్లను వెచ్చించనున్నట్లు సీఎం కేసీఆర్ ఇటీవలే ప్రకటించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, దేవాదుల, డిండి వంటి ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను దృష్టిలో పెట్టుకుని ఈసారి సాగునీటి పారుదల శాఖ రూ.26 వేల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లు సమాచారం. ఇకరైతుబంధుకు రూ.12 వేల కోట్లు నిధులు కావాలంటూ ప్రతిపాదించినట్లు తెలిసింది. లక్ష లోపు పంట రుణాలమాఫీకి రూ.24 వేల కోట్లు అవసరమవుతాయని భావిస్తోంది. రుణమాఫీని గతంలో మాదిరిగానే నాలుగు విడతల్లో అమలు చేస్తామని సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో తొలి విడత కింద ఈ బడ్జెట్‌లో రూ.6 వేల కోట్లు కావాలంటూ ప్రతిపాదించినట్లు సమాచారం. కాగా విద్యుత్తు రంగానికి రూ.5 వేల కోట్లు కావాలంటూ ఆ శాఖ ప్రతిపాదించింది. ఇదివరకు ఈ శాఖకు రూ.4800 కోట్లను కేటాయించారు.

సంక్షేమానికి నిధుల పెంపు..

వివిధ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ఈసారి పెద్దపీట వేయనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు నిధులను పెంచనుంది. గత బడ్జెట్ కన్నా అదనంగా 5 శాతం మేర నిధులను పెంచాలంటూ ఆయా శాఖలు ప్రతిపాదించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వైద్య ఆరోగ్య శాఖకు రూ.7375 కోట్లను కేటాయించారు. ఉన్నత విద్య, మాధ్యమిక, ప్రాథమిక, సాంకేతిక విద్యలన్నింటికీ కలిపి రూ.13,278 కోట్ల వరకు కేటాయించారు. అయితే.. ఈసారి విద్యా, వైద్య శాఖల నుంచి 10 శాతం వరకు పెంపు ప్రతిపాదనలు అందినట్లు సమాచారం. ఇక ఆసరా పెన్షన్లకు ఈసారి నిధులను పెంచాలని గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతిపాదించింది. రాష్ట్రంలో 13,27,090 మంది పెన్షన్‌దారులుండగా, వయస్సు కుదింపుతో మరో ఏడు లక్షల మంది కొత్తగా అర్హులవుతారని, ఆసరా పెన్షన్‌దారుల సంఖ్య 20 లక్షలకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఫలితంగా పెన్షన్ల భారం 200 కోట్లకు చేరుతుందని, పెన్షన్లను రెట్టింపు చేస్తే 400 కోట్లు అవసరమవుతాయని భావిస్తున్నారు.

పోలీస్ శాఖకు 5 వేల కోట్లు

కొత్త బడ్జెట్‌లో తమకు రూ.5 వేల కోట్లు కేటాయించాలని పోలీసు శాఖ ప్రతిపాదించింది. కమాండ్ కంట్రోల్ సెంటర్, జిల్లా పోలీస్ కేంద్రాల (డీపీవో) నిర్మాణాలతోపాటు కొత్త వాహనాలు, సీసీ కెమెరాలు, సాంకేతిక పరికరాల కొనుగోలు తదితర అంశాల్ని బడ్జెట్‌లో పొందుపర్చారు. ప్రణాళిక, ప్రణాళికేతర బడ్జెట్ కలిపి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి అందజేశారు. బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా డీపీవోల నిర్మాణాలు కొంత నెమ్మదిగా సాగుతున్నాయి. ఈ సారి బిల్లులు చెల్లించి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయనున్నారు.

లోకం తీరు



చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
అదిలాబాద్	16.8	31.0
వరంగల్	17.0	29.5
హైదరాబాద్	17.9	29.9
నల్లగొండ	18.0	29.4
రామగుండం	18.4	30.0

రేపు అక్కడక్కడ వర్షాలు

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శుక్రవారం అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గురువారం పొడి వాతావరణమే ఉంటుందని, ఉదయం, రాత్రి వేళల్లో కొన్ని చోట్ల పొగమంచు ఉంటుందని చెప్పారు. దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ ఉపరితల ఆవర్తనం నుంచి తెలంగాణ వరకు ఉపరితల ద్రోణి ఏర్పడింది.



మధ్యప్రదేశ్ ఈవీఎంల్లో లోపాల్లేవా?

కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు బాగా పనిచేసినట్టు. ఓడితే అవకతవకలకు పాల్పడినట్టా. ఇటీవల ఈవీఎంల ద్వారానే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. ఈవీఎంలలో లోపాల వల్లే మధ్యప్రదేశ్‌లో గెలిచామని, లేదా గెలిచేలా ఈవీఎంలలో అవకతవకలకు పాల్పడ్డామని వారు ప్రకటించాలి. ఈవీఎంల ద్వారా గెలిచినందున వారు మధ్యప్రదేశ్‌లో అధికారం వీడాలి.

- నిర్మలా సీతారామన్, కేంద్ర రక్షణ మంత్రి



ఈవీఎంలు బ్రహ్మాండం

ఈవీఎంలు బ్రహ్మాండంగా పని చేస్తున్నాయి. ఈవీఎంలపై ఆరోపణలు అర్థరహితం. వాటిపై అనుమానాలు ఏమైనా ఉంటే వీవీప్యాట్ చిట్టీలు లెక్కిస్తే తేలిపోతుంది. ఈవీఎంలను ప్రవేశపెట్టిన కాంగ్రెస్ వాళ్లే వాటి విశ్వసనీయతను ప్రశ్నించడం హాస్యాస్పదం.

- నితీశ్ కుమార్, బిహార్ ముఖ్యమంత్రి

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.61	పాత ధర 71.64
కొత్త ధర రూ.75.61	కొత్త ధర 71.64

మార్పులేదు



ధూమపానం మాన్పించే మొబైల్ యాప్

న్యూయార్క్, జనవరి 23: ధూమపాన అలవాటును మాన్పించడంతోపాటు, దాని వల్ల వచ్చే వృద్ధాప్య ఛాయలను పసిగట్టి మనకు చెప్పే సరికొత్త మొబైల్ యాప్‌ను అమెరికా శాస్త్రవేత్తలు రూపొందించారు. 'గెరో హెల్త్‌స్పాన్' అనే ఈ యాప్ సాయంతో.. పొగ తాగడం వల్ల శరీరంలో జరిగే మార్పులను ఏ రోజుకా రోజు తెలుసుకోవచ్చని వారు తెలిపారు. అంతే కాకుండా రోజువారి ఫలితాలను బట్టి ఎలాంటి ఆహారం తీసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుందో, ఆ అలవాటు ఎలా మానుకోవాలో ఈ గెరో హెల్త్‌స్పాన్ చెబుతుందని దాన్ని తయారు చేసిన రోస్‌వెల్ పార్క్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్తలు తెలిపారు.

గర్భంలోనే గుండె జబ్బు మొదలు

లండన్, జనవరి 23: గర్భవతిగా ఉన్నప్పుడు ఊబకాయం వచ్చిన మహిళకు పుట్టే పిల్లలకు గుండె జబ్బులు వస్తాయని లండన్‌లోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనంలో తేలింది. ఊబకాయం లేనప్పుడు పుట్టిన వారి కంటే.. ఊబకాయంతో ఉన్నప్పుడు పుట్టిన పిల్లలకే హృద్రోగాల ప్రమాదం ఎక్కువని వారు చెప్పారు. గర్భంలో ఉన్న శిశువుకు అవసరమైనంత ఆక్సిజన్ అందకపోవడం వల్ల పలు సమస్యలు తలెత్తుతాయని, అప్పుడే గుండె జబ్బులకు కూడా మొదలవుతాయని తెలిపారు.

కొడుకు లేని లోటు తీర్చుతున్న వైనం

సూర్యాపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తనను కళ్లలో పెట్టుకుని కాపాడుకున్న కన్నతండ్రి అనారోగ్యానికి గురికావడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయింది. తమకు జీవనాధారమైన వ్యవసాయం చేసేవారు లేకపోవడంతో.. తనే నాగలి పట్టి పొలం వెళ్లింది. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని తుల్జారావుపేటకు చెందిన బానోతు సుశీల కథ ఇది. ఆమె తండ్రి తేజావత్ బిక్షం అదే మండలంలోని జగన్‌నాయక్‌తండాలో ఉంటున్నారు. బిక్షం తన ముగ్గురు కుమార్తెలకు పెళ్లి చేసి పంపించాడు. గత ఏడాది అనారోగ్యం పాలవడంతో ఇంటికే పరిమితమయ్యాడు. చూసే దిక్కు లేక అనారోగ్యంతో ఇంటిలో పడి ఉన్న తండ్రిని చూసి సుశీల చలించిపోయింది. అతడి కోసం భర్తతో సహా పుట్టింటికి వచ్చేసి వ్యవసాయాన్ని చేపట్టింది. సుశీల భర్త ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. బిక్షంకు కొడుకులు లేని లోటును సుశీల తీరుస్తోందని గ్రామస్తులు ఆమెను కొనియాడుతుండటం గమనార్హం.



● నాన్నకు వ్యవ'సాయం'గా హలం పట్టిన అతివ

ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు

» బస్సు రోడ్డు పక్కన నిలిపివేత

పెద్దపల్లి టౌన్, జనవరి 23: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు మార్గమధ్యంలో గుండెపోటు వచ్చింది. నొప్పి గుండెను మెలిపెడుతున్న ఆ స్థితిలో కూడా ప్రయాణికుల ప్రాణాల్ని కాపాడేందుకే ఆలోచించిన ఆ డ్రైవర్, బస్సును రోడ్డుపక్కన ఆపి.. స్టీరింగ్‌పై కుప్పకూలిపోయాడు. పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ వద్ద బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. తీవ్ర అస్వస్థతకు గురైన డ్రైవర్ మహేందర్‌కు బస్సులోనే ఉన్న సింగరేణి డాక్టర్ వెంకట రమణ, ప్రథమ చికిత్స చేశారు. అదే బస్సులో ప్రయాణిస్తున్న సింగరేణి డ్రైవర్ తిరుపతి, బస్సును పెద్దపల్లి ఆస్పత్రికి తరలించాడు. అయితే, గుండె చికిత్సకు కావాల్సిన పరికరాలు లేవని పెద్దపల్లి ఆస్పత్రి సిబ్బంది చెప్పారు. కరీంనగర్‌కు తరలించేందుకు తమ అంబులెన్స్‌లో డీజిల్ కూడా లేదనడంతో ప్రయాణికులు డబ్బులు పోగు చేసి డీజిల్ పోయించారు. అనంతరం కరీంనగర్ ఆస్పత్రికి తరలించడంతో మహేందర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.



చికిత్స పొందుతున్న డ్రైవర్ మహేందర్

బెదిరింపులకు భయపడం

» ప్రజల సంక్షేమమే ధ్యేయం.. చిల్లర రాజకీయాలొద్దు: ఉత్తమ్



మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హుజూర్‌నగర్, జనవరి 23: బెదిరింపు రాజకీయాలకు భయపడబోమని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం పంచాయతీలో కాంగ్రెస్ మద్దతుదారుల తరఫున బుధవారం ఆయన ప్రచారం నిర్వహించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు తొలగిస్తామని అధికార పార్టీ నాయకులు బెదిరించడం శోచనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో అందరికీ సమాన హక్కు ఉంటుందని, టీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఓట్ల కోసం అధికార పార్టీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

ప్రపంచ లిపిల సరసన గుంజాల గోండి లిపి

» ప్రొఫెసర్ జయధీర్



నార్నూర్, జనవరి 23: గుంజాల గోండి లిపి ప్రపంచ స్థాయి లిపిల సరసన చేరిందని గోండు లిపి అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు అన్నారు. ఆదివాసీ కళలు, జానపద వాయిద్యాలు అంతరించి పోతున్న తరుణంలో ప్రస్తుతం వాటిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని గుంజాలలో గోండి లిపి అధ్యయన కేంద్రంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతరించిపోతున్న సంగీతం, జానపద కళలను కాపాడుకొనేందుకు తెలంగాణ రచయితల వేదిక వంటి సంస్థలతో కలిసి.. మార్చి 2,3 తేదీల్లో 40 రకాల ఆదివాసీ సంగీత వాయిద్యాలతో హైదరాబాద్‌లో ప్రదర్శన ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రపంచలిపిల్లో గుంజాల గోండు లిపిని యూనిక్ కోర్డ్ అధికారికంగా ప్రకటించడం జరిగిందన్నారు. గోండి లిపిలోనే నిఘంటువు తయారు చేస్తున్నామని, త్వరలోనే మూడో వాచకం అందుబాటులోకి తెస్తామన్నారు.

ఎల్ఈడీ వీధి దీపాలకు మార్చి దాకా గడువు

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ఎల్ఈడీ వీధి దీపాలను అమర్చుకోవడానికి గడువును మార్చి 31వ తేదీ దాకా పొడిగించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీఎస్‌రెడ్‌కో) నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ఎల్ఈడీ 15 వాట్ల బల్బుకు 2,171 రూపాయలు, 75 వాట్ల బల్బుకు రూ.5,318లుగా ధరలను నిర్దేశించారు. నగర పాలక సంస్థలు, పంచాయతీలు ఎల్ఈడీ దీపాలను మార్చి నెలాఖరు వరకు అమర్చుకునే అవకాశం ఉంది.

నేతాజీ స్ఫూర్తిని కొనసాగించాలి: కవిత

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్ అందించిన స్ఫూర్తిని అందరూ కొనసాగించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ టీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఆయన జయంతి(జనవరి 23) సందర్భంగా కవిత బుధవారం ఈ మేరకు ట్వీట్ చేశారు. 'ఐక్యత, అంకితభావం, త్యాగం' అనే నినాదంతో నేతాజీ ఇచ్చిన సందేశాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేసుకున్నారు.

ఈఆర్‌సీలో పోస్టుల దరఖాస్తుకు రేపే ఆఖరు

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్ఈఆర్‌సీ) చైర్మన్, టెక్నికల్, ఫైనాన్స్ సభ్యుల పోస్టులకు నామినేషన్ దాఖలు చేసే గడువు శుక్రవారంతో ముగియనుంది. ఈఆర్‌సీలో పోస్టులన్నీ ప్రస్తుతం ఖాళీగా ఉండటంతో ఆయా పోస్టుల భర్తీ కోసం తెలంగాణ ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రతీ పోస్టుకు ఇద్దరి జాబితాను సిద్ధం చేసి, ఆ జాబితాను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. ఇప్పటిదాకా 44 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం దాకా గడువు ఉండటంతో మరో 20 దాకా నామినేషన్లు వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

తిరుపతి వరకు 'హమ్‌సఫర్'

» దేశవ్యాప్తంగా 22 రైళ్ల గమ్యస్థానాలు పొడిగింపు

న్యూఢిల్లీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 22 రైళ్ల గమ్యస్థానాన్ని పొడిగిస్తూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల మీదుగా ప్రయాణిస్తున్న రైళ్లు కూడా వీటిలో ఉన్నాయి. రైల్వేమంత్రి పియూష్ గోయల్ బుధవారం ఢిల్లీలో ఆ వివరాలను వెల్లడించారు. హౌరా-విజయవాడ హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను తిరుపతి వరకు పొడిగించారు. ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలోనూ ఈ రైలు ఆగుతుంది. అలాగే, కటక్-బ్రహంపూర్ మెము రైలును ఇచ్ఛాపురం వరకు, విశాఖపట్టణం-పలాసా ప్యాసింజర్ రైలును బ్రహంపూర్ వరకు, సికింద్రాబాద్-తాండూర్ మెము రైలును చిత్తాపూర్(కర్ణాటక) వరకు పొడిగించారు. మిర్యాలగూడ-కాచిగూడ డెము రైలును నడికుడి వరకు పొడిగించారు. ఈ రైలు కొండ్రపోల్, విష్ణుపురం, పొందుగులలోనూ ఆగుతుంది.

స్టాంప్స్ కుంభకోణంలో ఐదుగురి సస్పెన్షన్

» ఇద్దరు ఉద్యోగులపై క్రిమినల్ కేసులు, జిల్లా రిజిస్ట్రార్ తొలగింపు

ఆదిలాబాద్ టౌన్, జనవరి 23: ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్టాంపుల కుంభకోణంపై అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. డిసెంబర్ 13న ఇదే శాఖలో స్టాంప్స్ విక్రయంలో రూ.78లక్షలకు పైగా అక్రమాలు జరిగాయని.. ఆ శాఖ జిల్లా రిజిస్ట్రార్ జైవంత్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో డిసెంబర్ 18న 'రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కుంభకోణం' అన్న కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. విచారణ అనంతరం ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న జైవంత్‌రావ్‌ను అధికారులు విధుల్లో నుంచి తప్పించారు. స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ అడిషనల్ ఐజీ, డీఐజీలు బుధవారం 3గంటల పాటు ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో విచారణ జరిపారు. 2014 నుంచి జిల్లా సబ్‌రిజిస్ట్రార్‌లుగా పనిచేసిన ఐదుగురు అధికారులు ఈ కుంభకోణంలో ఉన్నట్లుగా వారి విచారణలో తేలింది. స్టాంప్స్ విక్రయాల డబ్బులు ప్రభుత్వ ఖజానాకు జమ చేయని సిబ్బంది ఇద్దరిపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేయగా, ఐదుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు.

ఓటేయలేదని దాడులు

నగదు.. నజరానాలు వాపసు చేస్తున్న ఓటర్లు

యాదాద్రి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గెలుపే ధ్యేయంగా.. ఓట్ల కోసం భారీగా బేరసారాలు సాగాయి.. కుల సంఘాలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలుగా అభ్యర్థుల నుంచి పెద్దఎత్తున ఓట్ల కోసం నోట్లు, మద్యం, మాంసం వంటివి పంపిణీ చేశారు. ఇలా నగదు, నజరానాలు తీసుకోవడం ఎన్నికల ఫలితాల తర్వాత గ్రామాల్లో ఘర్షణ వాతావరణాలను సృష్టిస్తోంది. ఓటు వేస్తామని బేరాలు కుదుర్చుకున్నా.. తమకు ఓటు వేయలేదంటూ.. ఓడిపోయిన అభ్యర్థులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పంచాయతీ తొలి విడత ఎన్నికలు జరిగిన అయిదు మండలాల్లో ఎన్నికల్లో పెద్దమొత్తంలో ఖర్చు చేశారు. అభ్యర్థులు ఓటుకు రూ. 3000 నుంచి రూ. 10,000 వరకు పంపిణీ చేశారు. ఓడిపోయిన అభ్యర్థులు నోట్లు తీసుకుని ఓటు వేయలేదని ప్రజలపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. అనుమానం ఉన్న వారిపై దాడులకు కూడా పాల్పడుతున్నారు. తుర్కపల్లి మండలంలోని ఒక గ్రామంలో మెజారిటీ కులం ఓటర్లు.. పోటీ చేసిన అభ్యర్థి నుంచి రూ.2 లక్షలు కులసంఘానికి తీసుకున్నారు. అయినా ఇతర అభ్యర్థి గెలవడంతో తమ కులం వాళ్లు మోసం చేశారని గ్రామంలో పంచాయతీ ఏర్పాటు చేశారు. ఇదే విధంగా మరో చోట ఓడిపోయిన అభ్యర్థి, తిట్ల దండకం చదువుతున్నారు. ఇది భరించలేని కొంతమంది ఓటర్లు ఆ అభ్యర్థి నుంచి తీసుకున్న కూల్ డ్రింక్స్ బాటిళ్లను ఊరిలోని ఆంజనేయస్వామి ఆలయంలో వదిలిపెట్టి వెళ్లారు. యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామంలో ఓడిపోయిన అభ్యర్థి తమపై దాడికి దిగాడని.. ఓ వర్గం ఓటర్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గెలుపు కోసం పోటీ పడి నోట్లు, నజరానాలు పంచిన అభ్యర్థులు ఓడిపోయిన తర్వాత దాడులు.. దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఘటనలు పలు పంచాయతీల్లో దర్శనమిస్తున్నాయి. కాగా.. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం బహదూర్‌పూర్‌తండాలో గెలుపొందిన టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రత్యర్థిగా పోటీచేసిన శాంతిబాయి ఇంటిపై రాళ్లు రువ్వారు. ఆమె కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలపై టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కొందరు దాడికి దిగడంతో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తండాకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మరిన్ని ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా.. ముందుజాగ్రత్తగా.. గ్రామంలో పెద్దఎత్తున మొహరించారు.

ఊరు మనదిరా



ముల్కలపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఓటర్లు వదిలి వెళ్లిన కూల్‌డ్రింక్ బాటిళ్లు

సర్పంచ్ బరిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

రంగంలో పలువురు ఉన్నత విద్యావంతులు

ముథోల్/గొల్లపల్లి, జనవరి 23: పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉన్నత విద్యావంతులు ఉద్యోగాలు సైతం వదులుకొని వస్తున్నారు. నిర్మల్ జిల్లా ముథోల్‌కు చెందిన రాజేందర్ బెంగళూరులో నెలకు లక్ష రూపాయల జీతంతో పనిచేస్తున్నా, ఉద్యోగాన్ని వదిలి సర్పంచ్‌గా పోటీకి దిగారు. తన స్వస్థలమైన ముథోల్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతోనే ఇలా నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. జగిత్యాల జిల్లాలోనూ పలువురు ఉన్నత విద్యావంతులు పోటీలో నిలిచారు. గొల్లపల్లి మండలం వెంగళాపూర్‌లో పోటీ చేస్తున్న రమ్య, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పట్టభద్రురాలు. మరో పోటీదారు బొంకంటి సుజాత ఎంఎస్సీ, బీఎడ్‌తో పాటు ప్రస్తుతం ఎంఎస్‌డబ్ల్యూ కోర్సు చదువుతోంది. లొత్తునూర్‌లో సర్పంచ్‌గా పోటీ చేస్తున్న కుంటాల పంచవాణి, బీబీరాజ్ పల్లెలో పోటీ చేస్తున్న దొనకొండ వరలక్ష్మీ ఎంబీఏ పూర్తి చేశారు. రంగదామునిపల్లె సర్పంచ్ అభ్యర్థులైన జెల్ల అనిల్ ఎంఫార్మసీ, నలువాల అశోక్ పీజీ పూర్తి చేశారు.



రాజేందర్



రమ్య



సుజాత

మోడల్ టెంపుల్ టౌన్‌గా యాదాద్రి

» రహదారుల వెంట మొక్కలు.. విద్యుద్దీపాలు

» మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు



వైటీడీఏ ఉన్నతస్థాయి సమావేశంలో సీఎస్ ఎస్‌కే జోషి తదితరులు

యాదాద్రి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం, విస్తరణ అభివృద్ధి పనులు తుది దశకు చేరుకోవడంతో.. ఆలయ పరిసరాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఆలయ సన్నిధితో పాటు పట్టణాన్ని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక నగరిగా చేసేందుకు అధికారులు అభివృద్ధి ప్రణాళికలు రచిస్తున్నారు. దేశ విదేశాల నుంచి యాత్రికులు సందర్శించే అవకాశాలు ఉండటంతో.. అదే స్థాయిలో వసతి, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్ణయించారు. సీఎం కేసీఆర్ యాదాద్రిని వాటికన్ సిటీ స్థాయిలో తీర్చిదిద్దుతామని ప్రకటించిన సంగతి తెలిసిందే. కొండపై ఆలయ విస్తరణ, పునర్నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతో, పరిసరాల అభివృద్ధి ప్రతిపాదనలు అభివృద్ధి ప్రణాళికలపై సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి వైటీడీఏ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రహదారుల విస్తరణ, డ్రైనేజీ, ఫుట్‌పాత్‌ల నిర్మాణంతో పాటు రోడ్లకు ఇరువైపులా మొక్కలు, వీధి దీపాలు, పార్కులు, పట్టణ పారిశుధ్య నిర్వహణ వంటివాటికి కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్టలో మోడల్ బస్ స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆలయాన్ని సందర్శించే భక్తులకు, అభివృద్ధి పనులకు అవసరమైన నీటిని అందించడానికి మిషన్ భగీరథ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. పట్టణంలో నిర్మిస్తోన్న 133/11 కేవీ సబ్ స్టేషన్‌ను ఏప్రిల్ 15లోపు పూర్తి చేయాలని, అవసరమైన విద్యుదీకరణ పనులు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ ప్రతిపాదించినట్టుగా వేద పాఠశాల, శిల్ప కళాశాలలను వెంటనే ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న నారసింహ అభయారణ్యం, జింకల పార్కు ఏర్పాటును వేగవంతం చేయాలన్నారు. వైటీడీఏ జారీ చేసిన మాస్టర్ ప్లాన్ ముసాయిదాపై ప్రజలు, నిపుణుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి తుది మాస్టర్ ప్లాన్‌ను జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.



రైతు సమన్వయ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి-2019 క్యాలెండర్‌ను శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. బంజారాహిల్స్‌లోని స్పీకర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా, ఉద్యానవన శాఖ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

- హైదరాబాద్

నేటి నుంచి రమేష్ హత్యకేసు విచారణ

» నిందితులుగా ఇద్దరు డీఎస్పీలు, ఒక సీఐ, డాక్టర్



రమేష్ (ఫైల్)

గోదావరిఖని, జనవరి 23: సంచలనం సృషించిన పెద్దపల్లి జిల్లా గోదావరిఖని కానిస్టేబుల్ ఎర్రగోళ్ల రమేష్ హత్యపై గోదావరిఖని 6వ అదనపు జిల్లా సెషన్ కోర్టులో గురువారం నుంచి సాక్షుల వాంగూల్మాలు నమోదు చేయనున్నారు. ఈ కేసులో డీఎస్పీలు రాజేంద్రప్రసాద్, హబీబ్ ఖాన్, సీఐ విద్యాసాగర్, వైద్యుడు శ్రీనివాస్ నిందితులుగా ఉన్నారు. ప్రధాన నిందితుడు, రౌడీషీటర్ అరుకోళ్ల శ్రీనివాస్ అలియాస్ బుగ్గల శ్రీను గత ఏడాది హత్యకు గురి కాగా.. మరో నిందితుడు డాక్టర్ సత్యనారాయణరెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం గమనార్హం.

అసలేం జరిగింది?

2010, ఫిబ్రవరి 9వ తేదీన కానిస్టేబుల్ రమేష్ గోదావరిఖని ఓసీపీ-3 సీహెచ్‌పీ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ప్రమాదంలో మృతిగా గోదావరిఖని ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. రమేష్ మృతిపై పలు అనుమానాలు రావడంతో అప్పటి డీఐజీ రవి శంకర్ అయ్యర్, స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) ఏర్పాటు చేసి విచారణ జరిపించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేశారు. రౌడీ షీటర్ బుగ్గల శ్రీనివాస్ రమేష్‌ను తుపాకితో కాల్చి హత్య చేసినట్టు నిర్ధారణకు వచ్చిన సిట్, అప్పటి గోదావరిఖని, పెద్దపల్లి డీఎస్పీలు హబీబ్‌ఖాన్, రాజేంద్రప్రసాద్, ట్రాఫిక్ సీఐ విద్యాసాగర్, టుటౌన్ సీఐ వెంకటరమణను నిందితులుగా చేర్చింది. పోస్టుమార్టం నిర్వహించిన ప్రభుత్వ వైద్యులు సత్యనారాయణ, శ్రీనివాస్ సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారంటూ వారిపై కూడా కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసును సీబీసీఐడీకి అప్పగించారు. కేసును విచారణ జరిపిన సీబీసీఐడీ 140మంది వివిధ రంగాలకు చెందిన వారిని సాక్షులుగా చేర్చి చార్జిషీట్ దాఖలు చేసింది. ఫిర్యాదుదారు రమేష్ భార్య, కుటుంబ సభ్యులకు కూడా కోర్టు సమన్లు ఇచ్చింది తర్వాతి పరిణామాల్లో సీఐ వెంకటరమణ పెట్టుకున్న క్వాష్ పిటీషన్‌ను హైకోర్టు ఆమోదించడంతో ఆయనను నిందితుడి జాబితా నుంచి తొలగించారు. 60మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టేందుకు ప్రాసిక్యూషన్ సన్నాహాలు చేస్తోంది. దాదాపు తొమ్మిదేళ్ల తరువాత ఈ కేసు విచారణ కీలక దశకు చేరడం గమనార్హం.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

వెంకటాపూర్ (రామప్ప), జనవరి 23: జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. ఇంచెం చెర్వుపల్లికి చెందిన రైతు నర్రేవుల వెంకటేష్(55) బుధవారం పురుగుల మందు తాగాడు. పదేళ్ల క్రితం కుటుంబంతో సహా ఖమ్మంకు వలసవెళ్లిన వెంకటేష్, అక్కడ మిర్చి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్వగ్రామం ఇంచెం చెర్వుపల్లిలో తన తండ్రి పేరున 17ఎకరాల 33 గుంటల భూమి ఉండగా.. తన పేరుతో భూమి పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వాలని గత ఏడాది ఆగస్టులో తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఎన్ని రోజులు గడచినా తహసీల్దార్ స్పందించకపోవడంతో కార్యాలయం ఎదుట పురుగుల మందు తాగాడు. కార్యాలయ సిబ్బంది వెంటనే అతన్ని ప్రైవేటు వాహనంలో ములుగు ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఎంజీఎంకు తరలించారు. ఈ విషయమై తహసీల్దార్ గుగులోతు దేవాసింగ్‌ను వివరణ కోరగా.. రైతు చేసుకున్న దరఖాస్తును పరిశీలించి విచారణ కోసం వీఆర్‌వోలను ఆదేశించినట్లు తెలిపారు. సర్వే నిర్వహించి శుక్రవారం నాటికి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చామని పేర్కొన్నారు.

ప్రియాంక ప్రవేశం

ప్రియాంక గాంధీ ఎప్పటికైనా రాజకీయాల్లోకి వస్తారా, రారా? నిజంగానే ఈమెకు ఇష్టంలేదా, లేక కొడుకు కోసం సోనియా అడ్డు పడుతున్నారా? అచ్చం ఇందిరమ్మలాగా ఉండే ప్రియాంక వస్తేనే కాంగ్రెస్ బతికిబట్టకట్టడం, మోదీని ఓడించడం సాధ్యం, లేకపోతే ఇంతే అని ఇంతకాలం మధనపడిన కాంగ్రెస్ అభిమానులకు ప్రియాంక రాజకీయ రంగ ప్రవేశం శుభవార్తే. ఇంతకాలం కుటుంబపరంగా అమ్మ, అన్నల విజయం కోసం అమేథీలోనూ, రాయ్‌బరేలీలోనూ ప్రచారం చేయడం వినా, ఎంతటి కష్టకాలంలోనూ పార్టీ కోసం పనిచేయని ప్రియాంక ఇప్పుడు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ హోదాలో తూర్పు ఉత్తరప్రదేశ్ బాధ్యతలు స్వీకరించడంతో ఆమె రాజకీయ ప్రవేశం అధికారికంగా జరిగిపోయింది. ఇది మోదీపై రాహుల్ సర్జికల్ దాడి అనీ, రాజకీయ బ్రహ్మాస్త్రమనీ మీడియా అభివర్ణిస్తున్నది. ప్రియాంకను ఆకస్మాత్తుగా తెరమీదకు తేవడంతో బీజేపీ వణికిపోతున్నదని రాహుల్ అంటున్నారు. ఈ ప్రకటన వెలువడిన కొద్దిగంటల్లోనే ప్రధాని మోదీ కాంగ్రెస్ వంశపారంపర్య పాలనపై మరోమారు విరుచుకు పడ్డారు.

ప్రియాంక ప్రభావం ఉత్తర్‌ప్రదేశ్‌కు మాత్రమే పరిమితం కాబోదనీ, దేశమంతటా కాంగ్రెస్ పునరుజ్జీవనానికి ఉపకరిస్తుందని కాంగ్రెస్ నాయకులు సంతోషిస్తున్నారు. ఈ ఆశలను అటుంచితే, సార్వత్రిక ఎన్నికల్లో హస్తానికి దక్కించుకోవాలంటే 80స్థానాలున్న యూపీ అత్యంత కీలకం. గత ఎన్నికల్లో బీజేపీ ఇక్కడ 71స్థానాలు సాధించి కేంద్రంలో సులభంగా అధికారంలోకి వచ్చింది. గతంలో కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న యూపీని క్రమంగా ఎస్పీ, బీఎస్పీలు, బీజేపీ ఆక్రమించడంతో దశాబ్దాలుగా ఈ పార్టీకి అక్కడ ఉనికి లేకుండా పోయింది. దీనికితోడు, ఇటీవల ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్‌లు ఒక్కటై బీజేపీపై పోరాడాలన్న ప్రతిపాదన సైతం గాలికి కొట్టుకుపోయింది. ఓ నాలుగుసీట్లు మినహా మిగతాఅన్నింటిని మాయావతి, అఖిలేష్‌లు చెరిసగం పంచేసుకున్నారు. కాంగ్రెస్‌ను పూచికపుల్లలా తీసిపారేసిన ఈ చర్య దాని ప్రతిష్ఠను మరింత దిగజార్చింది. పార్టీ యావత్తూ నిస్తేజంగా, నిరాసక్తంగా ఉన్న ఈ స్థితిలో ప్రియాంక ప్రవేశం పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. మోదీ హవాతో యూపీలో బీజేపీ పరిస్థితి ఒక్కసారిగా మారిపోక, ప్రియాంక మేజిక్ కాంగ్రెస్‌ను వెలిగిస్తుందని ఒక ఆశ. ఎస్పీ-బీఎస్పీ-కాంగ్రెస్ పొత్తు ప్రతిపాదన చర్చల్లో కీలకపాత్ర పోషించిన ప్రియాంక అది కాస్తా తెగిపోవడంతో ఆగ్రహించి తనకుతానుగా రంగప్రవేశం చేశారని కొందరు విశ్లేషిస్తున్నారు. కానీ, ప్రియాంక తూర్పు ప్రాంతానికి మాత్రమే పరిమితం కావడాన్ని బట్టి ప్రస్తుతానికి ఈ విడివిడి పోటీలన్నీ కలివిడిగానే జరుగుతున్నాయని అనిపిస్తున్నది. పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లో దళిత, ముస్లిం జనాభా అత్యధికంగా ఉన్నందున ఈ ఎస్పీ-బీఎస్పీ ఓటుబ్యాంకును దెబ్బతీయడం కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం కాదు. మోదీ, యోగి సహా కేంద్రక్యాబినెట్‌లోని అనేకమంది మంత్రులు గెలుపుకొస్తున్న తూర్పు యూపీని స్వాధీనం చేసుకోవడం, తద్వారా బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలను కత్తిరించేయడం కాంగ్రెస్ అసలు లక్ష్యం. సగం స్థానాలున్న తూర్పు ప్రాంతంలో ఒకప్పుడు కాంగ్రెస్ పక్షాన నిలిచి, ఇప్పుడు బీజేపీ ఓటుబ్యాంకుగా మారిన అగ్రకులాలవారిని తిరిగి మెప్పించి రప్పించే బాధ్యత ప్రియాంకది. మోదీ పరిపాలనా వైఫల్యాలు అస్త్రం తరువాత ప్రియాంకను బ్రహ్మాస్త్రంగా ప్రయోగించడం తప్ప కాంగ్రెస్‌కు మరోదారి లేదు.

మోదీ, షా దూకుడు తగ్గాలంటే ప్రియాంక రావాలంటూ గత ఎన్నికల నాటినుంచి కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. మాటల మాంత్రికుడు మోదీని నిరోధించడానికి ఇందిర పోలికలతో ప్రజాకర్షణశక్తి ఉన్న ప్రియాంక ఉపకరిస్తుందని వారి నమ్మకం. యూపీలో చెప్పుకోదగ్గ నాయకత్వం, మొఖం లేని కాంగ్రెస్‌కు ఇప్పుడు ప్రియాంక రాకతో ఆ కొరత తీరుతుంది. కాంగ్రెస్‌తో జతకట్టేందుకు ఉత్సాహం చూపని ప్రాంతీయపక్షాల్లో సైతం కాంగ్రెస్ విజయావకాశాలపై నమ్మకం ఏర్పడి, కలసివచ్చేందుకు సిద్ధపడవచ్చు. ప్రజల్లోనూ, కార్యకర్తల్లోనూ కాంగ్రెస్ బలమైన పోటీని ఇవ్వబోతున్నదన్న ఈ భావన ప్రభావం రేపు ఫలితాల్లోనూ ఉండవచ్చు. ప్రియాంక రాజకీయ ప్రవేశాన్ని ప్రజాస్వామ్యవాదులు ఆహ్వానించినా, చివరకు సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఆమెను ఆపన్న హస్తంగా వాడుకుంటున్నది పార్టీ. ఇప్పటికే బలమైన శక్తులన్నీ యుద్ధక్షేత్రంలో మోహరించి, ఓటర్లు సైతం మానసికంగా స్థిరపడిన స్థితిలో ఈ వాతావరణాన్ని తారుమారు చేసే, అద్భుతాలు చేయగలిగేంత సమయం ఆమెకు నిజానికి లేదు. సంకీర్ణ చక్రం తిప్పడానికి అవసరమైనంత సంఖ్యాబలాన్ని పార్టీకి సాధించిపెట్టడంలో ఆమె ఏమేరకు విజయం సాధించగలరో చూడాలి.


అర్బన్ నక్సల్స్ అంటే ఎవరు?

సంఘ పరివార్ భావజాలాన్ని వ్యతిరేకించే వారందరిపై నక్సల్స్ అని ముద్రవేసి, తమ భావజాలాన్ని తమకు తామే సమర్థించుకొని, ఇతర భావజాలాల మీద ప్రత్యామ్నాయాల మీద దుమ్ము చల్లడం నేడు ఒక కళగా మారింది. ఫలానా వాళ్ళు అర్బన్ నక్సల్స్ అని వాళ్ళు విశ్వవిద్యాలయాలలో విద్యార్థులని రెచ్చగొడుతున్నారని వాళ్ళను అడవులకు పంపే ప్రయత్నం చేస్తున్నారని ఏ ఆధారాలు లేకుండా ఆరోపిస్తున్నారు. ఉపన్యాసాల ద్వారా ఉత్తేజితులై అడవికి పోయే వారుండరు. మనుషులు అలా ప్రభావితం కారు. యువత తమ జీవిత అనుభవం నుండి, తమ కుటుంబ నేపథ్యం నుండి, సమాజంలో కొనసాగుతున్న అన్యాయాల నుండి ప్రభావితం అవుతారు. ఒక చిన్న పిల్లవాడు పెంటకుప్ప మీద ఆహారాన్ని వెతుక్కుంటే చూసిన వారు దానికి చలించి సమాజంలో ఎందుకు ఇంత అన్యాయం ఉంది అని ప్రశ్నిస్తూ సమాధానాలు వెతికే క్రమంలో ఉద్యమాలకి పోవచ్చు.

కొందరు చాలా బాధ్యతారహితంగా ఉగ్ర మేధావులు వంటి పదాల్ని ఉపయోగిస్తున్నారు. మేధో ఉగ్రవాదులు అంటే మేధావులంతా ఉగ్రవాదులు అని భావించడమా లేక ఉగ్రవాదులంతా మేధావులు అని సూత్రీకరించడమా అర్థం కాదు. మేధావి అంటే సమాజ చలనాన్ని, చరిత్ర పరిణామ క్రమాన్ని గమనిస్తూ, మానవాళి ఎటు ప్రయాణం చేస్తున్నదని అర్థం చేసుకుంటూ, చరిత్ర గమనాన్ని చెప్పేవాడు. మేధావి ఒక న్యాయబద్ధమైన, ఉదాత్తమైన మానవీయ స్వప్నాన్ని కలిగివుండేవాడు. మనుషులను ప్రేమించేవాడు, మానవాళికి మంచి భవిష్యత్తు ఉండాలని ఆశపడేవాడు. సమాజంలోని అన్యాయాలను విశ్లేషించేవాడు. మేధో జగత్తుకు ఆద్యుడుగా మనమందరం భావించే సోక్రటీస్ చేసిన పనేమిటి? యువతలో మౌలికమైన ఆలోచనలను రేకెత్తించి మంచి మనుషులంటే ఎవ్వరు అనే తాత్విక ప్రశ్నలడిగి, యువతలో నైతిక విలువలను పెంపొందించడానికి కృషి చేస్తే ఆయనను మేధో ఉగ్రవాదిగా ముద్రవేసి అప్పటి పాలకులు ఆయనకు మరణశిక్షను వేసారు. పాలకులు ఇచ్చిన విషాన్ని తాగుతూ తన శిష్యులతో సంభాషిస్తూ మరణాన్ని ఆహ్వానించినవాడు. ఇవ్వాళ సోక్రటీస్ ప్రపంచానికి ఒక వెలుగు దివ్వెగా మారాడు.

విల్‌డ్యురాంట్ రాసిన 'స్టోరీ ఆఫ్ ఫిలాసఫీ' పుస్తకంలో క్రైస్తవ మతోన్మాదుల చేతుల్లో చిత్రహింసలు పడిన తత్వవేత్తల జీవిత అనుభవాల గురించి వివరంగా రాశారు. అంతెందుకు ఇవ్వాళ శాస్త్రీయ విజ్ఞానానికి బీజాలు వేసి శాస్త్రజ్ఞులకి స్ఫూర్తిదాయకమైన గెలీలియో, కోపర్నికస్... చిత్రవధలు అనుభవించినవారే. చరిత్రలో మెలిక ప్రశ్నలు అడిగినందుకు నాటి ఆధిపత్య వర్గాలు వాళ్లందరిని 'మేధో ఉగ్రవాదులు' అనే భావించింది. వాళ్ళ చిత్రవధల పునాదుల మీద మానవ నాగరికత ముందుకు నడిచింది.

సమాజంలో అన్యాయాలు ఉన్నంత కాలం ప్రతిఘటన ఉంటుంది. బానిస సమాజానికి వ్యతిరేకంగా పోరాడిన సోక్రటీస్ ఇవ్వాళ ప్రపంచానికి ఆరాధ్యుడయ్యాడు. అంతెందుకు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన భగత్‌సింగ్, బ్రిటిష్ వాళ్ల దృష్టిలో ఉగ్రవాదే, మనకు ఆయన స్వాతంత్ర పోరాట యోధుడయ్యాడు. చరిత్ర అంతా ఉద్యమాలు, పోరాటాలున్నాయి. ఈ పోరాటాలు ఎందుకు జరిగాయి, ఎందుకంత ప్రాణ నష్టం జరిగింది అనే ప్రశ్నలు అడగాలి. ఇంత చరిత్ర అనుభవ వెలుగులో ప్రాణ నష్టం లేకుండా సమాజాలు మారవా? మనం మార్చలేమా? అన్నది మనందరి ముందున్న సవాలు. భారత రాజ్యాంగం ఈ ప్రశ్నకు జవాబుగానే ఒక శాంతియుత మార్పును కోరుకుంది. ఆదేశిక సూత్రాలలో ఒక సమ సమాజాన్ని ఆశిస్తూ అలాంటి సమాజాన్ని సాకారం చేసుకోవడానికి ప్రజలకు ప్రాథమిక హక్కులు ఇచ్చింది. పూర్తి భావ ప్రకటన స్వేచ్ఛను కల్పించింది. ఈ హక్కులు కాపాడడానికి చట్టబద్ధ పాలనను ఒక మౌలిక ప్రమాణంగా అంగీకరించింది. తీవ్రవాదులు చట్టాన్ని ప్రశ్నిస్తున్నారు కాబట్టి ఆ చట్టాన్నే మేం అంగీకరించేది లేదు అనే ప్రతివాదు చట్ట వ్యతిరేకే. ఎదుటివాడు చట్టాన్ని గౌరవించడం లేదు అని అనేవాళ్లకు తమకంటూ చట్టం మీద గౌరవం ఉంటే ఆ వాదన చెల్లుతుంది. అంటే నా ఎదుటివారికి చట్టం మీద గౌరవం లేదు కాని అతని పట్ల చట్టబద్ధంగా మాత్రమే ప్రవర్తించాలి. అన్న వాళ్లకు మాత్రమే చట్టాన్ని గురించి మాట్లాడే అర్హత ఉంటుంది.



> మావోయిస్టు ఉద్యమం ఎందుకు గత ఐదు దశాబ్దాలుగా నిరాఘాటంగా కొనసాగుతుంది అనే ప్రశ్న అడగకుండా ఎలా ఉండగలం. అడిగితేనే మేధో ఉగ్రవాది అయిపోతాడా? సమాజంలో సంక్షోభం ఉన్నప్పుడు దానికి కారణాలు వెతికే వారుంటారు. హింసకు మూలాలను వెతికే వారుంటారు. కారణాలను, ప్రత్యామ్నాయాలను వెతికేవారిని, మాట్లాడేవారిని 'ఉగ్రవాదులు', వాళ్లను అణచివేయండి అనే వారిని ఏం అనాలి?

ఇవ్వాళ మన మధ్యే ఉన్న పది మందిని అర్బన్ నక్సల్స్ పేర జైళ్లల్లో నిర్బంధించారు. వీళ్లు అర్బన్ నక్సల్స్ అని ఎవరు నిర్ధారించాలి. చట్టం ప్రకారం న్యాయస్థానాలు నిర్ధారించాలి. వీళ్లందరిని అరెస్టు చేస్తే సుప్రీంకోర్టు తలుపు అని అర్ధరాత్రి తట్టారు అంటే మరి ఎవ్వరిదగ్గరకు వెళ్ళాలి. తలుపులు తడతారనే చట్టాలను మారుస్తూ రాజ్యానికి మరిన్ని విపరీతమైన, విచ్చలవిడి అధికారాలు కల్పించారు. ఉపా (UAPA) చట్టం కింద ఎవ్వరినైనా, ఏ ఆధారాలు లేకున్నా కనీసం ఆరు నెలలు జైళ్లల్లో పెట్టవచ్చు ఇది చిదంబరం చేసిన చట్టం. ఈ చట్టం కిందే ఆయనను ఎప్పుడైనా అరెస్టు చేయవచ్చు. అమాయకులను పట్టుకొని అలా నిర్బంధిస్తే రక్షణ ఏమిటి? ఎవరు అమాయకులు ఎవ్వరు దోషులని ఎవ్వరు నిర్ధారించాలి? ఇవాళ అరెస్టు అయిన పది మంది గురించి రాయటానికి ఈ వ్యాసం పరిధి సరిపోదు. మచ్చుకి గతంలో అరెస్టు చేసిన పది మందే కాక ఈ మధ్య అంబేడ్కర్ కుటుంబ సభ్యుడు, అంతర్జాతీయంగా గుర్తింపబడ్డ మేధావి ఆనంద్ తెల్తుంబ్డె గురించే చర్చిద్దాం.

ఆనంద్ తెల్తుంబ్డె అతి పేద దళిత కుటుంబంలో పుట్టాడు. చిన్నప్పటి నుండి క్లాసులో ఫస్టే. హై స్కూలులో చదివేప్పుడు ఇళ్లకు సున్నం వేసి డబ్బులు పోగుచేసుకొని చదివాడు. అత్యంత ప్రతిభ కలవాడు కాబట్టే ఐఐటి ఖరగ్‌పూర్‌లో, తర్వాత ఐఐఎం అహ్మదాబాద్‌లో చదివాడు. అటు ఇంజనీరింగ్‌లో, ఇటు మేనేజ్‌మెంట్‌లో అత్యున్నతమైన ర్యాంకులు సాధించాడు. ఉద్యోగరీత్యా ఒక బహుళజాతి కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పని చేసి, అది వదిలి ఐఐటి ఖరగ్‌పూర్‌లో ప్రొఫెసర్‌గా చేరాడు. ఇప్పుడు గోవాలో ఒక మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో అత్యంత క్లిష్టమైన, అధునాతన మెగాడేటా బోధిస్తున్నాడు. ఆయన చేసిన పాపం అల్లా, అత్యంత ప్రతిభావంతుడు కావడం వల్ల, అతి పేద కుటుంబ జీవిత అనుభవం వల్ల సమాజంలో ఉండే అన్యాయాల మీద స్పందిస్తూ దళితుల సమస్య మీద, అసమానతల మీద ఖైర్లాంజీ దురాగతాల మీద, సామ్రాజ్యవాదం మీద దాదాపు 26 పుస్తకాలు రాసాడు. ఆయన కుల వ్యవస్థ మీద రాసిన రిపబ్లిక్ ఆఫ్ క్యాస్ట్ అత్యంత ప్రామాణికమైంది. సామాజిక అసమానతల మీద కుల వ్యవస్థ దుర్మార్గాల మీద స్పందించినందుకే ఇవ్వాళ ఆయనను మేధో ఉగ్రవాదుల జాబితాలో చేర్చారు. విచిత్రమైన విషయమేమంటే ఆనంద్‌ని భీమా కోరేగాం సంఘటన 'కుట్ర'లో భాగం చేసారు. కాని ఆయన భీమాకోరేగాం సంఘటనతో విబేధించి, చాలా మంది ఆగ్రహానికి గురయ్యాడు. భీమాకోరేగాంని దళితుల పీష్వాల మధ్య యుద్ధంగా చూడడం సరైంది కాదని రాసాడు. (ఆ అభిప్రాయంతో నాకు కూడా అంగీకారం లేదు) భీమాకోరేగాం సంఘటనతో విబేధించిన ఆయనను దాని వెనక ఉన్నాడని, వీరందరి వెనక మావోయిస్టు పార్టీ ఉందని, మావోయిస్టు పార్టీ వెనక కాంగ్రెస్ పార్టీ అందులో రాహుల్ గాంధీ, దిగ్విజయ్ సింగ్ లాంటి వారు ఉన్నారని అనడం ఎంత హాస్యాస్పదమో వేరే వ్రాయ అవసరం లేదు. ఇప్పుడు చెప్పండి మేధో ఉగ్రవాదులనే పేర ఎలాంటి వాళ్ళ మీద ముద్ర వేసి జైళ్ళల్లోకి పంపుతున్నారో ఆలోచించండి.

మావోయిస్టు ఉద్యమం ఎందుకు గత ఐదు దశాబ్దాలుగా నిరాఘాటంగా కొనసాగుతుంది అనే ప్రశ్న అడగకుండా ఎలా ఉండగలం. అడిగితేనే మేధో ఉగ్రవాది అయిపోతాడా? ఆ పోరాటాన్ని విశ్లేషించకుండా దానికి పరిష్కారాలు కనుక్కోకుండా దానికి తుపాకి బదులు తుపాకి అంటే బాధ్యతారాహిత్యమౌతుంది. ఈ ఉద్యమం మీద ఉమ్మడి రాష్ట్రంలో క్యాబినెట్ సబ్ కమిటీని వేసారు. ప్లానింగ్ కమిషన్ ఒక నిపుణుల కమిటీని వేసింది. ఒక పదిహేను మంది ప్రజాస్వామ్య మానవతావాదులు దశాబ్ద కాలం శాంతి చర్చల కొరకై కృషి చేసి విప్లవ పార్టీకి ప్రభుత్వానికి మధ్య చర్చలు జరిగేలా చూసారు. ఈ పదిహేను మందిలో యస్.ఆర్ శంకరన్, పెద్దలు పొత్తూరి వెంకటేశ్వర రావు, డా. జయశంకర్, బొజ్జాతారకం, కోదండరాం, జీవన్ కుమార్ లాంటి వారున్నారు. ఈ చర్చలు జరగడానికి వరవరరావు సహకరించారు. వీరందరినీ– చర్చలు జరిపిన ఐదుగురు క్యాబినెట్ మంత్రులను, ఒక దశలో చర్చలకి సిద్ధం అన్న చిదంబరంని ఉగ్రవాదులు అందామా? మన దేశంలో ఒక్క బిజెపి పార్టీ దాని అనుబంధ సంస్థలు తప్పించి అన్ని రాజకీయ పార్టీలు ఇది కేవలం శాంతి భద్రతల సమస్య కాదు అని అన్నవారే! సమాజంలో సంక్షోభం ఉన్నప్పుడు దానికి కారణాలు వెతికే వారుంటారు. హింసకు మూలాలను వెతికే వారుంటారు. కారణాలను, ప్రత్యామ్నాయాలను వెతికేవారిని మాట్లాడేవారిని 'ఉగ్రవాదులు' వాళ్లను చట్టాన్ని తుంగలో తొక్కైనా సరే అణచివేయండి అనే వారిని ఏం అనాలి?

■ జి. హరగోపాల్

పోలీసుబాస్ – సుప్రీం తీర్పు

ఈ మధ్యకాలంలో, పోలీసు వ్యవస్థకు తలమానికంగా వుండాల్సిన సిబిఐ తీరుతెన్నులు గమనించిన తర్వాత పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠ మరింత మసకబారిందని విజ్ఞులు భావిచటంలో తప్పు లేదు. తెలుగురాష్ట్రాలలోని కేసుల దర్యాప్తును సిబిఐ, ఎన్ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ) ఎంతవరకు వేలెత్తి చూపకుండా, నిష్పాక్షికతతో చేపడతాయనేది కూడా వివాదాంశంగా మారింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సిబిఐని తమ రాష్ట్రంలో అడుగుపెట్టకుండా చేసింది. కోడికత్తి కేసులో ఎన్ఐఏ దర్యాప్తు వ్యవహారాన్ని తప్పుపట్టింది. దేశంలోని చాలా రాష్ట్రాలలో ప్రభుత్వాలు మారగానే పోలీసుల పనితీరు మారటం సాధారణం అయింది. కేవలం ప్రభుత్వాల మీదనే పోలీసు వ్యవస్థ ఆధారపడివుందనే అపప్రథను కూడా ఆ వ్యవస్థ మూట కట్టుకున్నది. ప్రజల విశ్వాసం పూర్తిగా సన్నగిల్లటంతో, ఎంత బాగా నిద్రాహారాలు మాని పని చేసినా, పోలీసుల వ్యవహారశైలి ప్రజలకు రుచించని పరిస్థితి ఏర్పడటం కేవలం పోలీసులకే కాదు ప్రజలకు గూడా దురదృష్ట పరిణామంగా భావించక తప్పదు.

సుప్రీంకోర్టు డిజిపిల నియామకంలో నిన్నగాక మొన్న ఇచ్చిన తీర్పు, మరొక్కసారి పోలీసుల నియామకాల మీద, పారదర్శక వైఖరి మీద ఏకాగ్రతతో ఆలోచించాల్సిన అవసరాన్ని ఈ దేశంలోని ప్రజాస్వామ్య వాదులకు కల్పించినట్లయింది.

పోలీసు– స్టేట్ లిస్టులో వుండే సబ్జక్ట్ అవటం వల్ల సహజంగానే రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు, కేంద్రం ఈ విషయంలో ఏ మాత్రం వేలు పెట్టే ప్రయత్నం చేసినా, సహించలేని పరిస్థితి, క్రమేపీ బలపడుతున్నది. బహుశా కేంద్ర ప్రభుత్వ అత్యుత్సాహ ధోరణి గూడా ఒక్కొక్కప్పుడు ఆ పరిస్థితిని కల్పిస్తూ వుండొచ్చు. అయితే అధికారులను కేంద్రీకృతం చేసుకొని పరిపాలనను గుప్పెట్లో పెట్టుకోవాలనే వింత ధోరణి ఈ మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రదర్శిస్తుండటం వల్ల, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి విషయంలోనూ, బిగుసుకొని పోవటమే గాకుండా కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలను బహిర్గతం చేస్తున్నాయి.



డిజిపిల నియామకాలు ఇందుకొక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. బ్రిటిష్‌వారి పాలన మన దేశంలో అంతమొందిన తర్వాత, సర్దార్ వల్లభ్ భాయి పటేల్ నాయకత్వంలో పని చేసిన హోం శాఖ అత్యంత సమర్థంగా నియామకాల విషయాల్లో సమస్యలు తలెత్తకుండా వ్యవహరించటం వల్ల అప్పటి రాష్ట్ర ప్రభుత్వాలు విధాన నిర్ణయాలను అంతగా పట్టించుకోలేదు. అంతేగాకుండా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కాంగ్రెసు ప్రభుత్వాలే వుండటం చేత సామరస్య ధోరణి కోసం పెద్దగా ప్రయత్నించాల్సిన పరిస్థితి గూడా ఏర్పడలేదు.

> సామర్థ్యం, మెరిట్, వ్యవహార శైలితో పాటు నీతి నియమాలను కవచకుండలాలుగా ధరించే వ్యక్తులు పోలీసులుగా ఎంపిక కాబడ్డప్పుడే ప్రజలకు నిజమైన రక్షణ ఏర్పడుతుంది. పోలీసు – హితుడిగా, స్నేహితుడిగా, సన్నిహితుడిగా భాసించే మార్గం అప్పుడే ఏర్పడుతుంది. 'రక్షకుడి'కి నిజమైన నిర్వచనం అప్పుడే లభిస్తుంది.

కానీ ఇవ్వాళ్టి పరిస్థితులు వేరు! పోలీసు డైరక్టర్ జనరల్ నియామక వ్యవహారంలో 2006లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సవరించాలని కోరుతూ, కేరళ, వెస్ట్ బెంగాల్, బిహార్, హరియాణా, పంజాబ్ (అయిదు రాష్ట్రాలు) రాష్ట్రాలు కోర్టు కెక్కాయి. ప్రజా ప్రయోజనాలు కాపాడే విధంగా, రాజకీయ ఒత్తిళ్ళు లేని విధంగా డిజిపిల ఎంపిక, నియామక సరళి వుండేలా గత తీర్పు వుందని, ఈ అయిదు రాష్ట్రాల విజ్ఞప్తులను 'సుప్రీం' తోసిపుచ్చింది.

పోలీసు సంస్కరణలకు సంబంధించి 2018 జులైలో యిచ్చిన ఆదేశాలు తప్పకుండా అమలు చేయాలని ఖండితంగా సుప్రీంకోర్టు చెప్పింది. ప్రస్తుత డిజిపి పదవీకాలం ముగియటానికి మూణ్నెళ్ళ ముందే, సీనియర్ అధికారుల జాబితాను రాష్ట్రాలు యూ.పి.యస్.సి (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్)కి పంపించాలని, అనుభవం, మంచి రికార్డు, పదవీకాలం, వీటిని దృష్టిలో పెట్టుకొని ఎంపిక చేసిన ముగ్గురిలో రాష్ట్ర ప్రభుత్వం డిజిపిగా ఒకర్ని ఎంచుకోవాలని సుప్రీంకోర్టు తీర్పులో స్పష్టపర్చింది. దీని వలన డిజిపికి ఒత్తిడి నుంచి రక్షణ ఏర్పడుతుంది. పోలీసు శాఖకు సరియైన నాయకత్వం లభించినట్లవుతుంది. సొంతంగా డిజిపి నియామకం రాష్ట్రాలు చేపట్టే విధానాన్ని సుప్రీం ఒప్పుకోలేదు.

రాష్ట్ర డీజీపీకి నిర్ణీత పదవీకాలం అత్యవసరం. పోలీసుల పనితీరును పర్యవేక్షించటానికి రాష్ట్ర స్థాయిలో భద్రతా కమీషన్ వుండాలని గూడా 1996లో దాఖలైన వ్యాజ్యంలోనే 'సుప్రీం' స్పష్టపర్చింది. దర్యాప్తు విధులను, శాంతి భద్రతల విధులను వేరు చేయాలని గూడా ఆదేశించింది.

1996 నాటి ప్రజా ప్రయోజనాల కేసులో ఇచ్చిన ఏడు సూచనలను కుంటిసాకులు చూపించి కొన్ని రాష్ట్రాలు అమలుపర్చటానికి వెనుకాడాయి. 2018 సంవత్సరం జూలై నెలలో సవివరమైన అంశాలను సుప్రీం మరొక్కసారి ఉటంకించినా, రాష్ట్రాల స్పందన అంతంత మాత్రంగానే వుండటం ఈ తాజా ఉత్తర్వుల అవసరం ఏర్పడింది.

కేవలం డిజిపిల నియామక వ్యవహారమేగాదు పోలీసు సంస్థకు సంబంధించిన అనేక విషయాల్లో ఎన్నో కమిటీలు పోలీసు సంస్కరణలను రూపొందించాయి. కానీ అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ కారణాల చేత అమలుపర్చే విషయంలో కుంటిసాకులు చూపుతూ, పోలీసులను తమ చేతుల్లో వుంచుకొనేందుకు, పార్టీల విబేధాలు కూడా మరిచి పాటుపడుతూనే వున్నాయి.

నిజానికి పోలీసుల రిక్రూట్‌మెంట్, ట్రయినింగ్ విషయాల్లో గూడా ఎన్నో అవకతవకలు బయటపడ్తున్నాయి. సామర్థ్యం, మెరిట్, వ్యవహార శైలితో పాటు నీతి నియమాలను కవచకుండలాలుగా ధరించే వ్యక్తులు పోలీసులుగా ఎంపిక కాబడ్డప్పుడే ప్రజలకు నిజమైన రక్షణ ఏర్పడుతుంది. పోలీసు – హితుడిగా, స్నేహితుడిగా, సన్నిహితుడిగా భాసించే మార్గం అప్పుడే ఏర్పడుతుంది. 'రక్షకుడి'కి నిజమైన నిర్వచనం అప్పుడే లభిస్తుంది.

■ రావులపాటి సీతారాంరావు
రిటైర్డ్ ఐ.పి.ఎస్

జనవాక్యం

ఆడబిడ్డని బతుకనిద్దాం!



స్త్రీ శిశు సంక్షేమ శాఖ 2008 నుంచి ప్రతి ఏడాది జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. కానీ ఉత్సవాలు నిర్వహిస్తే సరిపోతుందా? తాజా జనగణన లెక్కల్లో ప్రతీ వెయ్యిమంది పురుషులకు 940 మంది మాత్రమే మహిళలున్నట్లు తేలింది. అలాగే, ఆరు సంవత్సరాలలోపు ఆడపిల్లలైతే ప్రతి 1000 మంది మగ పిల్లలకు 914 మంది మాత్రమే ఉన్నట్లు తేలింది. దీని ప్రభావం రాబోయే సంవత్సరాలలో కనబడుతుంది. ఆడపిల్లలకు విద్యావకాశాలు కూడా దయనీయంగా ఉన్నాయి. 30 శాతం మంది అమ్మాయిలు ప్రైమరీ స్కూల్స్ లోనే డ్రాప్ అవుట్ అవుతున్నారు. ఉన్నత విద్యావకాశాలు అందుకుంటున్న మహిళలు కూడా నూటికి 10 నుండి 30 శాతం మాత్రమే. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం. అయినప్పటికీ భారత్ లో రెండు దశాబ్దాల కాలంలో కోటి మంది ఆడ శిశువుల్ని పొట్టన పెట్టుకున్న వైనాన్ని బ్రిటన్‌కి చెందిన ఇండిపెండెంట్ పత్రిక బట్టబయలు చేసింది. వీటితోపాటు బాలికలపై, స్త్రీలపై జరుగుతున్న అకృత్యాలు మరొకటి. అలాగే బాల్య వివాహాల్లో భారత్ ఇప్పటికీ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. దేశంలో ఏటా 2.66 కోట్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయి. బాలికా దినోత్సవాన్ని ప్రభుత్వం ప్రారంభించి తొమ్మిదేండ్లు నిండాయి. అప్పటి నుంచి పరిస్థితుల్లో చెప్పుకోతగ్గ మార్పు రాలేదు. బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. బాలకార్మికులు పెరుగుతూనే ఉన్నారు. ఆడపిల్లల అక్రమ రవాణా జరుగుతోంది. వివక్ష కొనసాగుతోంది. ఇవన్నీ రూపు మాపేలా బాలికల చదువుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. బాలికల బంగారు భవిష్యత్ కోసం సమాజం, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలి. అపుడే నిజమైన బాలికా దినోత్సవం.

(నేడు జాతీయ బాలికా దినోత్సవం)

– కాళంరాజు వేణుగోపాల్, మార్కాపురం

కర్మయోగి గాంధీ

గాంధీగారిని మహాత్ముడని రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. ఆయన ఇచ్చిన ఆ గౌరవ సంబోధనను, జాతి స్వీకరించడంతో గాంధీ మహాత్మా గాంధీ అయ్యాడు. గాంధీగారిని మహాత్ముడు అని పిలవటాన్ని ఠాగూర్ ఈ విధంగా సమర్థించారు: ఎవరి ఆత్మ అయితే విముక్తి చెంది, అన్ని ఆత్మలలోనూ దర్శనమిస్తుందో, ఆ ఆత్మ కలవాడే 'మహాత్ముడు' అని ఆయన నిర్వచించారు. మహాత్ముడి కార్యకలాపాలు ఒకరి కోసమో ఇద్దరి కోసమో కాదు, అవి మొత్తం ప్రపంచం కోసం. వాటికి పరిమితులేమీ లేవు. నిర్బంధాలు లేవు. గాంధీజీ కార్యకలాపాలు కూడా అంతే. అవి ఒక కులం, మతం, జాతి కోసం కాదు. సకల మానవాళి కోసమూను. అందుకే ఆయన మహాత్ముడు. ఇదే విషయాన్ని గురించి భగవద్గీతలో భగవానుడు ఇటువంటి కర్మయోగి ప్రియమైనవాడని, భక్తుడని, ఇతడిని నేను చూసుకుంటాననీ అన్నాడు. కర్మయోగి సన్యాసితో సమానమైనవాడని, ఈ రెండు పద్ధతులూ అనుసరించ దగ్గవేనని, అయినా సన్యాసి కంటే కర్మయోగి శ్రేష్ఠుడని చెప్పాడు. మన గాంధీ గారు అదే కోవకు చెందుతారు. ఆయన మనసులోని చంచలము వదిలి, శాంతి, సహనం, సత్యం, అహింస విలువలను పట్టి కర్మయోగిగా మసలినాడు.

– జమలాపురం ప్రసాదరావు, ఖమ్మం

(ఇది మహాత్మాగాంధీ 150వ జయంతి సంవత్సరం)

సహజ న్యాయాన్ని కాలరాచిన 'కోటా'

మోదీ ప్రభుత్వం అకస్మాత్తుగా జనరల్ కేటగిరీ లోనూ ఆర్థిక బలహీన వర్గాలున్నాయని కనిపెట్టి వారికి విద్య, ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చేసిన 124వ రాజ్యాంగ సవరణ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికే కాదు, సహజ న్యాయ సూత్రాలకూ విరుద్ధమైనది. ఈ అంశం ఎవరికి, ఎలా రాజకీయంగా ఉపయోగ పడుతుందనికాక. దాని న్యాయాన్యాయాల గురించే మనం మాట్లాడుకోవాలి.

హేతుబద్ధత లేని ఈ నిర్ణయంతో రిజర్వేషన్ వ్యవస్థ లక్ష్యాన్ని దెబ్బతీయటమే కాక అణగారిన వర్గాల అభివృద్ధికి అవకాశాల్ని కుదిస్తున్నారు. కులం, ఆచారాల రూపంలో అణచివేతకు గురైన ఫలితంగా ఆధిపత్య వర్గాలతో అవకాశాల్లో పోటీ పడలేని ప్రజలకు ఆసరాగా రిజర్వేషన్లు వచ్చాయి. 'సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన' వర్గాలకు తరతరాలుగా అందని విద్యను అందించటానికి, 'ప్రభుత్వ పాలనలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు' ఉద్యోగావకాశాలు కల్పించే ఆశయంతో రిజర్వేషన్లు వచ్చాయి. కాబట్టి రిజర్వేషన్ లక్ష్యం ప్రాతినిధ్యం లేని వర్గాల ప్రాతినిధ్యాన్ని పెంచటం. దేశంలో మనుషులందరిలో సమానత్వాన్ని సాధించటం.

కానీ ఇవ్వాళ మోదీ పార్టీ చేసిన రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ప్రయోజనం పొందగల వర్గాలకు పై మూడు నిబంధనలేవీ వర్తించవు. సామాజికంగా వారే ఆధిపత్య వర్గాలు. వారిపై ఏ సామాజిక అణచివేత ప్రభావం గతంలో లేదు, ఇప్పుడూ లేదు. వారితోనే ఇతరులకు సమస్య. ఇక విద్యాపరంగా అక్షరాస్యతలో గానీ, ఉన్నత విద్యాధికుల్లో గానీ వారే ముందున్నారు. పరిపాలనలో వారి జనాభాకి మించి కొన్ని రెట్ల ఆధిక్యంలో ఉన్నారు. జనరల్ కేటగిరీ (జీసీ) వర్గంలో కొద్దిమంది ఆర్థిక వెనుకబాటుతనంలో ఉన్నప్పటికీ, ఆ కొద్దిమందికి గల 'ఆర్థిక కారణం' దళిత, గిరిజన, శూద్ర, నిమ్న కులాల మాదిరి సామాజిక ఆధిపత్య వర్గాలుగా ఉన్నవారికి రిజర్వేషన్లు కల్పించటానికి అర్హత కాదు, కాకూడదు. పైగా వారిలో 'పేదల' నిర్వచనం చూస్తే మిగతా వర్గాల్లో ధనికులతో సమానంగా ఉంది. ఇదంతా రాజ్యాంగ విరుద్ధమే కాదు, అహేతుకం, అనైతికం కూడా.

రాజ్యాంగంలోని అధికరణ 46 చేసిన దిశా నిర్దేశమే తమకు ప్రేరణ అని 124వ రాజ్యాంగ సవరణ బిల్లులో చెప్పుకొచ్చారు. ఆర్టికల్ 46కి ఇదొక పెద్ద అపచారపు వ్యాఖ్య. 'ప్రభుత్వం బలహీన వర్గాల, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల విద్యా మరియు ఆర్థిక ప్రయోజనాలను ప్రత్యేక శ్రద్ధతో పెంపొందించాలి, వారిని సామాజిక అన్యాయం మరియు అన్ని రకాల దోపిడీల నుండి రక్షించాలి' అని. ఇది చదివిన వారికి ఎవర్ని ఉద్దేశించి ఈ నిబంధన ఏర్పాటు చేయబడిందో విడమరిచి చెప్పాల్సిన పనిలేదు. కానీ మోదీ గారికి వారి వ్యాపారులను, నెలకు 67 వేలు సైతం సంపాదించే, 'బీదల'ను ఇందులో సర్దుబాటు చేయవచ్చనిపించింది. పీవీ నరసింహారావు మండల్ సిఫారసుల అమలు సందర్భంలో ఒక రాజీ మార్గంగా ఇదే ప్రతిపాదనను చేసినా అది కోర్టులో నిలవలేదు. అప్పటికీ ఇప్పటికీ రెండు స్థూల (రిజర్వేషన్ వర్తించే, వర్తించని) వర్గాల మధ్య ఆర్థిక, సామాజిక అంతరం మరింత పెరిగింది గానీ తగ్గలేదు. ఎక్కడా రాజ్య వ్యవస్థలైన శాసన (రాజకీయ), కార్య నిర్వాహక, న్యాయ రంగాలలో గానీ వ్యాపారాలలో గానీ రిజర్వేషన్ వర్తించే వర్గాలు ఆధిపత్యం లోకి వచ్చి రిజర్వేషన్ వర్తించని (కారణంగా వెనుకబడి పోయిన) వారిని స్థానభ్రంశం చేసిన దాఖలాలు లేవు. కనీసం జీసీ వర్గాల్లో గతంతో పోల్చినప్పుడు పేదరికం దారుణంగా పెరిగినట్టు కూడా ఏ ఆధారం లేదు, అధ్యయన నివేదికలు అంతకన్నా లేవు. ఇది కేవలం సాంకేతిక పొరపాటు కాదు. జీసీ వర్గాలు ఇప్పటిదాకా ఓపెన్ కేటగిరీ పేరుతో 50 శాతం అవకాశాలను తమకు రిజర్వుడ్‌గా వాడుకున్నారు. ఆ ఓపెన్ కేటగిరీలో ఎస్సీ, ఎస్టీ ఓబీసీ అభ్యర్థుల శాతం పెరుగుతుండటంతో ఇటువంటి రిజర్వేషన్ తమకు అవసరమని ఆ వర్గం కొంత కాలంగా డిమాండు చేస్తున్నది. అలాగే మొత్తంగానే రిజర్వేషన్ విధానం లేకుండా చేయటం కోసం రిజర్వేషన్ వర్తించే వర్గాల్లో ఆర్థికంగా ఎదిగిన అతికొద్దిమందిని భూతద్దంలో చూపి రిజర్వేషన్ల రద్దుకు డిమాండు చేసిన విషయం ఎవరూ మరువకూడదు.

ఇది కేవలం ఎన్నికల ఎత్తుగడ కాదు, మోదీ పాలనా వైఫల్య ఫలితం కూడా కాదు. అణగారిన వర్గాలకు రిజర్వేషన్ విధానాన్ని ప్రారంభం నుండీ



> కేవలం ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేస్తున్న వర్గాలకు, ఇప్పుడు దానికి పునాది వేసిన మోదీ పార్టీకి అంతిమంగా రిజర్వేషన్ విధానాన్ని రద్దుచేసి బలహీనులకు ఏ అండా లేకుండా చేయటమే లక్ష్యం. అంతేకానీ జనరల్ కేటగిరిలోని వాస్తవ పేదలను ఉద్ధరించటం కాదు. రాజ్యాంగానికి చేసిన 124వ సవరణను వెంటనే తొలగించాలి.

ఆధిపత్య కులాలు అడ్డుకుంటూనే ఉన్నాయి. అర్హత లేనివారు తమతో పోటీకి వస్తున్నారనేది వారి ఆరోపణ. అర్హత అంటే వారి దృష్టిలో వారసత్వపు హక్కే. అన్ని ప్రయోజనాలు తమ వర్గ పరిధి దాటిపోకుండా ఉంచుకోవటానికి, తామే శాశ్వత పాలకులుగా కొనసాగటానికి మెజారిటీ ప్రజలకు విద్య లేకుండా, ఆస్తి లేకుండా అణచిపెట్టటానికి వారు విశ్వప్రయత్నం చేస్తూనే ఉన్నారు. కాబట్టి రిజర్వేషన్ విధానంతో నిమ్న కులాల స్థితి గతుల్లో ఎటువంటి అభివృద్ధికర మార్పునూ ఆ వర్గాల స్థూల మనస్తత్వం ఒప్పుకోదు. ఈ రోజు సనాతన హైందవ సాంప్రదాయానికి ప్రతినిధిగా భావించుకునే పార్టీ చేయగల పనినే మోదీ పార్టీ చేసింది. సమాజంపై తమ అధిపత్యానికి అడ్డుగా ఉన్న రిజర్వేషన్ విధానాన్ని దారి తప్పించి, ఆర్థిక ప్రాతిపదికను విస్తరిస్తూ క్రమంగా రిజర్వేషన్లను ఎత్తేయటానికి ఈ రాజ్యాంగ సవరణ తొలి మెట్టు. జనరల్ కేటగిరీలో మాత్రమే పోటీ పడే వారిలో పేదలే లేరని ఎవరూ అనరు. జీసీ వర్గాల పేదవారిని మోదీ గారి నిర్వచనం ప్రకారం గుర్తిస్తే ఆ పేదరికానికి అర్థమే ఉండదు. అలా కాకుండా ఒక సార్వజనీన పేదరిక నిర్వచనం ప్రకారం వారిని గుర్తించి మిగతా వర్గాల పేదలకిచ్చే అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయాలు ఉదాహరణకు పిడిఎస్, సంక్షేమ స్కూళ్ళు, హాస్టళ్లు, స్కాలర్ షిప్‌లు, జాబ్ ట్రైనింగ్, ఉపాధి హామీ మొదలగునవన్నీ అందించాలి. నిర్దిష్ట అర్హులకు పేదలకిచ్చే అన్ని ఆర్థిక సహాయాలూ చేయాలి. అలా కాక సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన వారినీ కేవలం ఆర్థికంగా మాత్రమే వెనుకబడిన వారినీ ఒకే గాటన కట్టి రిజర్వేషన్లు అడగటం, ఇవ్వటం సమంజసం కాదు.

కేవలం ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేస్తున్న వర్గాలకు,ఇప్పుడు దానికి పునాది వేసిన మోదీ పార్టీకి అంతిమంగా రిజర్వేషన్ విధానాన్ని రద్దుచేసి బలహీనులకు ఏ అండా లేకుండా చేయటమే లక్ష్యం. అంతేకానీ జనరల్ కేటగిరిలోని వాస్తవ పేదలను ఉద్ధరించటం కాదు. ఇది వారు పేదలకిచ్చిన నిర్వచనాన్ని చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. కాబట్టి రాజ్యాంగానికి చేసిన 124వ సవరణను వెంటనే తొలగించాలి. అన్ని వర్గాలు కనుక ఒప్పుకుంటే ఓపెన్ కేటగిరీని రద్దుచేసి రిజర్వేషన్ మొత్తాన్ని నూరు శాతానికి పెంచి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, జీసీ వర్గాలను అలాగే ఉంచి వారి జనాభా దామాషా ప్రకారం అవకాశాల్లో వాటా తీసుకోవచ్చు. నిజానికిది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు వారి చారిత్రక వెనుకబాటుతనానికి అదనపు వెయిటేజీ ఏమీ ఇవ్వదు. అయితే అవకాశాల్లో వారి ప్రాతినిధ్యానికి భద్రతనిస్తుంది. జనరల్ కేటగిరీ వర్గాలకూ స్థిరమైన వాటా ఉంటుంది. ఇది ఆర్టికల్ 14, సమానత్వపు హక్కుతో విభేదించదు కూడా. వారి వారి కేటగిరీలో తిరిగి పేదలను, ధనికులను వేరుపర్చి అవకాశాల్లో ప్రాధాన్యతలు నిర్ణయించవచ్చు. నిజానికి కులాలను రద్దు చేసుకుందామని అందరూ ముందుకు రాగలిగితే ఈ గందరగోళం, అసూయ, ద్వేషాలకు తావే ఉండదు. దేశంలో రమారమి 75 శాతం రిజర్వేషన్ వర్తించే మనుషులు ఉండి తమకు న్యాయంగా రావాల్సిన వాటా ఇంకా ఉన్నా మోదీ గారు ఇలా సాహసించారంటే సగటు భారతీయుల్లో పెరుగుతున్న ఛాందస భావాలు, రాజకీయ భావ దారిద్ర్యంపై వారికి గల నమ్మకమే కారణం. హైందవ భావజాలం మాటున పెరుగుతున్న ఆధిపత్య వర్ణ, కుల అనుకూల వాతావరణం వారి పనిని సులభతరం చేసింది.

ఇప్పుడు రిజర్వేషన్ల ద్వారా ఆర్థికంగా ఎదిగినవారికీ వివక్ష తప్పటం లేదు. వివక్షకు మూలం కులం. రిజర్వేషన్ కోసమో, కొత్తగా సంఘం పెట్టుకోవటానికో కులాన్ని అలాగే ఉంచుకుంటే కులం పోదు. కులం పోకపోతే వివక్ష పోదు. కుల నిర్మూలనకు అందరూ ప్రయత్నించాలి. ప్రత్యేకించి ప్రభుత్వం క్యాస్ట్ ఫ్రీ ఇండియాను లక్ష్యంగా ప్రకటించాలి. కులమే పోయిన నాడు కుల ప్రాతిపదికన రిజర్వేషన్ల విధానం దానికదే రద్దవుతుంది.

■ డా.ఎస్.తిరుపతయ్య
మానవ హక్కుల వేదిక

ప్రమాణాలు ఎందుకు పడిపోతున్నాయి?

ప్రభుత్వ స్కూళ్లలో ప్రమాణాలపై హైకోర్టు ఆందోళన

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతోపాటు విద్యా ప్రమాణాలు పడిపోవడం పట్ల హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోతుంటే.. ప్రైవేటుకు ఆస్కారం కల్పించినట్లు అవుతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పరిస్థితులను చక్కదిద్దడానికి పటిష్ఠమైన ప్రతిపాదనలతో రావాలని ప్రభుత్వం తరపు న్యాయవాదికి స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డితో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోవడాన్ని ప్రశ్నిస్తూ ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకటరెడ్డి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ తరపు న్యాయవాది ఎన్.ఎస్.అర్జున్‌కుమార్ వాదిస్తూ.. విద్యాప్రమాణాలపై ఆసర్-2018 నివేదికలో ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థుల సంఖ్య మరింత పడిపోయిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 16వేల మంది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో ఉపాధ్యాయుల భర్తీకి ప్రభుత్వం ఏం చేస్తోందని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రభుత్వం తరపు న్యాయవాది వివరణ ఇస్తూ.. దశల వారీగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నామని, విద్యా ప్రమాణాలు పెంచేందుకు 'మోడల్ స్కూల్స్' ప్రారంభించామని తెలిపారు. అలాగైతే ప్రమాణాలు ఎందుకు పడిపోతున్నాయని ధర్మాసనం ప్రశ్నించింది. పరిస్థితిని మెరుగుపర్చేందుకు పటిష్ఠమైన ప్రణాళికతో రావాలని సూచించింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

దివ్యాంగుల 'ఓటు'కు సౌకర్యాలు కల్పించాలి

హైకోర్టు సీజేకు లేఖ.. సుమోటో పిల్‌గా ధర్మాసనం విచారణ

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఓటుహక్కును వినియోగించుకునేలా తగిన సౌకర్యాలు కల్పించాల్సిందిగా ఆదేశించాలంటూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖపై ధర్మాసనం స్పందించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డితో కూడిన ధర్మాసనం ఈ లేఖను సుమోటో పిల్‌గా విచారణ చేపట్టింది. ఈ వ్యాజ్యంలో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ఎన్నికల సంఘాలకు, కేంద్ర న్యాయశాఖకు నోటీసులు జారీ చేసింది. దివ్యాంగుల చట్టం-2016 ప్రకారం వారు ఓటుహక్కు వినియోగించుకునేందుకు తగిన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ.. 'నెట్‌వర్క్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీ ఆర్గనైజేషన్' అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. తెలంగాణలో సుమారు 20 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని, తగిన సౌకర్యాలు కల్పించకపోవడంతో అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 8 లక్షల మంది దివ్యాంగులు తమ ఓటుహక్కును వినియోగించుకోలేక పోయారని పేర్కొన్నారు. ఇది దివ్యాంగుల హక్కులను హరించడమే అవుతుందన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. మూడు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.



స్లిప్పుల లెక్కింపుపై ఈసీ వివరణ తీసుకోండి

ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాదికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని, వీవీ ప్యాట్లలోని స్లిప్పులను లెక్కించేలా కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ బీఎస్పీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై ఈసీ వివరణ తీసుకోవాలని ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాదిని ఆదేశించింది. మల్‌రెడ్డి రంగారెడ్డి పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ రాజశేఖర్‌రెడ్డితో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. కౌంటింగ్‌పై పోలింగ్ ఏజెంట్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ రిటర్నింగ్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోలేదని మల్‌రెడ్డి ఆరోపించారు. అనేక అభ్యంతరాల మధ్య కౌంటింగ్ రోజు రాత్రి 9.30 గంటలకు 376 ఓట్లతో టీఆర్ఎస్ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించారని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం వీవీ ప్యాట్ స్లిప్పుల లెక్కింపుపై కేంద్ర ఎన్నికల సంఘం వివరణ తీసుకుని చెప్పాలని న్యాయవాది అవినాశ్ దేశాయ్‌ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది. కాగా వీవీ ప్యాట్ స్లిప్పులను లెక్కిస్తే తానే గెలుస్తానని మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సీనియర్ న్యాయవాదులు రాకేశ్ గుంజాల్, హైకోర్టు న్యాయవాది అరుణ్‌తో ఆయన చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే తాను కోర్టును ఆశ్రయించానని తెలిపారు.



యాగశాల వద్ద సీఎం కేసీఆర్‌ను కలిసి డైరీ అందజేస్తున్న గంగు ఉపేంద్రశర్మ

సీఎం యాగంతో ప్రజా సంక్షేమం:గంగు

- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు 2019 డైరీ అందజేత

సీఎం కేసీఆర్ నిర్వహిస్తున్న యాగం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. సీఎం ప్రకటించిన విధంగా ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో అర్చక, ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నందుకు కృతజ్ఞతగా ముద్రించిన 2019 డైరీని యాగశాల వద్ద కేసీఆర్ దంపతులకు బుధవారం ఆయన అందజేశారు. హిందూ ధర్మాన్ని పాటించే సీఎం కేసీఆర్ బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ బ్రాహ్మణిజాన్ని నిలబెట్టేందుకు యాగాలు చేయడం సంతోషకరమని అన్నారు.

● వ్యాస్ కుమారుడు శ్రీవత్స పదోన్నతికి కోర్టు బ్రేక్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):దివంగత ఐపీఎస్ వ్యాస్ కుమారుడు శ్రీవత్స పదోన్నతికి బ్రేక్ పడింది. డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న శ్రీవత్సకు పదోన్నతి కల్పించడానికి వీలుగా అజయ్‌మిశ్రా నేతృత్వంలోని డీపీసీ మంగళవారం సమావేశం కాగా, ప్రక్రియను నిలిపివేయాలంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వ్యాస్ హత్య తర్వాత కారుణ్య నియామకం కింద ఆయన కుమారుడు శ్రీవత్స డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. అయితే, మూడేళ్లపాటు హైదరాబాద్ జిల్లా కార్యనిర్వాహక మెజిస్ట్రేట్(ఎస్ఈఎం)గా పని చేసిన శ్రీవత్స.. కన్‌ఫర్డ్ ఐఏఎస్ కోసం విధిగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంది. పరీక్ష నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలన్న శ్రీవత్స అభ్యర్థించగా.. తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది. దీనిపై ఓ అధికారి హైకోర్టును ఆశ్రయించగా, జస్టిస్ రామసుబ్రమణ్యన్, జస్టిస్ పి.కేశవరావు నేతృత్వంలోని బెంచ్ పదోన్నతి ప్రక్రియను నిలిపేస్తూ ఆదేశాలు ఇచ్చింది.

● పంట కాలనీలతో స్వావలంబన: పార్థసారథి

రైతుల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడేలా పంట కాలనీలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి సూచించారు. వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయంతో పంట ఉత్పత్తులకు అధిక ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెక్రటేరియేట్ నుంచి వివిధ జిల్లాల డీఏవోలు, ఏడీఏలు, ఏవోలు, ఎంఈవోలతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాగా, హరియాణాలోని సోనేపట్‌లో ఫుడ్ టెక్నాలజీ నేషనల్ ఇనిస్టిట్యూట్ సందర్శనకు పార్థసారథి నేతృత్వంలోని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారుల బృందం గురువారం బయలుదేరి వెళ్లనుంది.

● ఈ-నామ్ అంతర్ రాష్ట్ర ట్రేడింగ్ సక్సెస్: కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈ- నామ్ పోర్టల్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో అంతర్‌రాష్ట్ర ట్రేడింగ్ విజయవంతమైందని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ వెల్లడించారు. తొలి అంతర్‌రాష్ట్ర ట్రేడింగ్ ఈ నెల 19న తెలుగు రాష్ట్రాల్లో జరిగిందని ఆయన తెలిపారు. తెలంగాణలోని గద్వాలకు చెందిన ఓ రైతు ఏపీలోని కర్నూలుకు చెందిన ట్రేడర్‌కు ఈ-నామ్ ద్వారా 8.46 క్వింటాళ్ల వేరుశనగలు అమ్మారని వివరించారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా విక్రయించుకోడానికి ఉద్దేశించి రూపొందించిన ఈ పోర్టల్ ద్వారా ఒకే రాష్ట్రానికి చెందిన మార్కెట్లలోనే విక్రయించే అవకాశం ఉండేది. అయితే, అంతర్‌రాష్ట్ర మార్కెట్లలో కూడా ఈ-నామ్ ద్వారా విక్రయించేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ తెలుగు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టును చేపట్టింది.

● బీజేపీ సర్పంచ్‌లకు లక్ష్మణ్ అభినందన

పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో కామారెడ్డి జిల్లాలో విజయం సాధించిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అభినందించారు. వీరంతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్‌ను కలిశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలు తీర్చాలని, పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని లక్ష్మణ్ తెలిపారు.

తెలంగాణ ఎడిషన్లలో

ఏపీ వార్తలు ఎందుకు?

అస్తిత్వాన్ని తొక్కి పెట్టే ప్రయత్నాలను సహించం.. తెలంగాణ భావజాల పత్రికలకు ప్రోత్సాహం

- జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా
- ఏపీ సీఎం చంద్రబాబువి ఆపద మొక్కులు
- ఎమ్మెల్యే క్రాంతి అభినందన సభలో కేటీఆర్



ఎమ్మెల్యే క్రాంతిని అభినందిస్తున్న కేటీఆర్

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఏర్పడి ఐదేళ్లవుతున్నా కొన్ని మీడియా సంస్థలు తెలంగాణపై ఆధిపత్య ధోరణితో వార్తలు రాస్తున్నాయని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ వార్తలు అమరావతిలో రానప్పుడు.. అమరావతి వార్తలు తెలంగాణలో ఎందుకని ప్రశ్నించారు. వార్తాపత్రికల తెలంగాణ ఎడిషన్లలో స్థానిక వార్తలే ఉండాలన్నారు. టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టు సంఘం నేత, ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అభినందన సభ హైదరాబాద్‌లో బుధవారం జరిగింది. టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ను గజమాల, జ్ఞాపికతో సన్మానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. కొన్ని పత్రికలు తెలంగాణ అస్తిత్వాన్ని తొక్కిపెట్టే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇలాంటి డ్రామాలు ఎక్కువ రోజులు నడవవని, దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ అస్తిత్వానికి ఇబ్బంది ఏర్పడితే జర్నలిస్టులంతా ఇటువైపే నిలబడాలని సూచించారు. తెలంగాణ భావజాలం కలిగిన పత్రికలకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే బాధ్యత తనదే అన్నారు. కోర్టు వివాదం లేని ఇళ్ల స్థలాలతో పాటు జర్నలిస్టుల హెల్త్‌కార్డులు, టీయూడబ్ల్యూజే భవన నిర్మాణం వంటి అంశాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు సీఎం కేసీఆర్ పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. జర్నలిస్టులకు ఇంకా చేయాల్సింది చాలా ఉందని, త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమంపై అనవసర ఆరోపణలు చేస్తున్న వారితో బహిరంగ చర్చకు అవసరమైతే మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ వస్తారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఏపీ సీఎం చంద్రబాబు జర్నలిస్టులకు 30 ఎకరాలు కేటాయిస్తూ జీవో తెచ్చారని, ఆయనవి ఆపద మొక్కులని ఎద్దేవా చేశారు. తెలంగాణ పథకాలను కాపీ కొడుతూ వచ్చే ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఏపీ ప్రజలు తెలివైన వారని, చంద్రబాబుకు దిగిపోయే సమయం దగ్గర పడిందని జోస్యం చెప్పారు. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి రూ.100 కోట్ల నిధి ఏర్పాటు చేసిన సీఎం దేశంలో కేసీఆర్ ఒక్కరేనని కొనియాడారు. జర్నలిస్టుల సంక్షేమంపై కొన్ని సంఘాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ జర్నలిస్టుల సంక్షేమాన్ని మరిచిపోనన్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. జర్నలిస్టులంటే మంచీ చెడు తెలిసిన వాళ్లని అన్నారు. జర్నలిస్టు ప్రజా ప్రతినిధిగా ఎంత బాగా పని చేయగలడో చూపించాలని క్రాంతికిరణ్‌కు సూచించారు. నిజాం వ్యతిరేక ఉద్యమం నుంచి పత్రికా రంగమే ఉద్యమాలను నడిపించుకుంటూ వచ్చాయని గుర్తు చేశారు. సభలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి, జర్నలిస్టు సంఘం నేతలు పాల్గొన్నారు. ఉద్యమ సమయంలో పోలీసుల లాఠీ దెబ్బలకు తీవ్రంగా గాయపడి అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకున్న నల్లగొండ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు ఆవుల అంజయ్యకు కేటీఆర్ రూ.5 లక్షల చెక్కును అందజేశారు.

ఓడిన వాళ్లకు 'డీసీసీ' ఇవ్వొద్దు


- కాంగ్రెస్‌ను వీడిన వాళ్లకు బుద్ధి చెప్పాలి: వీహెచ్
- ఈవీఎంలు వద్దని నేడు ధర్నా: మర్రి

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన వాళ్లకు డీసీసీ పదవులు ఇవ్వొద్దని, పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న వాళ్లకే ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు సూచించారు. కాంగ్రెస్‌ను వీడిన నాయకులకు బుద్ధి చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వీహెచ్ బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. వంటేరు ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడిపోవడం అన్యాయమన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వద్దకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎలా వెళ్తారని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లను 52శాతానికి పెంచేలా కార్యాచరణ చేపట్టాలని, క్రీమీలేయర్ ఎత్తివేతపై రాహుల్‌గాంధీ న్యాయ నిపుణులతో చర్చిస్తున్నారని తెలిపారు. ఈ నెల 25న నిర్వహించే నేషనల్ ఓటర్స్ డేను బహిష్కరిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి వెల్లడించారు. ఈవీఎంలు వద్దంటూ గురువారం ధర్నా చేస్తామన్నారు. ఈ ధర్నాకు కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ, టీజేఎస్, ఎంబీటీ నేతలను ఆహ్వానించామన్నారు. కాగా, ఎన్డీయే పాలనలో మహిళలకు భద్రత కరువైందని టీపీసీసీ నాయకురాలు ఇందిరాశోభన్ ఆరోపించారు.

డీసీసీల జాబితా సిద్ధం

- 2, 3 రోజుల్లో ప్రకటించే అవకాశం

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా కమిటీ(డీసీసీ) అధ్యక్షుల నియామకంపై టీపీసీసీ కసరత్తు పూర్తి చేసింది. 31 జిల్లాలకు గాను 30 జిల్లాల డీసీసీలను ఎంపిక చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఖుంటియా ఈ జాబితాను అధిష్ఠానానికి సమర్పించినట్లు తెలిసింది. డీసీసీలను నియమిస్తే పార్లమెంటు ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించొచ్చని అధిష్ఠానం భావిస్తోంది. దీంతో 31 జిల్లాల్లో డీసీసీలను నియమించాలని ఆదేశించింది. కొన్ని జిల్లాల్లో డీసీసీ పదవికి పోటీ నెలకొనడం, మరికొన్ని జిల్లాల్లో సమర్థుల కొరతతో టీపీసీసీ సందిగ్ధంలో పడింది. నియామకం ఆలస్యమవడంతో సీరియస్ అయిన అధిష్ఠానం ఈ ప్రక్రియను నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించినట్లు సమాచారం. అన్ని జిల్లాల అధ్యక్షులను 2, 3 రోజుల్లో ప్రకటిస్తుందని తెలుస్తోంది.



కారు గుర్తును తొలగించండి : ఎస్ఎఫ్‌బీ

కారు గుర్తుకు పడాల్సిన ఓట్లు ట్రక్కు గుర్తుకు పడటం వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో తాము నష్టపోయామన్నది టీఆర్ఎస్ నేతల వాదన. ట్రక్కు గుర్తును తీసేయాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి కూడా చేశారు. అయితే గద్వాల నియోజకవర్గ సమాజ్‌వాదీ ఫార్వర్డ్ బ్లాక్(ఎస్ఎఫ్‌బీ) ఇన్‌చార్జి అబ్దుల్ మహ్మద్ ఖాన్ ఇందుకు భిన్నమైన వాదన వినిపిస్తున్నారు. ట్రక్కు ట్రక్కు గుర్తుకు పడాల్సిన ఓట్లు కారు గుర్తుకు పడటం వల్లే తాను ఓడిపోయానని వాపోతున్నారు. ట్రక్కు, కారు గుర్తుల విషయంలో ఓటర్లు గందరగోళానికి గురయ్యారని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లోనైనా కారు గుర్తును తొలగించాలని కోరుతూ బుధవారం సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

గ్రామాభివృద్ధికి 20కోట్లు ఇస్తా

గట్ల నర్సింగాపూర్‌కు కావేరి సీడ్స్ ఎండీ హామీ



భీమదేవరపల్లి, జనవరి 23: వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలంలో తన స్వగ్రామమైన గట్ల నర్సింగాపూర్ అభివృద్ధికి రూ.20 కోట్లు ఇస్తానని కావేరీ సీడ్స్ ఎండీ గుండవరపు భాస్కర్‌రావు తెలిపారు. గట్ల నర్సింగాపూర్ సర్పంచ్‌గా తాను బలపరిచిన అభ్యర్థి జక్కుల అనితను గెలిపించాలని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో రూ.6కోట్లతో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం, రూ.2కోట్లతో పెద్ద చెరువు పూడికతీత, రూ.2కోట్లతో ఫంక్షన్ హాలు నిర్మించినట్లు తెలిపారు. వీటిని పరిశీలించేందుకు రెండు నెలల్లో ఎప్పుడైనా గ్రామానికి వస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని చెప్పారు. సర్పంచ్‌గా జక్కుల అనితను గెలిపిస్తే.. ఎస్సీ కాలనీ పక్కన తనకున్న నాలుగెకరాల భూమిని దళితులు ఇళ్లు కట్టుకునేందుకు ఉచితంగా ఇస్తానని ప్రకటించారు. పెద్ద చెరువును రిజర్వాయర్‌గా మార్చి రైతులకు సాగు నీరు అందుబాటులో ఉంచుతానని హామీ ఇచ్చారు.

ఇది శనక్కాయ మాయ





సంస్థ నిర్వాహకులను అదుపులోకి తీసుకుంటున్న ఉప్పల్ పోలీసులు, ఉప్పల్‌లోని గ్రీన్‌గోల్డ్ బయోటెక్ సంస్థ ముందు గుమిగూడిన బాధితులు

- లక్ష రూపాయలిస్తే గానుగ యంత్రం
- వేరుశనగ ఆడించి నూనె, పిప్పి ఇస్తే 3.8లక్షల లాభం
- ఇతరులను చేర్పిస్తే 20వేల కమీషన్ అదనం
- ఉప్పల్ కేంద్రంగా గ్రీన్‌గోల్డ్ కంపెనీ మోసం
- రూ.100కోట్ల దాకా వసూళ్లు

ఉప్పల్/హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అదో గొలుసు కట్టు కంపెనీ. అక్కడ రూ. లక్ష పెట్టుబడి పెడితే.. రెండేళ్లు తిరిగేసరికి 4.8లక్షలు చేతికి వస్తాయి! అంటే.. 3.8లక్షల లాభం!! అదెలా అంటారా? పెట్టుబడిగా లక్ష ఇస్తే.. వేరుశనగ ఆడించే ఓ యంత్రం ఇస్తారు. చేయాల్సిందల్లా వారు ఇచ్చిన వేరుశనగలను ఆడించి నూనె తీయడం.. ఆ నూనెను, పిప్పిని కంపెనీకి అప్పగించడమే! వారు ఎప్పుడు వేరుశనగలిచ్చినా కాదనకుంటా పట్టించి ఇయ్యాలి. ఇలా చేస్తే.. 24 నెలలపాటు నెలకు రూ.20వేల చొప్పున ఇస్తారు. గడువు తర్వాత యంత్రం కూడా మిగిలిపోతుంది. మరొకరిని చేర్పిస్తే రూ.20వేలు కమీషన్ అదనం! అంటే.. మొత్తంగా లక్షకు రెండేళ్లలో రూ.4లక్షల లాభం అన్నమాట! ఇదంతా చూస్తుంటే అప్పట్లో కరక్కాయల పేరుతో నిండా ముంచిన ఓ కంపెనీ భాగోతం గుర్తొస్తోంది కదూ! ఇదీ అలాంటిదే. ఈ శనక్కాయల దందా పేరుతో ప్రజలు నిండా ముంచి రూ.100కోట్లదాకా దండుకుందా కంపెనీ! ఈ మేరకు ఉప్పల్ కేంద్రంగా గ్రీన్‌గోల్డ్ బయోటెక్ పేరుతో జిన్నా శ్రీకాంత్ అనే వ్యక్తి పాల్పడిన భారీ మోసం ఇది! నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌కు చెందిన జిన్నా శ్రీకాంత్ ఈ కంపెనీ అధినేత! ఉప్పల్ మెట్రో స్టేషన్ పక్కనే అద్దెకు భవనాన్ని తీసుకొని.. ఏజెంట్లను పెట్టుకున్నాడు. లక్ష ఇస్తే.. అంతే ఖరీదు గల యంత్రం ఇస్తామని నష్టపోవడమనే ప్రశ్నే తలెత్తని శ్రీకాంత్ జనాలను నమ్మించాడు. దీంతో కొందరైతే రూ.10లక్షలదాకా పెట్టుబడి పెట్టారు. వారిని చూసి మరొకరు.. వేల సంఖ్యలో పెట్టుబడి పెట్టారు. అయితే, వారి నుంచి డబ్బులు తీసుకొని యంత్రాలయితే ఇచ్చాడు గానీ నెలవారీగా ఇస్తామన్న రూ.20వేలు ఇవ్వలేదు. ప్రశ్నించిన పెట్టుబడిదారులను ఇదిగో.. అదిగో అంటూ వాయిదా వేస్తూ వచ్చాడు. సరూర్‌నగర్ హుడా కాంప్లెక్స్‌కు చెందిన బాధితుడు ఇంద్రకిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ భారీ దందా భాగోతం బటయపడింది. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సంస్థ కార్యాలయంపై దాడి చేసి యజమాని జిన్నా శ్రీకాంత్‌తో పాటు, మరో నిర్వాహకుడు భాస్కర్ ఇతర నిర్వాహకులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వేల సంఖ్యలో శ్రీనివాస్ మాటలకు మోసపోయారని తెలుస్తోంది. కొందరు బాదితులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. బాదితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మోసం గురించి బయటకు పొక్కడంతో కంపెనీ ముందు పెద్ద సంఖ్యలో బాధితులు గుమిగూడారు.

కేబినెట్ హోదా లేకుండానే పార్లమెంటరీ కార్యదర్శులు

- ఛత్తీస్‌గఢ్ మార్గంలో వెళదాం
- కోర్టు చిక్కులకు ఇదే పరిష్కారం
- తెలంగాణ ప్రభుత్వం యోచన
- అధ్యయనానికి ఎంపీ వినోద్, సలహాదారు రాజీవ్ శర్మలతో కమిటీ

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సహాయ మంత్రి హోదా లేకుండానే పార్లమెంటరీ కార్యదర్శులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. శాసనసభ్యుల సంఖ్యలో మంత్రుల సంఖ్య 15 శాతం దాటకూడదని 2003 నాటి కేంద్ర ప్రభుత్వ చట్టం నిర్దేశిస్తున్న నేపథ్యంలో రాజ్యాంగ పరమైన ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకే సహాయ మంత్రి హోదా ఇవ్వవద్దని భావిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లోనూ సహాయ మంత్రి హోదా ఇవ్వకుండానే పార్లమెంటరీ కార్యదర్శుల నియామకం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం దాన్నే మార్గదర్శకంగా తీసుకోబోతున్నట్లు సమాచారం.

15 శాతం నిబంధన కోసమే

ఆరు నూరైనా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించి తీరుతామని ఇప్పటికే సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఈ విషయమై అధ్యయనం చేసి, తగిన సూచనలు ఇచ్చే బాధ్యతను ఎంపీ బి.వినోద్ కుమార్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మలకు అప్పగించారు. వారివురు ఇప్పటికే అధ్యయనం ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్‌లలో గతంలో జరిగిన నియామకాల వివరాలను సేకరిస్తున్నారు. ఢిల్లీ, మధ్యప్రదేశ్ నియామకాలను న్యాయస్థానం కొట్టేయగా, ఛత్తీస్‌గఢ్ నియామకాలను మాత్రం కోర్టు కొట్టేయలేదు. అందుకే, అక్కడి పద్ధతిని కమిటీ పరిశీలిస్తోంది. గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఆరుగురిని పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించగా.. న్యాయస్థానం కొట్టేసింది. పార్లమెంటరీ కార్యదర్శులకు కూడా సహాయ మంత్రి హోదా ఇవ్వడం వల్ల చట్టం విధించిన 15 శాతం పరిమితి దాటినట్లు అవుతుందనే భావన వ్యక్తమవుతోంది. సహాయ మంత్రి హోదా అనే పదం ఉండడంతో వారు మంత్రులు అనే భావన వస్తోంది. అందుకే, ఆ హోదా లేకుండా పదవులు కట్టబెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. అసెంబ్లీలో చీఫ్ విప్, విప్‌లు ప్రధానంగా ఎమ్మెల్యేల సమన్వయానికి దోహద పడుతున్నారు. మంత్రుల్లా వారు ప్రమాణం చేయకపోయినా కేబినెట్ హోదా పొందుతున్నారు. పార్లమెంటరీ కార్యదర్శుల విషయంలోనూ అదే పద్ధతి పాటించాలని భావిస్తున్నారు.

బ్రిటీష్ సంప్రదాయం


పార్లమెంటరీ కార్యదర్శుల వ్యవస్థ బ్రిటిష్ పార్లమెంటరీ విధానంలో ఉంది. కొత్త తరం మంత్రులను తయారు చేసుకోవడానికి ఇదో మార్గం. చట్టసభలో యువ సభ్యులను సీనియర్ మంత్రులకు సహాయకులుగా నియమిస్తారు. వారు ఆయా శాఖల దైనందిన వ్యవహారాల్లో మంత్రులకు సహాయపడతారు. మంత్రి మాటే ఫైనల్‌గా ఉంటుంది. భవిష్యత్తులో కొత్తగా మంత్రులను తీసుకొనే సమయంలో పార్లమెంటరీ కార్యదర్శులకు ప్రాధాన్యం ఇస్తారు.

జైట్లీకి ఆపరేషన్

- రెండు వారాల పాటు విశ్రాంతి
- ఆర్థిక శాఖ బాధ్యత గోయల్‌కు
- మధ్యంతర బడ్జెట్‌కు 9 రోజుల ముందు కీలక పరిణామం

న్యూఢిల్లీ, జనవరి 23: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి న్యూయార్క్ ఆస్పత్రిలో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ఆయనకు కనీసం రెండు వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కేన్సర్‌తో బాధపడుతున్న 66 ఏళ్ల జైట్లీ చికిత్స కోసం ఈ నెల 13న అమెరికా వెళ్లారు. తొలుత ఆయనకు 'సాఫ్ట్ టిష్యూ కేన్సర్'కు సంబంధించిన పరీక్షలు చేశారు. అనంతరం బుధవారం ఆయనకు ఆపరేషన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి తొమ్మిది రోజుల ముందు ఆర్థిక శాఖ అదనపు బాధ్యతలను రైల్వే మంత్రి పియూష్ గోయల్‌కు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రధాని మోదీ సూచన మేరకు జైట్లీ ఆరోగ్యం కుదుటపడే వరకు ఆయన నిర్వర్తిస్తున్న ఆర్థిక, కార్పొరేటు వ్యవహారాల శాఖల బాధ్యతలను గోయల్ అప్పగిస్తున్నట్లు ఆ ప్రకటన పేర్కొంది. ఎన్డీఏ ప్రభుత్వం ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ నెల 25 నాటికి స్వదేశానికి తిరిగి రావాలని జైట్లీ భావించారు. అయితే ఆపరేషన్ నిర్వహించడంతో ఆ సమయానికి వచ్చే అవకాశం లేదు. జైట్లీ స్థానంలో గోయల్‌కు అదనపు బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి. గత ఏడాది మే నెలలో జైట్లీకి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించినప్పుడు 100 రోజుల పాటు గోయల్ రెండు కీలక శాఖల బాధ్యతలూ నిర్వర్తించారు.

హయ్యర్ ఎడ్యుకేషన్ కోసం వెళ్లాలనుకునే విద్యార్థుల సంఖ్య ఒకవైపు పెరుగుతోంది. అదే సమయంలో దానికి అయ్యే వ్యయాలు ఏటా పెరుగుతూనే ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఉన్నత విద్యకు అయ్యే వ్యయం భారంగా మారుతోంది. విద్యా రుణాలను పలు బ్యాంకులు వడ్డీతో ఇస్తున్న మాట నిజమే. అయితే స్కాలర్‌షిప్‌లు కూడా ఉంటాయనే విషయాన్ని కొంత మంది విస్మరిస్తున్నారు. అయినప్పటికీ వీటి కోసం దరఖాస్తు పెట్టుకునే వారి సంఖ్య వేలల్లో ఉంటే, లభించే అవకాశాలు చాలా తక్కువ ఉంటున్నాయనేది అందరికీ తెలిసిందే. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే షార్ట్‌లిస్టింగ్‌లో ముందుండవచ్చని చెబుతున్నారు నిపుణులు.



Scholarships

దరఖాస్తుకు ముందు హోంవర్క్ మస్ట్!

ఉన్నత విద్య కోసం వెళ్లాలనుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం ఎప్పటి నుంచో ఉన్న విషయం తెలిసిందే. హయ్యర్ ఎడ్యుకేషన్ అవకాశాలు పెరుగుతున్న కొద్దీ వీటి పరిధి కూడా విస్తరిస్తోంది. కొన్ని సంస్థలు, యూనివర్సిటీలు ఇచ్చే స్కాలర్‌షిప్‌లు ఏ కోర్సు చేసిన వారికైనా వర్తిస్తుంటాయి. అయితే మరికొన్ని ప్రత్యేకించి కొన్ని కోర్సులకే పరిమితమవుతాయి. స్కాలర్‌షిప్ ఏదైనప్పటికీ వీటిని పొందేందుకు తగు పద్ధతిని అనుసరించాల్సి ఉంటుంది.

చదువులకు అవసరమైన నిధుల కోసం సాధారణంగా అన్నివిధాలుగా యత్నించిన తరవాతే స్కాలర్‌షిప్స్‌పై దృష్టి సారించాలన్న అభిప్రాయంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉంటారు. అందుకువిరుద్ధంగా ఒక వైపు అవసరమైన నిధుల కోసం ప్రయత్నిస్తూనే మరో వైపు స్కాలర్‌షిప్స్ వెంటపడాలన్నది అనుభవజ్ఞుల సూచన. ఈ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే షార్ట్‌లిస్ట్‌లో ముందుకు వెళ్లవచ్చు అని చెబుతున్నారు. అవేంటో చూద్దాం.

చాలా ముందుగానే....!

ఒక కోర్సు చేయడానికి ఆరు నుంచి ఎనిమిది నెలల ముందే స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవడం మంచిది. స్కాలర్‌షిప్‌ను స్పాన్సర్ చేసే ఏజెన్సీ నుంచి అన్ని విషయాలు తెలుసుకోవాలి. తద్వారా అందే మొత్తం, దరఖాస్తు చేయడం వంటివన్నీ ఇందులో భాగమై ఉంటాయి. దరఖాస్తు చేసిన తరవాత మంజూరుకు పట్టే సమయం కూడా తెలుసుకోవాలి. అందుకనే కొద్దిగా ముందుగా దరఖాస్తు ప్రక్రియను ఆరంభించాలి.

లోతుగా పరిశోధన

ఇంటర్నెట్‌తో విషయాలన్నీ ఒక క్లిక్ దూరంలోనే లభిస్తున్నాయి. మన ఆసక్తి, చేయబోయే కోర్సులను దృష్టిలోపెట్టుకుని నెట్‌లో సెర్చ్ చేయడం మంచిది. సంబంధిత సమాచార సేకరణలో లోపం ఉండకూడదు. సమగ్రంగా సేకరించి దాన్నంతా ఒక క్రమపద్ధతిలో పెట్టుకోవాలి. ఎడ్యుకేషన్ స్పెషలిస్టులను సంప్రదించి వారి సలహాలూ తీసుకోవచ్చు. ఏ కోర్సులకు ఏయే స్కాలర్‌షిప్స్ ఉన్నాయో చెబుతారు. ప్రతి మనిషిని స్వయంగా కలుసుకోవడానికి బదులు ఫోన్ చేసి లేదంటే ఈమెయిల్ ద్వారా సమాచారాన్ని పొందడం మేలు. అలా ఫోన్ చేసినప్పుడు మీ అవసరాలు, వాటికి వారెలా ఉపయోగపడతారు అన్నది చూసుకోండి. ఫేస్‌బుక్, లింక్డిన్ సహాయంతో కూడా నిపుణుల వివరాలను తెలుసుకోవచ్చు. ఉన్నత విద్య విషయాల్లో అనుభవం ఉన్న వ్యక్తుల సమాచారం లభిస్తే, మరిన్ని వివరాలను తెలుసుకోవచ్చు. స్కాలర్‌షిప్ ఆప్షన్స్ తెలియజేస్తారు. అలాగే కొంతమంది స్పాన్సర్లతో నేరుగా కనెక్ట్ అయ్యే మార్గం కూడా చెబుతారు.

ప్రయారిటీల షార్ట్ లిస్టింగ్

మీరు చేసిన పరిశోధన ఆధారంగా నమ్మకంగా, ప్రయోజనం కలిగించే స్కాలర్‌షిప్‌లను సులువుగా గుర్తించవచ్చు. అయితే వీటిలో ఏది మీకు సూట్ అవుతుందన్నది అసలు ప్రశ్న. దేశం, కాలేజీ, కోర్సు వంటి విషయాలన్నీ ఇందులోకి వస్తాయి. మీ ఆసక్తి, అర్హతలను అనుసరించి వేటికి దరఖాస్తు చేయవచ్చో తేల్చుకోవాలి. అప్పుడు ఏ స్కాలర్‌షిప్స్ మీకు అనువైనవి అన్నది తేలుతుంది. పోస్ట్ స్టడీ నిబంధనలు, బాండ్స్, స్టడీకి ముందు తరవాత ఉండాల్సిన కనీస మార్కులు/జిపిఎను కూడా పరిగణనలోకి తీసుకుని ప్రాధాన్యం ప్రకారం షార్ట్‌లిస్టింగ్ చేసుకోవాలి.

దరఖాస్తు ప్రక్రియ

బేసిక్ రెజ్యూమెను ముందు రూపొందించుకోవాలి. తరవాత ప్రతి స్కాలర్‌షిప్‌ను ముడిపెట్టి చూడండి. అలాగే ఒకే రెజ్యూమే అన్ని దరఖాస్తులకు ఉపయోగపడుతుందని భావించడం చాలా తప్పు. స్కాలర్‌షిప్ అప్లికేషన్‌లోని రిక్వైర్‌మెంట్స్‌ని హైలైట్ చేసుకోండి. సంబంధిత పాయింట్లు రెజ్యూమేలో ఉండేలా చూసుకోండి. ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్, తెలిసిన విదేశీ బాషలు, ప్రత్యేక నైపుణ్యాలు వంటివి ముఖ్యమైన ఏరియాల్లో కొన్ని. వాటికి కూడా రెజ్యూమెలో ప్రాధాన్యం కల్పించండి. స్కాలర్‌షిప్స్‌కు సంబంధించి ఒక కామన్ ప్రశ్న ఎదురవుతూ ఉంటుంది. ఈ స్కాలర్‌షిప్‌నకు మీరు ఎలా అర్హులు, మీ అభ్యర్థనను మేం ఎందుకు మన్నించాలి లేదంటే ఎందుకు పరిశీలించాలని అడుగుతుంటారు. చాలా వరకు దరఖాస్తుల్లో ఒక పేజీ మేర ఈ విషయమై ప్రత్యేకించి తెలియజేయాల్సిన అవసరం ఉంటుంది. మీ అవసరాలను హైలైట్ చేయడానికి లభించిన అవకాశంగానే దీన్ని భావించాలి. అందువల్ల ఫార్మల్ రెజ్యూమెకు పరిమితం కాకూడదు. సాఫ్ట్‌స్కిల్స్‌కు తోడు సాంస్కృతిక కార్యకలాపాల్లో మీ పాత్రను ఇక్కడ తెలియజేయాలి. తద్వారా అప్లికేషన్‌కు పర్సనల్ టచ్ ఇచ్చినట్లవుతుంది. ఇందు కోసం స్కాలర్‌షిప్ ఎస్సేలపై కొంత సమయం వెచ్చించండి.

క్రెడిబుల్ క్యాండిడేట్

వ్యక్తిగత సామర్థ్యాలు, అనుభవం విషయంలో తప్పుదోవ పట్టించే ప్రయత్నం ఎన్నడూ చేయవద్దు. అలా చేస్తే మీ విశ్వసనీయత దెబ్బతింటుంది. పైపెచ్చు మీ దరఖాస్తు తిరస్కరణకు గురవుతుంది. ఇప్పటి సాంకేతిక యుగంలో మీ బ్యాక్‌గ్రౌండ్‌ను తెలుసుకోవడం చాలా సులువు. అందుకు అనేకానేక ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయని మర్చిపోవద్దు. మీ సామాజిక ప్రొఫైల్‌కు కూడా ఇదే వర్తిస్తుంది. సామాజిక మాధ్యమాల్లో మీరు చేసే ప్రతి పోస్టు, మీ వ్యక్తిత్వాన్ని పట్టిస్తుంది. మీ ఆలోచనలు అందులో ప్రతిబింబిస్తాయి. అవి మీ దరఖాస్తుకు జత అవుతాయి. ప్రొఫెషనల్ రంగంలో మీకు బాగా తెలిసిన ఇద్దరుముగ్గురు వ్యక్తులను గుర్తించండి. మీ పర్సనాలిటీలో ఉన్న బలమైన పాయింట్లను గుర్తించే వ్యక్తులై ఉండాలి. వారికి కూడా విషయం చెప్పి, అనుమతి కూడా తీసుకుని, రిఫరెన్స్ కింద వారి పేర్లను జతచేయండి. దరఖాస్తుకు ముందే సదరు ఏజెన్సీ నుంచి ఫోన్‌కాల్ వస్తుందని ముందస్తుగా వారికి తెలియజేయండి. పంపడానికి ముందే మీ దరఖాస్తు సమగ్రంగా, అవసరానికి మించని రీతిలో ఉందన్నది తేల్చుకోండి. అచ్చుతప్పులు లేకుండా చూసుకోండి. చెక్‌లిస్ట్‌తో సరిచూడండి. డెడ్‌లైన్‌లను గౌరవించండి.

దరఖాస్తు ప్రక్రియ అనంతరం

దరఖాస్తు సదరు ఏజెన్సీకి అందిందా లేదా అన్నది చెక్ చేసుకోండి. ఏజెన్సీ వ్యక్తులు తెలిసి ఉంటే వారితో టచ్‌లో ఉండండి. ఇంకేమైనా వివరాలు అదనంగా అవసరం అనుకుంటే వాటినీ ఇచ్చి దరఖాస్తును మరింత పట్టిష్టంగా రూపొందించుకోవడం మంచిది. అదే సమయంలో మరిన్ని స్కాలర్‌షిప్‌లకూ దరఖాస్తు చేసేందుకు వెనుకాడవద్దు. పారదర్శకంగా ఉండటం చాలా మంచిది. స్కామ్‌లు తదితరాలకు పాల్పడే ఏజెన్సీలతో అప్రమత్తంగా ఉండండి. క్రాస్‌చెక్ చాలా అవసరం. విలువైన సమయాన్ని వృథా చేయవద్దు ఇప్పట్నించి మీ ప్రయత్నాలు మొదలు పెట్టండి.

Bulletin Board

International scholarships

Newcastle University invites applications for 200 partial Vice-Chancellor's International Scholarships to assist international students to study an undergraduate degree or a postgraduate degree. For details, email scholarship.applications @ncl.ac.uk.

Research programme

TIFR Visiting Students Research Programme (VSRP-2019) is for students who have completed their 2 years of undergraduate coursework. The scholarship aims to provide research experience to Bachelor's and Master's pursuing students who can also benefit from a monthly stipend of Rs 7000 along with other benefits. The last date to apply is January 31, 2019. For details, visit www.tifr.res.in/~vsrp/Brochures/Brochures.htm.

India scholars

College Board invites applications for the College Board India Scholars Program. The academically talented but economically weaker students from the country who score above a certain level in SAT will be designated as College Board India Scholars. The last date to apply is February 8, 2019. For details, log on to www.collegeboard.org.

IIAD courses

The Indian Institute of Art and Design (IIAD) in collaboration with Kingston School of Art,London offers undergraduate programmes in Fashion Design, Fashion Business Management, Communication Design and Interior Architecture & Design. It also offers postgraduate programmes in Fashion Design and Fashion Business Management. The last date to apply is April 17, 2019. For further details, email apply@iiad.edu.in.

Tech courses

KIIT Group of Colleges invites applications for admission to various courses. The courses offered are BTech (CSE ECE, EEE, Civil Engineering & Mechanical Engineering), MTech (ECE & CSE), MBA, BBA & BCA. The last date to apply is June 30, 2019. For details, log on to www.kiit.in.

Fortunate 40

Fiitjee is conducting "FORTUNATE 40" test for the students studying in Class 8 & Class 10 with the parental financial background being below Rs 10,000 per month. The last date to apply for the test is February 2. To be eligible for the FORTUNATE 40 batch, students must clear the individual subject cut-offs & also the grand total cut-off. For details, log on to www.fiitjee.com.

PGDM programme

Prin LN Welingkar Institute of Management Development & Research (WeSchool) Mumbaiand Bengaluru campuses together invite applications from MBA aspirants to apply for the 2- year full-time PGDM programmes. The last day for submitting applications is January 26, 2019. For details, log on to www.welingkar.org/pgdm.

జాబ్ కార్నర్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా - ఒప్పంద ప్రాతిపదికన కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 31

ఉద్యోగాలవారీ ఖాళీలు: సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు 15, స్పెషలిస్టు ఆఫీసర్లు 16

అర్హత: సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు చార్టర్డ్ అకౌంటెంట్/ ఎంబీఏ (ఫైనాన్స్)/ మాస్టర్ ఇన్ ఫైనాన్స్ కంట్రోల్/ మాస్టర్ ఇన్ మేనేజ్‌మెంట్ స్టడీస్/ పీజీడీఎం (ఫైనాన్స్) ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల అనుభవం ఉండాలి.

వయసు: 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి

ఎంపిక: షార్ట్ లిస్ట్, ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తు ఫీజు: రూ.600 (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.100)

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 11

వెబ్‌సైట్: www.sbi.co.in/careers

స్పెషలిస్టు ఆఫీసర్లు **ఖాళీలు:** 11

ఉద్యోగాలు: డిప్యూటీ మేనేజర్లు 6, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు 5

విభాగం: ఐఎస్ ఆడిట్

అర్హత: బిఈ/ బీటెక్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్/ ఎలక్ట్రానిక్స్ / ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్) పూర్తిచేసి ఉండాలి. నిర్దేశించిన విధంగా అనుభవం ఉండాలి.

వయసు: జూలై 1 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: షార్ట్ లిస్టింగ్ కం ఇంటరాక్షన్ ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.600

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 11

వెబ్‌సైట్: www.sbi.co.in

ఆంధ్రా యూనివర్సిటీ

విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ - కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 6

ఉద్యోగాలు: జూనియర్ రీసెర్చ్ ఫెలో 4, ఫీల్డ్ / ల్యాబ్ అసిస్టెంట్ 2

అర్హత: ఎంటెక్/ ఎమ్మెస్సీ/ బీఎస్సీ (ఎంపీసీ/ ఎంపీజీ) పూర్తిచేసి ఉండాలి. **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 25

వెబ్‌సైట్: www.andhrauniversity.edu.in

ఐబిపిఎస్ ఆంగ్ల పద ప్రయోగం

గత ఏడాది అక్టోబరు 14న నిర్వహించిన పిఓ (ప్రిలిమ్స్) టెస్ట్‌లో భాగమైన టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లో ప్రశ్నలు కిందివిధంగా ఇచ్చారు.

ప్రతి ప్రశ్నలోనూ ఒక ఆంగ్ల పదం ఇచ్చి దాని కింద ఆ మూడు వాక్యాల్లో దాన్ని రెండు మూడు రకాలుగా ఇస్తున్నారు. ఆ మూడు వాక్యాల్లో దేనిలో ఆ ఆంగ్ల పదం లేదా దాని మరో రూపాన్ని సరిగా ఉపయోగించారో అభ్యర్థి గుర్తించాలి. ఆ ఆంగ్ల పదాన్ని ఎక్కువ వాక్యాల్లో సరిగ్గా ప్రయోగించి ఉండవచ్చు.

CRUCIAL

(A)At this crucial time all you can do is pray for the betterment and faster recovery of the people of the state who have been inured.

(B) It was crucially to revise few of the national policies as they were outdated.

(C) Though there is hope and positivity in the world the fact cannot be ignored that crucial intentions exists as well.

1) Only B and C 2)Only A and C
3) Only C 4) Only A 5) All A,B, and C

Ans: 4

(వివరణ: ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీలో crucial అనే పదానికి decisive, critical, very important అనే అర్థాలున్నాయి. దీనిని adjective గా వాడవచ్చు. (crucially అనే రూపంలో ఉపయోగిస్తే, అప్పుడు మనం దీని adverbగా ఉపయోగిస్తున్నామన్నమాట.) (A) వాక్యంలో చూపినట్లుగా crucial time అనే ప్రయోగం సరైనది.

BENIGN

(A) There was recently a study describing how some foods when had with some apparently benign medicines led to extreme consequences.

(B)The activities of the criminals appeared to be benign in the beginning as they pretend to be local citizens.

(C) Though her tumour was benign there was no guarantee that it would not erupt again

1) Only A 2) Only B and C
3) None of A,B, and C
4) All (A) , (B) and (C) 5) Only B

Ans: 4

(వివరణ: ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీలో benign అనే పదానికి kindly, gentle, favourable, salutary అనే అర్థాలున్నాయి. దీనిని adjectiveగా ఉపయోగించవచ్చు. benevolent, compassionate, gentle, harmless, kind, kind-hearted, kindly, merciful , mild, sympathetic , warm-hearted అర్థాలున్నాయి. (C) వాక్యంలో tumourని benign అని చెప్పడానికి వైద్య పరిభాషలో బాగా ఉపయోగిస్తున్నారు. కనుక ఇది ఆన్సర్. ఇచ్చిన మూడు వాక్యాల్లో ఆ ఆంగ్ల పదాన్ని సరిగ్గా ఉపయోగించారు.



TRANSPARENT

(A) Transparency in work and following of work ethic are the most important characteristics that recruiters seek these days

(B) It was a highly transparently situation as there was firing from both sides of the border and it did not appear that it would end any time soon

(C) Though there were several cases of money laundering in the city, the transparency convicts had not been put behind bars yet.

1) All A,B, and C 2) Only B and C
3) Only C 4) Only A and C 5) Only A

Ans: 4

(వివరణ:ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీలో Transparent అనే పదానికి able to see through, easily discerned, easily understood, frank అర్థాలున్నాయి. దీనిని adjectiveగా ఉపయోగించవచ్చు. (transparently అనే రూపంలో ఉపయోగిస్తే, అప్పుడు మనం దీనిని adverbగా వాడుతున్నామన్నమాట.)

(A), (C) వాక్యాలలో transparency అనే noun రూపంలో ఉపయోగించారు.

COLLOQUIAL

(A) It was the colloquial of the ruling party which made it difficult for the opposition to find anything negative to say about them.

(B) The colloquialism of a 6-month-old during the journey was not only tiring but also disturbing for the fellow passengers

(C) The languages spoken in South Africa by the inhabitants of European descent are English and Dutch, the latter chiefly in the form of a patois colloquially known as the Taal.

1) Only B AND C 1) Only A and B
3) Only A 4) All A,B, and C 5) Only C

Ans: 5

(వివరణ: ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీలో COLLOQUIAL అనే పదానికి ordinary, familiar conversation; informal అర్థాలున్నాయి. దీనిని adjectiveగా వాడవచ్చు.

(B) వాక్యంలో colloquialism అనే noun రూపంలో ఉపయోగించారు.

PRUDENT

(A) The prudent banker decided to do a background check before sanctioning the company's loan.

(B) It is prudent to invest in the stock market provided there is an experienced person guiding you through the highs and lows .

(C) Nowadays few people from the younger generation are willing to join politics as they feel prudent about the country .


1) All A,B and C 2) Only B
3) Only A 4) Only A and B
5) Only C **Ans:** 4

(వివరణ: ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీలో PRUDENT అనే పదానికి cautious , politic అనే అర్థాలున్నాయి. దీనిని adjective గా వాడవచ్చు. మనకు ఇచ్చిన ఆంగ్ల పదాన్ని యదాతథంగానూ, మూడు వాక్యాల్లోనూ ఉపయోగించారు. ఇప్పుడు ఆ పద ప్రయోగం ఏ వాక్యంలో కరెక్ట్‌గా ఉందో లేదో చూడాలి.

- Prudent బ్యాంకర్ అంటే cautious బ్యాంకర్ అనే అర్థం.
- అనుభవం ఉన్న వ్యక్తి గైడెన్స్‌తో షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం సరైనది.

ఈవిధంగా ఐబిపిఎస్ నిర్వహిస్తున్న బ్యాంక్ పరీక్షల్లో ముఖ్యంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్ట్‌లో కూడా సరికొత్త ప్రశ్నలు రూపొందిస్తున్నారు. అందువల్ల అభ్యర్థులు రోజూ ఇంగ్లీష్ న్యూస్ పేపర్ చదవాలి. ప్రతి ఆంగ్ల పదం నౌన్, ప్రొనౌన్, ఆడ్జెక్టివ్, ఆడ్వెర్బ్ రూపాలను కూడా తెలుసుకోవాలి. దీనికి ఇంగ్లీష్ డిక్షనరీ బాగా ఉపకరిస్తుంది.

- ప్రాతూరి పోతయ్యశర్మ



చిరంతనా కర్
అంజు అరోరా

ఒకరిది కార్పొరేట్ రంగంలో హెచ్ఆర్‌గా సుదీర్ఘానుభవం. మరొకరిది పర్యావరణ రంగంలో పలు కమ్యూనిటీలతో కలిసి పనిచేసిన అనుభవం. ఇద్దరూ స్నేహితులయ్యారు. ఆలోచనలు, అభిప్రాయాలు కలిశాయి. అంతే... వాళ్లిద్దరూ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్లుగా 'ది పీరియడ్ హబ్' స్టార్టప్‌కు శ్రీకారం చుట్టారు. 'రీ డిఫైనింగ్ పీరియడ్స్' తమ స్టార్టప్ లక్ష్యమంటున్నారు. వారే అంజు అరోరా, చిరంతనా కర్. వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతున్న వారేమంటున్నారంటే...

ఒకే లక్ష్యంతో వారిద్దరూ కలిశారు!

'ఆ రోజులు' ఆనందంగా...

- అంజు అరోరా

'నేను కార్పొరేట్ రంగంలో హెచ్ఆర్‌గా పదిహేనేళ్లు పనిచేశా. పిల్లలు పుట్టడంతో ఉద్యోగం మానేసి తల్లిగా బిజీ అయిపోయా. ఆ క్రమంలో పీరియడ్ ప్యాడ్స్ తయారీ, వినియోగం, పర్యావరణ పరంగా వాటివల్ల తలెత్తుతున్న సమస్యలు, ముఖ్యంగా ప్లాస్టిక్ ఉన్న ప్యాడ్స్ వినియోగంతో మహిళల ఆరోగ్యం, వెల్‌నెస్ దెబ్బతింటున్న విధానం గురించి స్టడీ చేశా.

ఎకో ఫ్రెండ్లీ ప్యాడ్స్ ...

పర్యావరణ సురక్షితమైన బహిష్టు మేనేజ్‌మెంట్ సంస్కృతిని మహిళల్లో, సమాజంలో పెంపొందించాలనే ఆలోచన అప్పుడే కలిగింది. అప్పటినుంచి ఈ అంశంపై ప్రజలతో, విద్యార్థులతో, మహిళలతో మాట్లాడడం ప్రారంభించా. బహిష్టు సమయంలో అనుసరించే ఆరోగ్యకర ధోరణులపై స్త్రీల సుస్థిర ఆరోగ్యం ఎంతగా ఆధారపడి ఉందో వారికి తెలియజేయాలనుకున్నా. నాది చిరంతనాది ఒకే లక్ష్యం, ఒకే మార్గం కావడంతో ఇద్దరం మంచి మిత్రులమయ్యాం. సమాజానికి, పర్యావరణానికి, స్త్రీలకు మనవంతుగా ఏదైనా చేద్దామనే తపన మా ఇద్దరినీ 'ది పీరియడ్ హబ్' ఆలోచనకు శ్రీకారం చుట్టేలా చేసింది. ముఖ్యంగా బహిష్టు సమయంలో పర్యావరణపరంగా, ఆర్గానిక్ వేలో మహిళలకు సురక్షితమైన ప్యాడ్స్ వాడకం అవసరాన్ని తెలియజేప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఇందులో భాగంగా మహిళా కాలేజీలకు వెళ్లడం, స్కూళ్లకు వెళ్లడం, కొందరికి శిక్షణ ఇచ్చి ఈ సమస్యపై చైతన్యం తెచ్చేలా తొలుత దృష్టిపెట్టాం. ప్రణాళికలు రూపొందించుకున్నాం. ఆడవాళ్లకు "యూజ్ అండ్ త్రో ప్యాడ్స్‌కు దూరంగా ఉండండి" అని చెప్తున్నాం. వాస్తవం ఏమిటంటే బ్రాండెడ్ నాప్‌కిన్స్‌లో 90 శాతం ప్లాస్టిక్ వాడుతున్నట్టు అధ్యయనాల్లో వెల్లడైంది. వీటిని ఉపయోగించడం వల్ల దీర్ఘకాలంలో ఆరోగ్యపరంగా తలెత్తే దుష్ప్రభవాలు ఎన్నో. రకరకాల బాక్టీరియాల వృద్ధి, ఇన్ఫెక్షన్లు, రాషెస్‌కు ప్లాస్టిక్ ప్యాడ్స్ కారణమవుతున్నాయి. అందుకే మహిళలకు సుఖమైన, సౌఖ్యమైన పీరియడ్స్ కోసం ఏదో ఒకటి చేయాలని నేను, చిరంతనా భావించాం.

అమ్మాయిల కోసం 'పీరియడ్ వాచ్'

ఈ క్రమంలో ప్రభుత్వానికి సంబంధించిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ఇంక్యుబేషన్ సెంటర్ సహాయ సహకారాలతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సహకారాన్ని తీసుకుంటూ క్లాత్ ప్యాడ్స్, కప్ ప్యాడ్స్, రీ యూజబుల్ క్లాత్ ప్యాడ్స్ నుంచి కస్టమైజ్డ్ ప్యాడ్స్ వరకూ అందించాలని నిశ్చయించుకున్నాం. మా 'పీరియడ్ హబ్' అందించే ప్రతి ఉత్పత్తి, సేవలు, బుక్‌లెట్స్ ప్రతి స్త్రీ తన పీరియడ్స్‌ను బెస్ట్‌గా మేనేజ్‌చేసుకోవడానికి, మెనోపాజ్ అనంతరం వరకూ కూడా తన ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం దాకా ఉపయోగపడుతుంది. మేం అమ్మాయిల కోసం తీసుకువస్తున్న పీరియడ్ వాచ్ కూడా జీరో కెమికల్. ఇది బహిష్టు అయ్యే ప్రదేశాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచుతుంది. అలాగే పీరియడ్ అండర్‌వేర్లను అందిస్తాం. పది సంవత్సరాల దాకా కూడా ఉపయోగించే మెనుస్ట్రుయల్ కప్స్ కూడా మా జాబితాలో ఉన్నాయి. మేం ఇచ్చే పీరియడ్ బాస్కెట్‌లో హైజీన్‌నిచ్చే జెల్స్ ఉంటాయి.

హైజీన్ మేనేజ్‌మెంట్ అవసరం...

పీరియడ్ మేనేజ్‌మెంట్‌లో హైజీన్ మేనేజ్‌మెంట్ చాలా ముఖ్యం. మేం అందించే సేవల్లో గానీ, వస్తువుల్లో గానీ ఏ దశలోనూ రసాయనాల ఉనికి ఉండదు. ఈ అంశంపై చైతన్యపరిచేందుకు బహిష్టుల పట్ల సిగ్గుపడే వాతావరణంలో పెరగని విదేశీ అమ్మాయిలను, అబ్బాయిలను బృందంగా తీసుకున్నాం. ఆరోగ్యవంతమైన బహిష్టు మేనేజ్‌మెంట్ ఆవశ్యకత పరంగా చైతన్యం తేచ్చే పని చేస్తున్నాం. మా పీరియడ్ బాస్కెట్లను మగవాళ్లు తమ భార్యలకు, అమ్మలకు, స్నేహితురాళ్లకు గిఫ్ట్‌గా ప్రెజెంట్ చేసేలా కూడా తెస్తున్నాం.

వెల్‌నెస్ అవగాహన పెరిగింది...

ఇప్పుడు నగర ప్రజల్లో వెల్‌నెస్ అవగాహన బాగా పెరిగింది కాబట్టి మా ప్రయత్నానికి స్పందన ఉంటుందని అనుకుంటున్నాం. తొలుత మేము అర్బన్ మహిళలను టార్గెట్‌గా పెట్టుకున్నాం. దశల వారీగా విస్తరించాలనే ఆలోచన ఉంది. మా ట్యాగ్‌లైన్ 'వి సెలబ్రేట్ పీరియడ్స్'. ఇది మా లక్ష్యాన్ని విస్పష్టంగా తెలుపుతుంది. 'పీరియడ్ పాజిటివ్, పీరియడ్ రెడీ'గా ఆడవారిని సిద్ధం చేయడం మా ఆలోచన. బహిష్టు సమయంలో మహిళలు, అమ్మాయిలు ఆరోగ్యంగా ఉంటూ 'పీరియడ్'ని సెలబ్రేట్ చేసుకోవాలి. ఇదే మా లక్ష్యం.

'పీరియడ్ బాస్కెట్'తో సమస్యలు దూరం

-చిరంతనా కర్

'నేను ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్‌ని. హైదరాబాద్‌లోని పలు పర్యావరణ స్వచ్ఛంద సంస్థలతో కలిసి పన్నెండేళ్లు పనిచేశాను. ఎన్విరాన్‌మెంటల్ కన్సల్టెంట్‌గా సేవలు అందించా. పర్యావరణంలో నీటి కాలుష్యం నా ప్రధాన అంశం. 'టాయిలెట్ బిహేవియర్' మనదేశంలో దీనస్థితిలో ఉంది. మెనుస్ట్రుయేషన్ హైజీన్ కూడా ఇందులో అంతర్భాగమే. బహిష్టు సమయంలో మహిళలు, ఆడపిల్లల్లో ఆరోగ్యకరమైన సంస్కృతికి, వెల్‌నెస్‌కి అంజు ఆరోరా చేసిన ప్రయత్నాలు, అధ్యయనాలు, ఆలోచనలు నాకు నచ్చాయి. వాటిని కార్యరూపంలో పెడితే బాగుంటుందనిపించింది.

ఆలోచనే మమ్మల్ని కలిపింది...

మా ఇద్దరి ఆలోచనా ఒకటే. అదే మమ్మల్ని సన్నిహితుల్ని చేసింది. రెండేళ్లుగా మా స్నేహం కొనసాగుతోంది. ఎవరూ పట్టించుకోని కొన్ని ప్రత్యేక అంశాలపై దృష్టిపెట్టాలనుకున్నాం. అందుకే పారిశుద్ధ్యం, టాయిలెట్ బిహేవియర్‌పై చైతన్యం తేవడంతోపాటు... మహిళలకు బహిష్టు సమయంలో అవసరమైన వెల్‌నెస్ ఉత్పత్తులపై కూడా దృష్టిపెట్టాం. అంతేకాదు మోడల్ టాయిలెట్ రూపకల్పనకు శ్రీకారం చుట్టాం.

'పీరియడ్ హబ్' పర్యావరణ సురక్షితమైన వెల్‌నెస్ పరిష్కారాలను పట్టణప్రాంతాల్లోని మహిళలకు బహిష్టు సమయంలో అందిస్తుంది. మహిళల రీ ప్రొడక్టివ్ లైఫ్ సైకిల్‌లోని ప్రతి దశకు అనుగుణంగా సంప్రదాయ, ఆధునాతన విధానాలను సమ్మిళితం చేస్తూ బహిష్టు సమయంలోను, దానిముందూ, తర్వాతా కూడా అవసరమైన సేవలు, ఉత్పత్తులు అందజేస్తుంది. మున్సిపల్ వ్యర్థాలలో ఉపయోగించిన బహిష్టు నాప్‌కిన్స్ ఉండకుండా ప్రభుత్వాలు 'రెడ్ బాస్కెట్' వంటి ఆలోచన చేస్తే బాగుంటుంది.

ఆన్‌లైన్ సేవలతో ప్రారంభం...

'పీరియడ్ హబ్'కు సంబంధించి గ్రౌండ్ వర్క్ మొత్తం పూర్తి చేస్తున్నాం. మార్చిలో తొలుత ఆన్‌లైన్ సేవలతో మొదలవుతుంది. ఆ తర్వాత హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, హైటెక్‌సిటీ ప్రాంతాల్లో అవుట్‌లెట్స్ రాబోతున్నాయి. భవిష్యత్తులో మీ ఇంటి ముంగిటకే మా పీరియడ్ కిట్స్, వెల్‌నెస్ ఉత్పత్తులు, ఎకో-ఫ్రెండ్లీ పాడ్స్ తదితర సేవలు అందిస్తాం. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ టైములో ఫుడ్ నుంచి వెల్‌నెస్ వరకూ ప్రకృతిసహజమైన ఉత్పత్తులు అందిస్తాం. పీరియడ్స్ అనేది మహిళలకు సంబంధించిన విషయంలా కాకుండా దీనిపట్ల పురుషులతో పాటు సమాజమంతా ఓపెన్‌గా వ్యవహరించా లనేదే మా ఆకాంక్ష. ఆ చైతన్యాన్ని మా హబ్ పెంపొందిస్తుంది. పీరియడ్స్ మేనేజ్‌మెంట్ పరంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు కూడా అవగాహన కల్పిస్తాం. క్లాత్ పాడ్స్ వినియోగంపై వారికి శిక్షణ ఇవ్వాలనుకుంటున్నాం.

నానమ్మలు, అమ్మమ్మలు అనుసరించిన పర్యావరణహితమైన క్లాత్ ప్యాడ్స్ వంటి వాటితో పాటు బహిష్టు సమయంలో తీసుకోవాల్సిన ఫుడ్, వెల్‌నెస్ పద్ధతులను వర్కవుట్ చేశాం. పాత, కొత్తల మేలు కలయికతో అధునాతన రీతిలో ప్యాడ్స్‌ని అందిస్తాం.



పీరియడ్స్ టైములో పొత్తికడుపు నొప్పి వంటి రకరకాల బాధలతో చాలామంది ఇబ్బంది పడుతుంటారు. కొత్తగా పీరియడ్స్‌లోకి ప్రవేశించిన అమ్మాయిలు ఉంటారు. వీరందరికీ వారి వారి అవసరాలకు అనుగుణంగా మా సేవలు ఉంటాయి.

● **నాగసుందరి**
ఫొటోలు: **అశోకుడు**

అవగాహన



పాలిచ్చే తల్లులకు పోషకాహారం!

చలికాలం... పాలిచ్చే తల్లులతో పాటుగా పసిపిల్లలు కూడా జలుబు, దగ్గు వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. చల్లని వాతావరణం తల్లీపిల్లల రోగనిరోధకవ్యవస్థ మీద ప్రభావం చూపుతుంది. ఫలితంగా పసిపిల్లలు పలు రకాల ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే అవకాశముంది. అంతేకాదు పాల ఉత్పత్తి మీద ప్రభావం చూపుతుంది. కాబట్టి పాలిచ్చే తల్లులు చలికాలంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు వైద్యులు. తల్లి పాలలో యాంటీ బాడీస్ ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. ఇవి పసిపిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచి, వారిని ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడుతాయి. పిల్లల ఆరోగ్యం తల్లి ఆరోగ్యం మీద ఆధారపడి ఉంటుంది. తల్లులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, పోషకాహారం తీసుకోవడం వల్ల చలికాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలను అడ్డుకోవచ్చు. తల్లి తీసుకునే ఆహారం తల్లిపాల నాణ్యతను నిర్ణయిస్తుంది. ఈ సీజన్‌లో పాలిచ్చే తల్లులు ఏమేం తీసుకోవాలి? వేటికి దూరంగా ఉండాలి? వంటి ఆహార చిట్కాలు చెబుతున్నారు లాక్టేషన్ కన్సల్టెంట్ డాక్టర్ జాయ్‌సే జయసేలన్. ఆ వివరాలివి..

వేడినీళ్లు, నిమ్మరసం: రోజు ఉదయాన్నే పెద్ద గ్లాసు నిండా వేడి నీళ్లలో నిమ్మరసం కలుపుకొని తాగాలి. వేడి నీళ్లు జీర్ణవ్యవస్థ చక్కగా పనిచేసేందుకు దోహదపడతాయి. నిమ్మరసంలోని విటమిన్ సి రోగనిరోధక వ్యవస్థను పటిష్ఠం చేస్తుంది.

ఆహారం: సమతులాహారం తీసుకోవాలి. పప్పుధాన్యాలు, డ్రైఫ్రూట్స్, విటమిన్స్, ఐరన్, కాల్షియం లభించే ఆహారపదార్థాలతో పాటు తాజా పళ్లు, కూరగాయలు అధిక మొత్తంలో తీసుకోవాలి. ఆకుపచ్చ రంగులో ఉండే బచ్చలి, క్యాబేజీ, కాలే తినడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు, లవణాలు లభిస్తాయి. పాలిచ్చే తల్లుల్లో పాల ఉత్పత్తి పెరగాలంటే నెయ్యి ఎక్కువగా తినమని చెబుతారు. అయితే పాలు, తాజా పళ్ల రసాలు నెయ్యికి చక్కటి ప్రత్యామ్నాయం. వీటిని తీసుకున్నా పాల ఉత్పత్తి పెరుగుతుంది.

షుగర్ ఫుడ్‌కు నో: చలికాలంలో షుగర్ ఎక్కువ ఉన్న, బాగా వేగించిన, మ్యూకస్‌ను ఏర్పరిచే ఆహారపదార్థాలను చాలావరకూ తగ్గించాలి. ఎందుకంటే షుగర్ వల్ల రోగనిరోధక వ్యవస్థ దెబ్బతినడమే కాకుండా పాల నాణ్యత కూడా తగ్గిపోతుంది. చక్కెర పదార్థాలకు బదులు ప్రొటీన్స్ అధికంగా లభించే నట్స్, ఉడికించిన గుడ్లు ఎక్కుగా తినాలి. ఫ్రిజ్‌లోంచి తీసిన పదార్థాలను వెంటనే తినడం వల్ల ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదముంది. డెయిరీ ఉత్పత్తులైన ఐస్‌క్రీమ్, జున్ను తినడం వల్ల బరువు పెరుగుతారు.శరీరానికి అవసరమైన పోషకాలు, మినరల్స్ కూడా సరిపోను లభించవు. ఈ సీజన్‌లో అవకాడో, అరటి పండు తినకపోవడమే మేలు. ఇవి పాల ఉత్పత్తి, నాణ్యతను తగ్గిస్తాయి. అరటిపండు తినడం వల్ల దగ్గు వస్తుంది.

ఇవి తినాలి: పాలిచ్చే తల్లులు కూరగాయలు, మసాలదినుసులను డైట్‌లో భాగం చేసకోవాలి. అల్లం, వెల్లుల్లి, క్యారెట్, పుట్టగొడుగులు ఎక్కువగా తీసుకోవాలి. అల్లం శరీరాన్ని వెచ్చగా ఉంచుతుంది. వెల్లుల్లిలోని యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చలికాలంలో సాధారణంగా వచ్చే ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణనిస్తాయి. క్యారెట్లలో యాంటీ ఆక్సిడెంట్స్ ఎ విటమిన్‌ను అందిస్తాయి. పుట్టగొడుగుల్లో షియాటెక్ రకం పుట్టగొడుగులు సూపర్‌ఫుడ్. వీటిలో యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలతో పాటు రక్తం గడ్డకట్టకుండా చూసే లక్షణాలుంటాయి.

మొదట్లో అలా వదిలేస్తేనే మేలు!

పేరెంటచ్



ఇంటర్నల్ ఎగ్జామ్స్ కోసం ఆయా సబ్జెక్ట్‌లను అప్పటికే ఎన్నోసార్లు చదివిఉండవచ్చు. అయినా, వార్షిక పరీక్షలు వచ్చేనాటికి కొంతమంది పిల్లలకు సబ్జెక్ట్‌లన్నీ మళ్లీ కొత్తగానే కనిపిస్తాయి. వాటిని అర్థం చేసుకోవడంలో ఏదో ఇబ్బంది అనిపిస్తుంది. ఫలితంగా వాళ్ల మనసు ఒక పట్టాన పుస్తకాల పైన లగ్నం కాదు. పరీక్షల కోసం అదేపనిగా చదవడం ఎంత కాదన్నా ఒత్తిడితో కూడుకున్నదే. అందుకే, పరీక్షల తేదీలు రాగానే కొందరు పిల్లల్లో భయం, ఆందోళన కమ్మేస్తాయి. తప్పనిసరై పుస్తకం చేతిలోకి తీసుకున్నా 'ఎప్పుడు పుస్తకం మూసేసి బయటపడదామా?' అనే చూస్తుంటారు. అలాంటప్పుడు తల్లిదండ్రులు వాళ్ల మానసిక స్థితిని అర్థం చేసుకోవాలే గానీ, ఆ మాత్రానికే అసహనానికో, ఆగ్రహానికో గురికాకూడదు. ఒకవేళ పెద్దవాళ్ల ఒత్తిడి కారణంగా చదవడానికి పూనుకున్నా, చదివినదేదీ వాళ్ల మనసుకు పట్టదు. 'మూడు నాలుగు మాసాల క్రితమే కదా హాఫ్ ఇయర్లీ ఎగ్జామ్స్ రాసింది! ఇంతలోనే ఏమయ్యింది?' అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ, ఆ కాస్త వ్యవధి కూడా తక్కువేమీ కాదు పాఠ్యాంశాలతో సంబంధం లేని వందల విషయాలు వారి మెదడులోకి చొరబడటానికి! నిజానికి, స్వల్పకాలంగా ఉండే చంచలత్వం అంతా పిల్లల మనసు కాస్త కుదుట పడేవరకే. ఆ తర్వాత మనం వద్దన్నా చదవడం మానరు. అందుకే పరీక్షల కోసం చదవడం మొదలెట్టినప్పుడు వాళ్ల నిలకడలేని స్వభావాన్ని చూసీ చూడనట్టుగా ఉండాలి. దానివల్ల కలిగే నష్టమేమీ లేకపోగా, చదువు పైన వాళ్ల మనసు లగ్నం కావడానికి పరోక్షంగా సహకరించినట్టే అవుతుంది. అంతేగానీ ఒత్తిడి పెంచితే మొదటికే మోసం వచ్చే ప్రమాదం లేకపోలేదు.

హోమ్‌కేర్



ఫ్రిజ్‌లోని ఏ అరలో ఏ పదార్థాలను ఉంచాలనేది చాలామంది సందేహం. ఫ్రిజ్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లలో ఉష్ణోగ్రత ఒకేవిధంగా ఉండదు. కాబట్టి ఫ్రిజ్‌లో ఏ పదార్థాలను ఎక్కడ పెట్టాలనేది గుర్తుంచుకోవాలి. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఆహారపదార్థాలు

ఫ్రిజ్‌లో ఏవి.. ఎక్కడ?

ఎక్కువ కాలం పాడవకుండా ఉంటాయి, ఫ్రిజ్ కూడా ఎక్కువ రోజులు పనిచేస్తుంది.

పాలు: చాలామంది పాలను ప్రధాన కంపార్ట్‌మెంట్‌లో పెడతారు. పాలు పాడవకూడదంటే 4 డిగ్రీల కన్నా తక్కువ ఉష్ణోగ్రత ఉండాలి. బాటిళ్లలో పాలను నిల్వచేసేవారు వాటిని అరలో చివరన ఉంచాలి.

బ్రెడ్: గది ఉష్ణోగ్రత వద్ద ఉంచినా బ్రెడ్ పాడవదు. బ్రెడ్డులో తేమ తగ్గితే గట్టి పడుతుంది. బ్రెడ్డును ఎక్కువ రోజులు నిల్వచేయాలంటే మాత్రం ఫ్రీజర్‌లో పెట్టాలి. ఫ్రీజర్‌లో తేమ తగ్గడం ఆలస్యమవుతుంది. దాంతో బ్రెడ్డు తాజాగా ఉంటుంది.

టొమాటోలు: తాజాగా, ఎర్రగా, జ్యూసీగా ఉండాలని టొమాటోలను ఫ్రిజ్‌లో ఉంచుతారు చాలామంది. అయితే వీటిని గిన్నెలో వేసి కిచెన్‌లోనే ఉంచాలి. వేసవిలో వేడి ఎక్కువ కాబట్టి, కూరగాయల బుట్టలో ఉంచి, టొమాటోలను ఫ్రిజ్‌లో ఉంచాలి.

గుడ్లు: ప్లాస్టిక్ ట్రేలో గుడ్లను ఉంచితే, అవి చుట్టున్న పదార్థాల వాసన గ్రహిస్తాయి. దాంతో గుడ్ల రుచిలో తేడా వస్తుంది. వాటిని ఎగ్స్ ట్రేలోనే ఉంచాలి. దాంతో వాటికి అవసరమైన ఉష్ణోగ్రత అందుతుంది.

వెన్న, చీజ్: వీటిని ఫ్రిజ్‌లోని డెయిరీ కంపార్ట్‌మెంట్‌లో ఉంచడమే మంచిది. డెయిరీ కంపార్ట్‌మెంట్‌లో వీటికి వేడి లభిస్తుంది. దాంతో సమయానికి వాడుకునేందుకు అనువుగా ఉంటాయి.

ఎలా మారాలి?

ఫ్యామిలీ కౌన్సెలింగ్



నా వివాహమై తొమ్మిది ఏళ్లయ్యింది. మా వారంటే నాకెంతో ఇష్టం. ఆయనకీ నేనంటే ఇష్టమే కానీ ఈ మధ్య నేను ఏ డ్రెస్ వేసుకున్నా 'నాకు నప్పడం లేదు' అంటున్నారు. నేను మారాలంటున్నారు. నాకు చాలా బాధగా ఉంది. నేను ఎలా మారాలి?

- వనిత

అవును... మీరు మారాల్సిందే. కానీ ఎలా? శారీరకంగా కాదు. మానసికంగా ముందు దృఢం కావాలి. చాలామంది ఆడవాళ్లు వివాహమయ్యాక భర్తే లోకంగా ఉంటారు. తమ ఇష్టాలు, అభిరుచులు ఒక్కోటీ వదిలేస్తారు. స్నేహితులు తగ్గిపోతారు. అంతకుముందున్న ఆసక్తులు, అభిరుచులు మర్చిపోతారు. పిల్లలు, భర్త ఏవేవి ఇష్టపడతారో అవే చేస్తారు. ఇక వ్యక్తిగత శ్రద్ధ కూడా తగ్గిపోతుంది. ఇంట్లోనే ఉంటాం కదా అని పనిలో ఉంటూ వ్యాయామం జోలికి వెళ్లరు. ఆ కాస్త సమయంలో ఇంకో పని చెయొచ్చు కదా అనుకుంటారు. తమ కోసం ఇంత శ్రమించే భార్యలని ఒక్కమాటతో తీసిపారేయడం భర్త, పిల్లలకే చెల్లుతుంది. అలా అనే బదులు ఎలా ఉండాలో చెప్పచ్చు కదా! అబ్బే అలా చెబితే వారికి పని తగులుతుందని భయం. అయితే ఇప్పుడిప్పుడు చాలామంది భార్యలను చలాకీగా ఆరోగ్యంగా ఉండాలని కోరుతున్నారు. అంచేత మీరు ముందుగా చెయ్యాల్సింది మీకంటూ కొంత సమయం కేటాయించుకోవడం, దాన్ని సద్వినియోగం చేసుకోవడం. ఏదన్నా వ్యాయామం ఎంచుకోండి. మీ అభిరుచికి తగిన వ్యాపకం కల్పించుకోండి. ఆహారం, ఆరోగ్యం అంశాల్లో కుటుంబానికంతా పనికొచ్చే ప్రణాళిక వేసుకోండి. వీటిలో మీ వారిని భాగస్వాముల్ని చేయండి. ఆహారం చిన్న చిన్న మార్పులు, ఆరోగ్యానికి కొద్దిపాటి వ్యాయామం మీలో ఎంత ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుందో మీరే తెలుసుకుంటారు. ఆల్ ది బెస్ట్!

-కె.శోభ
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com




కనుచూపుమేరంతా బంగారు కాంతులీనే పసుపు పచ్చ రంగుతో ఊరూవాడా మెరిసిపోతుంది. శుభానికి చిహ్నంగా భావించే పసుపు జల్లుల్లో ఊరంతా మునిగి పులకించి పోతుంది. హోలీని తలపించే ఈ ఏకవర్ణోత్సవం మాటలకు అందనిదీ, వర్ణనలకు లొంగనిదీ! అదే భండారా పండుగ.

చూసొద్దామా?

నింగీ నేలా సింగారంగా! పసుపు బంగారంగా!

ఎప్పుడు?: ఫిబ్రవరి 4న
ఎక్కడ?: మహారాష్ట్రలోని జెజూరీలో
ఎలా వెళ్ళాలి?: తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాంతాల నుంచి మహారాష్ట్రలోని పుణే నగరానికి నేరుగా రైలు, విమాన సౌకర్యం ఉంది. . హైదరాబాద్, విజయవాడ నగరాల నుంచి పుణేకి బస్సులున్నాయి. అక్కడికి సుమారు యాభై కి.మీ. దూరంలో ఉన్న జెజూరీకి రైలు లేదా రోడ్డు మార్గాల్లో చేరుకోవచ్చు.
ఏమిటీ వేడుక?: జెజూరీలోని ఖండోబా ఆలయ ప్రాంగణాన్ని భక్తులు 'సోన్యాచీ జెజూరీ' అంటే 'బంగారు జెజూరీ' అని పిలుస్తారు. ఇక్కడ జరిగే భండారా (పసుపు) ఉత్సవం లాంటిది మరెక్కడా కనిపించదు. ఖండోబాను శివుని అవతారంగా భావిస్తారు. ఆయనను భైరవుడనీ, మలహరి, మైల్లారా అనీ పిలుస్తారు. జానపద గాథల ప్రకారం మైల్లారా పరాక్రమవంతుడైన రాజు. ఏడు కోట్ల (యేల్కోట) సైన్యంతో రాక్షస సంహారం చేశాడు. అందుకే భక్తులు 'యేల్కోటా యేల్కోటా, జయ మల్హారా' అంటూ నినాదాలు చేస్తారు. ఆయనకు పసుపు అంటే చాలా ప్రీతి అని చెబుతారు. ఖండోబా చతుర్భుజుడు. ఒక చేతిలో పసుపు పాత్ర ఉంటుంది. ఆయన ప్రీతి కోసం పసుపు ఉత్సవాన్ని నిర్వహిస్తారు. మరో విశేషం ఏమిటంటే, ఏడాదిలో రెండు మూడు సార్లు కూడా ఈ ఉత్సవం జరుగుతుంది. సోమవారం, అమావాస్య కలిసి వచ్చే రోజును సోమావతి అమావాస్య అంటారు. (ఈ ఏడాది ఫిబ్రవరి 4, జూన్ 3, అక్టోబర్ 30 తేదీల్లో ఇలా కలిసివస్తున్నాయి). ఆ రోజున జెజూరీ గ్రామం పసుపు వర్ణరంజితమవుతుంది. బంగారానికీ, సౌభాగ్యానికీ చిహ్నంగా భావించే పసుపును చల్లుతూ ఉత్సవం చేస్తే స్వామి తమకు సుఖ సంపదలను ఇస్తాడని భక్తుల నమ్మకం. ఒకరిపై ఒకరు పసుపు చల్లుకుంటారు. మేడలూ మిద్దెలూ ఎక్కి గాలిలో పసుపును వెదజల్లుతారు. ఆలయ శిఖరం దాటి బంగారు చాయలో పసుపు మేఘాలు కమ్ముకుంటాయి. ఎక్కడ చూసినా పసుపుదనమే! ఈ సందర్భంగా ఖండోబాను కీర్తిస్తూ భక్తులు పాటలు పాడుతారు. నృత్యాలు చేస్తారు.

కళలన్నీ కలబోసి!



మన దగ్గరే

సాహిత్యం, కళలు, సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని చాటి చెప్పడం, అదే సమయంలో ఆలోచలనూ రేకెత్తించడం ప్రధాన ఉద్దేశంగా రూపుదిద్దుకున్న హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ సృజనాత్మకతకూ, వినూత్న ధోరణులకూ పట్టం కడుతోంది.

హైదరాబాద్‌లో 2010లో ప్రారంభమైన లిటరరీ ఫెస్టివల్ ఇప్పుడు దేశంలో నిర్వహించే ముఖ్యమైన ఈవెంట్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. మన దేశంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా విదేశాలకు చెందిన కవులు, రచయితలు, నాటకకర్తలు, సంగీతజ్ఞులు, చిత్రకారులు, విద్యావేత్తలు ఈ కార్యక్రమాలకు హాజరవుతారు. కళా రంగంలో వస్తున్న మార్పులు, సమకాలీన అంశాలపై చర్చలు జరుపుతారు. ఔత్సాహికులకు భవిష్యత్ మార్గ నిర్దేశం చేస్తారు. పలు విద్యా, సాహిత్య, సాంస్కృతిక సంస్థలు, ప్రచురణ సంస్థలు, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్ లిటరరీ ట్రస్టు దీన్ని నిర్వహిస్తోంది. ఎల్లుండి నుంచి మరోసారి జరిగే ఈ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఎప్పుడు?: ఈ నెల 25 నుంచి 27 వరకూ
ఎక్కడ?: హైదరాబాద్‌లోని బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో **ప్రవేశం:** ఉచితం

ఇవీ కార్యక్రమాలు



ఈ ఫెస్టివల్‌కు ప్రతి సంవత్సరం ఒక దేశానికి చెందిన ప్రతినిధులను ఆహ్వానిస్తారు. అలాగే ఒక భారతీయ భాషపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరిస్తారు. ఈ ఏడాది చైనా ప్రతినిధులు అతిథులుగా హాజరై, ఈ ఉత్సవాల్లో తమ సాహిత్యం, సంస్కృతి, కళల గురించి వివరిస్తారు. అలాగే గుజరాతీ భాషను ఈ సారి ఎంపిక చేశారు. ఆస్ట్రేలియా నుంచి ఎనిమిది మంది సభ్యుల బృందం కూడా హాజరుకానుంది. సుమారు వందమంది సాహితీ ప్రముఖులు, వివిధ రంగాల కళాకారులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక ప్రసంగాలు ఉంటాయి. సుప్రసిద్ధ నృత్యకారిణి మృణాళినీ సారాబాయి, ఉర్దూ కవి కైఫీ ఆజ్మీ శత జయంతుల సందర్భంగా వారికి నివాళులు అర్పిస్తారు. ఈ కార్యక్రమాల్లో వారి తనయలు మల్లికా సారాబాయి, షబనా ఆజ్మీ పాల్గొంటారు. భోపాల్ మురికివాడల్లో పిల్లల కోసం గ్రంథాలయం నిర్వహిస్తున్న పన్నెండేళ్ళ బాలిక ముస్కాన్ అహిర్వర్‌ను ఈ వేడుకల్లో సత్కరిస్తారు. సాహిత్య సదస్సులు, చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వర్క్ షాపులు, ప్రదర్శనలు, ట్రెజర్ వాక్‌లు, పుస్తకావిష్కరణలు, రచనా పఠనాలు, విద్యార్థుల కోసం ప్రత్యేక ఈవెంట్స్.... ఇలా అనేక అంశాల్లో కార్యక్రమాలను ఈ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహిస్తున్నారు.

ఇది రోబో స్టాల్

విశేషం

'కూకూ....' అని శబ్దం ఎవరైనా వింటే '2.0' చిత్రంలో చిట్టి కళ్లముందు మెదులుతాడు. ఆ సినిమాలో చిట్టి కాస్ట్యూమ్స్ ఎంత స్టయిలిష్‌గా ఉంటాయో, అందులోని విలన్ పాత్ర పోషించిన పక్షిరాజా గెటప్ అంత భయంకరంగా ఉంటుంది. ఇక ఈ సినిమా క్లైమాక్స్ చివరిలో వచ్చే 'చిన్ని' అనే చిన్న రోబో, వెన్నెల అనే ఫిమేల్ రోబో చూడముచ్చటగా ఉంటాయి . సాంకేతికంగా ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన సినిమా ఇది. అంతేకాదు వీరి మేకప్‌ల కోసం భారీగా ఖర్చు పెట్టారు చిత్ర నిర్మాతలు. మరి ఈ పాత్రలు ఉపయోగించిన గెటప్‌లన్నీ చూసే అవకాశం వస్తే భలే ఉంటుంది కదూ! సాధారణంగా హాలీవుడ్‌లో ఇలాంటి ప్రదర్శనలు జరుగుతూ ఉంటాయి. ఇప్పుడు చెన్నైలో కూడా ఇలాంటి ఎగ్జిబిషన్ ఒకటి ఏర్పాటు చేసింది '2.0' చిత్రబృందం. ప్రతి ఏటా చెన్నై నగరంలోని ఐలాండ్ గ్రౌండ్స్‌లో తమిళనాడు పర్యాటక శాఖ ఎగ్జిబిషన్ నిర్వహిస్తూ ఉంటుంది. ఇందులో ప్రభుత్వం తన పథకాలను ప్రజలకు వివరిస్తూ ఉంటుంది. ఇందు కోసం ప్రతి శాఖ ఒక్కో స్టాల్‌ను ఏర్పాటు చేస్తుంది. అంతే కాదు ప్రత్యేక స్టాల్స్ కూడా ఉంటాయి. ఈ నెల 9న ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్‌లో '2.ఒ' స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ స్టాల్‌లో రజనీకాంత్, అక్షయ్‌కుమార్ పాత్రల కాస్ట్యూమ్‌లు, వారి కోసం వినియోగించిన ప్రొస్థటిక్స్, సినిమాలోని రోబో బొమ్మలనూ చూడవచ్చు. 70 రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ ప్రజలకు అందుబాటులో ఉంటుంది.







సమాచారం

బ్యాంకాక్ చుట్టేద్దామా!

ఐఆర్‌సీటీసీ సంస్థ తాజాగా థాయ్‌ల్యాండ్, శ్రీలంక దేశాలకు విమాన ప్యాకేజీలను ప్రకటించింది. ఈ ప్యాకేజీలో వసతి, ముఖ్య ప్రదేశాల సందర్శన ఖర్చులు కూడా కలిపి ఉంటాయి.

బ్యాంకాక్ టూర్!

ఈ యాత్ర ఫిబ్రవరి 15న హైదరాబాద్‌లో సాయంత్రం 4:30 గంటలకు మొదలవుతుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 19వ తేదీ రాత్రి 10:40కి తిరుగు ప్రయాణం ప్రారంభమై, అర్ధరాత్రి 1:40కి హైదరాబాద్‌లో ముగుస్తుంది.

సందర్శించే ముఖ్య ప్రదేశాలు: రిక్లైనింగ్ బుద్ధ, గోల్డెన్ బుద్ధ, పగడాల దీవి, నాంగ్‌నూచ్ బొటానికల్ గార్డెన్లను సందర్శించవచ్చు,

ఛార్జీలు: రూ. 50,958 (పెద్దలకు), రూ.43,094 (పిల్లలకు)

త్వరగా వస్తే నూడుల్స్ ఫ్రీ!

ఆఫీసుకు ఠంఛనుగా సమయానికి వెళ్లాలంటే త్వరగా బయలుదేరాల్సిందే. అదే పీక్ టైమ్‌లో మీ ప్రయాణం మొదలుపెడితే, హడావిడి తప్పదు. ఆ తర్వాత బాస్‌తో అక్షింతలూ తప్పవు. అయినా కొంత మంది ఆలస్యంగా వెళుతూ ఉంటారు. వీటికి రకరకాల కారణాలు ఉండవచ్చు. జపాన్ రాజధాని టోక్యో నగరంలోని మెట్రో సబ్‌వే స్టేషన్లన్నీ కిక్కిరిసి ఉంటాయి. ముఖ్యంగా అక్కడి టోక్యో- చైబా ప్రాంతాలను కలిపే టొజోయ్ లైన్ మరింత బిజీగా ఉంటుంది. ప్రతి రోజూ ఏడు కోట్ల మందికి పైగా ప్రజలు మెట్రోను వినియోగించుకుంటారని అధికారిక గణాంకాల చెబుతున్నాయి. అందుకే రద్దీని తగ్గించడానికి టోక్యో మెట్రోపాలిటన్ అధికారులు వినూత్నంగా ఆలోచించారు. రద్దీ వేళల్లో కాకుండా త్వరగా మెట్రో స్టేషన్‌ను చేరుకుంటే ఉచితంగా నూడుల్స్ తినవచ్చు. ఈ స్కీమ్ రెండు వారాలే కిందటే ప్రారంభమైంది. ఉదయం 7:50 నుంచి 8: 50 గంటల వరకూ అందిస్తోన్న ఈ స్కీమ్‌ను ఇప్పటివరకూ 76 వేల మంది ప్రయాణికులు ఉపయోగించుకున్నారట. దీనికి దాదాపు వెయ్యి కంపెనీలు ఈ పథకానికి తోడ్పాటునందిస్తున్నాయి.

వినూత్నం


ప్రయాణికులతో కిక్కిరిసిన టోక్యోలోని ఓ మెట్రో సబ్‌వే

డైలీ సుడోకు - 433

6				9			8	
8	5		4				2	
	1				5			
		4	3		8	6		
		7	5		2	4		
			9				1	
	6				3		4	8
	3			8				7

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 432 సమాధానం

5	9	3	8	6	2	1	4	7
2	7	1	4	9	3	5	8	6
6	8	4	1	7	5	9	3	2
3	2	5	9	1	8	7	6	4
8	6	9	5	4	7	3	2	1
1	4	7	2	3	6	8	5	9
4	1	6	3	5	9	2	7	8
9	5	2	7	8	4	6	1	3
7	3	8	6	2	1	4	9	5



మీకు తెలుసా?

'గంట' కొట్టేస్తారు!

'రోబో' సినిమాలో 'కిలిమంజారో....' పాట గుర్తుందా? రజనీకాంత్, ఐశ్వర్యారాయ్ నర్తించిన ఈ పాటను పెరూ దేశంలోని మచుపిచు అనే ప్రాంతంలో చిత్రీకరించారు. దీనికి చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యం ఉంది. పర్యాటకులకూ ఎంతో ఇష్టమైన ప్రదేశం ఇది. ప్రపంచ చారిత్రక వారసత్వ కట్టడాల్లో ఉన్న ఈ ప్రాంతం కూడా ఇప్పుడు ఓవర్‌టూరిజమ్ బారిన పడింది. పర్యాటకుల తాకిడిని నియంత్రించడానికి ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకూ మాత్రమే అనుమతించేలా నిబంధన విధించారు కూడా. అయినా సరే రద్దీ ఏ మాత్రం తగ్గలేదు. ఇది గమనించిన యునెస్కో సంస్థ ఈ ప్రాంతాన్ని ప్రమాదంలో ఉన్న చారిత్రక కట్టడాల జాబితాలో చేర్చుతామని హెచ్చరించడంతో అక్కడి అధికారులు నిబంధనలను ఇంకా కఠినతరం చేశారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి కొత్త రూల్స్ అమల్లోకి తెచ్చారు. తెల్లవారుజామున 6 గంటల నుంచి 9 గంటలు, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ సందర్శన వేళలను మూడు స్లాట్లుగా విభజించారు. సందర్శకులు మచుపిచు అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీకు కావాల్సిన స్లాట్‌లను బుక్ చేసుకోవాలి. అదీ గంట మాత్రమే! ఉదాహరణకు మీరు ఉదయం స్లాట్‌లో 9 గంటలకు బుక్ చేసుకుంటే కేవలం 10 గంటల వరకే మచుపిచులో తిరగడానికి అనుమతి ఉంటుంది. ఒకసారి టిక్కెట్ బుక్ చేసుకుంటే మళ్లీ స్లాట్‌ను మార్చుకునే వీలు ఉండదు. ఈ చర్యల వల్లనైనా సమస్య తీరుతుందని అధికారులు ఆశపడుతున్నారు.

కంట్రోల్... కంట్రోల్!

ఎఫెక్ట్

ప్రపంచంలో ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలని ఎంతో మంది సాహసికులు ఉవ్విళ్లూరుతూ ఉంటారు. కానీ ఇప్పుడు ఆ అవకాశం పరిమితమే! ఎక్కువ మంది టిబెట్ మీదుగా ఎవరెస్ట్‌ను ఎక్కడం ప్రారంభిస్తారు. ఆ సంఖ్యను పరిమితం చేయాలని చైనా భావిస్తోంది. ప్రతి ఏటా ఎవరెస్ట్‌కు నేపాల్, టిబెట్‌ల మీదుగా చేరుకొనే అధిరోహకులు, పర్యాటకుల సంఖ్య 60 వేల వరకూ ఉంటుంది. వారిలో వందల మంది ఎవరెస్ట్ శిఖరాన్ని అందుకోవడానికి వెళ్తూ ఉంటారు. ముఖ్యంగా ఈ శిఖరాన్ని చేరుకునే క్రమంలో అంటే... 26 వేల 794 అడుగుల ఎత్తుకు చేరేసరికి ఆక్సిజన్ అందక పలువురు ప్రాణాలు కోల్పోతూంటారు. ఈ ప్రదేశాన్ని 'డెత్ జోన్'గా పిలుస్తారు. అయితే గతంలో చాలా మంది యాత్రికులు నేపాల్ మీదుగా సౌత్ కోల్ అనే పర్వతపు దారి ద్వారా చేరుకొనేవారు. 2017లో 648 మంది నేపాల్ మార్గంలో అక్కడికి వెళ్లారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఈ దారిలో అనేక ప్రమాదాలు చోటు చేసుకోవడంతో యాత్రికులు చైనా మీదుగా వెళ్లడం ప్రారంభించారు. అదే ఇప్పుడు సమస్యలు తెచ్చిపెడుతోంది. వీరి వల్ల అక్కడ పారిశుధ్యం విపరీతంగా దెబ్బతింటోందని చైనా అధికారులు చెబుతున్నారు. అందుకే ఇక నుంచి అధిరోహకుల సంఖ్యను కేవలం 300 మందికే పరిమితం చేయాలని సూచిస్తోంది.

ఇక ఒకటే సీజన్!

ఈ పర్వతారోహణకు ఔత్సాహికులు అన్ని సీజన్లలో వెళుతూ ఉంటారు. కానీ ఇకనుంచి కేవలం వేసవి కాలానికే చైనా పరిమితం చేస్తుందట. అత్యధికంగా వేసవిలోనే ఈ ప్రాంతానికి పర్యాటకులు పోటెత్తుతూ ఉంటారు. అంతేకాదు డెత్‌జోన్‌లో గత ఏడాది ఆరుగురు అధిరోహికులు మృత్యువాత పడటంతో ఆ ప్రాంతాన్ని కూడా ప్రక్షాళన చేసే పనిలో పడ్డారు అక్కడి అధికారులు. ఇప్పటికే ఓ ప్రత్యేక బృందం ఈ పనిలో బిజీగా ఉంది. అంతేకాదు చైనా వైపుగా వెళ్తే జేబు చిల్లు పడే ప్రమాదమూ ఉంది. ఎందుకంటే అక్కడ ధరలు కూడా బాగా పెంచేశారు. చెత్తను పరిశుభ్రం చేయడానికి అధిరోహకుల నుండి కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయమని అడుగుతున్నారట కూడా!



నవ్య సకల



కళ



వృత్తి వైద్యం.. ఆసక్తి పద్యం...

వృత్తి రీత్యా ఆయన ఎముకల డాక్టర్... తండ్రి ప్రోత్సాహంతో కళలపై అభిమానం పెంచుకున్నారు. పద్య నాటకాన్ని ప్రాణంగా ప్రేమించారు. అందుకే, వ్యయ ప్రయాసలకు ఎదురైనా వెరవకుండా నాటక ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇటీవల ద్రౌపదీ వస్త్రాపహరణం నాటక ప్రదర్శనతో కళాభిమానుల మన్ననలు అందుకున్న హైదరాబాద్‌కు చెందిన చింతలపాటి శూలపాణి తన మనోగతాన్ని 'నవ్య'తో పంచుకున్నారు.

"నాటకం అంటే కేవలం వినోదానికే పరిమితమైన ప్రదర్శన కాదు. దానికి సామాజిక ప్రయోజనం కూడా ఉండాలి. మంచిని బోధించే సూక్తులు ఉండే పౌరాణిక నాటకాలు ఈ ప్రయోజనాన్ని సాధిస్తాయి.

నాకు చిన్నప్పటి నుంచీ నాటకాలు, ప్రధానంగా పద్య నాటకాలు అంటే చాలా ఇష్టం. మాది ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా సత్తెనపల్లికి సమీపంలో ఉన్న అగ్రహారం. ఇప్పుడు దాన్ని 'హస్నాబాద్ అగ్రహారం' అని పిలుస్తున్నారు. మా నాన్నగారు చింతలపాటి సోమరాజు మహా విద్వాంసుడు. ఆయన మాతో సంప్రదాయ సాహిత్యం చదివించారు. దాంతో మాకు భాష, కళల మీద మక్కువ పెరిగింది. మా చదువులు గుంటూరు, విజయవాడల



లోనే జరిగాయి. తరువాత వృత్తి రీత్యా హైదరాబాద్ వచ్చాను. వనస్థలిపురం ప్రాంతంలో ఎముకల వైద్య నిపుణుడిగా స్థిరపడ్డాను. వృత్తి జీవితంలో తీరిక లేకపోయినా, పద్య నాటకాల మీద ఆసక్తి అలాగే ఉంది. అందుకే ఒక పక్క వైద్య వృత్తిలో ఉంటున్నా, నాటకాలు వేయడం మానలేదు. మా ప్రాంతంలో ఉంటున్న దీపిక ప్రసాద్, ఎం.ఎస్.కె. ప్రభు, ఆంధ్ర సాంబమూర్తి, పంపన వెంకటేశ్వరరావు తదితరులు రంగస్థలంమీద అనుభవం ఉన్నవారు. వాళ్లు వివిధ నాటక సమాజాలకు చెందిన మెరికలను మాతో కలిసేలా చేశారు. మా ప్రతి ప్రదర్శననూ రసవత్తరంగా మార్చారు. మేమంతా పద్యనాటకాలను తరచుగా ప్రదర్శిస్తూనే ఉన్నాం. మేము ప్రదర్శించిన వాటిలో 'శ్రీకృష్ణ సత్య, గణపతి మహాత్మ్యం, దక్షయజ్ఞం, శ్రీకృష్ణ తులాభారం' మొదలైన నాటకాలు ఉన్నాయి.

ఆ నాటకమే ఎందుకంటే...

ఈ నాటకాలు ప్రదర్శిస్తున్న సమయంలోనే ద్రౌపదీ వస్త్రాపహరణం నాటకం మీద నా దృష్టి మళ్లింది. ద్రౌపదీ వస్త్రాపహరణం నాటకాన్నే ఎంచుకోవడానికి ఒక ప్రధానమైన కారణం ఉంది. భారతాన్ని మలుపు తిప్పిన ఘట్టం అది. దరిమిలా కురుక్షేత్ర యుద్ధం సంభవించడం, లక్షలాది సైన్యం, కురువంశం నాశనం కావడం జరిగాయి. ఒక మహిళను అవమానించి, బాధపెట్టడం వల్ల ఎలాంటి అనర్థాలు జరుగుతాయో ఈ నాటకం మనకు చెబుతుంది. ఈ రోజున కూడా సమాజంలో మహిళలకు అవమానకరమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. అటువంటి చర్యలకు పాల్పడే వారికి పతనం తప్పదన్న నీతిని ఈ నాటకం ద్వారా చెప్పాలనుకున్నాం. అదే విధంగా ద్రౌపదిలా దైవాన్ని నమ్ముకుంటే ఆపదలో ఆదుకుంటాడనే సందేశమూ దీనిలో ఉంది. ఆధునిక సమాజంలో కనిపించే వ్యసనాలు, అక్రమ ఆస్తుల సంపాదన లాంటి వాటి బారిన పడితే పతనం తప్పదనే హెచ్చరిక ఉంది. పర్వ దినాల్లో ఆలయాల పందిళ్ళ దగ్గర తప్ప ఈ నాటకం ఎన్నో ఏళ్ళుగా పెద్ద వేదికల మీద ప్రదర్శనకు నోచుకోలేదు. ఆ నాటకానికి రంగస్థలం మీద మళ్ళీ పూర్వ వైభవం కలిగించాలన్న ఆలోచనతో ప్రయత్నాలు ప్రారంభించాను. హైదరాబాద్‌లో సుమారు పాతికేళ్ళుగా నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్న రసరంజని సంస్థను సంప్రతించాను. సురభి నాటక సమాజాలకు చెందిన నిపుణుల సహకారం తీసుకున్నాను. గుంటూరు, హైదరాబాద్‌లలో కళాత్మక కార్యక్రమాలు నిర్వహించే చింతలపాటి సోమరాజు సాంస్కృతిక సేవా సంస్థను ఆహ్వానించాం. రెండు రోజులపాటు ద్రౌపదీ వస్త్రాపహరణం నాటకాన్ని ఈ మధ్య ప్రదర్శించాం. దానికి కళాభిమానుల నుంచీ, ప్రేక్షకుల నుంచీ అపూర్వమైన స్పందన లభించింది. రసరంజని సంస్థ, కె.వి. రమణల ప్రోత్సాహం దీని వెనుక ఎంతో ఉంది. జమున రాయలు వంటి అగ్రశ్రేణి నటి మాతో ద్రౌపదిగా నటించడం మరింత వన్నె తెచ్చింది. నేను స్వయంగా శ్రీకృష్ణ పాత్ర పోషించాను. సుమారు 30 మంది కళాకారులు దీనిలో నటించారు. ప్రతి పాత్రకూ పద్యాలు ఉండేలా చూసుకున్నాం. ఈ నాటకానికి లభించిన ప్రశంసలు మాలో కొత్త ఉత్సాహం నింపాయి. తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిష్ఠాత్మక వేదికలపై ప్రదర్శలివ్వాలన్నది మా ఆలోచన. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే నంది నాటకోత్సవాలు, గరుడ పరిషత్ నాటక పోటీలకు సిద్ధమవుతున్నాం.

మా పిల్లలు కూడా!


పదేళ్ళ నుంచీ నాటక రంగంలో ఉన్నాను. అర్జునుడు, అశ్వత్థామ, దుర్యోధనుడు, దేవేంద్రుడు, నారదుడు... ఇలా వైవిధ్యం చూపించడానికి అవకాశం ఉన్న పాత్రలు నేను ధరించిన వాటిలో ఉన్నాయి. నా భార్య హిమబిందు. ఆమె గైనకాలజిస్ట్. ఆమెకూ కళలంటే మక్కువ. మాకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి జనార్దన్ సాగర్, అమ్మాయి రాజ్యలక్ష్మి. వారిద్దరూ మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలకు తయారవుతున్నారు. సంగీతం, నాటకాల పట్ల వారికి అభిరుచి ఉంది. ఈ మధ్యే త్యాగరాయ గానసభలో కృష్ణరాయబారంలో ఒక సన్నివేశం ప్రదర్శించాం. మా అమ్మాయి శ్రీకృష్ణ పాత్ర ధరించింది. ప్రస్తుతం కృష్ణా జిల్లాలోని కాజ, హంసలదీవి తదితర ప్రాంతాల్లో 'ద్రౌపదీ వస్త్రాపహరణం' నాటక ప్రదర్శనకు సిద్ధపడుతున్నాం. మంచి మంచి పద్య నాటకాలను ఉత్తమ ప్రమాణాలతో రసరమ్యంగా ప్రేక్షకులకు చూపాలన్నదే మా ఆశయం. దీనికోసం ఎలాంటి వ్యయ ప్రయాసలకైనా నేను సిద్ధం.

■ జి.ఎల్.ఎన్. మూర్తి

ఇదీ చరిత్ర!

ద్రౌపదీ వస్త్రపహరణం ఇతివృత్తం మహాభారతంలోది. తొలితరం తెలుగు పండితులు, నాటకకర్తలు దాన్ని జనరంజకమైన నాటకంగా మలచడానికి కృషి చేశారు. వారిలో గుంటూరు జిల్లాకు చెందిన మల్లాది అచ్యుతరామశాస్త్రి రచన అత్యంత ఆదరణ పొందింది. అలాగే చిలకమర్తి లక్ష్మీనరసింహం, సోమరాజు రామచంద్రరావు, కోలాచలం శ్రీనివాసరావు రాసిన నాటకాలు కూడా పేరుపొందాయి. ఏలూరు కేంద్రంగా నాటక జైత్ర యాత్ర సాగించిన మైలవరం రాజా వారి కంపెనీ ప్రదర్శించిన నాటకాల్లో ద్రౌపదీ వస్త్రాపహరణం ఎంతో ఖ్యాతి పొందింది. విజయవాడకు చెందిన యడవల్లి సూర్యనారాయణ తన కంచుకంఠంతో పద్యాలను అద్భుతంగా ఆలపించి, నాటకరంగంలో సూపర్‌స్టార్‌గా నిలిచారు.

- సుమారు ఇరవయ్యేళ్ళపాటు నాటకాల కాంట్రాక్టర్ల చలువ వల్ల రంగస్థలం మీద ఈ నాటకం ప్రదర్శితమైంది. ఆ తరువాత నాటక సమాజాలూ, కళాకారుల సంఖ్యా తగ్గిపోవడంతో పద్యనాటకాల్లో కేవలం పది వరకూ మాత్రమే మిగిలాయి. విస్మరణకు గురైన నాటకాల జాబితాలో 'ద్రౌపదీ వస్త్రాపహరణం' నాటకం కూడా ఉంది.
- హైదరాబాద్‌కు చెందిన దీపికాప్రసాద్ చొరవతో 1980లలో 'ద్రౌపదీ వస్త్రాపహరణం' నాటకం మళ్ళీ ప్రదర్శితమయింది. కానీ దాదాపు 12 ప్రదర్శనల తరువాత కష్టనష్టాల కారణంగా మళ్ళీ తెరమరుగైపోయింది.
- తాజాగా డాక్టర్ చింతలపాటి శూలపాణి కృషితో ఈ నాటకం మళ్ళీ ప్రేక్షకుల ముందుకు వచ్చి, ఆదరణ పొందుతోంది.
- ఐదుగురు రచయితలు ఇదే ఇతివృత్తంతో నాటకం రాసినా మల్లాది అచ్యుతరామశాస్త్రి రచన మాత్రమే ప్రదర్శనలకు నోచుకుంటోంది.



వెండి తెరమీద...

- రంగస్థలం మీద రాణించిన 'ద్రౌపదీ వస్త్రాపహరణం' నాటకం రచయిత మల్లాది అచ్యుతరామశాస్త్రి సహకారంతో 1936లో తెలుగులో సినిమాగా రూపుదాల్చింది. అయితే అంతకుముందే తెలుగు నాటకాల ప్రభావంతో తమిళంలో 1934లో ఒక సినిమా రూపొందడం విశేషం. దీనిలో కృష్ణునిగా చెల్లప్ప, ద్రౌపదిగా టి.పి. రాజ్యలక్ష్మి నటించారు.
- 1936లో హెచ్.ఎం.రెడ్డి పర్యవేక్షణలో, హెచ్.వి.బాబు దర్శకత్వంలో విడుదలైన తెలుగు 'ద్రౌపదీ వస్త్రాపహరణం' విజయవంతం అయింది. ఈ సినిమాలో శ్రీకృష్ణునిగా సి.ఎస్.ఆర్ ఆంజనేయులు, దుర్యోధనుడిగా యడవల్లి సూర్యనారాయణ, ద్రౌపదిగా కన్నాంబ నటించారు. దీనికి పోటీగా అదే సమయంలో 'ద్రౌపదీ మాన సంరక్షణం' అనే సినిమా ఇదే ఇతివృత్తంతో విడుదలయింది. శ్రీకృష్ణునిగా బందా కనకలింగేశ్వరరావు, దుర్యోధనుడిగా బళ్ళారి రాఘవ, ద్రౌపదిగా సురభి కమలాబాయి నటించారు. జగన్నాథ్, రమణమూర్తి దర్శకత్వం వహించారు. దీనికి ప్రేక్షకాదరణ లభించలేదు.

'మహానాయకుడు'.. వచ్చేనెల్లో!


బాలకృష్ణ

మన పార్టీ పేరు 'తెలుగు దేశం'... అని నందమూరి తారకరామారావు ప్రకటించడంతో 'యన్.టి.ఆర్. కథానాయకుడు' తొలి భాగం పూర్తయింది. రెండో భాగం ఎప్పుడెప్పుడా అని సినీ ప్రేక్షకులు, అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఆ ఎదురుచూపులకు తెరదించుతూ 'యన్.టి.ఆర్ మహానాయకుడు'ను ఫిబ్రవరి 15న విడుదల చేయడానికి చిత్ర యూనిట్ నిర్ణయించింది. 'యన్.టి.ఆర్'గా నందమూరి బాలకృష్ణ, బసవతారకమ్మగా విద్యాబాలన్ నటించిన చిత్రమిది. సుమంత్, కల్యాణ్‌రామ్, రానా కీలక పాత్రల్లో నటించారు. తొలి భాగంలో 'యన్.టి.ఆర్' సినీ వైభవాన్ని చూపించిన దర్శకుడు క్రిష్ జాగర్లమూడి రెండో భాగంలో ఎక్కువగా 'తెలుగు దేశం' పార్టీ ప్రస్థానంపై దృష్టి పెడతారని సమాచారం. యన్.బి.కె. ఫిల్మ్ ఎల్ఎల్‌పీ పతాకంపై నందమూరి బాలకృష్ణ, నందమూరి వసుంధరాదేవి నిర్మించారు. వారాహి చలనచిత్రం, విబ్రి మీడియా సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. సాయి కొర్రపాటి, విష్ణు ఇందూరి సహ నిర్మాతలు. ఎం.ఆర్.వి.ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ నిర్మాత. ఎం.ఎం.కీరవాణి సంగీతాన్ని సమకూర్చారు.

చై గ్రీన్‌సిగ్నల్?


నాగచైతన్య

నాగార్జున, నాగచైతన్య, కలిసి మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా? అవుననే అంటున్నారు ఫిల్మ్ నగర్ జనాలు. వీరిద్దరూ కలిసి 'మనం'లో సందడి చేసిన సంగతి తెలిసిందే. తాజాగా తాతా, మనవడుగా నటించడానికి సిద్ధమవుతున్నారట. ఈ తాజా సినిమాకు కల్యాణ్‌కృష్ణ కురసాల దర్శకుడు. 'సోగ్గాడే చిన్ని నాయన' చిత్రానికి ఆయన సీక్వెల్ సిద్ధం చేస్తున్నారనే సంగతి తెలిసిందే. 'సోగ్గాడే చిన్నినాయన'లో నాగార్జున తండ్రీ, కొడుకుగా ద్విపాత్రాభినయం చేశారు. ఈ తాజా చిత్రంలో మూడో తరాన్ని కూడా చూపించబోతున్నారట. అందుకే మనవడి పాత్రకోసం నాగచైతన్యను సంప్రదించారట. తన పాత్ర వచ్చిన తీరు సంతృప్తికరంగా ఉండటంతో నాగచైతన్య వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారని టాక్. వేసవిలో సినిమాను సెట్స్ మీదకు తీసుకెళ్లనున్నారు.

రియల్ లైఫ్‌లో... నా చుట్టూ అబ్బాయిలే!


అఖిల్

"నిజ జీవితంలో నా పాత్రకు, 'మిస్టర్ మజ్ను'లో చేసిన పాత్ర విక్కీకి అసలు పోలిక లేదు. విక్కీ ఓ ప్లేబాయ్. లవర్ బాయ్‌గా ఎలా మారాడనేది కథ! అందువల్లే ప్రచార చిత్రాల్లో నా చుట్టూ అమ్మాయిలు ఉన్నారు. అమ్మాయిల వెంట పడ్డాను. రియల్ లైఫ్‌లో.. నా చుట్టూ అబ్బాయిలే ఉంటారు. ప్రస్తుతానికి నేను ఒంటరే" అని అక్కినేని అఖిల్ అన్నారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'మిస్టర్ మజ్ను'. నిధీ అగర్వాల్ హీరోయిన్. 'తొలిప్రేమ' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకుడు. బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మాత. ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు సినిమా వస్తున్న సందర్భంగా అఖిల్ చెప్పిన విశేషాలు...

- తాతయ్యగారి (ఏయన్నార్) 'ప్రేమ్ నగర్', నాన్నగారి (నాగార్జున) 'నిన్నే పెళ్ళాడతా', 'మన్మథుడు' చిత్రాల స్ఫూర్తితో నేటి తరానికి తగ్గట్టు వెంకీ అట్లూరి చక్కటి కథ రాశాడు. ప్రేమ, వినోదం, చక్కటి సంగీతం, కుటుంబ భావోద్వేగాలు... అన్నీ ఉన్న వినోదాత్మక చిత్రమిది. ట్రైలర్‌లో చూపించిన 'ఎక్స్‌క్యూజ్‌మి మిస్' డైలాగ్ 'ప్రేమ్ నగర్' నుంచి తీసుకున్నదే. వెంకీ ఓల్డ్ క్లాసిక్స్ చూసి స్ఫూర్తి పొందాడు గానీ.. ఎక్కడా కాపీ కొట్టలేదు.
- సాధారణంగా 'మజ్ను' అంటే ట్రాజెడీ క్యారెక్టర్సే గుర్తొస్తాయి. ఇందులో ఈతరం కుర్రాడి కథ చెబుతున్నాం. నో ట్రాజెడీ. అందుకని, 'మిస్టర్ మజ్ను' అని టైటిల్ పెట్టాం. మా కుటుంబానికి 'మజ్ను' టైటిల్ కలిసి వచ్చింది. నాకూ కలిసి వస్తుందని ఆశిస్తున్నా. సినిమాలో ప్రేమకథ ప్రారంభం కావడానికి కొంత సమయం పడుతుంది. ఈలోపు నా పాత్రను పరిచయం చేస్తూ వచ్చే సన్నివేశాలు బావుంటాయి.
- 'అఖిల్', 'హలో' చిత్రాల్లో చేసిన పాత్రలకు పూర్తి భిన్నమైన పాత్రను ఈ చిత్రంలో చేశా. క్యారెక్టరైజేషన్ చుట్టూ అల్లిన కథ కావడంతో వెంటనే నచ్చేసింది. అయితే.. నాన్నకు నచ్చుతుందో? లేదో? అనే సందేహంతో, అప్పటికే కమిటైన సినిమా పూర్తి కావడానికి ఏడాది పడుతుంది కనుక... వెంకీని మరో చిత్రం చేసుకోమని చెప్పాను. తను నాకోసం ఈ కథతో మూడేళ్లు ఎదురుచూశాడు. పదేళ్ల నుంచి వెంకీ తెలుసు. మూడేళ్ల నుంచి మంచి స్నేహితులయ్యాం. ఈ మూడేళ్లలో కథలో పెద్ద మార్పులేం చేయలేదు. కానీ, 'తొలిప్రేమ' తర్వాత నెక్స్ట్ లెవల్ సినిమా తీయాలనుకుంటున్నానని ఫ్యామిలీ ఎమోషన్స్ పెంచాడు వెంకీ. సినిమా పూర్తయ్యాక ఓ సన్నివేశంలో మా ఇద్దరికీ సందేహం ఉంటే... నాన్న సలహా తీసుకుని రీషూట్ చేశాం. ఆ సన్నివేశం విషయంలో మేము ఏదైతే ఫీలయ్యామో... నాన్న కూడా అదే చెప్పారు.
- హీరోగా నటించిన రెండు చిత్రాలు ఆశించిన రీతిలో ఆడలేదు. స్టార్ హీరోలకు డిజాస్టర్ వస్తే త్వరగా కోలుకోలేరు. కొత్తవాడిగా 'అఖిల్' రిజల్ట్ అధిగమించి 'హలో' చేశా. రెంటిటి నుంచి చాలా నేర్చుకున్నాను. హీరోగా పరిచయమైనప్పుడు నాపై భారీ అంచనాలు నెలకొనడం, ఒత్తిడి నా శత్రువులుగా మారాయి. అంచనాలు చేరుకోడానికి ప్రయత్నించలేదు. ఇప్పుడు నచ్చిన చిత్రాలు చేస్తూ.. ఒక్కో మెట్టు ఎక్కాలని ప్రయత్నిస్తున్నా.
- ప్రస్తుతం రెండు చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి. ఫిబ్రవరి నెలాఖరుకు కొత్త చిత్రం వివరాలు ప్రకటిస్తా. మంచి కథ వస్తే మల్టీస్టారర్ చిత్రాలు చేస్తా. ఐదారు మంది హీరోలతో హాలీవుడ్ 'ఎక్స్‌పెండబుల్స్' తరహా మల్టీస్టారర్స్ చేయడం నాకిష్టం.

మాస్ ఎలా నేర్చుకోవాలో...

ఈ సినిమా ప్రీ రిలీజ్‌లో తారక్ (చిన్న ఎన్టీఆర్) నుంచి మాస్ నేర్చుకోమని నాన్న చెప్పారు. (నవ్వుతూ) మాస్ ఎలా నేర్చుకోవాలో నాన్నను అడగాలి. ప్రీ రిలీజ్‌లో తారక్ చెప్పినట్టు నన్ను చాలా ఆత్మవిమర్శ చేసుకున్నా. గత చిత్రాల్లో నటనకు, ఈ చిత్రంలో నటనకు వ్యత్యాసం చూపాలని చాలా కష్టపడ్డా. దర్శకుడు వెంకీ అట్లూరి కూడా యాక్టింగ్, బాడీ లాంగ్వేజ్ విషయంలో నాకెంతో సహాయం చేశాడు. 'మిస్టర్ మజ్ను'లో ఇంట్రడక్షన్ సాంగ్ చిత్రీకరిస్తున్నప్పుడు రామ్ చరణ్ మా సెట్స్‌కి వచ్చారు. స్వతహాగా తనకు డ్యాన్స్ అంటే ఇష్టం కదా! ఇందులో నా డ్యాన్స్ చూసి ప్రశంసించారు. ఇంట్రడక్షన్ సాంగులో 8 ప్యాక్‌తో కనిపిస్తా. నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ కన్విన్స్ చేయడంతో 8 ప్యాక్ చేశా. అందుకోసం సుమారు పది వారాలు చేపలు మాత్రమే తిన్నా. అయితే... పాటలో మాత్రమే 8 ప్యాక్ కనిపిస్తుంది.


ఎన్టీఆర్, రామ్‌చరణ్, అఖిల్

ఇస్మార్ట్... స్టార్ట్!


ఛార్మీ, రామ్, పూరి జగన్నాథ్

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరీ కనెక్ట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. పూరి జగన్నాథ్, ఛార్మి నిర్మాతలు. ఈ చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. హీరోపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత 'స్రవంతి' రవికిశోర్ కెమెరా స్విచ్చాన్ చేయగా... నటి, నిర్మాత ఛార్మీ కౌర్ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "ఇందులో రామ్ సరికొత్త లుక్‌లో కనిపిస్తారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ గురువారం నుంచి ప్రారంభం కానుంది. మే నెలలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం" అన్నారు. పునీత్ ఇస్సార్, సత్యదేవ్, మిలింద్ గునాజి, ఆశిష్ విద్యార్థి, 'గెటప్' శ్రీను, సుధాన్షు పాండే, మధు సింగంపల్లి, కుల్దీప్ సింగ్, దీపక్ శెట్టి నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ: లావణ్య, కెమెరా: రాజ్ తోట, కళ: జానీ షైక్, కూర్పు: జునైద్ సిద్ధిఖీ, పాటల రచయిత: భాస్కరభట్ల, పోరాటాలు: 'రియల్' సతీశ్, సంగీతం: మణిశర్మ.

యూత్‌కు చేరువయ్యేలా ఉంది

-సురేశ్‌బాబు


కోటేశ్వరరావు, సురేశ్‌బాబు, అనురాగ్

అనురాగ్ కొణిదెన హీరోగా నటిస్తున్న చిత్రం 'మళ్లీ మళ్లీ చూశా'. సాయిదేవ రామన్ దర్శకత్వంలో కొణిదెన కోటేశ్వరరావు ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను నిర్మాత సురేశ్‌బాబు విడుదల చేశారు. 'టీజర్ చాలా ఫ్రెష్‌గా ఉంది. కంటెంట్ యూత్‌కు చేరువయ్యేలా ఉంది. హీరో అనురాగ్ స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంది. టీమ్‌కు ఆల్ ది బెస్ట్' అని చెప్పారు సురేశ్‌బాబు. 'ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. సినిమా చాలా బాగా వచ్చింది. త్వరలో ఆడియోను రిలీజ్ చేస్తాం. విడుదల తేదీని ప్రకటిస్తాం' అని తెలిపారు నిర్మాత కోటేశ్వరరావు. శ్వేత అవస్తి, కైరవి తక్కర్ ఈ చిత్రంలో కథానాయికలుగా నటించారు.

హన్సికకు గాయాలు!



నటి హన్సికకు 'మహా' షూటింగ్‌లో గాయాలయ్యాయి. ఆమె టైటిల్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'మహా'. యూనిట్ వర్గాల ప్రకారం... "సినిమాలో కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. హన్సిక మంచి ఎమోషన్‌తో నటించసాగారు. అనుకోకుండా ఆమె జారి పడ్డారు. చేతికి బాగా గాయాలయ్యాయి. రక్తం కూడా చాలా పోయింది. షూటింగ్ ఆపేద్దామని, ఆసుపత్రికి వెళ్దామని మేం ఎంతో బతిమలాడాం. అయినా ఆమె అందుకు అంగీకరించలేదు. చేతికి బ్యాండేజ్ వేసుకుని నటించారు. ఆమె పోర్షన్ పూర్తయ్యాక ఇంటికెళ్లారు" అని అన్నారు. 'మహా' చిత్రానికి యుఆర్ జమీల్ దర్శకత్వం వహిస్తున్నారు.

స్నేహానికీ, సహజీవనానికీ మధ్య...


ప్రియాంత్

"స్నేహానికీ, సహజీవనానికీ మధ్య సన్నటి గీతను చూపిస్తూ... ఈతరం యువత ఎలా ఉంటున్నారనే కథతో రూపొందించిన చిత్రమిది. తల్లిదండ్రులకు దూరంగా స్వేచ్ఛా జీవితానికి అలవాటు పడిన యువత ఎలా ఉంటున్నారనేది చిత్రంలో చూపించాం. రొమాంటిక్ సన్నివేశాల్లో హద్దు మీరలేదు" అని ప్రియాంత్ అన్నారు. ఆయన హీరోగా పరిచయమవుతున్న సినిమా 'కొత్తగా మా ప్రయాణం'. యామిని భాస్కర్ హీరోయిన్. 'ఈ వర్షం సాక్షిగా' పేమ్ రమణ దర్శకుడు. ఈ నెల 25న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రియాంత్ మాట్లాడుతూ "మాది హైదరాబాద్. నేను 'యస్' బ్యాంకులో తొమ్మిదేళ్లుగా మేనేజర్‌గా పని చేస్తున్నా. సినిమాలపై ఆసక్తితో ఏడెనిమిదేళ్లుగా అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నా. హీరోగా నా తొలి చిత్రమిది. ఇందులో నెలకు రెండు లక్షలు జీతం వచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా నటించా. ప్రతి విషయంలో ముక్కుసూటిగా వ్యవహరించే అతడు ఏ అమ్మాయి విషయంలోనూ ముక్కుసూటిగా వ్యవహరిస్తాడు. ఆ తర్వాత పరిణామాలేంటి? అమ్మాయి, అబ్బాయి కలిసుంటే సమాజం ఏమంటుంది? అనేది సినిమా. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయకూడదని, బాధ్యతగా ఉండాలని చెప్పే చిత్రమిది" అన్నారు.

తనలాగా మారిపోయా!

- కియారా అడ్వానీ



"ప్రతి అంశాన్నీ ఆచీ తూచీ ఆలోచించి, నిదానంగా మాట్లాడటం నా రక్తంలోనే లేదు. నేను చాలా దుడుకుగా ఉంటాను. చాలా సరదాగా మాట్లాడుతాను. మనసులో ఏమీ ఉంచుకోను. అలాంటి నా స్వభావంలోనూ ఇటీవల మార్పు వచ్చింది" అని అన్నారు కియారా అడ్వానీ. తెలుగులో సందీప్ వంగా తెరకెక్కించిన 'అర్జున్‌రెడ్డి' హిందీ వెర్షన్ 'కబీర్ సింగ్'లో నటిస్తున్నారు కియారా. ఈ సినిమాలో తాను చేస్తున్న కేరక్టర్ గురించి కియారా మాట్లాడుతూ "సందీప్ డిజైన్ చేసిన ప్రీతి పాత్ర నాకు చాలా కొత్తగా అనిపించింది. ఆ పాత్ర ఎక్కువగా మాట్లాడదు. ఓపిక ఎక్కువ. ప్రతి విషయాన్నీ లోలోపల ఆలోచిస్తుంది. ఈ పాత్ర తాలూకు లక్షణాలను నేను చాలా కష్టపడి అలవాటు చేసుకున్నాను. కొన్ని సందర్భాల్లో ప్రీతీలాగే ప్రవర్తిస్తున్నా. ఊహ తెలిసిన తర్వాత నేను అంత కామ్‌గా కూర్చోవడం ఇదే తొలిసారేమో" అని అన్నారు కియారా అడ్వాణీ.

నరసింహస్వామి వైభవం!



సుమన్ ప్రధాన పాత్రలో పి.శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'సింహనాదం'. శ్రీలిఖిత మూవీ మేకర్స్, వైష్ణవి స్పిరిటైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో పలువురు స్వామిజీల ఆశీస్సులతో మొదలైంది. సింహయాజి స్వామి, రామానుజాచార్యులు, కామిశెట్టి శ్రీనివాస్ టైటిల్ లోగోను ఆవిష్కరించారు. "నరసింహస్వామి వైభవాన్ని తెలిపే చిత్రమిది. త్వరలో ఇతర నటీనటులు ఎంపిక పూర్తిచేసి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం" అని నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ కురాకుల, ఛాయాగ్రహణం: మణి-దిలీప్.

టాప్ రిటైలర్స్ జాబితాలో రిలయన్స్ రిటైల్‌కు 94వ స్థానం

న్యూఢిల్లీ: ముకేష్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ రిటైల్.. డెలాయిట్ ప్రకటించిన గ్లోబల్ పవర్స్ ఆఫ్ రిటైలింగ్ 2019 సూచీలో 94వ స్థానాన్ని సొంతం చేసుకుంది. సరుకులు, వినియోగదారు ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ వ్యాపారాల ద్వారా రాబడులు గణనీయంగా పెరగడంతో రిలయన్స్ రిటైల్ ఏకంగా 95 స్థానాలు ఎగబాకే అవకాశం ఏర్పడింది. 2017 ఆర్థిక సంవత్సరంలో కంపెనీలు నమోదు చేసుకున్న రాబడులను ఆధారంగా చేసుకుని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 250 సంస్థలతో డెలాయిట్ వార్షిక జాబితాను రూపొందించింది.

ఎస్‌బీఐకి చోక్సీ రూ. 405 కోట్ల బకాయి

- నోటీసు ఇచ్చిన బ్యాంకు.. తొలిసారిగా వెల్లడి
- తెలంగాణలోని 38.51 హెక్టార్ల భూమి తనఖా



ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)ను వేల కోట్లు మోసగించి విదేశాలకు పారిపోయిన మెహుల్ చోక్సీ.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కీ రూ.405 కోట్ల కుచ్చుటోపీ పెట్టాడు. ఎస్‌బీఐ నుంచి తీసుకున్న రుణానికి హామీగా తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలంలో ఉన్న 38.51 హెక్టార్ల భూమితోపాటు పలు ఆస్తులను తనఖా పెట్టాడు. కుంభకోణంలో ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీ, చోక్సీలకు తాము ప్రత్యక్షంగా ఎలాంటి రుణాలివ్వలేదని గత ఏడాది ఫిబ్రవరిలో ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ స్వయంగా వెల్లడించారు. కానీ, బకాయిల రికవరీ ప్రయత్నాల్లో భాగంగా తొలిసారిగా రుణం ఇచ్చిన ఈ విషయాన్ని బయటికి వెల్లడించింది. తమకు బకాయిపడిన రూ.405 కోట్ల రుణాన్ని చెల్లించాలంటూ బుధవారం ఎస్‌బీఐ పబ్లిక్ నోటీస్ జారీ చేసింది. గీతాంజలి జెమ్స్ అధినేత అయిన మెహుల్ చోక్సీ తన భారత పౌరసత్వాన్ని వదులుకున్నట్లు తెలిసిన రెండ్రోజులకే ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. నిర్వహణ మూలధన అవసరాల కోసం చోక్సీ ఎస్‌బీఐ నుంచి పెద్ద మొత్తంలో రుణం పొందారు. ఇందుకోసం చోక్సీ తన కుటుంబం, గ్రూపు కంపెనీలకు హైదరాబాద్, ముంబై, రాయ్‌గఢ్, నాసిక్‌లలో ఉన్న పలు స్థిరాస్తులను తనఖా పెట్టారు. బకాయిల రికవరీ కోసం సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం చోక్సీ, ఆయన కుటుంబ సభ్యులకు ఎస్‌బీఐ ఇప్పటికే నోటీసులు కూడా జారీ చేసింది. కానీ, ఆ నోటీసులు తిరిగి వచ్చాయి. గత ఏడాది జనవరిలో పీఎన్‌బీలో వెలుగు చూసిన రూ.13,500 కోట్ల నీరవ్ మోదీ రుణ మోసం కేసులో చోక్సీ కూడా ప్రధాన నిందితుడే. చోక్సీ అల్లుడే నీరవ్ మోదీ. ఈ స్కామ్ బయటికి పొక్కకముందే నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలు కుటుంబంతో సహా విదేశాలకు పారిపోయారు. వీరిని భారత్‌కు తిరిగి రప్పించేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.


తెలంగాణలో చోక్సీ ఆస్తులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: వజ్రాల కటింగ్, పాలిషింగ్ కోసం మెహుల్ చోక్సీ హైదరాబాద్ శివార్లలో రూ.500 కోట్ల పెట్టుబడితో జెమ్స్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ పార్కు ఏర్పాటు కోసం చోక్సీకి చెందిన గీతాంజలి గ్రూపునకు 2005లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రావిర్యాలలోని సెజ్‌లో 190 ఎకరాలు కేటాయించింది. రాజీవ్ జెమ్స్ పార్క్ పేరుతో 2007లో చోక్సీ కార్యకలాపాలు ప్రారంభించారు. ఆ తర్వాత దీని పేరును హైదరాబాద్ జెమ్స్ సెజ్ లిమిటెడ్‌గా మార్చారు. పీఎన్‌బీ రుణం కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా గత ఏడాది ఫిబ్రవరిలో గీతాంజలి గ్రూపు ఆస్తులపై సోదాలు నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఈ పార్క్ సీజ్ చేశారు.



కేంద్ర బడ్జెట్ దగ్గర పడుతోంది. తాత్కాలిక (ఓటాన్) బడ్జెట్టే అయినా ఈసారి సంప్రదాయాలకు తిలోదకాలిచ్చి ప్రధాన నిర్ణయాలనూ ఈ బడ్జెట్‌లో ప్రకటిస్తామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. దీంతో పారిశ్రామిక, వాణిజ్య సంఘాలు బడ్జెట్‌లో తమకు ఏమేం కావాలో కోరుతూ ఆర్థిక మంత్రికి విజ్ఞప్తులు సమర్పిస్తున్నాయి. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో స్థిరాస్తి రంగం కోరుతున్న ప్రోత్సాహకాలను 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బజాజ్ పంచుకున్నారు.

పన్ను పోటు తగ్గించాలి



ప్రస్తుతం దేశంలో స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) పరిశ్రమ పలు సమస్యలు ఎదుర్కొంటోంది. డిమాండ్ అంతంత మాత్రంగానే ఉంది. ఎన్‌బీఎఫ్‌సీల సంక్షోభంతో ఇది మరింత తీవ్రమైంది. దీంతో మంచి పేరున్న బిల్డర్లు కూడా నిధుల సమస్య ఎదుర్కొంటున్నారు. అయినా డిమాండ్‌ను పెంచేందుకు పరిశ్రమ కొన్ని చర్యలు చేపట్టింది. దీనికి తోడు వచ్చే తాత్కాలిక బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ రంగానికి కొన్ని ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలి. లేకపోతే రియల్టీ రంగం కష్టాల నుంచి గట్టెక్కే పరిస్థితి లేదు. వచ్చే కేంద్ర బడ్జెట్ నుంచి రియల్టీ పరిశ్రమ ముఖ్యంగా గృహ నిర్మాణ రంగం ఈ కింది ప్రోత్సాహకాలు ఆశిస్తోంది. అవేంటంటే...

పరిశ్రమ హోదా

స్థిరాస్తి రంగం అనేక అనుబంధ రంగాల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో సమకూరుస్తోంది. ముఖ్యంగా వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. ఇంకా ఆర్థిక వ్యవస్థపై అనేక విధాలుగా ప్రభావం చూపిస్తోంది. అయినా ప్రభుత్వం ఈ రంగాన్ని ఇప్పటి వరకు 'పరిశ్రమ'గా గుర్తించ లేదు. కనీసం ఈ బడ్జెట్‌లో అయినా కేంద్ర ప్రభుత్వం స్థిరాస్తి రంగాన్ని 'పరిశ్రమ'గా గుర్తించాలి. పరిశ్రమ హోదాతో స్థిరాస్తి రంగం చౌకగా నిధులు సమకూర్చుకునే అవకాశం ఏర్పడుతుంది. దీని వల్ల నిధుల ఖర్చులు తగ్గి, ఆ ప్రభావం ప్రాజెక్టుల వ్యయాల మీదా పడుతుంది. ప్రస్తుతం తీవ్ర నిధుల కొరత ఎదుర్కొంటున్న స్థిరాస్తి రంగానికి ఈ చర్య ఎంతో అవసరం.

భూమి ధర

జీఎస్‌టీతో రియల్ ఎస్టేట్ రంగంపై పన్నుల భారం పెరిగింది. ప్రస్తుతం ఈ రంగంపై 18 శాతం జీఎస్‌టీ భారం మోపుతున్నారు. భూమి ధరను మూడోవంతుగా పరిగణించి, మొత్తం ప్రాజెక్టు వ్యయం నుంచి దాన్ని తగ్గిస్తే (అబేట్‌మెంట్), అమలయ్యే జీఎస్‌టీ భారం 12 శాతమే. అయితే దీన్లో కొన్ని సమస్యలున్నాయి. నిజానికి చాలా నగరాల్లో ప్రాజెక్టు వ్యయంలో భూమి ధరే 50 శాతానికిపైగా ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, భూమి ధర తగ్గింపును (అబేట్‌మెంట్) 50 శాతానికి పెంచాలి. దీని వలన జీఎస్‌టీ భారం ప్రస్తుత 12 శాతం నుంచి తొమ్మిది శాతానికి తగ్గుతుంది.

అందుబాటు ధరల గృహాలు

'2022నాటికి అందరికీ గృహ వసతి' అన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యం సాకారం కావాలంటే కనీసం కోటికిపైగా ఇళ్లు కొత్తగా నిర్మించాలి. ఇందులో 95 శాతం గృహాలు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు (ఈడబ్ల్యూఎస్), అల్పాదాయ వర్గాల (ఎల్ఐజీ) కోసమే నిర్మించాల్సి ఉంది. అంటే వీరి కోసం నిర్మించే ఇళ్ల విలువ తక్కువగా ఉండేలా అందుబాటు ధరల్లో నిర్మించాలి. నిర్మాణ వ్యయం ఏమాత్రం పెరిగినా ఈ వర్గాల కొనుగోలు శక్తి దెబ్బతిని అసలు లక్ష్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఈ తరహా గృహాల మీదా 12 శాతం జీఎస్‌టీ అమలు చేస్తున్నారు. అయితే ప్రాజెక్టు వ్యయంలో భూమి ధరను మూడోవంతుగా పరిగణించి దాన్ని తీసివేశాక చూస్తే ఈ తరహా గృహాల మీద పడే జీఎస్‌టీ భారం ఎనిమిది శాతం అవుతుంది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, అల్పాదాయ వర్గాలకు ఇది కూడా భారమే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే కేంద్ర బడ్జెట్‌లో అయినా ఈ ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే భూమి ధరను మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 50 శాతంగా పరిగణించాలి. తద్వారా ఈ తరహా గృహాలపై జీఎస్‌టీ భారాన్ని ఆరు శాతానికి తగ్గించాలి. ఇలా చేస్తే 2022 నాటికి అందరికీ గృహ వసతి అన్న లక్ష్యం మరింత త్వరగా నెరవేరే అవకాశం ఉంది.

'అసలు' పై పన్ను మినహాయింపు

మన దేశంలో సొంతిల్లనేది ప్రతి వ్యక్తి జీవిత లక్ష్యం. అప్పు చేసి సొంతిల్లు సమకూర్చుకున్నా ప్రస్తుతం ఇస్తున్న పన్ను మినహాయింపులు ఏమంత ఆకర్షణీయంగా లేవు. ఐటి చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఇస్తున్న రూ.1.5 లక్షల వార్షిక మినహాయింపులో ఈ 'అసలు' చెల్లింపు కూడా ఒక భాగం. ఇలా కాకుండా హోమ్ లోన్ చెల్లిస్తున్నంత కాలానికి ఏటా కేవలం హోమ్ లోన్‌పై చెల్లించే రూ.1.5 లక్షల 'అసలు' చెల్లింపుకు ప్రత్యేకంగా పన్ను మినహాయింపు ఇవ్వాలి. కనీసం వచ్చే బడ్జెట్‌లో అయినా ఆర్థిక మంత్రి ఇందుకోసం చర్యలు తీసుకోవాలి.

రీట్ పెట్టుబడులు

అమెరికా, యూరప్ వంటి దేశాల్లో రియల్ ఎస్టేట్ కంపెనీలు కమర్షియల్ రియల్ ఎస్టేట్ అభివృద్ధికి అవసరమైన నిధులను 'రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్'(రీట్) అనే పెట్టుబడి సాధనాల ద్వారా సమీకరిస్తుంటాయి. మన దేశంలోనూ వీటిని ప్రారంభించేందుకు రెండేళ్ల క్రితమే అనుమతులు మంజూరు చేశారు. అయితే 'పన్ను'ల భారం కారణంగా మన దేశంలో ఇది ఇంకా ప్రజల్లోకి రాలేదు. ముఖ్యంగా మూడేళ్ల తర్వాతగానీ రీట్ పెట్టుబడి లాభాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) క్లెయిమ్ చేసుకునే అవకాశం లేదు. ఈక్విటీ పెట్టుబడుల్లా రీట్ యూనిట్లపైనా ఏడాది తర్వాత ఎల్‌టీసీజీటీ క్లెయిమ్ చేసుకునే అవకాశం కల్పించాలని ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఇలా చేస్తే మన దేశంలోనూ రీట్స్ మదుపరుల చూరగొంటాయి. స్థిరాస్తి రంగం ఎదుర్కొంటున్న నిధుల కొరతా కొంత వరకు తీరుతుంది.

- శిశిర్ బజాజ్, సీఎండీ, నైట్ ఫ్రాంక్ ఇండియా

జీఎస్‌టీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో జాతీయస్థాయిలో జీఎస్‌టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ధర్మాసనం ఏర్పాటు కానుంది. బుధవారం నాడు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఇందుకు ఆమోదం తెలిపింది. జీఎస్‌టీకి సంబంధించిన వివాదాలు చోటుచేసుకున్న సందర్భంలో రెండో అప్పీల్ చేసుకునేందుకు ఇది ఫోరమ్ మాదిరిగా పని చేస్తుంది. అంతేకాకుండా రాష్ట్రస్థాయిలో భిన్నమైన ఆదేశాలు వెలువడినప్పుడు ఈ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చు. జీఎస్‌టీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను దేశ రాజధానిలో ఏర్పాటు చేస్తారు. ఇందులో కేంద్రం, రాష్ట్రాల నుంచి ఒక్కొక్క సభ్యుడు, ఒక అధ్యక్షుడు ఉంటారు. జీఎస్‌టీ చట్టం కింద నెలకొనే వివాదాలను వేగవంతంగా పరిష్కరించేందుకు జీఎస్‌టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ (జీఎస్‌టీఏటీ) జాతీయ ధర్మాసనం దోహదపడుతుందని కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్ అన్నారు. సెంట్రలైజ్డ్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని జీఎస్‌టీ మండలి గత డిసెంబరులోనే నిర్ణయం తీసుకుంది. కాగా జీఎస్‌టీఏటీ జాతీయ బెంచ్ ఏర్పాటుకు ఒక్కసారి రూ.92.50 లక్షల వ్యయం కానుంది. తర్వాత వార్షికంగా రూ.6.86 కోట్ల ఖర్చు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

వస్తువుల డెలివరీకి 'విజ్జీ' యాప్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆహార వస్తువుల డెలివరీకి ఫుడ్ యాప్‌లు వచ్చినట్లుగా వినూత్న ఆలోచనతో వస్తువులు, ఇతర సేవలను డెలివరీ చేయడానికి విజ్జీ లాజిస్టిక్ టెక్నాలజీస్ 'విజ్జీ' యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. గృహస్తులు, చిన్న వ్యాపారులను దృష్టిలో పెట్టుకుని ఈ యాప్‌ను అత్యాధునిక టెక్నాలజీపై అభివృద్ధి చేసినట్లు ప్రమోటర్లు రవి గొల్లపూడి, రవి బత్తి తెలిపారు. కస్టమర్లు యాప్, వాట్సప్, ఫోన్, విజ్జీ వెబ్ ద్వారా బుక్ చేసుకుని సేవలు పొందొచ్చు. ట్రిప్ దూరం తదితరాల ఆధారంగా రుసుము వసూలు చేస్తారు. 4, 8 గంటల ప్యాకేజీలు కూడా ఉన్నాయని ప్రమోటర్లు తెలిపారు. సుశిక్షితులైన బాయ్‌లు వస్తువులను డెలివరీ చేస్తారని వివరించారు.

భారత్, చైనాల పాత్ర మరింత కీలకం!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై జర్మన్ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్



దావోస్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్, చైనాల పాత్ర మరింత కీలకంగా మారిందని జర్మన్ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ అన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో ఆమె మాట్లాడుతూ.. అంతర్జాతీయ వాణిజ్య, ఆర్థిక సేవల వ్యవస్థల పునఃపరిశీలనలో ఈ అంశాన్నీ పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, అమెరికా వంటి అగ్రరాజ్యాలు వాణిజ్యంలో అనుసరిస్తున్న రక్షణాత్మక ధోరణులను మెర్కెల్ దుయ్యబట్టారు. ఇతర దేశాలకూ వారి సొంత ప్రయోజనాలుంటాయన్న విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

జీడీపీ.. ఓ ఫ్యాన్సీ నంబర్!

స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) ఓ ఫ్యాన్సీ ఫిగర్ (ఆకర్షణీయ అంకె) మాత్రమేనని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత కమల్ నాథ్ అన్నారు. ఆర్థిక వృద్ధి క్షేత్ర స్థాయి ప్రజల బ్రతుకులనూ మెరుగుపర్చగలగాలని అన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో వర్ధమాన దేశాలపై జరిగిన చర్చా కార్యక్రమంలో కమల్ నాథ్ పాల్గొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం(2019-20)లో భారత జీడీపీ వృద్ధి 7.5 శాతానికి, 2020-21లో 7.7 శాతానికి చేరుకోవచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ అంచనా వేసింది. ఈ అంచనాలను ఉదహరిస్తూ.. జీడీపీ గణాంకాలు కేవలం ఆకర్షణీయ అంకెలేనని, కొన్నిసార్లు భ్రమపెడతాయని కమల్ నాథ్ అన్నారు. 7.5 శాతం వృద్ధితో దూసుకుపోతున్నప్పుడు దాని ఫలాలు ఎంతమందికి అందాయన్న విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో రెండో స్థానం వైపుకు భారత్ పరుగు తీస్తోందని కమల్ నాథ్ అన్నారు.

కార్పొరేట్ కంపెనీల్లో ఎల్‌జీబీటీఐలకు చోటు

స్వలింగ సంపర్కులు, బైసెక్సువల్స్, ట్రాన్స్‌జెండర్, ఇంటర్‌సెక్స్ (ఎల్‌జీబీటీఐ) సమాజానికి చెందిన వారికి కార్పొరేట్ రంగంలో ఉపాధి అవకాశాలు పెంచేందుకు దిగ్గజ సంస్థలు నడుం బిగించాయి. కార్పొరేట్ ఉద్యోగాల్లో వీరి నియామకాలు పెంచేందుకు వీలుగా మైక్రోసాఫ్ట్, మాస్టర్ కార్డులు డబ్ల్యూఈఎఫ్‌తో కలిసి ప్రత్యేకంగా ఓ వేదికను ఏర్పాటు చేశాయి.



కొత్త వ్యాగన్‌ఆర్‌ను విడుదల చేస్తున్న కెనిచి అయుకవా, మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ఎస్ కల్సీ

మార్కెట్లోకి కొత్త వ్యాగన్‌ఆర్

న్యూఢిల్లీ: మారుతి సుజుకీ తన హ్యాచ్‌బ్యాక్ మోడల్ వ్యాగన్‌ఆర్‌లో సరికొత్త వెర్షన్‌ను బుధవారంనాడు మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.4.19 లక్షలు ఉండగా.. గరిష్ఠ ధర రూ.5.69 లక్షల (ఎక్స్‌షోరూమ్) వరకు ఉంది. 1 లీటర్ పెట్రోల్ ఇంజన్ కలిగిన మాన్యువల్ వెర్షన్ల ధర రూ.4.19 లక్షల నుంచి రూ.4.69 లక్షల వరకు ఉండగా.. ఆటోమేటెడ్ గేర్ షిఫ్ట్ ధర రూ.5.16 లక్షలుగా ఉంది. 1.2 లీటర్ వేరియంట్ల ధర రూ.4.89 లక్షల నుంచి రూ.5.69 లక్షల (ఎక్స్‌షోరూమ్) వరకు ఉంది. 1 లీటర్ ఇంజన్ వ్యాగన్‌ఆర్ లీటరు పెట్రోల్‌కు 22.5 కిలో మీటర్లు, 1.2 లీటర్ ఇంజన్ వేరియంట్ లీటరుకు 21.5 కిలో మీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ తెలిపింది. ఈ సరికొత్త వ్యాగన్‌ఆర్ కేవలం కుటుంబాలకే కాకుండా యువతకు, డైనమిక్ కొనుగోలుదారులకు మంచి చాయిస్‌గా ఉంటుందని మారుతి సుజుకీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కెనిచి అయుకవా తెలిపారు. ఈ వ్యాగన్‌ఆర్‌ను సుజుకీ ఐదోతరం హియర్‌టెక్ ప్లాట్‌ఫామ్‌పై అభివృద్ధి చేశామన్నారు. ఇప్పటికే మార్కెట్లో ఉన్న వ్యాగన్‌ఆర్‌కన్నా కొత్త మోడల్ మరింత వెడల్పుగా, పొడవుగా ఉంటుందని చెప్పారు. బూట్‌స్పేస్ 341 లీటర్లకు పెరిగిందని చెప్పారు. ఈ మోడల్‌కు ఇప్పటికే 12,000 బుకింగ్స్ వచ్చినట్టు ఆయన తెలిపారు. ఇప్పటిదాకా 22 లక్షలకు పైగా వ్యాగన్‌ఆర్‌లను మారుతి విక్రయించింది.

పన్నులు తగ్గించాలి: అయుకవా

చాలా దేశాలతో పోల్చితే భారత్‌లో ఆటోమొబైల్స్‌పై పన్ను అధికంగా ఉందని, దీన్ని తగ్గించాలని మారుతి ఎండీ, సీఈఓ కెనిచి అయుకవా కోరారు. పన్నులు తగ్గిస్తే డిమాండు పెరుగుదలకు, పరిశ్రమ అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు.

టీడీఎస్ చెల్లించని కంపెనీలపై చర్యలు

- టీడీఎస్ చెల్లించని కంపెనీలపై చర్యలు

న్యూఢిల్లీ: మూలం వద్ద మినహాయించిన పన్ను (టీడీఎస్)ను డిపాజిట్ చేయని లేదా ఆ మొత్తాన్ని చెల్లించడంలో జాప్యం చేసిన భారీ కంపెనీలపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. టాప్ టెన్ కంపెనీలు చెల్లించాల్సిన మొత్తమే రూ.350 కోట్ల వరకు ఉండటంతో ఐటీ అధికారులు చర్యలను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని కంపెనీలపై ప్రాసిక్యూషన్ చర్యలను ప్రారంభించగా.. కొన్ని కంపెనీలు మాత్రం కేసులను సెటిల్ చేసుకునేందుకు ముందుకు వచ్చినట్టు తెలుస్తోంది. టీడీఎస్ చేసిన కంపెనీలు ఆ మొత్తాన్ని నిర్దేశిత కాలంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు పాటించని కంపెనీలపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. కాగా టీడీఎస్ డీఫాల్ట్ లేదా డిపాజిట్‌లో జాప్యమైన కంపెనీల్లో క్రెస్ట్ లాజిస్టిక్స్ అండ్ ఇంజనీర్స్ అగ్రస్థానంలో ఉంది. ఈ సంస్థ డీఫాల్ట్ మొత్తం రూ.110 కోట్లు ఉంది. హబ్‌టౌన్ రూ.65 కోట్లు, హెచ్ సీసీ రూ.50 కోట్ల చెల్లింపులు చేయాల్సి ఉంది.

కాగా.. టాక్స్ రిటర్నులు ఫైల్ చేయని వారిని గుర్తించే ప్రక్రియను కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) వేగవంతం చేసింది. డేటా ఎనలిటిక్స్‌ను ఉపయోగించి ఇలాంటి వారిని గుర్తిస్తున్నారు. ఏ సంవత్సరానికైతే రిటర్నులు సమర్పించలేదో సంబంధిత రిటర్నులను వెంటనే సమర్పించాలని లేదా 21 రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా స్పందించాలని కోరుతున్నారు. ప్రత్యేకమైన మానిటరింగ్ వ్యవస్థ ద్వారా అధిక విలువ కలిగిన లావాదేవీలు నిర్వహించే వారిని గుర్తిస్తున్నారు.

ఎస్సార్ స్టీల్ కోసం పోటాపోటీ

రూ.54,389 కోట్లు ఇచ్చేందుకు రుయాలు రెడీ

31లోగా తేల్చాలన్న ఎన్‌సీఎల్‌ఏటీ

న్యూఢిల్లీ: ఎస్సార్ స్టీల్‌పై పట్టుకోసం కోసం ప్రమోటర్లు రుయా సోదరులు, ఎల్ఎన్ మిట్టల్ నేతృత్వంలోని అంతర్జాతీయ స్టీల్ దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్ కంపెనీ పోటీపడుతున్నాయి. అప్పులు తీర్చలేక ఎన్‌సీఎల్‌టీకి చేరిన ఈ కంపెనీని చేజిక్కించుకునేందుకు ఆర్సెలార్ మిట్టల్ కంపెనీ సమర్పించిన రూ.42,000 కోట్ల బిడ్‌ను రుణదాతల కమిటీ (సీఓసి) ఇప్పటికే ఆమోదించింది. దీనికి తోడు వ్యాపార అభివృద్ధి కోసం మరో రూ.8,000 కోట్ల నిధులు సమకూరుస్తామని అర్సెలర్ మిట్టల్ గ్రూపు హామీ ఇచ్చింది. అయితే ఆర్సెలార్ మిట్టల్ కంపెనీ కంటే రూ.12,000 కోట్లు ఎక్కువ (రూ.54,389 కోట్లు) చెల్లించేందుకు ప్రమోటర్లు రుయాలు ముందుకొచ్చారు.ఈ మొత్తంతో బ్యాంకుల రుణాలతోపాటు, కంపెనీకి ఇతర సేవలు అందజేసిన కంపెనీలకు చెల్లించాల్సిన బాకీలు కూడా చెల్లించవచ్చని రుయాలు చెబుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రుణదాతలు తమ బిడ్‌ను ఆమోదించేలా చూడాలని ప్రమోటర్లు అహ్మదాబాద్‌లోని ఎన్‌సీఎల్‌టీ బెంచ్‌ను ఆశ్రయించారు. రుణదాతల అప్పులన్నీ చెల్లించడంతో పాటు, కంపెనీ ఆస్తులకు ఎక్కువ మొత్తం ధర రాబట్టడమే దివాలా చట్టం ప్రధాన లక్ష్యమనే విషయాన్ని గుర్తు చేశారు.

మా బిడ్‌నే స్వీకరించాలి

ఎల్ఎన్ మిట్టల్ నాయకత్వంలోని ఆర్సెలార్ మిట్టల్ కంపెనీ మాత్రం నిబంధనలకు అనుగుణంగా దాఖలు చేసిన తమ బిడ్‌నే ఆమోదించాలని నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. రుణదాతలు తమ బిడ్‌ను ఆమోదించాక ఎస్సార్ స్టీల్ ప్రమోటర్లు ఈ ఆఫర్ ప్రకటించడం చెల్లదని ప్రకటించాలని కోరింది. దీంతో ఈ కేసును ఈ నెల 31లోగా పరిష్కరించాలని ఎన్‌సీఎల్ఏటి అహ్మదాబాద్‌లోని ఎన్‌సీఎల్‌టి బెంచ్‌ను కోరింది. లేకపోతే ఫిబ్రవరి 4న తామే దీనిపై ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేసింది.

ఇదిలా ఉంటే.. శర వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత స్టీల్ మార్కెట్‌లో ప్రవేశించేందుకు ఆర్సెలార్ మిట్టల్ గ్రూపు ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. ఇప్పటి వరకు అందుకోసం చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. దీంతో దివాల పరిష్కార ప్రక్రియలో భాగంగా అప్పుల భారంతో ఎన్‌సీఎల్‌టీకి చేరిన ఎస్సార్ స్టీల్ కంపెనీ ఆస్తులపై కన్నేసింది. రుయాలు దాదాపు 30,000 కోట్ల పెట్టుబడితో గుజరాత్‌లోని హజీరా వద్ద కోటి టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.

డీలర్ల విస్తరణపై నిస్సాన్ దృష్టి

హైదరాబాద్ (ఆంధ్ర జ్యోతి బిజినెస్): నిస్సాన్ మోటార్ ఇండియా డీలర్ల నెట్‌వర్క్‌ను రెట్టింపు చేయాలని నిర్ణయించింది. కంపెనీ తాజాగా అభివృద్ధి చేసిన 'నిస్సాన్ కిక్స్' ఎస్‌యూవీని బుధవారం తెలుగు రాష్ట్రాల్లోకి విడుదల చేస్తూ.. కంపెనీ డీలర్ నెట్‌వర్క్ డెవలప్‌మెంట్, కస్టమర్ క్వాలిటీ అండ్ ట్రైనింగ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అతుల్ షహానే విలేకరులతో ఈ విషయం చెప్పారు. 'ప్రస్తుతం కంపెనీకి దేశ వ్యాప్తంగా 272 మంది డీలర్ల నెట్‌వర్క్ ఉంది. వచ్చే నాలుగైదుసంవత్సరాల్లో వీరి సంఖ్యను రెట్టింపు చేస్తాం' అన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ తమ డీలర్ల నెట్‌వర్క్‌ను విస్తరించనున్నట్టు చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంపై ఎక్కువ దృష్టి పెడతామన్నారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఆరు డీలర్లతో పాటు, నాలుగు వర్క్ షాపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సరికొత్త 'నిస్సాన్ కిక్స్' ఆకర్షణీయమైన 11 రంగుల్లో లభిస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో లభించే ఈ కారు ధర రూ.9.55 లక్షల నుంచి ప్రారంభమవుతుందన్నారు.



నిస్సాన్ కిక్స్‌ను మార్కెట్‌లో విడుదల చేస్తున్న కంపెనీ వైస్ ప్రెసిడెంట్ అతుల్ షహానే, వైబ్రెంట్ నిస్సాన్ (హైదరాబాద్) ఎండి సిరాజ్ బాబూఖాన్, లక్ష్మి నిస్సాన్ ఎండి కె జయరాం.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
36,108.47	10,831.50	32,490	39,040	71.33	62.06
336.17	91.25	15	255		

మేలిమి 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

దక్షిణాఫ్రికాలో వేదాంత రూ.11,500 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: లోహాల తవ్వకానికి వేదాంత రిసోర్సెస్ దక్షిణాఫ్రికాలో దాదాపు 160 కోట్ల డాలర్ల (దాదాపు రూ.11,500 కోట్లు) పెట్టుబడులు పెట్టనుంది. ఇప్పటికే దక్షిణాఫ్రికాలో జింక్ వంటి లోహాల తవ్వకానికి 40 కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టినట్టు వేదాంత రిసోర్సెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అనిల్ అగర్వాల్ తెలిపారు. 'గత ఏడాది ప్రధాని మోదీ దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడ 100 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించాం. దాన్ని ఇప్పుడు 160 కోట్ల డాలర్లకు పెంచుతున్నామ'ని అగర్వాల్ అన్నారు. దక్షిణాఫ్రికా ప్రెసిడెంట్ సిరిల్ రామఫోసా భారత పర్యటనకు వచ్చారు. ఆయనతోపాటు వచ్చిన వ్యాపార బృందంలో అగర్వాల్ ఉన్నారు. దక్షిణాఫ్రికాలో లోహాలను తవ్వే సంస్థలు ఉండని, అటువంటి సంస్థలని భారత్‌లో కూడా తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. వేదాంత ఇప్పటి వరకు భారత్‌లో రూ.2.34 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టింది. వచ్చే మూడేళ్లలో మరో రూ.60,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉంది.

30% పెరిగిన రేమండ్ లాభం

న్యూఢిల్లీ: వివిధ వ్యాపారాల్లో ఉన్న రేమండ్ గ్రూప్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.39.95 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదేకాలంతో పోలిస్తే ఇది 30 శాతం ఎక్కువ. ఇదేకాలంలో కంపెనీ ఆదాయం 12.69 శాతం పెరిగి రూ.1,705.68 కోట్లకు చేరింది. ఇందులో రూ.847.73 కోట్ల ఆదాయం వస్త్ర వ్యాపారం ద్వారా సమకూరింది.

ఐటీసీ లాభం రూ.3,209 కోట్లు

కలిసొచ్చిన ఎఫ్‌ఎంసీజీ, వ్యవసాయ వ్యాపారం.. ఆదాయంలో 15% వృద్ధి

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3) ఐటీసీకి బాగానే కలిసొచ్చింది. ఈ కాలంలో కంపెనీ రూ.11,340 కోట్ల ఆదాయంపై రూ.3,209 కోట్ల ఏకీకృత (స్టాండ్ ఎలోన్) నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదేకాలంతో పోలిస్తే ఆదాయం 15.03 శాతం, నికర లాభం 3.84 శాతం పెరిగాయి. క్యూ3లో ఎఫ్‌ఎంసీజీ, అగ్రి బిజినెస్, పేపర్ బోర్డ్స్, పేపర్, ప్యాకేజింగ్ వ్యాపారాలు పుంజుకోవడం కంపెనీకి బాగా కలిసొచ్చింది. గత ఏడాది క్యూ3 ఆదాయంలో రూ.412.90 కోట్ల అసాధారణ ఆదాయం ఉన్నట్టు తెలిపింది. తమిళనాడు ఎంట్రీ టాక్స్ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు అనుకూలంగా రావడంతో ఈ మొత్తం సమకూరింది.

ఎఫ్‌ఎంసీజీ వ్యాపారం

మూడో త్రైమాసికంలో ఎఫ్‌ఎంసీజీ వ్యాపార ఆదాయం బాగా పుంజుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.7,500.97 కోట్లున్న ఈ విభాగం ఆదాయం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో 10.31 శాతం పెరిగి రూ.8,274.36 కోట్లకు చేరింది. ఇదే కాలంలో కంపెనీ సిగరెట్ల విభాగం ఆదాయం 9.59 శాతం పెరిగి రూ.5,073.38 కోట్లకు చేరింది. ఆయా వ్యాపారాల్లో తీవ్ర పోటీ ఉన్నా మార్కెట్ వాటాను కాపాడుకుంటూ కంపెనీ లాభాలు పెంచుకుంది.

ఇతర వ్యాపారాలు

మూడో త్రైమాసికంలో గోధుమ పిండి, చిరుతిళ్లు, బిస్కెట్లు, నూడుల్స్, పాల వ్యాపారం, శీతల పానీయాల వంటి బ్రాండెడ్ ఆహార ఉత్పత్తులతోపాటు అగర్‌బత్తీల వ్యాపారం మంచి వృద్ధి రేటు నమోదు చేశాయి. హోటల్ వ్యాపార విభాగంలోనూ 11.72 శాతం ఆదాయ వృద్ధి రేటు నమోదైంది. అగ్రి బిజినెస్ వ్యాపారంలో అయితే 25.72 శాతం ఆదాయ వృద్ధి రేటు నమోదైంది. కాఫీ, మసాలా ద్రవ్యాలు, రొయ్యల వ్యాపారం పుంజుకోవడం ఇందుకు ప్రధాన కారణం. క్యూ3 ఆర్థిక ఫలితాలు ఆకర్షణీయంగా ఉన్నా బీఎస్ఈలో ఐటీసీ షేరు 4.16% నష్టపోయి రూ.277.70 వద్ద ముగిసింది.

పెరిగిన ఖర్చులు

ఆదాయంతో పాటు క్యూ3లో ఐటీసీ ఖర్చులు 16.75 శాతం పెరిగాయి. 2017-18 ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.6,377.90 కోట్లున్న ఖర్చులు, అక్టోబరు-డిసెంబరు 2018 త్రైమాసికంలో రూ.7,446.46 కోట్లకు చేరాయి.

రూ.25,000 కోట్ల రైట్స్ ఇష్యూ

» వొడాఫోన్ ఐడియా బోర్డు ఆమోదం

న్యూఢిల్లీ: వాటాదారులకు రైట్స్ ఇష్యూ చేయాలని వొడాఫోన్ ఐడియా నిర్ణయించింది. రూ.25,000 కోట్ల రైట్స్ ఇష్యూకు బోర్డు ఆమోదం తెలిపిందని కంపెనీ వెల్లడించింది. నవంబరులో కంపెనీ నిధుల సమీకరణకు కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సిఫారసుల ఆధారంగా రైట్స్ ఇష్యూకురానుంది. 4జీ సేవల విస్తరణ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన స్పెక్ట్రమ్ బకాయిలు తదితరాలకు కంపెనీకి నిధుల అవసరం ఉంది. రైట్స్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను వీటికి వినియోగించే వీలుంది.

తన్లా లాభంలో 177% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి తన్లా సొల్యూషన్స్ ఏకీకృత ప్రాతిపదికన రూ.17 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.3.6 కోట్లతో పోలిస్తే 177 శాతం పెరిగింది. ఇదే త్రైమాసికానికి మొత్తం ఆదాయం 42 శాతం వృద్ధితో రూ.200.4 కోట్ల నుంచి రూ.284.5 కోట్లకు చేరిందని కంపెనీ వెల్లడించింది. షేరుకు ఆర్జన (ఈపీఎస్) 176 పెరిగి 90 పైసలకు చేరింది. 2018 డిసెంబరు చివరి నాటికి కంపెనీ వద్ద నగదు, నగదు సమానమైన నిల్వలు రూ.211 కోట్లు ఉన్నాయి.

ఎయిర్ ఇండియా మాజీ సీఎండీపై సీబీఐ కేసు

» అరవింద్ జాదవ్‌పై అవినీతి ఆరోపణలు

» మరికొందరు అధికారులపైనా కేసు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా మాజీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) అరవింద్ జాదవ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కేసు నమోదు చేసింది. అధికారులకు పదోన్నతుల కల్పించే విషయంలో కాకుండా నియామకాల విషయంలో నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలతో సీబీఐ కేసు నమోదు చేసింది. జాదవ్‌తోపాటు అప్పటి ఎయిర్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (పర్సనల్) ఎల్‌పీ నఖ్వా (ప్రస్తుతం రిటైర్ అయ్యారు), మాజీ అడిషనల్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఏ కట్యాలిదా, అమితాబ్ సింగ్, రోహిత్ బాసిన్ పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో సీబీఐ చేర్చింది. నేరపూరిత కుట్రకు సంబంధించిన ఐపీసీ సెక్షన్‌తోపాటు అవినీతి నిరోధక చట్ట నిబంధనల కింద కేసు నమోదు చేసింది. అధికారులకు పదోన్నతులు కల్పించడానికి గాను 2010 సంవత్సరంలో జాదవ్ ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేశారని, ఆ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్టు సీబీఐ ఆరోపించింది. ఈ ప్యానెల్‌లోని ముగ్గురిలో అప్పటి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గుస్తవ్ బల్లా, అప్పటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్ సోమన్, ఎల్‌పీ నఖ్వా ఉన్నారని పేర్కొంది. మెడికల్ సర్వీసు జనరల్ మేనేజర్‌గా ఉన్న నఖ్వాను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా 2009 ఆగస్టు 31 వరకు పదోన్నతి కల్పించారు. 2009 సెప్టెంబరు 1వ తేదీ నుంచి ఆమె తిరిగి జనరల్ మేనేజర్ బాధ్యతలు నిర్వహించాల్సి ఉండగా.. అందుకు భిన్నంగా ఈ నఖ్వాను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గానే కొనసాగించారు. 2010 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చే విధంగా నఖ్వా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హోదాను జాదవ్ రెగ్యులరైజ్ చేసినట్టు సీబీఐ దర్యాప్తులో తేలింది. ఈమె అక్రమ నియామకాన్ని పౌర విమానయానశాఖ రద్దు చేయడమేకాకుండా పూర్వ స్థానానికి పంపుతూ ఆదేశాలిచ్చింది. కానీ ఆమె ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గానే కొనసాగారు. కాగా నఖ్వాను తక్షణమే జనరల్ మేనేజర్ హోదాకు తిరిగి పంపిస్తూ 2010 సెప్టెంబరు8న ఎయిర్ ఇండియా మానవ వనరుల సబ్ కమిటీ బోర్డు ఆదేశాలు జారీ చేసింది. కాగా నఖ్వా పదోన్నతుల ప్యానెల్‌లో సభ్యురాలిగా ఉండేందుకు అర్హురాలు కాదని తేలినట్టు సీబీఐ పేర్కొంది.

10,800 దిగువన మరింత బలహీనం

టెక్ వ్యూ

నిఫ్టీ బుధవారం పాజిటివ్‌గానే ప్రారంభమైనప్పటికీ 10,900 ఎగువన నిలదొక్కుకోలేక కరెక్షన్‌కు గురైంది. దిద్దుబాటు కొనసాగుతూ 10,800 వరకు వెళ్లి చివరకు ఈ స్థాయి ఎగువన ముగిసింది. ఎగువన నిరోధ స్థాయిల వద్ద కూడా బలహీనతను ప్రదర్శించింది.

గురువారం స్థాయిలివే..

నిరోధం : 10,870 **మద్దతు : 10,800**

- నిఫ్టీ మరింతగా బలహీనపడి తదుపరి ఇంట్రాడే మద్దతు స్థాయి 10,880కన్నా దిగువన ట్రేడవుతూ ఉంటే మరింత బలహీనతకు సంకేతం.
- దిగువ స్థాయిలో 10,700 వద్ద ప్రధాన మద్దతు లభిస్తుంది.
- తక్షణ అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ ఇక్కడ తప్పనిసరిగా రికవరీ కావాలి.
- నిఫ్టీ రికవరీ సాధిస్తే ఇంట్రాడే నిరోధం 10,870, 10,940గా ఉంటుంది.
- పాజిటివ్ ట్రెండ్ కోసం ఈ నిరోధాల ఎగువన మార్కెట్ ముగియాలి.

■ వి.సుందర్ రాజా

ఉదయం సెషన్ మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : పుష్య బహుళ చతుర్థి

నక్షత్రం : పుబ్బ

మృగశిర, చిత్త, ధనిష్ఠ నక్షత్ర జాతకులు, కన్య, మకర రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10831.50 (-91.25)

ట్రెండ్ మార్పు వేళలు : 9.55; 11.10; 12.54; 1.57

ధోరణి: నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 10.35 వరకు అదే ట్రెండ్‌తో కొనసాగవచ్చు. తర్వాత 12.10 వరకు మెరుగ్గా ట్రేడుకావచ్చు. తర్వాత మళ్లీ 12.15 నుంచి నిస్తేజంగా మారి 2 గంటల వరకు కొనసాగి ముగింపు వరకు నిలకడగా/మెరుగ్గా ఉండవచ్చు.

ట్రేడింగ్ వ్యూహం: నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఏటిపి) కన్నా మెరుగ్గా ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 10.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఒకవేళ నిఫ్టీ ఫ్యూచర్స్ 10.45 సమయానికి ఏటీపీకన్నా ఎగువన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లు తీసుకుని12.15 వరకు క్లోజ్ చేసుకోవచ్చు. 12.30 సమయానికి నిఫ్టీ ఫ్యూచర్స్ ఏటీపీకన్నా దిగువన ట్రేడవుతూఉంటే షార్ట్ పొజిషన్లు తీసుకుని 2గంటల వరకు ముగించుకోవచ్చు.

నిరోధం : 10870, 10905

మద్దతు స్థాయిలు : 10790, 10755

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి

www.thefinancialastrologer.blogspot.in

80 శాతం పెరిగిన విజయా బ్యాంక్ లాభం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని విజయా బ్యాంక్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.143.38 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదేకాలంతో పోలిస్తే ఇది 80.2 శాతం ఎక్కువ. ఇదేకాలంలో బ్యాంక్ స్థూల ఆదాయం రూ.3,450.81 కోట్ల నుంచి రూ.4,106.42 కోట్లకు చేరింది. గత ఏడాది మూడో త్రైమాసికంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో బ్యాంక్ స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏ) 6.17 శాతం నుంచి 6.14 శాతానికి తగ్గాయి. అయితే ఇదే సమయంలో నికర ఎన్‌పీఏలు మాత్రం 3.99 శాతం నుంచి 4.08 శాతానికి పెరిగాయి. విజయా బ్యాంక్‌కు ఇవే ఆఖరి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు. ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి విజయా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం కాబోతోంది.

ఇండిగో లాభాలకు గండి

» మూడో త్రైమాసికంలో 75% క్షీణత

న్యూఢిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో ఇండిగో విమానయాన సంస్థ మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లాభాలకు గండిపడింది. గత ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో రూ.762 కోట్లున్న కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో 75 శాతం క్షీణించి రూ.190.9 కోట్లకు పడిపోయింది. విమాన ఇంధన ధరలు, డాలర్‌తో రూపాయి మారకం క్షీణించడం క్యూ3లో లాభాలను బాగా దెబ్బతీశాయని కంపెనీ పేర్కొంది. ఇదే సమయంలో కంపెనీ స్థూల ఆదాయం 28 శాతం వృద్ధి రేటుతో రూ.8,229.4 కోట్లకు చేరింది. 'మూడో త్రైమాసికంలో మార్కెట్ పరిస్థితులు ఏ మాత్రం అనుకూలంగా లేవు. అయినా విమానాల సంఖ్య, ప్రయాణికుల సంఖ్య పెంచుకోవడం ద్వారా రూ.190 కోట్ల నికర లాభం నమోదు చేశాం' అని కంపెనీ సీఈఓ రాహుల్ భాటియా తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన నష్టాలు

రెండు రోజుల్లో ఇన్వెస్టర్లకు రూ.1.10 లక్షల కోట్ల నష్టం



ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిసింది. ట్రేడింగ్ చివర్లో అమ్మకాలు హోరెత్తడంతో 336.17 పాయింట్ల నష్టంతో సెన్సెక్స్ 36,108.75 వద్ద, 91.25 పాయింట్ల నష్టంతో నిఫ్టీ 10,831.50 వద్ద క్లోజయ్యాయి. రెండు రోజుల నష్టాలతో ఇన్వెస్టర్లు రూ.1.10 లక్షల కోట్లు నష్టపోయారు. బుధవారం ఉదయం రెండు ప్రధాన సూచీలూ లాభాలతోనే ప్రారంభమయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 36,521.47 పాయింట్ల గరిష్ఠ స్థాయికి, నిఫ్టీ 10,944.75 పాయింట్ల గరిష్ఠ స్థాయికి చేరాయి. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధానికి ఇప్పట్లో తెర పడే సూచనలు లేవన్న వార్తలతో ట్రేడింగ్ చివర్లో అమ్మకాల ఒత్తిడి పెరిగి ప్రధాన సూచీలు రెండూ నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ సెక్టోరియల్ ఇండెక్స్‌ల్లో ఎఫ్‌ఎంసీజీ ఇండెక్స్ అత్యధికంగా నష్టపోయింది. పవర్, ఐటీ, పీఎస్‌యూ, ఇన్‌ఫ్రా, ఆటో, బ్యాంకెక్స్, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్‌లూ నష్టాల బాట పట్టాయి. మంగళవారం తీవ్రంగా నష్టపోయిన మెటల్ ఇండెక్స్ బుధవారం అత్యధికంగా లాభపడింది. సెన్సెక్స్ షేర్లలో సన్‌ఫార్మా షేర్లు వరుసగా రెండో రోజూ లాభాల బాట పట్టాయి. బుధవారం ఈ కంపెనీ షేరు మరో 3.04 శాతం లాభంతో రూ.430.75 దగ్గర క్లోజయింది. యస్ బ్యాంక్, టాటా స్టీల్, హెచ్‌యూఎల్, బజాజ్ ఫైనాన్స్, వేదాంత, హెచ్‌సీఎల్ టెక్, ఎల్ అండ్ టీ కంపెనీల షేర్లూ స్వల్పంగా లాభపడ్డాయి. క్యూ3లో నికర లాభం 3.84 శాతమే పెరగడంతో సెన్సెక్స్ షేర్లలో ఐటీసీ షేర్లు అత్యధికంగా 4.16 శాతం నష్ట పోయాయి. పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, ఇన్ఫోసిస్, ఎం అండ్ ఎం కంపెనీల షేర్లూ అమ్మకాల ఒత్తిడితో 1.85 శాతం వరకు నష్టపోయాయి. మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఆశించిన విధంగా లేకపోవంతో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ కంపెనీ షేరు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయింది. బుధవారం ఈ కంపెనీ షేరు బీఎస్ఈలో 11.143 శాతం నష్టంతో రూ.305.70 వద్ద ముగిసింది.

బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)


ACI INFOCOM .63(.64)1010
ADITYA SPIN. 5.42(5.7)520
AGRO TECH FO 598.3(598.75)264
AISHWARYA TE 3.14(3.02)2400
ALPHAGEO (I) 452.35(461.45)1164
ALU FLUORIDE 115.55(117.9)4970
AMAR RAJA BA 781.25(779.9)7911
ANDHRA BANK 27.2(27.8)27642
ANDHRA CEMEN 5.08(5.28)6268
ANDHRA PETRO 62.25(62)52215
ANJANI PORTL 123(125)35
ASTRA MICRO 80.6(79.3)17502
AUROB.PHARMA 782.05(788.25)55404
AVANTEL LTD 223.5(230.6)959
AVANTI FEEDS 362.55(367.8)19654
B.N.RATHI SE 26(25.3)1
BALAJI AMINE 492.5(499.5)330
BAMBINO AGRO 184(183.8)281
BARTRONICSIN 6.71(7.09)6612
BCG 3(3.05)25141
BHAGIRA.CHEM 438.95(441.65)80
BHAGYA INL 35.85(35.05)250
BHARATFIN 949.1(954.35)9437
BNR UDYOG 17.68(17.34)10
CAMBRIDGE 45.3(45.75)14
CAT TECHN. .61(.63)3050
CCHHL 7.88(7.34)1051
CCL PRODUCTS 272.1(273.4)958
CELESTIAL 7.56(7.66)4777
CIL SECURITS 15.45(16)649
COROM INTER 435.2(432.4)6754
CUBEX TUBING 14.95(14.37)1437
CYBERMATE 1.9(1.91)12583
CYIENT 598.4(591.45)9488
DANLAW TECH. 98.9(95)1018
DIAMONPOWER 1.44(1.42)6207
DIVI'S LAB. 1503.7(1502.4)10891
DIVYA.GRANIT 103.9(100)4034
DQ ENT 7.69(7.55)431
DR.REDDY'S 2645.5(2640)41746
EMPEE SUGARS 1.41(1.48)200
EVEREST ORG. 125.2(122.9)1759
FACOR ALLOYS 2.1(2.02)48022
FIRSTOBJ 9.16(9.1)6
FOURTH GEN. 2.25(2.16)303
GATI LTD. 77.4(78.9)26713
GAYATRI PROJ 168.85(170.55)573
GENNEX LAB 3.57(3.57)37602
GMR INFRASTR 16.15(16.15)1050135
GODAVARI DRU 21.2(21.2)2592
GOLDSTONE EN 14.25(14.65)3682
GRANULES (I) 93.2(86.65)131863
GVK POWERINF 6.96(7.04)206129
HBL P SYS 26.9(27)14086
HERITGFOOD 519.05(525.9)531
INCAP LTD. 37(36.15)218
IPAPPM 443.15(442.45)1061
IVRCL LTD .98(.99)77511
KAKATIYA CEM 192.05(194.1)3407
KALLAM 17.65(17.85)6501
KAVERI SEED 555.75(557.05)15828
KCP LTD 86.8(87.05)2089
KERNEX MICRO 26.45(25.95)3384
KNR CONST 210.9(213.15)3791
KREBS BIOCHM 112.85(122.95)1263
LOKESH MACH 44.8(43.75)373
LOTUS CHOC 22.15(23.1)2175
MOLD-TEK TEC 52(53.7)4053
MOSCHIP SEMI 21.55(22.9)49989
MSR INDIA 10.57(10.17)13811
N C L IND. 126.55(126.15)5940
NACLIND 27.1(26.55)10978
NATCO PHARM 685.2(689.4)5735
NCC 85.45(86.25)335208
NEHA INTER. 4.3(4.35)2305
NETTLINX LTD 46.95(49.4)6463
NEULAND LAB. 500.35(522.9)1146
NIHAR INFO 11.98(12.6)2326
NILE LTD. 354(350.55)3744
OIL COUNTRY 14.2(14.6)4366
OLECTRA 234.25(237)3865
PADMALAYA TE 2.23(2.34)234
PALRED 38.55(38.75)328
PANYAM CEMEN 12.27(12.58)13530
PENNAR STEEL 37.4(37.15)9433
PHYTOCHEM I. 41.75(42.8)2725
PITTIENG 55.2(58.9)23847
POKARNA LTD 168.95(173.3)1274
PRAJAY ENGS. 8.25(8.34)1125
PREMIER EXPL 265.15(231.55)50160
PRSMJOHNSN 80.9(81.2)14100
RAIN 119.6(120)37351
RAJ PACKAGIN 27.05(29)1100
RESTILE CER. 3.9(4.09)21295
SAGAR CEM. 632(642.65)102
SAMKRG PIST. 187.3(187.4)504
SANGHI IND. 59(58.95)1250
SAVEN TECHNO 27.5(27.6)13908
SIBAR AUTO 29.5(29.5)1
SMPL .37(.38)2600
SMS PHARMACE 72.3(72.95)3066
SREE RAYALA 152.25(152.2)2082
STEEL EXCH 13.75(13)4683
SURANATP 4.39(4.45)6500
SURYACHAKRA .29(.29)15944
SURYAVA SPIN 5.44(5.72)50
SURYLAK.COTT 40.2(41.45)100
SUVEN LIFE S 204.1(210.9)34637
TAJ GVK HOTL 181.45(172.55)20761
TANLA 29.9(30)21646
TCI INDUS. 870(829.95)610
TRANSCORP IN 25.5(25.2)2493
TRANSGENE BI 5.92(5.97)1127913
TRANSPORT CO 290.7(290.2)3632
USHER AGRO 2.5(2.45)37500
VICEROY HOTE 3.99(4.2)15399
VIJAY TEXTIL 40.8(40)11000
VIMTA LABS 274.65(273.45)2015
VIRINCHI 79.65(78.75)5396
VISAKA IND. 412.15(420.35)729
VISTA PHARMA 27.95(28.3)3045
VIVIMED LABS 25.65(24.65)243583
WATERBASE 156(158.25)22114
ZEN TECH 85(81.95)45214
ZENOTECH 32.1(33)8279

ఎన్ఎస్ఈ-500 (NSE)

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 608.1(603.95)5450
AARTIIND 1536.6(1557.85)39205
ABAN 70.6(71.45)228456
ABB 1293.2(1309.15)24267
ABFRL 204.1(203)866526
ABGSHIP 1.9(1.95)33457
ACC 1429.85(1436.35)314654
ADANIENT 143(145.7)2322990
ADANIPORTS 385.2(390.6)3653992
ADANIPOWER 51.75(51.3)10104731
ADANITRANS 207.6(209.15)382575
AEGISCHEM 197.35(198)87375
AHLUCONT 295.55(299.15)3024
AIAENG 1639.4(1664.95)25301
AJANTPHARM 1165.4(1166.45)399472
AKZOINDIA 1739.65(1726.6)3172
ALBK 42.05(42.45)2156793
ALLCARGO 109.65(110.85)84044
ALOKTEXT 3.85(3.85)1085024
AMARAJABAT 782.45(781.3)283071
AMBUJACEM 212.4(213.85)979376
ANANTRAJ 34.25(34.3)218571
ANDHRABANK 27.05(27.6)685900
APARINDS 620.2(615.1)1417
APLLTD 589.25(590.2)40984
APOLLOHOSP 1293.85(1293.8)671259
APOLLOTYRE 218.4(219)995406
ARVIND 91.1(91.05)1112156
ASHIANA 114.15(113.15)26659
ASHOKA 123.55(124.6)61953
ASHOKLEY 89.15(87.95)13463017
ASIANPAINT 1396.55(1406.95)2702265
ASTRAL 1058.25(1044.75)186190
ASTRAZEN 1653.1(1610.55)10698
ATUL 3536.4(3474.55)16469
AUROPHARMA 783.1(788.95)1819565
AXISBANK 661.6(661.6)7596006
BAJAJ-AUTO 2674.1(2688.35)205104
BAJAJCON 356.5(351.9)58790
BAJAJELEC 464(468.65)82875
BAJAJFINSV 6493.15(6435.55)187445
BAJAJHIND 8.8(8.85)1021724
BAJAJHLDNG 2966.65(2956.95)17908
BALKRISIND 864.45(859.65)422674
BALLARPUR 4.05(4.3)913078
BALMLAWRIE 189(189.95)28859
BALRAMCHIN 105.55(107.05)1040278
BANKBARODA 111.3(113.8)10399387
BANKINDIA 97.1(97.85)5267979
BASF 1470.15(1523.35)59730
BATAINDIA 1160.95(1147.75)841527
BBTC 1208(1221.1)1024207
BEML 883.3(878.25)1446255
BERGEPAINT 320.25(322.55)587054
BFUTILITIE 205.95(204.85)243230
BGRENERGY 56.5(56.55)24197
BHARATFIN 951.3(953.9)308514
BHARATFORG 490.1(486)1999764
BHARTIARTL 303.7(304.85)5063257
BHEL 69.35(71.2)5371992
BIOCON 670.65(668.6)2429064
BIRLACORPN 531.15(532.4)48421
BLISSGVS 159.5(161.3)620144
BLUEDART 3062.8(3103)1341
BLUESTARCO 608.25(614.8)8999
BOMDYEING 118.25(117.2)516396
BOSCHLTD 19090.15(19208.35)5495
BPCL 357.15(353.8)1986513
BRFL 8.7(8.6)94255
BRIGADE 210.95(206.4)162538
CADILAHC 342.05(346.05)573513
CANBK 260.45(263.45)3650554
CARERATING 985.15(987.65)18359
CASTEXTECH 1.1(1.05)590266
CASTROLIND 164.05(166)1819735
CCL 272.15(272.3)12383
CEATLTD 1219.5(1219.35)288428
CENTRALBK 32.75(32.25)309587
CENTURYPLY 170.7(170.75)91892
CENTURYTEX 885.9(877.1)395664
CERA 2568.35(2558.75)3913
CESC 679.1(682.2)242466
CHAMBLFERT 164.25(162.05)106390
CHENNPETRO 260.15(261.7)228317
CHOLAFIN 1144.95(1139.2)285217
CIPLA 509.3(507.1)1358623
CLNINDIA 400.55(402.85)5371
COALINDIA 225.55(227.75)2328748
COLPAL 1307.25(1306.55)474354
COROMANDEL 434.2(436.45)37834
CORPBANK 27.4(27.05)114861
COX&KINGS 157.6(157.85)24767
CRISIL 1646.45(1660.85)3488
CUB 186.95(190)382549
CUMMINSIND 821.65(829.1)181791
CYIENT 597.9(592.15)422032
DABUR 430.65(433.35)1537391
DBCORP 180.3(179.8)409303
DBREALTY 26.7(25.45)58449
DCBBANK 179.85(179.85)1245023
DCMSHRIRAM 333.55(336.5)30038
DEEPAKFERT 112.55(118.85)1423396
DELTACORP 237.85(234.7)1003949
DEN 71.1(69.95)439789
DENABANK 12.9(13.05)784881
DHANUKA 410.35(408.95)8547
DHFL 209.6(205.3)6409510
DISHTV 33.65(34.3)10217326
DIVISLAB 1503.3(1503.65)302963
DLF 177.25(180.05)4567262
DREDGECORP 429.1(408.05)1237293
DRREDDY 2646.75(2640.3)754526
DYNAMATECH 1450.3(1472.85)768
ECLERX 1065.45(1065.55)4544
EDELWEISS 160.55(162.7)448120
EICHERMOT 20089.15(20023.6)53595
EIDPARRY 203.35(203.15)182918
EIHOTEL 179.5(180.35)33152
ELECTCAST 21.25(21.3)77157
ELGIEQUIP 250.2(250.45)43099
EMAMILTD 417.9(423.95)737527
ENGINERSIN 116.8(117.85)825011
EROSMEDIA 81.65(80.15)252575
ESCORTS 730.4(720.8)1219553
ESSDEE 15.6(16.1)9710
ESSELPACK 116.7(114.35)292846
EVEREADY 218.25(219.85)128292
EXIDEIND 241.1(244.6)1452905
FCONSUMER 40.5(41.2)1018950
FDC 165.85(170.95)68275
FEDERALBNK 88.5(89.5)10623427
FINCABLES 424.7(435.7)35094
FINPIPE 530.35(533.25)29640
FLFL 420.9(418.5)33329
FORTIS 135.5(135.85)1090339
FSL 49.15(49.35)883488
GAIL 334.2(332.9)3063229
GATI 77.65(78.9)213692
GDL 105.9(107.6)46450
GEPIL 810.3(819.95)1557
GESHIP 290.7(297.9)49117
GET&D 305.75(310.75)14521
GILLETTE 6493.65(6504.55)2312
GLAXO 1408.85(1425.1)11710
GLENMARK 649.4(656.95)429188
GLOBOFFS 13.1(12.85)19293
GMDCLTD 84.45(84.85)65570
GMRINFRA 16.15(16.15)10288798
GODFRYPHLP 955.75(958.6)373785
GODREJCP 789.8(792.85)499882
GODREJIND 526(525.05)191069
GODREJPROP 715.3(733.85)88097
GPPL 87.65(86.75)37942
GRANULES 93.3(86.95)2802897
GREAVESCOT 119.4(119.9)85485
GREENPLY 137.3(136.2)27130
GRINDWELL 568.6(560)17805
GRUH 226.45(222.6)2265502
GSFC 105.9(108)1199995
GSKCONS 7268.45(7210.35)38055
GSPL 180(179.35)107116
GUJFLUORO 884(882.75)13520
GULFOILLUB 852.05(859.15)3281
GVKPIL 6.9(7.05)1053712
HATHWAY 31.75(30.85)61261907
HAVELLS 696.2(711.85)2677472
HCC 13.3(13.3)3558184
HCL-INSYS 21.8(22.3)509993
HCLTECH 944.45(940.75)2820793
HDFC 1958.25(1979.4)2201110
HDFCBANK 2105.4(2135.85)1906072
HDIL 26.95(26.2)3633985
HEIDELBERG 148.65(151.3)56691
HEROMOTOCO 2795.95(2824.9)326454
HEXAWARE 333.1(331.6)1018253
HFCL 22.45(21.8)2876326
HIMATSEIDE 213.65(211.95)27839
HINDALCO 205.45(203.55)5821081
HINDCOPPER 47.95(47.9)474316
HINDPETRO 241.85(242)3325871
HINDUNILVR 1767.2(1750.2)2321782
HINDZINC 259.4(260.25)537622
HMT 17.5(17.7)2535
HMVL 122.5(124.95)10667
HONAUT 22154.2(22115.55)357
HOTELEELA 14.8(14.75)90422
HSIL 228.05(234.45)90019
HTMEDIA 42.25(42.35)63845
IBREALEST 83.35(77.9)3090391
IBULHSGFIN 778.7(797.35)3406301
ICICIBANK 367.4(369.05)9726450
ICRA 3128.5(3136.6)366
IDBI 56.6(57.1)2465183
IDEA 33.9(33.5)12749248
IDFC 42.5(42.4)1807858
IFBIND 838.3(830.45)2358
IFCI 14.05(14.15)1688990
IGARASHI 536.55(534.2)4982
IIFL 428(442.5)55663
IL&FSTRANS 9.8(9.35)1689553
INDHOTEL 137.5(137)498158
INDIACEM 84(84.4)2414039
INDIANB 248.5(248.45)733176
INDOCO 207.5(210.35)337634
INDUSINDBK 1495(1501.6)1441440
INEOSSTYRO 672.2(676.3)3051
INFRATEL 277(277.65)4888651
INFY 731.65(745.35)7212099
INGERRAND 592.35(587.2)7246
INOXLEISUR 248.05(250.4)30103
INOXWIND 72.35(71.3)133230
INTELLECT 210.7(211.45)188065
IOB 14(14)355999
IOC 136.1(135.95)5367900
IPAPPM 443.95(443.95)15127
IPCALAB 781.75(772.85)28985
IRB 147.2(149.5)700595
ITC 277.3(289.75)40188183
J&KBANK 38.7(38.75)1097160
JAGRAN 110(110.4)43044
JAICORPLTD 108(107.95)590516
JBCHEPHARM 319.55(309.9)52555
JBFIND 20.65(21.35)26791
JCHAC 1769.65(1764.85)542
JETAIRWAYS 265.5(272.35)8345379
JINDALPOLY 249.7(248.75)14070
JINDALSTEL 139.5(137.75)11850565
JISLJALEQS 60.85(61.45)6554646
JKCEMENT 712.6(719.85)12058
JKIL 118.1(118.25)132898
JKLAKSHMI 296(296.15)12634
JKTYRE 97(98.15)223387
JMFINANCIL 83(84.85)902904
JPASSOCIAT 6.95(7.05)18269285
JPINFRATEC 3.35(3.2)665134
JPPOWER 1.95(1.9)2175641
JSWENERGY 68.55(68.8)886258
JSWHL 2485.1(2464.4)1255
JUBILANT 757.2(734.5)733236
JUBLFOOD 1173.25(1167.15)1423184
JUSTDIAL 484.4(481.4)1723892
JYOTHYLAB 191.55(194.55)82360
KALPATPOWR 379.5(375.1)30488
KANSAINER 447.7(456.25)42666
KEC 259.6(265.7)210862
KESORAMIND 81.2(79.25)304485
KIRLOSENG 182.65(186.2)20256
KITEX 107(107.3)21908
KOLTEPATIL 253.45(256.8)54992
KOTAKBANK 1276.5(1291.75)3258582
KPIT 216.65(216.55)4358444
KRBL 361.95(364.45)258124
KSCL 554.65(557.2)243244
KSK 1.45(1.4)790479
KTKBANK 118.5(118.45)892349
KWALITY 7.2(6.9)1107085
L&TFH 136.6(137)4333336
LAKSHVILAS 70.05(70.25)611580
LAOPALA 216.3(216.85)3168
LAXMIMACH 5518.35(5453.15)1721
LICHSGFIN 466.95(475.2)1353505
LT 1301.45(1301.15)1821323
LUPIN 864.6(865.45)837289
M&M 695.85(708.5)4714919
M&MFIN 434.7(436.7)506951
MAGMA 105.2(105.45)24788
MAHINDCIE 231.4(230.35)149933
MAHLIFE 410.85(411.65)16858
MANAPPURAM 97.9(98.95)2425359
MANPASAND 81.7(82.75)107934
MARICO 376.55(375.55)720808
MARKSANS 27.05(26.8)789931
MARUTI 7045.4(7068.85)702474
MAYURUNIQ 384.55(393.7)8953
MCLEODRUSS 104.3(106.35)62192
MERCK 3304.25(3323.7)9028
MHRIL 206.5(209.7)71479
MINDACORP 144.9(143.85)31046
MINDTREE 906.55(921.1)6485855
MMTC 28.05(28)600213
MOIL 160.9(162.15)57394
MONSANTO 2553.3(2555.15)937
MOTHERSUMI 157.55(162.55)3223449
MOTILALOFS 664.15(674.8)145775
MPHASIS 897.95(871.2)442978
MRF 66072.05(65259.6)3086
MRPL 69.15(69.05)980770
MTNL 14.8(14.7)938968
MUTHOOTFIN 541.7(542.4)679777
NATCOPHARM 688.85(689.85)100863
NATIONALUM 61.7(60.7)4655030
NAUKRI 1729.05(1632.15)465772
NAVKARCORP 46.2(46.45)106634
NCC 85.35(86.15)2983061
NETWORK18 37.85(37.2)176243
NHPC 25.25(25.4)4516414
NIITTECH 1274.95(1295.35)737956
NITINFIRE 1.55(1.6)74907
NLCINDIA 68(68)96402
NMDC 89.9(90.55)1686889
NTPC 140.75(142.8)4436294
OBEROIRLTY 440.2(447.75)393172
OFSS 3769.65(3684.8)48774
OIL 170.05(170.5)816310
OMAXE 213.5(213.5)223299
ONGC 143.3(144.35)4946218
ORIENTBANK 92.55(93.7)2742588
ORIENTCEM 74.85(74.4)35167
ORISSAMINE 851.55(859.4)10479
PAGEIND 22808.85(22590.55)37842
PARSVNATH 7(7)75297
PCJEWELLER 78.25(76.5)14665269
PEL 2357.85(2339.15)436540
PERSISTENT 544.7(544.85)365389
PETRONET 226.8(222.95)1997980
PFC 101.95(101.05)6581006
PFIZER 2662.65(2706.55)15777
PFS 16.5(16.65)243799
PGHH 9914.85(9987.95)838
PHOENIXLTD 603.8(599.05)17999
PIDILITIND 1131.45(1152.8)544213
PIIND 868.3(863.5)106858
PNB 77.75(78.6)12687561
POWERGRID 186.3(189.7)3472589
PRAJIND 134.65(132.7)6944441
PRESTIGE 213.15(214.35)583489
PRSMJOHNSN 80.8(81.45)63366
PTC 84.65(84.45)903606
PUNJLLOYD 3.5(3.65)2931799
PURVA 74.6(74.2)39581
PVR 1607.2(1598.65)307882
RADICO 421.5(413.25)2652760
RAIN 120.05(120.1)293420
RAJESHEXPO 582.35(584.25)394733
RALLIS 165.4(167.45)148067
RAMCOCEM 600.95(602.1)547065
RAMCOSYS 245.6(249.75)11550
RATNAMANI 894.3(908.15)83066
RAYMOND 813.9(812.85)2573606
RCF 62.7(63.1)531200
RCOM 12.95(13.35)59736285
RECLTD 120.95(122.95)5113723
REDINGTON 77.8(78.85)67777
RELAXO 736.35(742.3)30667
RELCAPITAL 208.9(206.9)5144947
RELIANCE 1226.3(1235.15)8829502
RELINFRA 281.75(279.3)4789882
RENUKA 10.65(10.75)225556
REPCOHOME 409.1(430.2)456089
RIIL 330.35(332.85)154009
RKFORGE 490(490.05)9883
RNAVAL 12.65(12.85)906026
ROLTA 6.95(7.3)1375007
RPOWER 28.1(28.15)3888323
RTNPOWER 3.65(3.65)6332199
RUCHISOYA 7.15(6.95)408394
SADBHAV 199.6(202.05)351031
SADBHIN 94.3(93.25)2476
SAIL 48.55(48.25)8867064
SANOFI 6403.3(6408.5)1218
SBIN 286.65(290.25)10304608
SCHAEFFLER 5411.25(5457.5)3780
SCHNEIDER 92.9(93.65)22801
SCI 43.05(42.25)398529
SHARDACROP 300(306.45)155197
SHILPAMED 398.4(399.35)6942
SHK 171.65(172.25)21080
SHOPERSTOP 518.15(519.3)12653
SHREECEM 16103.35(15917.55)50789
SHRIRAMCIT 1752.2(1767.55)1458
SIEMENS 1045(1049.5)183900
SIMPLEXINF 173.3(169.25)19011
SINTEX 11.25(11.1)750015
SITINET 9(9.2)55236
SJVN 25.8(25.8)244484
SKFINDIA 1924.85(1927.4)9621
SMLISUZU 615.65(621)3799
SNOWMAN 33.2(33.9)64682
SOBHA 503.1(504.8)98767
SOMANYCERA 353.65(368.3)32503
SONATSOFTW 321.35(316.85)190118
SOUTHBANK 13.95(14.1)10168856
SPARC 172.7(176.8)4266008
SREINFRA 32.25(32.95)4748555
SRF 2059.55(2073.2)203277
SRTRANSFIN 1088.05(1096.15)1240765
STAR 531.5(548.3)2603393
STCINDIA 123.4(122.45)249325
SUNDARMFIN 1469.75(1471.9)4393
SUNDRMFAST 522.25(521.1)60249
SUNPHARMA 431(418.95)26921274
SUNTV 529.45(519.25)3412724
SUPREMEIND 1066(1049.8)112573
SUVEN 203.75(210.85)195547
SUZLON 5.15(5.2)11668259
SWANENERGY 98(98.15)191067
SYMPHONY 1220.1(1156)95520
SYNDIBANK 35.75(36.9)4685680
SYNGENE 579.4(577.55)361607
TAKE 156.6(158.9)125438
TATACHEM 681.25(688.25)270584
TATACOFFEE 92.5(92.15)156135
TATACOMM 515.15(515.85)172391
TATAELXSI 966.8(967.85)349506
TATAGLOBAL 210.6(212.1)937183
TATAMOTORS 180.25(180.85)9778926
TATAMTRDVR 95.55(95.6)2884877
TATAPOWER 75.2(76.35)5394325
TATASPONGE 735.05(742.5)57943
TATASTEEL 464.6(456.55)7259386
TATASTLBSL 34.05(33.6)403797
TBZ 63.35(63.05)116020
TCS 1875.6(1901.9)2578169
TECHM 720.7(714.2)1965283
TEXRAIL 56.2(56.7)173289
THERMAX 1090.8(1097.95)7943
THOMASCOOK 221.6(220.8)80982
TIDEWATER 5237.75(5189.75)512
TIMKEN 560.7(560.1)4087
TITAN 962.15(982.65)1574247
TNPL 229(230.05)46717
TORNTPHARM 1909.2(1917.65)113438
TORNTPOWER 262.75(256.95)2403131
TREEHOUSE 4.55(4.5)9528
TRIDENT 68.95(70.05)468408
TRITURBINE 112.45(113.8)443167
TTKPRESTIG 8050.5(7660)16558
TTML 3.9(3.95)423408
TV18BRDCST 34.5(34.25)8377724
TVSMOTOR 531.55(554.2)4608503
TVSSRICHAK 2393(2368.75)1017
TVTODAY 362.55(364.7)7777
UBL 1444.9(1459.4)415921
UCOBANK 19.85(19.55)371440
UFLEX 260.55(260.45)57669
ULTRACEMCO 3850.65(3860.5)171340
UNICHEMLAB 206.95(210.1)18684
UNIONBANK 82.75(83.95)7830565
UNITECH 1.8(1.85)3690184
UPL 762.85(763.3)2336913
VAIBHAVGBL 705.05(707.65)2280
VAKRANGEE 47.05(45.6)19525991
VEDL 192.8(191.5)7523951
VIDEOIND 2.9(2.95)104951
VIJAYABANK 44.45(45.35)4565076
VINATIORGA 1589.9(1602.25)6649
VIPIND 490.25(493.05)167750
VOLTAS 532.75(540.15)424146
VRLLOG 270.75(272.65)14417
VSTIND 3167.15(3146.95)22326
VTL 1081.05(1073.25)5621
WABAG 294.65(289.35)581054
WABCOINDIA 6326.5(6352.35)1404
WELCORP 114.85(116.15)318756
WELSPUNIND 59.35(58.95)398605
WHIRLPOOL 1460.6(1467.15)14516
WIPRO 351.55(346.5)9937426
WOCKPHARMA 492.25(494.95)666872
WONDERLA 274.9(275.25)27775
ZEEL 432.85(425.25)12987032
ZEELEARN 34.7(35.1)50134
ZYDUSWELL 1274.5(1260.45)2562

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	33,440	33,200	33,430	33,100	32,440
క్రితం ముగింపు	33,360	33,100	33,460	33,000	32,430
22 క్యారెట్లు	30,970	30,800	30,750	30,670	30,970
క్రితం ముగింపు	30,890	30,700	30,780	30,520	30,960
వెండి (కిలో)	40,000	40,300	40,000	40,000	42,500
క్రితం ముగింపు	39,800	40,000	39,900	39,800	42,200

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60 **నెక్ (100 గుడ్లు)**



హైదరాబాద్	400	చిత్తూరు	423
వరంగల్	402	చెన్నై	430
విజయవాడ	417	నమక్కల్	415
గోదావరి	417	బెంగళూరు	415
విశాఖపట్నం	417	ముంబై	455

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	77	విజయవాడ	78
కరీంనగర్	78	గుంటూరు	79
వరంగల్	77	ఒంగోలు	80
మహబూబ్‌నగర్	77	చిత్తూరు	88
కర్నూలు	77	నెల్లూరు	88
విశాఖపట్నం	75	అనంతపురం	86
గోదావరి	76		



1969లో కాంగ్రెస్ చీలిక తరువాత దేశ రాజకీయాలపై నెహ్రూ గాంధీ కుటుంబ ముద్ర మరింత ఎక్కువయ్యింది. కాంగ్రెస్ శ్రేణులు దాదాపుగా ఆ కుటుంబ వ్యక్తి ఇమేజినే ప్రధానాంశంగా చేసుకొనేంతవరకూ వెళ్లింది. క్రమేణా అది విధేయతకు, భజనతత్వానికి దారితీసి పార్టీని దెబ్బతీసిందని విశ్లేషకులంటారు. రాజీవ్ మరణం తరువాత కాంగ్రెస్‌కు ఆ కుటుంబ బంధం తాత్కాలికంగా తెగింది. కుటుంబానికి చెందని తెలుగు వ్యక్తి పీవీ నరసింహారావు తొలిసారిగా పార్టీ అధ్యక్షబాధ్యతలను, ప్రధాని పదవిని స్వీకరించారు. పీవీ ఉన్నన్నాళ్లూ కూడా సోనియా రాజకీయాల్లోకి రావాలంటూ కాంగ్రెస్ నేతలు, శ్రేణులు ఒత్తిడి పెంచడంతో ఆమె అయిష్టంగానే ప్రజా జీవితంలోకి అడుగుపెట్టారు.



రాజకీయ కుటుంబాలు భారత ప్రజానీకానికేమీ కొత్త కాదు. అన్ని పార్టీల్లోనూ ఉన్నవే. ప్రతీ రాజకీయ నాయకుడూ తన కుటుంబంలో ఒకరిద్దరిని వారసులుగా తెస్తూనే ఉన్నారు. అతి తక్కువ మంది రాజకీయం వేరు కుటుంబం వేరు అన్న సిద్ధాంతంతో ప్రజా జీవితంలో కొనసాగారు... కొనసాగుతున్నారు. కానీ ఒకే ఒక్క కుటుంబం ఈ దేశంలో అనువంశిక పాలనకు ప్రతీకగా నిలిచింది. అది నెహ్రూ-గాంధీ కుటుంబం! ఈ ఒక్క ఫ్యామిలీయే దేశాన్ని 40 ఏళ్ల పాటు పాలించడం దీనికి ఒక కారణమైతే దేశమంతటా గుర్తింపు ఉన్న ఏకైక కుటుంబం ఇది కావడం మరో విశేషం. ప్రస్తుతం ఈ కుటుంబ నాలుగో తరం నడుస్తోంది. దాని నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన 11వ వ్యక్తి ప్రియాంక గాంధీ.

కాంగ్రెస్‌కు కొత్త చిగురు

ప్రియాంక గాంధీని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించడం, తూర్పు ఉత్తరప్రదేశ్ బాధ్యతలు అప్పగించడంతో ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టినట్లయింది. ఇది కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యంగా బీజేపీకి గట్టి పట్టున్న పూర్వాంచల్‌లో ప్రియాంక ప్రవేశం ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కీలకమవుతుందని అంచనా వేస్తున్నారు. 2014 ఎన్నికల్లో మోదీ పూర్వాంచల్‌లో భాగమైన వారణాసి నుంచి పోటీ చేయడం ద్వారా అక్కడ బీజేపీ అనుకూల సునామీని సృష్టించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా పూర్వాంచల్‌కు చెందినవారే. ఆ ప్రభంజనం పునరావృతం కాకూడదంటే అది ప్రియాంక వల్లే సాధ్యమని కాంగ్రెస్ భావిస్తోంది.

కీలక రాష్ట్రంలో నామమాత్రం

దేశంలోకెల్లా అతి పెద్ద రాష్ట్రమైన యూపీని కాంగ్రెస్ పార్టీ 1989 వరకు ఎదురులేకుండా ఏలింది. ఆ తర్వాతి పరిణామాల్లో ఎస్పీ, బీఎస్పీలు బలమైన

కాంగ్రెస్‌కు ప్రియబాంధవి | క్రియాశీల పాత్రలోకి ప్రియాంక

ప్రాంతీయ పార్టీలుగా అవతరించాయి. రామ జన్మభూమి వివాదంతో బీజేపీ కూడా రాష్ట్రంలో పాతుకుపోయి మూడు సార్లు అధికారానికి వచ్చింది. కాంగ్రెస్ క్రమంగా క్షీణిస్తూ... దళిత ఓటుబ్యాంకును మాయావతికి, అగ్రవర్ణ ఓటుబ్యాంకును బీజేపీకి, ఓబీసీ ముస్లిం ఓటుబ్యాంకును ములాయంసింగ్‌కు కోల్పోయి రాష్ట్రంలో నామమాత్రపు రాజకీయ పక్షంగా మిగిలింది. ఇలాంటి తరుణంలో ప్రధాన ప్రాంతీయ పార్టీలైన ఎస్పీ, బీఎస్పీలు దోస్తీకట్టాయి.. వాటి పొత్తులో కాంగ్రెస్‌కు చోటివ్వలేదు. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ పోటీచేసే అమేథీ, రాయ్‌బరేలీ సీట్లను మాత్రం వ్యూహాత్మకంగా కాంగ్రెస్‌కు వదిలేశాయి. దీన్ని కాంగ్రెస్ అవమానంగా భావించింది. అయితే 80 లోక్‌సభ స్థానాలున్న యూపీలో ఆ రెండు పార్టీలు కలిస్తే మెజారిటీ సీట్లను గెలుచుకొనే అవకాశం ఉంది. అందుకే కాంగ్రెస్‌ను పక్కన బెట్టాయి. 2017 శాసనసభ ఎన్నికల్లో సమాజ్‌వాదీతో పొత్తులో పోటీచేసి కూడా కాంగ్రెస్ ఆరు శాతమే ఓట్లు సంపాదించింది. బీజేపీకి 42% ఓట్లు వచ్చాయి. అంటే, కాంగ్రెస్ యూపీలో గౌరవప్రదమైన సీట్లు సంపాదించాలంటే రాహుల్ నేతృత్వంలోని ప్రస్తుత సెటప్ చాలదు. అందుకే, కాంగ్రెస్ తన వజ్రాయుధాన్ని వెలికి తీసింది. 47 ఏళ్ల ప్రియాంకను రంగంలోకి దింపింది. ఉనికిని చాటుకోవడానికి, బీజేపీ అగ్రవర్ణ ఓటర్లను చీల్చడానికి ప్రియాంక ఉపయోగపడతారని కాంగ్రెస్ వ్యూహకర్తల అంచనా.

11వ వారసురాలి అరంగేట్రం

- కశ్మీరీ పండిట్ అయిన మోతీలాల్ నెహ్రూ ఈ ఫ్యామిలీకి ఆద్యుడైనప్పటికీ స్వాతంత్ర్యం రావడానికి 16 సంవత్సరాల ముందే ఆయన కన్నుమూశారు. మోతీలాల్ రెండు సార్లు 1919, 1928 సంవత్సరాల్లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసి బ్రిటిష్ వారిపై పోరాడారు.
- మోతీలాల్ కుమారుడైన జవహర్‌లాల్ నెహ్రూ నుంచి ఈ కుటుంబం విస్తరించింది. స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచీ 1964 దాకా అంటే దాదాపు 17 సంవత్సరాల పాటు దేశ తొలి ప్రధానిగా నెహ్రూ పనిచేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా 1929, 1930, 1936,1951-54 సంవత్సరాల్లో పనిచేశారు.
- జవహర్‌లాల్ కుమార్తె ఇందిర.. ఆయన బతికున్నపుడే రాజకీయంగా ఎదిగారు. లాల్ బహదూర్ శాస్త్రి హఠాన్మరణం తర్వాత ప్రధాని పదవిని చేపట్టిన ఇందిర 1966-77 దాకా, తిరిగి 1980-84 దాకా ప్రధానిగా పనిచేశారు. పార్సీ కుటుంబంలో పుట్టిన ఫిరోజ్ జహంగీర్ ఘండీని ఇందిర ప్రేమించి పెళ్లాడారు. రాయ్‌బరేలీ నుంచి రెండుమార్లు గెలుపొందిన ఫిరోజ్.. నెహ్రూ గాంధీ కుటుంబంలో సభ్యుడయ్యారు. ఇందిర-ఫిరోజ్‌లకు ఇద్దరు పిల్లలు.. రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ. 1944, 46 సంవత్సరాల్లో జన్మించిన వీరిద్దరిలో సంజయ్ 1980లో విమాన ప్రమాదంలో మరణించారు.
- 1984 అక్టోబరు 31న తల్లి ఇందిరాగాంధీ మరణించిన సంక్షోభ సమయంలో ప్రధాని పదవిని చేపట్టిన రాజీవ్.. తరువాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అపూర్వ విజయం సాధించారు. ఐదేళ్ల పాటు ప్రధానిగా పనిచేశారు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబదూర్‌లో మానవబాంబు దాడిలో మరణించారు.
- సంజయ్ భార్య మేనకా గాంధీ. అత్త ఇందిర ఆగ్రహానికి గురై మెట్టినింటిని వీడి వచ్చి బీజేపీలో చేరారు. కేంద్రంలో మూడు సార్లు మంత్రిపదవి చేపట్టారు. మేనక కుమారుడు వరుణ్ గాంధీ బీజేపీలోనే ఎంపీ. యూపీలోని సుల్తాన్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
- ఇక రాజీవ్ భార్య సోనియాగాంధీ జన్మతః ఇటాలియన్. మొదట్లో రాజకీయాలకు విముఖంగా ఉన్న ఆమె చివరకు భర్త చనిపోయిన ఆరేళ్లకు రాజకీయాల్లోకి వచ్చారు. 19 ఏళ్లపాటు కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేసిన సోనియా రెండు సార్లు ప్రధానిగా అవకాశం వచ్చినా స్వీకరించలేదు. కానీ యూపీఏ ఛైర్‌పర్సన్‌గా అధికారాన్ని తెరవెనుక నుంచి నడిపిన వ్యక్తి.
- సోనియాకు ఇద్దరు పిల్లలు.. రాహుల్ ప్రస్తుతం కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు. సోదరి ప్రియాంక ఇన్నాళ్లూ ప్రత్యక్షంగా రాజకీయాల్లోకి దిగకుండా తెరవెనుక రాహుల్‌కు సహకరిస్తున్నారు.



ఆ అన్నకు ముద్దుల చెల్లి

రాజకీయ పదవులు, బాధ్యతలను నిర్వర్తించడంలో రాహుల్‌కు ప్రియాంక పూర్తి సహకారం అందిస్తున్నారు. నిజానికి, గాంధీ కుటుంబం తరఫున రాజకీయ అవకాశాలు తననే తొలిగా వరించినా.. రాహుల్‌తో పోటీపెట్టి తనను ప్రముఖంగా తెరపైకి తీసుకురావాలన్న ప్రయత్నాలకు ఆమె తొలినుంచీ దూరంగానే ఉన్నారు. తన నాయకత్వంపై జరుగుతున్న ప్రచారానికి తెర దించుతూ.. 'నేను రాజకీయాల్లోకి రావడం లేదు' అని 2009లో ప్రకటించారు. అయినా అన్నయ్య, తల్లికి సహాయంగా పార్టీ వ్యవహారాల్లో చురుగ్గానే వ్యవహరిస్తున్నారు. రాహుల్ తన చెల్లెమ్మ పట్ల చాలా ఆపేక్షతో ఉంటారు. బాల్యంలో ప్రియాంకను ఎవరు చిన్న మాట అన్నా సహించేవారు కాదు. అదే అన్యోన్యత రాజకీయాల్లోనూ కొనసాగిస్తున్నారు.

ట్విటర్‌లో దుమ్మురేపిన ప్రియాంక

ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో మొదటి స్థానం

ప్రియాంకాగాంధీ పేరు ట్విటర్‌లో మారుమోగిపోతోంది. ఇన్నాళ్లు రాయ్‌బరేలీ, అమేథీ పార్లమెంటు నియోజకవర్గాలకే పరిమితమైన ప్రియాంక.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులవడంతో ప్రపంచవ్యాప్తంగా ట్విటర్‌లో ఆమె పేరు ట్రెండింగ్‌లో నిలిచింది. ప్రియాంకాగాంధీ హ్యాష్‌ట్యాగ్ ప్రపంచవ్యాప్తంగా మొదటి స్థానానికి దూసుకెళ్లింది. ప్రియాంక ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంతో ప్రియాంకా గాంధీ హ్యాష్‌ట్యాగ్‌తో ట్వీట్లు చేశారు. ఏఐసీసీ జనరల్, ప్రియాంకా వాద్రా, కాంగ్రెస్ జనరల్ హ్యాష్‌ట్యాగ్‌లు కూడా టాప్‌లో ఉన్నాయి. మన దేశానికి సంబంధించి ట్విటర్‌లో టాప్ 15 ట్రెండింగ్ వార్తల్లో ప్రియాంకవే 11 ఉన్నాయి.



కొన్నేళ్లుగా తెర వెనుక నుంచే..!

ఇద్దరు పిల్లల తల్లిగా గృహిణి జీవితం గడుపుతున్నా ప్రియాంక కాంగ్రెస్‌లో తెర వెనుక కీలక పాత్ర పోషిస్తున్నారు. కర్ణాటకలో క్షణాల మీద మంత్రాంగం నెరిపి- జేడీఎస్‌కు ముఖ్యమంత్రి పదవి ఆఫర్ చేసి బీజేపీని దెబ్బతీసిన వ్యూహం ఆమెదేనని ప్రచారం జరిగింది. అంతేకాక- ఇటీవల మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎంపికలో ప్రియాంక చురుకైన పాత్ర పోషించారు. నవజ్యోత్ సింగ్ సిద్ధూను బీజేపీ నుంచి కాంగ్రెస్‌కు తీసుకురావడంలో ప్రియాంక కృషి ఉంది. ప్రియాంకను రంగంలోకి దింపడం ద్వారా కాంగ్రెస్ భారీ విజయాలు సాధించలేకపోయినా యూపీలో ఎస్పీ, బీఎస్పీలతో బేరసారాల్లో గట్టిగా వ్యవహరించే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రియాంక రాజకీయ రంగ ప్రవేశంపై భారీ అంచనాలు ఉన్న నేపథ్యంలో ఆమె విఫలమైతే మొత్తం కుటుంబమే రాజకీయ ప్రాధాన్యం కోల్పోయే ప్రమాదం ఉంది. ఒకసారి ప్రియాంక ఓ ఇంటర్వ్యూలో బ్రహ్మాస్త్రాన్ని ఒకేసారి ప్రయోగిస్తారని స్వయంగా వ్యాఖ్యానించారు.

టైమొచ్చింది.. ఇక రావాలి!

ఎస్పీ-బీఎస్పీ దూరం పెట్టడంతో తుది నిర్ణయం



"ఎస్పీ-బీఎస్పీలు గనక కాంగ్రెస్‌ను తమతో చేర్చుకుని ఉండుంటే ప్రియాంక రంగప్రవేశం మరికాస్త ఆలస్యమయ్యేది. అపుడు సమీకరణాలు వేరేగా ఉండేవి. కానీ ఆ రెండు ప్రాంతీయ పార్టీలూ చిన్నచూపు చూడడం వల్ల ఈ నిర్ణయాన్ని త్వరితం చేశారు."

-కాంగ్రెస్ కీలక నేత

గత వారం రోజులుగా రాహుల్ జాడ లేదు. ఆయన నుంచి యథావిధిగా ట్వీట్లు వెలువడుతున్నా మనిషి ఎక్కడున్నారో తెలీదు.. ఏం చేస్తున్నారో తెలీదు. కానీ ఆకస్మికంగా ఆయన సొంత నియోజకవర్గం అమేఠీలో బుధవారం ఓ బహిరంగ సభలో మాట్లాడారు. ప్రియాంకను పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఆమె అరంగేట్రానికి వెనుక జరిగిన కథేమిటన్నది ఆసక్తికరం...

రాహుల్ ఇటీవలే అమెరికా వెళ్లి.. సంక్రాంతి సెలవులకు అక్కడ ఉంటున్న ప్రియాంకను కలిశారు. ఇద్దరూ 4 రోజుల పాటు కలిసి ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల మంత్రాంగమే వారి చర్చనీయాంశమయ్యింది. నిజానికి ఆమె రాజకీయ రంగ ప్రవేశంపై రెండేళ్లుగా అంతర్మథనం సాగుతోంది. చివరకు ఎస్పీ-బీఎస్పీలు పొత్తు పెట్టుకుని కాంగ్రెస్‌ను దూరం జరిపాక రాహుల్ తుది నిర్ణయానికొచ్చేశారు. 'టైమొచ్చింది.. ఇక నువ్వు రంగప్రవేశం చేయాల్సిందే' అని సోదరికి గట్టిగా నచ్చచెప్పారు. తీసుకోవాల్సిన బాధ్యత, ప్రకటన అన్నీ అమెరికాలోనే ఖరారయ్యాయి. యూపీలో తూర్పు ప్రాంతమే కీలకం. మోదీ, ఆదిత్యనాథ్ యోగీ నియోజకవర్గాలూ ఇక్కడే ఉన్నాయి. కాబట్టి అదే చోట బీజేపీని గట్టిగా దెబ్బతీయాలన్నది వారి వ్యూహం.



అచ్చం నానమ్మలాగానే..

'ప్రియాంకా గాంధీ ఆంధీ (దుమ్ముతుఫాను) హై.. దూస్‌రా (రెండో) ఇందిరాగాంధీ హై ..బుధవారం ట్విటర్‌లో కాంగ్రెస్ శ్రేణులందరూ ఇచ్చిన నినాదమిది! ఇదే నినాదంతో రాయ్‌బరేలీ దద్దరిల్లిపోయింది. అంతేనా.. 'ఐరన్‌లేడీ-2' అని ఒకరు ట్వీట్ చేస్తే.. '21వ శతాబ్దపు ఇందిరాగాంధీ' అని మరొకరు ముచ్చటపడ్డారు. వెరసి.. 'ఎన్నాళ్లో వేచిన ఉదయం ఈనాడే ఎదురవుతుంటే..' అన్నట్టుగా.. ప్రియాంక రాజకీయ రంగప్రవేశంతో కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. ఇందిరతో ఆమెకున్న పోలికలను బేరీజు వేస్తున్నారిలా..

చీర కట్టు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఇందిరా గాంధీ ఖాదీకే ప్రాధాన్యమిచ్చి నేత చీరలు కట్టుకునేవారు. ఇది ఆమెను సామాన్యుల మనిషిగా నిలబెట్టేది. ఇందిర తరహాలోనే ప్రియాంక కూడా చేనేత చీరలకే ప్రాధాన్యమిస్తారు. నానమ్మలాగానే ఆమె చీరకట్టులో హుందాతనం ఉట్టిపడుతుంది.

ఎడమచేతికి వాచ్

ఇందిరాగాంధీకాలం నాటికి యువతులు ఎడమచేతికి రిస్ట్‌వాచ్ ధరించడం ఆధునికతకు చిహ్నం. అప్పట్లో ఆమె బయటకు వచ్చినప్పుడల్లా వాచ్ తప్పనిసరిగా పెట్టుకునేవారు. ప్రియాంక కూడా అంతే.

నమస్కారం..

సగటు రాజకీయ నాయకుల్లాగా చేతులు ఊపడం కాక.. రెండు చేతులతో నమస్కారం చేయడం ఇందిర శైలి. ప్రియాంక కూడా అదే తరహాలో నమస్కారంతో ప్రజలను పలకరిస్తారు.

సంప్రదాయాలకు విలువ

చీరకట్టు హుందాగా ఉండడమే కాదు.. ఆ కట్టు భారతీయ సంప్రదాయాలకు విలువనిచ్చేలా ఇందిర ప్రత్యేకంగా చూసుకునేవారు. మెడదాకా కప్పి ఉంచుతూ, మోచేతుల దాకా ఉండే బ్లౌజు వంటివి ధరించేవారు. ప్రియాంక కూడా అంతే.



ఫెడరల్ స్ఫూర్తికి సుప్రీం గండి!

లా-లోచనం

Law lochanam

ఈ నెల 16న యూపీఎస్సీ కార్యదర్శిని కోర్టు ముందు హాజరై, రాష్ట్రాల డీజీపీల నియామకంపై తాము జారీచేసిన ఉత్తర్వుల అమలులో జాప్యానికి సంజాయిషీ ఇచ్చుకోవాలని సుప్రీం ధర్మాసనం జారీచేసిన హుకుం విమర్శల పాలైంది. ఇటీవలి సీబీఐ డైరెక్టరు గెంటివేత వ్యవహారం, నియామక కమిటీ నిర్ణయంపై వెల్లువెత్తిన విమర్శల వేడి చల్లారలేదు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి నామినీ కూడా ఈ కమిటీలో సభ్యుడవడంతో దాదాపు సుప్రీం కోర్టు స్వతంత్ర ప్రతిపత్తి సందేహాస్పదమైంది. రాష్ట్ర పోలీసు బాస్‌ల నియామకాన్ని కేంద్ర సర్వీసు కమిషనుకు కట్టబెట్టిన సుప్రీం న్యాయ విచక్షణను గౌరవించినా, ఈ తీర్పు అసలు ఫెడరల్ స్ఫూర్తికే గండి కొట్టడం సమర్థనీయం కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార విభజనకు స్పష్టంగా హద్దులు గీయటంతో ఫెడరల్ ప్రజాస్వామ్యం భారత



రాజ్యాంగపు ప్రధాన లక్షణంగా కోర్టులు కూడా కీర్తించాయి. ఈ దిశలోనే ఆర్టికల్ 315 ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ ఉద్యోగులను నియమించుకునే పూర్తి స్వేచ్ఛ, విచక్షణ, అధికారాలను సర్వీసు కమిషన్ల ఏర్పాటుతో వినియోగించుకుంటున్నాయి. ఆర్టికల్ 320 యూనియన్, స్టేట్ పబ్లిక్ సర్వీసు కమిషన్ల విధి నిర్వహణ కోసం తగిన విధివిధానాలు నిర్దేశించటంతో ఈ కమిషన్లు రాజ్యాంగ సంస్థలుగా రూపుదిద్దుకున్నాయి. గవర్నరు కోరిక మేరకు ప్రత్యేక సందర్భాలలో మాత్రమే రాష్ట్ర ఉద్యోగుల నియామకంలో యూపీఎస్సీ పరిమిత పాత్ర పోషించే వెసులుబాటును ఆర్టికల్ 315(4) కల్పించింది. రాజ్యాంగపు 7వ షెడ్యూలు రెండవ జాబితాలోని రెండో ఎంట్రీ ప్రకారం పోలీసు వ్యవస్థ రాష్ట్ర పరిధిలో చేరింది. ఆయా రాష్ట్రాల భౌగోళిక, సామాజిక పరిస్థితులు, సమస్యల కనుగుణంగా పోలీసు అధికారుల నియామకం రాష్ట్ర ప్రభుత్వం కనుసన్నల్లో జరగాలనే రాజ్యాంగం ఉద్దేశ్యం.

'పోలీసు'ను రాజకీయ ప్రభావం నుంచి తప్పించే మిషతో, ప్రకాష్ సింగ్ కేసు (2006)లో సుప్రీం ధర్మాసనం చేసిన మార్గదర్శకాలు డీజీపీల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం పాత్రనే ప్రశ్నార్థకం చేయటం శోచనీయం. కేవలం పోలీసు అధికారుల సీనియారిటీ జాబితా పంపే పోస్టాఫీసు పాత్రను పోషించటంతో రాష్ట్రం చేతులు ముడుచుకోగా, డీజీపీని నియమించడం యూపీఎస్సీ వంతయి, రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషను ప్రమేయం శూన్యమైంది. చట్టంలో లోపాన్ని ఎత్తిచూపి, తన న్యాయ సమీక్షాధికారంతో సుప్రీం చేసే సూచనలు చట్టసవరణ జరిగే మధ్యకాలంలో మాత్రమే అమలు కావాల్సి ఉండగా, ప్రకాష్‌సింగ్ కేసులోనూ, ఇటీవలి జనవరి 16 ఉత్తర్వుల్లోనూ కోర్టు జారీచేసిన ఉత్తర్వులు ఆర్టికల్ 315ను పక్కన పెట్టేయటం హర్షణీయం కాదు. రాజ్యాంగానికి అతీతంగా ప్రత్యామ్నాయ నియామక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తన అధికార పరిధిని సుప్రీం ఏకపక్షంగా విస్తరించుకోవటం సమర్థనీయం కాదు. సీబీఐ డైరెక్టరు నియామకం కోసం ఏర్పర్చిన అధికార కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గానీ ఆయన నామినీ జడ్జిగాని సభ్యుడవటం సబబా? ఓవైపు విస్తృత న్యాయ సమీక్షాధికారం



వినియోగిస్తూ, మరోవైపు ప్రభుత్వ అధికారుల నియామకంలో సభ్యుడిగా వ్యవహరించటం, విమర్శలకు లోనవ్వటం న్యాయవ్యవస్థ స్వతంత్రత, విలువలపైన నీలినీడలు కమ్ముకోటానికి సాక్షాత్తూ సుప్రీంకోర్టే దారిచూపటం దురదృష్టకర పరిణామం.

-వేదాంతం సీతారామావధాని,
భారత సుప్రీంకోర్టు
మాజీ సెక్రటరీ జనరల్,
ఈ మెయిల్: sitharam.avadhani@gmail.com

రూ. 8 లక్షల ఆదాయం ఉంటే పేదలా?

10% ఈడబ్ల్యూఎస్ కోటా రాజ్యాంగ విరుద్ధం.. సుప్రీం కోర్టులో జస్టిస్ ఈశ్వరయ్య పిటిషన్

న్యూఢిల్లీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూసీ) 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని కోరుతూ జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్, అఖిల భారత బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు జస్టిస్ వి.ఈశ్వరయ్య బుధవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ మౌలిక స్వరూపానికి, ప్రాథమిక హక్కులకు, ఇందిర సవానీ కేసులో సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధంగా ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అన్ని వర్గాల సామాజిక, ఆర్థిక, కుల గణన వివరాలు సేకరించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశించాలని అభ్యర్థించారు. ప్రభుత్వం చెబుతున్న ఆర్థిక బలహీన వర్గాలకు రాజ్యాంగంలో నిర్వచనం లేదని, వారు ఎప్పుడూ సామాజిక అన్యాయానికి, వివక్షకు, అంటరానితనానికి, అణచివేతకు గురి కాలేదని స్పష్టం చేశారు. దేశంలో 80 శాతం సంపద, రాజకీయ అధికారం, విద్య, ఉపాధి అగ్ర వర్ణాల చేతుల్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. అగ్రవర్ణాల్లో 5 శాతం కూడా పేదలు లేరని, కానీ 10 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో అత్యధికులు అగ్రవర్ణాల వారే ఉన్నారని తెలిపారు. రూ.8 లక్షల వార్షిక ఆదాయం కలిగిన వారు ఆర్థిక బలహీన వర్గాలు ఎందుకు అవుతారని ప్రశ్నించారు. బలహీన వర్గాలు అంటే ఎస్సీ, ఎస్టీ, బీసీలేనని స్పష్టం చేశారు. 10 శాతం రిజర్వేషన్లలో వార్షిక ఆదాయ పరిమితి ఎక్కువ ఉండడం వల్ల దినసరి, వ్యవసాయ కూలీలు, డ్రైవర్లు వంటి వారికి ప్రయోజనం కలగదన్నారు. ఈ కేసులో ప్రతివాదులుగా కేంద్ర న్యాయ శాఖ కార్యదర్శి, కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ కార్యదర్శిని చేర్చారు. కాగా, 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెచ్చిన రాజ్యాంగ సవరణను సవాల్ చేస్తూ తెహసీన్ పూనావాల్లా అనే వ్యాపారవేత్త కూడా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

వచ్చే రెండేళ్లలో 2.5 లక్షల రైల్వే ఉద్యోగాలు

- 10% ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు
- రైల్వే మంత్రి పీయూష్ గోయెల్



న్యూఢిల్లీ, జనవరి 23: ఎన్నికల ముంగిట నిరుద్యోగులను ప్రసన్నం చేసుకోవడానికి మోదీ సర్కారు కసరత్తు ప్రారంభించింది. దానిలో భాగంగా.. వచ్చే రెండేళ్లలో రైల్వేలోని సుమారు 2.50 లక్షల ఖాళీలను భర్తీ చేయనున్నట్టు ఆ శాఖ మంత్రి పీయూష్ గోయెల్ బుధవారం ప్రకటించారు. అంతే కాకుండా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) కేటాయించిన 10 శాతం రిజర్వేషన్లను ఈ నోటిఫికేషన్లకు వర్తింపజేయనున్నట్టు ఆయన తెలిపారు. దీని వల్ల ఆ నోటిఫికేషన్లలోని సుమారు 23 వేల ఉద్యోగాలు ఈడబ్లూఎస్‌కు రిజర్వ్ అవుతాయని ఆయన తెలిపారు. ఇప్పటికే లక్షన్నర ఉద్యోగాలు భర్తీ ప్రక్రియలో ఉన్నాయని, రాబోయే రెండేళ్లలో భర్తీ చేసే వాటితో కలిపి మొత్తం 4 లక్షల ఉద్యోగాలవుతాయని గోయెల్ తెలిపారు. ఈ ఖాళీలను రెండు దశల్లో భర్తీ చేయనున్నామన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి 2020 మే వరకూ జరిగే మొదటి దశలో 131428 ఉద్యోగాలనూ, 2020 మే నుంచి 2021 ఆగస్టు వరకూ జరిగే రెండో దశలో 99 వేల ఉద్యోగాలనూ భర్తీ చేయనున్నట్టు ఆయన తెలిపారు.

చానళ్ల ఎంపికలో ట్రాయ్ సాయం

- అందుబాటులోకి కొత్త అప్లికేషన్

న్యూఢిల్లీ, జనవరి 23: డీటీహెచ్, కేబుల్ వినియోగదారులు టీవీ చానళ్లను సులభంగా ఎంపిక చేసుకునేందుకు టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) 'చానల్ సెలెక్టర్ అప్లికేషన్'ను ప్రారంభించింది. ఇది చానళ్ల ఎంపికలో సహాయపడడమే కాదు ఎంచుకున్న చానళ్లకు నెలకు ఎంత చెల్లించాలో కూడా లెక్కించి చెబుతుంది. ట్రాయ్ 'చానల్ సెలెక్టర్ అప్లికేషన్' పేజీ చివరిలో ఉన్న 'గెట్ స్టార్టెడ్' బటన్ నొక్కాలి. ఆపై మీ పేరు, నివసించే రాష్ట్రం, ఏ తరహా (జానర్) చానళ్లు చూడాలనుకుంటున్నారో తెలియజేయాలి. మీరు ఇచ్చిన సమాచారం ఆధారంగా చానళ్ల జాబితా కనిపిస్తుంది. వాటిలో నెల వారీ ప్లాన్‌లో కావాల్సిన చానళ్లను ఎంచుకోవచ్చు. మీ ఎంపికను బట్టి నెలకు ఎంత అవుతుందో ఈ అప్లికేషన్ లెక్కిస్తుంటుంది. 'వ్యూ సెలెక్షన్' బటన్ నొక్కడం ద్వారా ఆ మొత్తాన్ని తెలుసుకోవచ్చు.

● కువైట్‌లో భారత పనివాళ్లకు భద్రత

- ఎంవోయూకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి):కువైట్‌లో ఇళ్లలో పనిచేస్తున్న భారతీయులకు రక్షణ చర్యలను పటిష్ఠం చేయడానికి ఆ దేశంతో కేంద్రం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఎంవోయూను బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదించారు. ముఖ్యంగా మహిళలకు మరింత రక్షణ లభిస్తుందని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం అమలుకు తదుపరి సంయుక్త కమిటీని ఏర్పాటు చేస్తామని పేర్కొంది. దాదాపు 3 లక్షల మంది భారతీయులు కువైట్‌లో ఇళ్లలో పనిచేస్తున్నారని, అందులో 90 వేల మంది మహిళలే ఉన్నారని వివరించింది.

● నేడు పీఎస్ఎల్వీ-సీ44 ప్రయోగం

శ్రీహరికోట(సూళ్లూరుపేట), జనవరి 23: అంతరిక్షంపై పరిశోధనలు చేసే శాస్త్రవేత్తలు, విద్యార్థులకు ఉపయోగపడేలా వినూత్న ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. గురువారం అర్ధరాత్రి 11.37 గంటలకు పీఎస్ఎల్వీ-సీ44 రాకెట్‌ను నెల్లూరు జిల్లాలోని షార్ కేంద్రంలో ఉన్న ప్రథమ ప్రయోగ వేదిక నుంచి ప్రయోగించనున్నారు. ఈ ప్రయోగానికి బుధవారం లాంచ్ ఆథరైజేషన్ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బుధవారం రాత్రి 7.37 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. 28 గంటలపాటు ఇది కొనసాగనుంది. ఈ రాకెట్ ద్వారా దేశ రక్షణ రంగం కోసం మైక్రోశాట్-ఆర్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేరవేస్తున్నారు.

● ఏపీవై గరిష్ఠ వయో పరిమితి 50కి పెంపు?


న్యూఢిల్లీ, జనవరి 23: అటల్ పెన్షన్ యోజన(ఏపీవై) లబ్ధిదారుల గరిష్ఠ వయో పరిమితి పెంపాలనే యోచనలో కేంద్రం ఉందా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. ప్రస్తుతం 40 ఏళ్ల వరకూ ఉన్న వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచేందుకు కేంద్రం కసరత్తు చేస్తోందని ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రటరీ రాజీవ్ కుమార్ తెలిపారు. ఏజేవైని మరింత మందికి చేరువ చేసేందుకు నెలనెలా అందిస్తున్న కనీస పించనును రూ.10వేలు చేయడంతో పాటు గరిష్ఠ వయోపరిమితిని పెంచాలని కేంద్ర ఆర్థిక శాఖకు పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ, డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) ప్రతిపాదించిందన్నారు. వీటి సాధ్యాసాధ్యాలపై చర్చలు జరుగుతున్నాయని కుమార్ పేర్కొన్నారు.

● కేసు దాఖలైన 4 రోజుల్లో విచారణ: సీజేఐ

న్యూఢిల్లీ, జనవరి 23: సుప్రీంకోర్టులో వ్యాజ్యాల విచారణకు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) రంజన్ గోగోయ్ బుధవారం ప్రకటించారు. వ్యాజ్యాల విచారణకు ప్రస్తావన చేసే పద్ధతిని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా వ్యాజ్యాన్ని దాఖలు చేస్తే... నాలుగు రోజుల్లోనే అది ఆటోమేటిక్‌గా ధర్మాసనంపై విచారణకు వచ్చేలా విధానాన్ని రూపొందిస్తున్నామని సీజేఐ చెప్పారు. ఒకవేళ నాలుగు రోజుల కన్నా ముందే అత్యవసరంగా విచారణ జరగాలనుకుంటే సుప్రీం రిజిస్ట్రార్ వద్ద న్యాయవాదులు తమ పిటిషన్‌ను ప్రస్తావించవచ్చని ఆయన అన్నారు.

● కుంభమేళాలో నరమేధానికి కుట్ర..!?

ముంబై, జనవరి 23: మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్) భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేసింది. దేశంలో పలుచోట్ల పేలుళ్లకు కుట్రపన్నిన తొమ్మిది మంది ఉగ్రవాదులను థానే, ఔరంగాబాద్‌లలో అరెస్టు చేసింది. వీరిలో ఓ మైనర్(17) కూడా ఉన్నాడు. వీరంతా ఉగ్రవాద సంస్థ ఐఎస్ నుంచి ప్రేరణ పొందినట్లు విచారణలో తేలింది. నీరు, ఆహారపదార్థాల్లో రసాయనాలు కలిపి సామూహిక హత్యలకు కుట్ర పన్నినట్లు గుర్తించారు. వీరు కుంభమేళాను లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల నుంచి పలు రసాయనాలు, కత్తులు, మొబైల్ ఫోన్లు, హార్డ్ డిస్క్, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఏటీఎస్ అధికారులు తెలిపారు. అరెస్టయి నవారంతా ఇంజనీర్లు, ఫార్మాసిస్టులని వెల్లడించారు.



ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీ వాద్రాను నియమించడంతో కాంగ్రెస్ మరింత బలోపేతమైందని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సీనియర్ నేతలు, కార్యకర్తలు ఆనందంతో గాంధీభవన్‌లో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటూ.. మిఠాయిలు పంచారు.

ప్రియాంక.. గొప్పగా పనిచెయ్: వాద్రా



న్యూఢిల్లీ, జనవరి 23: ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న ప్రియాంక ఆమె భర్త రాబర్ట్ వాద్రా అభినందనలు తెలిపారు. రాజకీయాల్లో గొప్పగా పనిచేయాలని సూచించారు. "అభినందనలు పీ..(ప్రియాంక). నీ జీవితంలో ప్రతి దశలోనూ ఎప్పుడూ నీకు తోడుగా ఉంటున్నాను. బాగా పని చెయ్యి" అని రాబర్ట్ వాద్రా ట్విటర్‌లో పోస్ట్ చేశారు.

వారికి కుటుంబమే పార్టీ..: ప్రధాని మోదీ

ముంబై, జనవరి 23: ప్రియాంక ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంతో కాంగ్రెస్ శ్రేణులన్నీ సంబురాలు చేసుకుంటుండగా.. మోదీ మాత్రం తనదైన శైలిలో స్పందించారు. ప్రియాంక గాంధీని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై పరోక్షంగా చురకలంటించారు. బీజేపీలో ప్రజాస్వామ్యం ఉంటుందని.. ఇతర పార్టీలను కుటుంబమే నడుపుతుందని వ్యాఖ్యానించారు. బుధవారం మహారాష్ట్ర నియోజకవర్గాల బూత్ స్థాయి కార్యకర్తలతో మోదీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, కాంగ్రెస్‌కు సమర్థ నాయకత్వాన్ని అందించడంలో రాహుల్ విఫలమైనందునే ప్రియాంకను తీసుకొస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు.

ఏడాదికి 5 రోజులు అడవిలోనే

ఆత్మపరిశీలనకు, నన్ను నేను తెలుసుకునేందుకే.. ఆర్ఎస్ఎస్‌లో కార్యాలయాన్ని ఊడ్చేవాడిని

- అక్కడ టీ, వంటలు చేశాను.. పాత్రలూ కడిగాను: మోదీ

న్యూఢిల్లీ, జనవరి 23: ఒక రోజంతా ఒంటరిగా అడవిలో గడపాలంటే? అదీ.. కేవలం మంచినీళ్ల తప్ప ఏమీ దొరకని ప్రదేశమైతే? ఊహించుకుంటేనే కాస్త భయంగా ఉంది కదూ! అదే ఏకబిగిన ఐదు రోజుల పాటు ఉండాలంటే? అసాధ్యం అంటారా! ప్రధాని నరేంద్ర మోదీ ఏటా ఇలానే గడిపేవారట! దీపావళి పండక్కి అడవిలోకి పోయి.. అక్కడి నీళ్లే తాగుతూ ఐదురోజుల పాటు ఉండేవారట. పాపులర్ ఫేస్‌బుక్ పేజీ 'ది హ్యూమన్స్ ఆఫ్ బాంబే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన దీన్ని వెల్లడించారు. "చాలామందికి ఈ విషయం తెలియదు.. దీపావళి వచ్చిందంటే ప్రజలకు దూరంగా... కనీసం పత్రికలు, రేడియోలు కూడా అందుబాటులో లేని.. నీరు మాత్రమే లభించే ఓ అడవి లాంటి ప్రదేశానికి వెళ్లేవాణ్ని అక్కడే ఐదురోజుల పాటు గడిపేవాణ్ని" అని మోదీ చెప్పారు. మరి.. ఈ 'ఒంటరి అడవి జీవితం' ఎందుకు అని ప్రశ్నించినప్పుడు ఆయనలో ఓ గొప్ప తత్వవేత్త నిద్రలేచారు. ఈ ప్రక్రియ వ్యక్తిత్వ వికాసానికి గొప్ప మేలు చేస్తుందని వివరించారు. "రోజువారీ బిజీషెడ్యూల్‌తో ఉరుకుల పరుగుల జీవితం నుంచి విరామం ఇచ్చి 'అడవి బాట' పడితే.. ఆత్మ పరిశీలన చేసుకునే అవకాశం లభిస్తుంది. దృక్పథంలో గొప్ప మార్పు వస్తుంది. చివరికి 'నేను ఎవరు' అనే విషయాన్ని తెలుసుకుంటారు. అప్పటి నుంచి గొప్ప ఆత్మవిశ్వాసంతో వాస్తవిక ప్రపంచంలో జీవించడం మొదలుపెడతారు. మీ గురించి ఇతరులు ఏమి మాట్లాడుతున్నారనేది బాగా తెలుసుకోగలుగుతారు. ఇవన్నీ జీవితంలో దశలవారీగా ఉపయోగపడతాయి" అని మోదీ చెప్పుకొచ్చారు. ప్రతి వ్యక్తిలోనూ ఓ ప్రత్యేకత ఉంటుందని.. వెలుగు కోసం బయట వెంపర్లాడాల్సిన పనిలేదని అది వ్యక్తి లోపలే ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలో తన చిన్ననాటి విషయాలను.. ఆర్ఎస్ఎస్‌వైపు ఆకర్షితులైన విధానాన్ని.. 17 ఏళ్ల వయసులో రెండేళ్లపాటు సుదీర్ఘ హిమాలయ యాత్ర అంశాలను మోదీ పంచుకున్నారు. "హిమాలయాల నుంచి తిరిగి రాగానే ఇతరుల సేవ కోసమే జీవితాన్ని అంకితం చేయాలని నిర్ణయించుకున్నాను. కొన్నాళ్లకే అలహాబాద్‌కు మారాను. అక్కడ మా అంకుల్‌కు క్యాంటిన్‌లో సాయపడేవాణ్ని. కొన్నాళ్లకే ఆర్ఎస్ఎస్‌కు పూర్తిస్థాయి ప్రచారక్ అయ్యాను. అక్కడ విభిన్న వ్యక్తులతో మమేకం అయ్యే అవకాశం దక్కింది. ఆర్ఎస్ఎస్ ఆఫీసును శుభ్రం చేయడం.. సన్నిహితుల కోసం టీ, వంటలు చేయడం.. వంట పాత్రలు శుభ్రం చేయడం వంటి పనులు చేసేవాణ్ని. తర్వాతి రోజుల్లో బిజీగా మారినా.. హిమాలయాల్లో ఉండడం ద్వారా నేను పొందిన ప్రశాంత చిత్తాన్ని ఎన్నడూ కోల్పోలేదు. ఆ తర్వాత అడవిలో 5 రోజులు ఉండడం వల్ల ఆత్మావలోకనం చేసుకోవడం.. సమతూకమైన జీవన విధానాన్ని కొనసాగించడం అలవర్చుకున్నాను" అని మోదీ పేర్కొన్నారు. 'ది హ్యూమన్స్ ఆఫ్ బాంబే'కిచ్చిన ఇంటర్వ్యూలో భాగంగా 2 భాగాలు ఇదివరకే విడుదలయ్యాయి. ఇది 3వ భాగం.



నేతాజీ టోపీని మోదీకి ఇస్తున్న బోస్ కుటుంబ సభ్యులు

బోస్ మ్యూజియంప్రారంభం

నేతాజీ 122వ జయంతి సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మ్యూజియాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. న్యూఢిల్లీలోని ఎర్రకోట ప్రాంగణంలో బోస్ మ్యూజియంతో పాటు జలియన్ వాలా బాగ్, మొదటి ప్రపంచయుద్ధ, 1857-భారత తొలి స్వాతంత్ర్య సంగ్రామానికి సంబంధించిన మ్యూజియాలతో పాటు భారతీయ కళలపై ఏర్పాటు చేసిన దృశ్యకళ మ్యూజియంలను మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి నేతాజీ ధరించిన టోపీని బోస్ కుటుంబసభ్యులు బహూకరించారు. నేతాజీ ధరించిన టోపీని బహూకరించినందుకు ఆయన కుటుంబసభ్యులకు మోదీ ధన్యవాదాలు తెలుపుతూ ట్వీట్ చేశారు.

యూపీలో బీజేపీ సీట్లకు భారీ గండి

- 71 నుంచి 18కు పడిపోయే అవకాశం
- ఎస్పీ-బీఎస్పీల దెబ్బ.. అదీ కాంగ్రెస్ లేకుండానే!
- ఇండియా టుడే పోల్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 23: ప్రియాంక గాంధీ ప్రభావం మాట దేవుడెరుగు.. ఎస్పీ-బీఎస్పీ పొత్తొక్కటే బీజేపీకి విద్యుదాఘాతంలా మారే అవకాశాలున్నాయి. ఇండియా టుడే- కార్వీ ఇన్‌సైట్స్ సంయుక్తంగా 'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరిట నిర్వహించిన ప్రీపోల్ సర్వేలో బీజేపీ ఏకంగా 53 సీట్లను కోల్పోవచ్చు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో ఉన్న 80 సీట్లకుగాను బీజేపీ ఏకంగా 71 స్థానాలు గెల్చుకుని సంచలనం రేపింది. బీజేపీతో పొత్తు పెట్టుకున్న అప్నా దళ్ సైతం రెండు స్థానాలు గెల్చుకోవడంతో వారి బలం 73కు పెరిగింది. కాంగ్రెస్ ఆనాడు కేవలం అమేఠీ, రాయ్‌బరేలీల్లో మాత్రం గెలుపొందగలిగింది. ఎస్పీ-బీఎస్పీలు కూడా తుడిచిపెట్టుకుపోయాయి. ఇప్పుడు పరిస్థితి మారిందని, మోదీ-యోగీ మేజిక్ ఈసారి పనిచేయదని ఇండియా టుడే పోల్ సారాంశం. ఎస్పీ-బీఎస్పీ-ఆర్ఎల్డీ కూటమికి 58 సీట్లు రావొచ్చనీ, కాంగ్రెస్ 4 స్థానాలను సాధించవచ్చనీ అంచనా వేసింది. అంటే 2014 కంటే కాంగ్రెస్‌కు రెండు సీట్లు మాత్రమే అదనంగా వస్తాయన్నది సర్వే చెబుతున్న మాట. ఓట్ల శాతం 2014లో బీజేపీకి 42 శాతం వస్తే ఈసారి 36 శాతానికి పడిపోవచ్చనీ, ఎస్పీ-బీఎస్పీ-ఆర్ఎల్డీలకు 46 శాతం, కాంగ్రెస్‌కు 12 శాతం ఓట్లు రావచ్చనీ సర్వే వెల్లడించింది. ప్రియాంక రాజకీయ రంగ ప్రవేశ ప్రకటనకు ముందు జరిపిన సర్వే ఇది.



కారు అరలో రూ. 6.4 కోట్లు



తడ/నెల్లూరు (క్రైం), నరసాపురం, జనవరి 23: చెన్నై వైపు కారు అత్యంత వేగంతో దూసుకెళుతోంది. ఆ మార్గంలో విధుల్లో ఉన్న ఓ ఎస్ఐ దాసరి వెంకటేశ్వరరావుకి అనుమానం వచ్చి.. ఆ కారును సిబ్బందితో వెంబడించి ఆపి తనిఖీ చేశారు. కారు సీట్ల కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలో నగదు మూటలు ఉండటాన్ని గమనించారు. అన్నీ రెండు వేలు, 500 నోట్ల కట్టలే ఉన్నాయి. తైవాన్ సహా ఐదు దేశాలకు చెందిన సుమారు రూ.19,11,216 విలువైన విదేశీ కరెన్సీ, ఓ కవరులో 55 గ్రాముల బంగారు ముద్ద కనిపించాయి. వీటి విలువ మొత్తం రూ.6.40 కోట్లు అని ఎస్పీ ఐశ్వర్య తెలిపారు. బుధవారం తడ సమీపంలో ఈ ఘటన జరిగింది.

గెస్ట్‌హౌస్‌లో 11 మంది హత్య!

చంపేయమని కిషన్‌రెడ్డే ఆదేశించారు.. నేను తప్పించుకొని అమెరికా వెళ్లా

- కవరప్ కోసం కిషన్‌బాగ్ అల్లర్లు
- ప్రాజెక్ట్ ఎంఎస్17లో మేం సభ్యులం
- సయ్యద్ సుజా పత్రాల్లో సంచలనం
- బయట పెట్టిన కపిల్ సిబ్బల్





న్యూఢిల్లీ, జనవరి 23: ఈవీఎంల హ్యాకర్‌గా, సైబర్ నిపుణుడిగా చెప్పుకొంటున్న సయ్యద్ సుజా మరికొన్ని విశృంఖల, అసంబద్ధ ఆరోపణలను సంధించాడు. " గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చా..? అనే విషయమై సాంకేతిక అధ్యయనం చేయాలని ఓ ప్రాజెక్టు అప్పగించారు. దాని పేరు "ప్రాజెక్ట్ ఎంఎస్7బీ". మా టీమ్‌లో మొత్తం 13 మంది సభ్యులు. చేయవచ్చని నిరూపిస్తూ మేం మాకు అప్పగించిన పనిని పూర్తి చేశాం.. ఆ మరుసటి రోజే... మమ్మల్నందరినీ హైదరాబాద్‌లోని ఓ నాయకుడు పిలిపించాడు. వెళ్లిన వెంటనే మా అందరిపై గన్‌మెన్‌తో కాల్పులు జరిపించాడు. 11 మంది అక్కడికక్కడే చనిపోయారు. నేను తప్పించుకున్నాను.." అని సుజా పేర్కొన్నాడు.

ఆ కాల్పులు జరపమని ఆదేశించిన వ్యక్తి...	బీజేపీ నాయకుడు జీ కిషన్ రెడ్డి
ప్రదేశం...	ఉప్పల్ సమీపంలో ఉన్న అతని బావమరిది కాకిరెడ్డి గెస్ట్ హౌస్
అక్కడికి రమ్మని మాకు చెప్పినది...	విన్ సొల్యూషన్స్ అనే సంస్థ అధినేత కమల్ రావు

సయ్యద్ సుజా ఈ వివరాలు వెల్లడించినట్లు కాంగ్రెస్ నేత కపిల్ సిబ్బల్ మంగళవారం రాత్రి లండన్‌లో మీడియాకు చెబుతూ- సుజా ఈ మెయిల్ ద్వారా పంపిన కొన్ని పత్రాలను మీడియా ప్రతినిధులకు అందజేశారు.

ఆ పత్రాల్లోని కీలక అంశాలివి...

- సయ్యద్ సుజా వయసు 37 సంవత్సరాలు. తలిదండ్రుల పేర్లు : యూసఫ్ అహ్మద్ సయ్యద్, ఖుదీసా సయీదా. తండ్రి బెల్‌లో ఉద్యోగి.
- సుజా హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఆర్ఎఫ్ (రేడియో ఫ్రీక్వెన్సీ) కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్ చేశారు. మ్యాథ్స్‌లో మైనర్ పీహెచ్‌డీ పూర్తయింది. 2009లో విన్ సొల్యూషన్స్‌లో చేరారు.
- తదుపరి జనరేషన్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) తయారీకి సంబంధించిన ప్రాజెక్టును ఈసీఐఎల్... విన్ సొల్యూషన్ అనే కంపెనీకి అప్పగించింది. ఇది కమల్‌రావు అనే వ్యక్తికి సంబంధించిన సంస్థ. ఈ ప్రాజెక్టు పేరు ఎంఎస్7బీ. ఇందులో పని చేసిన 13 మందిలో సయ్యద్ సుజా ఒకరు.
- ఈసీఐఎల్ ప్రధాన కార్యాలయం ఉన్న సనత్‌నగర్ ప్రాంతంలోనే వేర్వేరు చోట్ల వీరు పని చేశారు. (నిజానికి ఈసీఐఎల్ సనత్‌నగర్‌లో లేదు.. కాప్రాలో ఉంది)
- 2014 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మే 12న ముగిసింది. ఆ మరుసటి రోజే... అంటే మే 13వ తేదీ ఉదయం ప్రాజెక్ట్ ఎంఎస్7బీ సభ్యులు హైదరాబాద్ ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజీ సమీపంలో ఉన్న కాకిరెడ్డి అనే వ్యక్తి గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు. అది... బీజేపీ నేత కిషన్ రెడ్డి బావది. వారున్న గదిలోకి కమల్ రావు, కిషన్ రెడ్డి, మరొకరు వచ్చారు. వచ్చీ రాగానే... 'చంపేయ్ అందరినీ' అని కిషన్ రెడ్డి ఆదేశించారు. అంతే... బుల్లెట్ల వర్షం కురిసింది. 11 మంది చనిపోయారు.
- ఈ ఘటనలో సయ్యద్ సుజాకు కూడా బుల్లెట్ గాయాలయ్యాయి. "అందరినీ వ్యాన్‌లో తరలించారు. వ్యాన్ ఒకచోట ఆగినప్పుడు నేను తప్పించుకున్నాను. రాత్రంతా ఒక ట్రక్‌లో ఉన్నాను. మిగిలిన వారితో పోల్చితే నా రక్తం త్వరగా గడ్డకడుతుంది. దీనిని గోల్డెన్ టైప్ బ్లడ్ అంటారు. అందుకే, ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం రాలేదు. మే 15వ తేదీన ఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానం ద్వారా షికాగోకు వెళ్లాను" అని సుజా చెప్పారు.
- అక్కడ సుజా 18 రోజులు ఆస్పత్రిలో, 16 రోజులు పోలీసుల అదుపులో (డిటెన్షన్) ఉన్నారు. 2014 జూన్ 17న విడుదలయ్యారు.
- తన పిల్లలు, తల్లిదండ్రుల గురించి ఒక స్నేహితుడికి ఫోన్ చేసి ఆరా తీయగా... "మీ ఇల్లు తలగలబడింది. మీ అమ్మానాన్న ఇద్దరూ సజీవ దహనమయ్యారు. భార్యాపిల్లలు కనిపించడంలేదు" అనే సమాధానం వచ్చింది. 2014 మే 17వ తేదీన గృహ దహనం జరిగింది.
- ఈ వివాదంలో వంశీ రెడ్డి అనే ఎంబెడెడ్ టెక్నాలజీ నిపుణుడిని కూడా హత్య చేసినట్లు సుజా తెలిపారు. "వీవీప్యాట్‌లో లోపాన్ని (బగ్)ను సరిచేయాలని కోరేందుకు వంశీరెడ్డి నా వద్దకు వచ్చారు. నేను మాత్రమే ఆ పని చేయగలిగాను. ఆ తర్వాత వంశీరెడ్డిని కూడా చంపేశారు. (వంశీరెడ్డి బస్సు ఢీకొట్టడంతో చనిపోయినట్లు ఈ పత్రంలో ఉంది.)

సుజాపై ఢిల్లీ పోలీసుల కేసు

న్యూఢిల్లీ, జనవరి 23: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రా(ఈవీఎం)ల హ్యాకింగ్ ఆరోపణలపై భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) చేసిన ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈవీఎంలను హ్యాక్ చేసి 2014 ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిందని, ఆ క్రమంలో ఈ వివరాలు తెలిసిన అందర్నీ హత్య చేయించిందని సైబర్ నిపుణుడు సయ్యద్ సుజా ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇదంతా ఉద్దేశపూర్వక దుష్ప్రచారమని, ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఈసీ ఫిర్యాదు చేసింది. దీని ఆధారంగా పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

సుజా ఆరోపణలు సత్యదూరం!

'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెల్లడి

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ హ్యాకర్‌గా చెప్పుకొంటున్న సయ్యద్ సుజా ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. బీజేపీ మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తనతో సహా 13 మందిని చంపేయాలని ఆదేశించినట్లు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనలో 11 మంది మరణించారని, తాను మాత్రం తప్పించుకుని అమెరికా వెళ్లానని చెప్పారు. మొదట కిషన్‌బాగ్ కాల్పుల్లో ముగ్గురు చనిపోయారని చెప్పిన సుజా.. తాజాగా 11 మంది హత్యకు గురయ్యారని తీవ్ర ఆరోపణలు చేశారు. విన్ సొల్యూషన్ కంపెనీ ద్వారా ఈసీఐఎల్‌కు తాము సాంకేతిక సహకారం అందించామన్నారు. కాగా, సుజా ఆరోపణలు అప్పటి పరిస్థితులతో ఏ మాత్రం సరిపోలడం లేదు. ఈ విషయం 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో తేలింది.

సయ్యద్ సుజా ఏం ఆరోపించారంటే..	'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో తేలిందేంటంటే..
బీజేపీ మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి బావమరిది కాకిరెడ్డి.	కిషన్‌రెడ్డికి కాకిరెడ్డి పేరుతో బావమరిది లేడు. ఆయన బావమరిది శ్రీనివాస్‌రెడ్డి. ప్రస్తుతం మలక్‌పేటలో ఉంటున్నారు.
కాకిరెడ్డికి ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజీ సమీపంలో గెస్ట్‌హౌస్.	కాకిరెడ్డి పేరిట అక్కడ ఎలాంటి గెస్ట్‌హౌస్ లేదు. అసలు అక్కడ కాకిరెడ్డి పేరుతో ఎవరూ నివసించడం లేదని జీహెచ్ఎంసీ వర్గాలు తెలిపాయి.
కిషన్‌రెడ్డి బావమరిది గెస్ట్‌హౌస్‌లో మే 13, 2014న తనతో సహా 13 మందిని చంపాలని గన్‌మెన్లను ఆదేశించారు. 11 మంది మరణించారు.	పోలీస్ రికార్డుల ప్రకారం.. ఆ రోజున ఎవరూ హత్యకు గురవలేదు. అంతేకాదు 11 మంది అదృశ్యమైనట్లు రాష్ట్రంలో ఎక్కడా కేసులు నమోదవలేదని పోలీస్ శాఖ స్పష్టం చేసింది.
విన్ సొల్యూషన్ కంపెనీలో పనిచేశాం. ఆ కంపెనీ ద్వారా ఈసీఐఎల్‌కు సాంకేతిక సాయమందించాం.	హైదరాబాద్‌లో విన్ సొల్యూషన్ పేరిట కంపెనీయే లేదు. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వెబ్‌సైట్‌లోనూ వివరాల్లేవు.
11 హత్యలను కప్పిపుచ్చేందుకు కిషన్‌బాగ్‌లో బీజేపీ అల్లర్లకు కుట్ర పన్నింది.	కిషన్‌బాగ్ అల్లర్లలో ఎలాంటి కుట్ర కోణం లేదని సైబరాబాద్ పోలీసులు చెప్పారు.
షాదన్ కాలేజీలో బీటెక్, జేఎన్‌టీయూలో ఆర్ఎఫ్‌లో ఇంజనీరింగ్ చేశా.	సుజా బీటెక్, ఆర్ఎఫ్ విద్యాభ్యాసానికి సంబంధించి ఆధారాలు లభించలేదు.
తండ్రి యూసఫ్ అహ్మద్ సయ్యద్.. ఆయన బీహెచ్ఈఎల్‌లో ఏఈగా పనిచేశారు.	యూసఫ్ అహ్మద్ సయ్యద్ పేరుతో బీహెచ్ఈఎల్ సంస్థలో ఎవరూ పనిచేయలేదు.
నా ఇంటిని తగులబెట్టినట్లు స్నేహితుడు ఒక పత్రిక క్లిప్పింగ్ పంపాడు, ఆ ప్రమాదంలో తల్లిదండ్రులు మరణించారు.	2014 మే 10 నుంచి 14 వరకు తెలంగాణలో ఎలాంటి తీవ్ర అగ్నిప్రమాదాలు జరగలేదని ఫైర్ గణాంకాలు చెబుతున్నాయి.
ఈసీఐఎల్ కేంద్ర కార్యాలయం సనత్‌నగర్‌లో ఉంది. అక్కడ్నుంచే కార్యకలాపాలు కొనసాగించాం.	ఈసీఐఎల్ కేంద్ర కార్యాలయం సనత్‌నగర్‌లో లేదు. కాప్రాలో ఉంది.
విన్ సొల్యూషన్‌లో సహోద్యోగి వంశీరెడ్డి సెప్టెంబరు 9, 2018న బస్సు ప్రమాదంలో మరణించాడు.	ఆ రోజున గచ్చిబౌలిలో బస్సు ప్రమాదం జరగలేదు. మరుసటి రోజు ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురు చనిపోయారు. అందులో వంశీరెడ్డి లేడు.

ఇంగ్లండ్ X వెస్టిండీస్	ఆస్ట్రేలియా X శ్రీలంక	భారత్ X న్యూజిలాండ్
తొలి టెస్ట్ - రెండో రోజు	తొలి టెస్ట్ - తొలి రోజు	మహిళల తొలి వన్డే
రా. 7.30 నుంచి సోనీ టెన్-1లో...	ఉ. 8.30 నుంచి సోనీ టెన్-3లో...	ఉ. 6.30 నుంచి స్టార్ స్పోర్ట్స్ 1లో..

ఆస్ట్రేలియా పర్యటన జోరును న్యూజిలాండ్ సిరీస్‌లోనూ భారత్ కొనసాగిస్తోంది. పేసర్ మహ్మద్ షమీ ఆదిలోనే స్వింగ్, సీమ్‌తో ప్రత్యర్థిని బెంబేలెత్తిస్తే చాలాకాలం తర్వాత కలిసి ఆడిన రిస్ట్ స్పిన్నర్లు చాహల్, కుల్దీప్ మిడిలార్డర్, టెయిలెండర్ల పని పట్టేశారు. దాంతో స్వల్ప స్కోరుకే కివీస్ చేతులెత్తేయగా..చిన్నపాటి లక్ష్యాన్ని కోహ్లీసేన ఆడుతూ పాడుతూ ఛేదించింది. అద్భుత ఇన్నింగ్స్‌తో ధవన్ ఫామ్‌లోకి రాగా కెప్టెన్ కోహ్లీ ఎప్పటిలాగానే సొగసైన ఇన్నింగ్స్ ఆడాడు.


మహ్మద్ షమీ (3/19)

ఆరంభం అదిరె..

తొలి వన్డేలో న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం

అదరగొట్టిన షమీ, కుల్దీప్, ధవన్


కుల్దీప్ (4/39)

2009 తర్వాత న్యూజిలాండ్‌లో భారత్ తొలి వన్డే గెలుపు

1

వన్డేల్లో అత్యంత వేగంగా 100 వికెట్లు (56 మ్యాచ్‌లు) తీసిన భారత బౌలర్ షమీ

నేపియర్: మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ షమీ (3/19) సీమ్ బౌలింగ్‌తో, కుల్దీప్ యాదవ్ (4/39) స్పిన్‌తో మెరుపులు మెరిపించిన వేళ.. న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్.. భారత బౌలర్ల ధాటికి 38 ఓవర్లలోనే 157 పరుగులకే చాపచుట్టేసింది. కెప్టెన్ కేన్ విలియమ్సన్ (81 బంతుల్లో 7 ఫోర్లతో 64) హాఫ్ సెంచరీ చేయగా రాస్ టేలర్ (24) పర్లేదనిపించాడు. అయితే సూర్యకిరణాలు నేరుగా బ్యాట్స్‌మెన్ కళ్లలో పడుతుండడంతో భోజన విరామం తర్వాత ఆటను అరగంటసేపు నిలిపి వేశారు. దాంతో డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం టీమిండియా లక్ష్యాన్ని 49 ఓవర్లలో 156 పరుగులుగా నిర్ధారించారు. ఆ లక్ష్యాన్ని భారత్ ఇంకా 85 బంతులు మిగిలుండగానే కేవలం రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ధవన్ (103 బంతుల్లో 6 ఫోర్లతో 75 నాటౌట్) మళ్లీ ఫామ్‌లోకి రాగా, కోహ్లీ (59 బంతుల్లో 3 ఫోర్లతో 45) అదే జోరు కొనసాగించాడు. ఈ గెలుపుతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. రెండో మ్యాచ్ శనివారం జరగనుంది.

రోహిత్ త్వరగా అవుటైనా..: లక్ష్యం చిన్నపాటిదే అయినా తొలుత రోహిత్, ధవన్ ఆచితూచి ఆడారు. అయితే 4వ ఓవర్లో సౌథీ బౌలింగ్‌లో ఫోర్ కొట్టిన ధవన్ ఆపై అతడి ఓవర్లోనే రెండు అద్భుత బౌండ్రీలతో అలరించాడు. ఆస్ట్రేలియాతో చివరి రెండు వన్డేల్లో విఫలమైన రోహిత్ (11) ఈ మ్యాచ్‌లోనూ నిరాశపరిచాడు. ఆడుతూ పాడుతూ బ్యాటింగ్ చేసిన కోహ్లీ-ధవన్ వీలు వచ్చినప్పుడు ఫోర్లు కొడుతూ జట్టును లక్ష్యం దిశగా నడిపించారు. ఈ క్రమంలో 23వ ఓవర్లో ధవన్ వన్డేల్లో 26వ అర్ధసెంచరీ చేశాడు. 25వ ఓవర్లో సౌథీ బౌలింగ్‌లో కోహ్లీ 37 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అంపైర్ అతడిని ఎల్బీగా ప్రకటించాడు. కానీ బంతి బ్యాట్‌ను తాకిందంటూ కోహ్లీ సమీక్ష కోరి విజయం సాధించాడు. అయితే కొద్దిసేపటికే ఫెర్గ్యూసన్ బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి విరాట్ నిష్క్రమించాడు. తర్వాత రాయుడు (13 నాటౌట్), ధవన్ జట్టును గెలుపు వైపు నడిపించారు.


శిఖర్ ధవన్ (103 బంతుల్లో 6 ఫోర్లతో 75 నాటౌట్)

వన్డేల్లో వేగంగా ఐదు వేల పరుగులు పూర్తి చేసుకున్న రెండో భారత ఆటగాడు ధవన్ (118 ఇన్నింగ్స్‌ల్లో). కోహ్లీ (114 ఇన్నింగ్స్‌ల్లో) ముందున్నాడు.

2

వణికించిన షమీ: టాస్ గెలిచిన కివీస్ సారథి విలియమ్సన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకోవడం ఆశ్చర్యపరిచింది. పిచ్‌నుంచి అందిన కొద్దిపాటి సహకారాన్ని సద్వినియోగం చేసుకున్న షమీ వికెట్లే లక్ష్యంగా బంతులు విసిరి ఓపెనర్లు గప్టిల్, మున్రోలను వణికించాడు. ముఖ్యంగా తన తొలి ఓవర్‌ను షమీ అద్భుతంగా వేశాడు. స్వింగ్, సీమ్‌తో గప్టిల్ (5)ను గుక్కతిప్పుకోనివ్వకుండా చేసి ఐదో బంతికి అతడిని ఎల్బీగా బలిగొన్నాడు. అదే ఊపుతో తన రెండో ఓవర్లో ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ మున్రో (8)ను మరో అద్భుత బంతితో బౌల్డ్ చేశాడు. 18/2తో ఇబ్బందుల్లో పడిన జట్టును విలియమ్సన్, రాస్ టేలర్ ఆదుకొనే ప్రయత్నం చేశారు. వీరు కుదురుకుంటున్న తరుణంలో తెలివైన బౌలింగ్‌తో టేలర్, లాథమ్ (11)లను రిటర్న్ క్యాచ్‌లతో చాహల్ అవుట్ చేశాడు. దాంతో 76/4తో కివీస్ తీవ్ర కష్టాల్లో పడింది. శంకర్ బౌలింగ్‌లో కేదార్ జాదవ్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన విలియమ్సన్ 26వ ఓవర్లో వన్డేల్లో 36వ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. తర్వాత కుల్దీప్ యాదవ్ తిప్పేయడంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 160 పరుగుల్లోపే ముగిసింది.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్: గప్టిల్ (ఎల్బీ) షమి 5, మున్రో (బి) షమి 8, విలియమ్సన్ (సి) శంకర్ (బి) కుల్దీప్ 64, టేలర్ (సి అండ్ బీ) చాహల్ 24, లాథమ్ (సి అండ్ బీ) చాహల్ 11, నికోల్స్ (సి) కుల్దీప్ (బి) కేదార్ జాదవ్ 12, శాంట్నర్ (ఎల్బీ) షమీ 14, బ్రేస్‌వెల్ (బి) కుల్దీప్ 7, సౌథీ (నాటౌట్) 9, ఫెర్గ్యూసన్ (స్టంప్డ్) ధోనీ (బి) కుల్దీప్ 0, బౌల్ట్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 1, **ఎక్స్‌ట్రాలు 2, మొత్తం: 38 ఓవర్లలో 157 ఆలౌట్. వికెట్లపతనం:** 1/5, 2/18, 3/52, 4/76, 5/107, 6/133, 7/146, 8/146, 9/148, 10/157

బౌలింగ్: భువనేశ్వర్ 5-0-20-0, షమీ 6-2-19-3, విజయ్ శంకర్ 4-0-19-0, చాహల్ 10-0-43-2, కుల్దీప్ 10-1-39-4, కేదార్ జాదవ్ 3-0-17-1

భారత్: రోహిత్ (సి) గప్టిల్ (బి) బ్రేస్‌వెల్ 11, ధవన్ (నాటౌట్) 75, కోహ్లీ (సి) లాథమ్ (బి) ఫెర్గ్యూసన్ 45, రాయుడు (నాటౌట్) 13, **ఎక్స్‌ట్రాలు 12, మొత్తం: 34.5 ఓవర్లలో 156/2. వికెట్లపతనం :** 1/41, 2/132 **బౌలింగ్:** బౌల్ట్ 6-1-19-0, సౌథీ 6.5-0-36-0, ఫెర్గ్యూసన్ 8-0-41-1, బ్రేస్‌వెల్ 7-0-23-1, శాంట్నర్ 7-0-32-0

విరాట్‌కు విశ్రాంతి



కివీస్‌తో చివరి రెండు వన్డేలు, టీ20 సిరీస్‌కు దూరం

నేపియర్: వరుస సిరీస్‌లలో జట్టుకు విజయాలు అందించిన టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీకి సెలెక్టర్లు కాస్త విశ్రాంతి ఇచ్చారు. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో చివరి రెండు మ్యాచ్‌లతో పాటు మూడు టీ20ల సిరీస్‌కు విరాట్ దూరం కానున్నాడు. గత కొన్ని నెలలుగా విరామం లేకుండా ఆడుతున్న కోహ్లీపై పనిభారం తగ్గించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు బీసీసీఐ ప్రకటించింది. విరాట్ స్థానంలో వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ సారథ్య బాధ్యతలు చేపడతాడని బోర్డు తెలిపింది. దీంతో కివీస్‌తో మరో రెండు వన్డేల్లో మాత్రమే విరాట్ ఆడనున్నాడు. నిరుడు జరిగిన ఆసియా కప్‌లోనూ ఇలాగే విరాట్ విశ్రాంతి తీసుకోవడంతో రోహిత్ జట్టు పగ్గాలు స్వీకరించాడు. కివీస్ టూర్ తర్వాత ఆస్ట్రేలియాతో భారత్ స్వదేశంలో పరిమిత ఓవర్ల సిరీస్ ఆడనుంది. వెంటనే ఐపీఎల్ ఉంటుంది. ఆ తర్వాత మే చివరి నుంచి కీలకమైన ప్రపంచ కప్ మొదలవనుంది. దీంతో విరాట్ విశ్రాంతికి ఇదే సరైన సమయమని భావించినట్టు బీసీసీఐ వెల్లడించింది.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మ్యాచ్ పాయింట్‌పై నిలిచిన సెరెనా గెలుపు వాకిట బోల్తా పడగా.. ఓటమి అంచున నిల్చున్న ప్లిస్కోవా అద్భుత పోరాటంతో సెమీస్‌కు దూసుకెళ్లింది. స్వితోలినాపై గెలుపుతో తుది నలుగురి జాబితాకు చేరుకున్న ఒసాకా.. ప్లిస్కోవాకు సవాల్ విసరనుంది. ప్రత్యర్థి నిషికోరి రిటైర్డ్ హర్ట్ కావడంతో టాప్ సీడ్ జొకోవిచ్ టైటిల్‌కు చేరువయ్యాడు. లూయిస్ పౌలీ కూడా సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్నాడు.

సెమీ ఫైనల్స్ నేడు

మహిళల సింగిల్స్ (ఉ. 8.30 తర్వాత)
క్విటోవా x కొలిన్స్
ప్లిస్కోవా x ఒసాకా

పురుషుల సింగిల్స్ (మ. 2.00 తర్వాత)
నడాల్ x సిట్సిపాస్
(సోనీ సిక్స్, సోనీ టెన్-2లో)


సెరెనా

సెరెనాకు షాక్

క్వార్టర్స్‌లో ప్లిస్కోవా గెలుపు
సెమీస్‌కు జొకోవిచ్, పౌలీ, ఒసాకా
ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: మార్గరెట్ కోర్ట్ 24 గ్రాండ్‌స్లామ్‌ల రికార్డును సమం చేయాలన్న అమెరికా టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్ ఆశలకు బ్రేక్ పడింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఉత్కంఠభరితంగా జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో మ్యాచ్ పాయింట్‌పై నిలిచిన సెరెనా.. నాటకీయ రీతిలో చెక్ ప్లేయర్ కరోలినా ప్లిస్కోవా చేతిలో ఓడి ఇంటిముఖం పట్టింది. ఆఖరి సెట్‌లో 5-1తో ఆధిక్యంలో ఉన్న సెరెనా.. వరుసగా ఆరు గేమ్‌లు చేజార్చుకుని టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సెరెనా 4-6, 6-4, 5-7తో ప్లిస్కోవా చేతిలో పరాజయం చవిచూసింది. 37 అనవసర తప్పిదాలు చేసిన సెరెనా అందుకు తగ్గ మూల్యం చెల్లించుకుంది. 'సమయం గడచిపోతున్నా.. మరో మేజర్ విజయం సాధ్యమే. విరామం తర్వాత గతంలోలా ఆడడం కష్టమే. కానీ, గెలవాలని ఎంతో ప్రయత్నించినా.. ఓడడం నిరాశ కలిగించింది. కుంటి సాకులు చెప్పడం నాకు నచ్చదు.. కానీ, ఓటమిని నేను తేలిగ్గా తీసుకోలేను. ప్లిస్కోవా అద్భుతంగా ఆడింది. మ్యాచ్ పాయింట్‌పై ఉన్నప్పుడు మరోసారి వదిలిపెట్టను' అని ఓటమి అనంతరం సెరెనా వ్యాఖ్యానించింది. సెమీఫైనల్లో జపాన్ యువ సంచలనం నవోమి ఒసాకాతో ప్లిస్కోవా తలపడనుంది. మరో క్వార్టర్స్ మ్యాచ్‌లో నాలుగో సీడ్ ఒసాకా 6-4, 6-1తో ఎలెనా స్వితోలినా (ఉక్రెయిన్)ను చిత్తు చేసింది. గాయంతో బాధపడుతున్న స్వితోలినా.. ఒసాకాకు ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది.


కరోలినా ప్లిస్కోవా

జొకో ముందుకు..

రెండేళ్లపాటు ఆస్ట్రేలియా ఓపెన్‌కు దూరంగా ఉన్న వరల్డ్ నెం.1 నొవాక్ జొకోవిచ్ సెమీస్‌కు చేరుకున్నాడు. ప్రత్యర్థి కీ నిషికోరి (జపాన్) గాయంతో వైదొలగడంతో నొవాక్ టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచాడు. క్వార్టర్స్‌లో జొకోవిచ్ 6-1, 4-1తో ఆధిక్యంలో ఉన్న సమయంలో నిషికోరి రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. తొలి సెట్‌లోనే నిషికోరి తొడ కండరాలు పట్టేశాయి. కానీ, చికిత్స చేయించుకుని మళ్లీ బరిలోకి దిగాడు. తర్వాత 4-1తో జొకో ఆధిక్యంలోకి దూసుకెళ్లడంతో.. ఇక తన వల్లకాదని నిషికోరి చేతులెత్తేశాడు. 18 ముఖాముఖి మ్యాచ్‌ల్లో నిషికోరిపై నొవాక్‌కు 16వ విజయం. శుక్రవారం జరిగే రెండో సెమీఫైనల్లో 28వ సీడ్ లూకాస్ పౌలీ (ఫ్రాన్స్)తో జొకోవిచ్ తలపడనున్నాడు. మరో క్వార్టర్స్‌లో లూకాస్ పౌలీ 7-6(4), 6-3, 6-7(2), 6-4తో 16వ సీడ్ మిలోస్ రవోనిక్ (కెనడా)ను ఓడించాడు.

వరుణుడు కాదు..సూర్యుడే..



సాధారణంగా క్రికెట్ మ్యాచ్‌లకు వరుణుడు అడ్డు తగులుతుంటాడు. ఇలా ఆగిన మ్యాచ్‌లు ప్రపంచ క్రికెట్‌లో లెక్కలేనన్నే ఉన్నాయి. కానీ మ్యాచ్‌ను సూర్యుడు అడ్డుకున్న వింత ఉదంతం భారత్-కివీస్ తొలి వన్డేలో బుధవారం చోటుచేసుకుంది. మనకు కొత్తయినా నేపియర్ వాసులకు ఇలాంటివి సహజమే. దేశాలన్నింటిలో పిచ్‌లు ఉత్తర, దక్షిణాభిముఖంగా ఉంటాయి. అయితే నేపియర్‌లో పిచ్ తూర్పు, పడమర ముఖంగా ఉంది. దాంతో సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో సూర్యకిరణాలు నేరుగా బ్యాట్స్‌మెన్ కళ్లలో పడుతుంటాయి. అలాంటి సందర్భాల్లో సూర్యకాంతి పూర్తిగా తగ్గిపోయే వరకూ మ్యాచ్‌లను ఆపివేస్తారు. మొదటి వన్డేలో ఇలానే అరగంటపాటు మ్యాచ్ నిలిచిపోయింది.

నా జీవితంలో ఇలా జరగలేదు..: సూర్యుడి వల్ల మ్యాచ్ ఆగిన సంఘటన తన జీవితంలో ఇంతదాకా చూడలేదని కెప్టెన్ కోహ్లీ కూడా ఆశ్చర్యం ప్రకటించాడు. 'ఇది వింతగా ఉంది. సూర్యుడి కాంతి కళ్లలో పడి 2014లో నేను అవుటయ్యా. అప్పుడు ఇలాంటి నిబంధన లేదు' అని విరాట్ వెల్లడించాడు.

1980లో సూర్య గ్రహణంతో..: బీసీసీఐ స్వర్ణోత్సవాల సందర్భంగా 1980 ఫిబ్రవరిలో భారత్-ఇంగ్లండ్ మధ్య ప్రత్యేక టెస్ట్ మ్యాచ్ నిర్వహించారు. అయితే సంపూర్ణ సూర్యగ్రహణంతో ఆట రెండో రోజు సెలవిచ్చారు. తొలిరోజు 6/58తో చెలరేగిన ఇయాన్ బోథమ్..విశ్రాంతితో మరింత పుంజుకొని సెంచరీ చేయడంతోపాటు మరో ఏడు వికెట్లు పడగొట్టాడు. ఆ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 10 వికెట్లతో నెగ్గింది.

బంతులు లేక..: 1981-82లో భారత్-ఇంగ్లండ్ మధ్య ఢిల్లీలో జరిగిన టెస్ట్ మూడోరోజు ఆట ఆలస్యంగా మొదలైంది. బంతులున్న కప్‌బోర్డు తాళం చేతులు అంపైర్ మర్చిపోవడంతో ఆట ఆలస్యంగా ప్రారంభమైంది.

వరాహంతో..: హైదరాబాద్‌లో గతంలో ఎల్బీ, ప్రస్తుత ఉప్పల్ స్టేడియాల్లో శునకాలు క్రికెట్ మ్యాచ్‌లకు ఆటంకం కల్పించడం తెలిసిందే. కానీ 1889లో వర్సెస్టర్‌షైర్-డర్బీషైర్ మ్యాచ్‌లో పంది మైదానంలోకి రావడంతో ఆటంకం ఏర్పడింది.

మంచువల్ల..: విపరీతమైన మంచు కారణంగా 1975, జూన్ 2న బుక్స్‌టన్‌లో డెర్బీషైర్-లాంక్‌ షైర్ మధ్య చాంపియన్‌షిప్ మ్యాచ్ జరగలేదు.

ఎలుక కారణంగా..: 1962లో లార్డ్స్‌లో ఇంగ్లండ్-పాకిస్థాన్ టెస్ట్ సందర్భంగా మైదానంలోకి ఎలుక రావడంతో ఆటకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

బాంబు కలకలం..: 1944 జూలై..రెండో ప్రపంచ యుద్ధ కాలం. లార్డ్స్‌లో ఆర్మీ-రాయల్ ఎయిర్‌ఫోర్స్ మ్యాచ్ సందర్భంగా జర్మనీ యుద్ధ విమానం డూడూల్‌బగ్ గ్రౌండ్‌లో దిగేలా కనిపించింది. దాంతో ఆటగాళ్లంతా మైదానంలో పడుకోగా..అభిమానులను స్టాండ్లనుంచి ఖాళీ చేయించారు.

గెలుపే లక్ష్యంగా..

నేడు కివీస్‌తో భారత్ తొలి వన్డే
ఉదయం 6.30 గం.నుంచి

నేపియర్: న్యూజిలాండ్ పర్యటనలో మూడు వన్డేల సిరీస్‌కు భారత మహిళల జట్టు సిద్ధమైంది. గురువారం జరగనున్న తొలి వన్డేలో కివీస్‌తో టీమిండియా తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో శుభారంభం చేయాలని మిథాలీ సేన పట్టుదలగా ఉంది. రమేష్ పొవార్ స్థానంలో కోచ్‌గా డబ్ల్యూవీ రామన్ బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. టీ20 ప్రపంచ కప్ సెమీస్‌లో తనను తప్పించిన వివాదాన్ని మరిచి ఈ సిరీస్‌పైనే పూర్తిస్థాయిలో దృష్టిపెట్టనున్నట్టు కెప్టెన్ మిథాలీ ప్రకటించింది. ఈ సిరీస్‌లో గెలిచి ఐసీసీ చాంపియన్‌షిప్‌లో ఐదో స్థానాన్ని మెరుగుపర్చుకోవాలని భారత్ భావిస్తోంది. గతేడాది టీ20 వరల్డ్‌కప్‌లో కివీస్‌ను ఓడించిన ఆత్మవిశ్వాసంతో టీమిండియా బరిలోకి దిగనుంది. అయితే సొంతగడ్డపై ఆ జట్టును ఓడించడం పర్యాటక జట్టుకు సవాలే. స్మృతి మంధాన, తానియా, మోనా, మిథాలీతో బ్యాటింగ్ విభాగం పటిష్ఠంగా ఉంది. మరోవైపు ఐసీసీ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానంలో ఉన్న కివీస్ ఈ సిరీస్ గెలిస్తే నేరుగా 2021 వరల్డ్‌కప్‌నకు అర్హత సాధిస్తుంది. స్వదేశీ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటామని కెప్టెన్ అమీ శాటర్త్‌వెయిట్ ఆశాభావం వ్యక్తం చేసింది.


మిథాలీ


శాటర్త్‌వెయిట్

పంజాబ్ మరో గెలుపు

లూథియానా: ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో పంజాబ్ రాయల్స్ మరో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 4-3తో ఎంపీ యోధపై గెలిచింది. 3-3తో స్కోరు సమం కాగా.. నిర్ణాయక 65 కిలోల బౌట్‌లో బజరంగ్ పూనియా 8-6తో హాజి అలియేవ్‌పై నెగ్గి పంజాబ్‌ను గెలిపించాడు. అంతకుముందు 86 కిలోల్లో పంజాబ్ రెజ్లర్ మర్వగిష్‌విలి 8-0తో దీపక్‌పై నెగ్గాడు. మహిళల 53 కిలోల్లో అంజు 6-4తో రితు ఫొగట్‌పై, 125 కిలోల్లో కోరె జార్విస్ 6-0తో ఆకాష్ ఆంటిల్‌పై గెలిచి రాయల్స్‌ను 3-0తో నిలిపారు. అయితే, తర్వాత జరిగిన మహిళల 62 కిలోల్లో ఎలిస్ మనోలా 3-0తో అంజుపై, 57 కిలోల్లో సందీప్ తోమర్ 4-2తో నితిన్ రాఠీపై నెగ్గి ఎంపీని 2-3తో నిలిపారు. మహిళల 57 కిలోల్లో యోధ రెజ్లర్ పూజా ధండా 9-3తో ప్రిస్టోవాపై గెలిచి స్కోరు సమం చేసింది.

ఒరేయ్ నల్లోడా..!

పెహ్లుక్వాయోపై సర్ఫరాజ్ జాతి వివక్ష వ్యాఖ్యలు

డర్బన్: పాకిస్థాన్ క్రికెట్ జట్టు కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ పత్యర్థి జట్టు ఆటగాడిపై నోరు పారేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో మంగళవారం రాత్రి జరిగిన రెండో వన్డే సందర్భంగా ఆల్‌రౌండర్ పెహ్లుక్వాయోపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేశాడు. సఫారీల ఇన్నింగ్స్ 37వ ఓవర్‌లో పెహ్లుక్వాయో బ్యాటింగ్‌తో తీవ్ర అసహనానికి గురైన సర్ఫరాజ్.. ఒరేయ్ నల్లోడా.. మీ అమ్మ ఇప్పుడెక్కడ కూర్చుంది. నీకు ఏం కావాలని ఆమెను ప్రార్థించమన్నావ్' అని ఉర్దూలో దూషించిన వ్యాఖ్యలు స్టంప్స్ మైక్‌లో రికార్డయ్యాయి. ఆ సమయంలో కామెంట్రీ చేస్తున్న మైక్ హెస్మన్.. సర్ఫరాజ్ ఏమన్నాడంటూ తన పక్కనే ఉన్న రమీజ్ రజాను అడగడం.. అందుకు అతను అది చాలా పెద్ద వాక్యం, చెప్పడం కష్టమంటూ సమాధానమివ్వడం కనిపించింది.

సఫారీల విజయం: ఈ మ్యాచ్‌లో 204 పరుగుల లక్ష్యంతో దిగిన దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో పాక్‌పై గెలిచింది. తొలుత ఫెహ్లుక్వాయో బౌలింగ్ (4/22), బ్యాటింగ్ (69 నాటౌట్)రెండింటిలోనూ రాణించాడు. డుసెన్ 80 పరుగులు చేశాడు.

ఆ ముగ్గురు ముందుకు

- సైనా, సింధు, శ్రీకాంత్ శుభారంభం
- ఇండోనేసియా మాస్టర్స్ నుంచి ప్రణీత్ అవుట్



జకార్తా: భారత స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశారు. మహిళల సింగిల్స్ తొలిరౌండ్లో ఎనిమిదో సీడ్ సైనా 7-21, 21-16, 21-11తో స్థానిక షట్లర్ దినార్ ద్యా ఆస్టిన్‌పై గెలుపొంది రెండోరౌండ్ చేరింది. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో రెండో సీడ్ సింధు 22-24, 21-8, 21-17తో చైనాకు చెందిన ఒలింపిక్ మాజీ విజేత జురుయ్ లీని ఓడించింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో 8వ సీడ్ కిడాంబి శ్రీకాంత్ 21-12, 21-8తో చోంగ్ వీ ఫెంగ్ (మలేసియా)పై అలవోకగా గెలిచాడు. మిగతా భారత షట్లర్లలో సాయిప్రణీత్ 12-21, 16-21తో ఒలింపిక్ విజేత చెన్ లోంగ్ (రష్యా) చేతిలో, కశ్యప్ 12-21, 16-21తో ఆంథోనీ (ఇండోనేసియా) చేతిలో ఓడాడు. పురుషుల డబుల్స్‌లో సుమిత్ రెడ్డి-మను అత్రి జంట కూడా బోణీ చేసింది. సిక్కిరెడ్డి-అశ్విని పొన్నప్ప 14-21, 14-21తో థాయ్‌లాండ్ జంట కితిహరకుల్-ప్రజోన్‌జోయ్ చేతిలో చిత్తయింది.





పానవట్టంపై పాదాలు.. 6వేల ఏళ్లనాటిదిగా అంచనా

● మెదక్‌లో మధ్యయుగం నాటి శివలింగం!

మెదక్ పట్టణంలో మధ్యయుగం నాటి శివలింగం బయటపడింది. మెదక్ నుంచి చేగుంట వెళ్లే దారిలో పిల్లికొట్టా సమీపంలోని హనుమాన్ ఆలయం వద్ద చరిత్ర పరిశోధకుడు శంకర్ రెడ్డి జరిపిన పరిశోధనల్లో ఈ శివలింగం లభ్యమైంది. ఇది 6000 ఏళ్లనాటిదిగా అంచనా వేశారు. సాధారణంగా శివలింగంపై ఎలాంటి ఆనవాళ్లు ఉండవు. కానీ ఇక్కడ లభ్యమైన శివలింగం పానవట్టంపై పాదాలు ఉండటం విశేషం. అయితే, ఈ ప్రాంతాన్ని గతంలో రేణుకాపురంగా పిలిచేవారని శంకర్ రెడ్డి తెలిపారు. ఈ శివలింగాన్ని చూస్తే మెదక్ సీమ ప్రాంతంలో మధ్యయుగానికి సంబంధించిన జీవన విధానాలకు సంబంధించిన మరిన్ని ఆనవాళ్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. నాటి కాలంలో శివలింగంపై నడిచి ఉంటారని, ఆ గుర్తులే వచ్చాయా, లేక ఏవైనా చారిత్రక అంశాలు ఉన్నాయా అనేది పరిశోధించాల్సి ఉందని చెప్పారు.

- మెదక్ రూరల్

10 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందే

- తెలంగాణ, ఏపీ స్పందించకపోవడం దారుణం: కరుణాకర్‌రెడ్డి



బర్కత్‌పుర/హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో త్వరలో చేపట్టబోయే ఉద్యోగ నియామకాల్లో అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డి.కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. విద్యారంగంలో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్లు వెలువడుతున్నాయని, వీటిలోనూ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి కేంద్ర ప్రభుత్వం 10శాతం రిజర్వేషన్ ప్రకటించినప్పటికీ, తెలంగాణ ఏపీ ప్రభుత్వాలు ఇప్పటి వరకూ స్పందించకపోవడం దారుణమని అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాజా రిజర్వేషన్‌లో కాపులకు 5శాతం, ఇతర వర్గాలకు మిగతా 5 శాతం అమలు చేస్తామన్న ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటన అయోమయానికి గురి చేస్తోందన్నారు. అగ్రవర్ణాలను వర్గీకరించి రిజర్వేషన్లు అమలు చేస్తామనడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఓసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.50వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల్లో 'గుడ్డు' బంద్!

- జగిత్యాలలో నెలరోజులుగా నిలిచిన సరఫరా
- అక్రమాల నివారణకు జియోట్యాగింగ్
- కొత్త నిబంధనతో సరఫరా ఆపేసిన కాంట్రాక్టర్లు





జగిత్యాలలోని ఓ అంగన్‌వాడీ కేంద్రం

జగిత్యాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలు, అవకతవకలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం తెచ్చిన ఓ నిబంధనతో.. కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన జియోట్యాగింగ్ వారికి ఇబ్బందిగా మారడంతో జగిత్యాల జిల్లాలో నెలరోజులుగా కోడిగుడ్ల సరఫరాను నిలిపివేశారు. జగిత్యాల జిల్లాలో 1,057 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 73,788 మంది పిల్లలు, 7,774 మంది బాలింతలు, 7,393 మంది గర్భిణులు ఉన్నారు. గర్భిణులు, బాలింతలకు వారంలో 2 రోజులు ఎగ్ ఫ్రై, 2 రోజులు ఉడికించిన కోడిగుడ్లు, మరో 2 రోజులు పెరుగు, పాలతో పాటు గుడ్డుతో అన్నం అందించాల్సి ఉంటుంది. వీటిని కాంట్రాక్టర్లు తమకు వీలైనప్పుడు సరఫరా చేసేవారు. కానీ బయోమెట్రిక్ విధానం ద్వారా ఇప్పుడు నెలకు మూడు విడతలుగా గుడ్లను సరఫరా చేయాల్సి ఉంటుంది. అది కాకుండా గుడ్ల సరఫరా కోసం చేపట్టిన జగిత్యాల, మల్యాల, ధర్మపురి, మెట్‌పల్లి ప్రాజెక్టుల టెండర్ల కాలపరిమితి గత ఏడాది మార్చిలోనే ముగిసింది. అయినప్పటికీ బలవంతం మీద కాంట్రాక్టర్లు గుడ్ల సరఫరాను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగా జియోట్యాగింగ్ పెట్టడంతో సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించి అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్ల సరఫరా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

యూట్యూబ్ చూసి తుపాకుల తయారీ

- కొడకండ్ల దారిదోపిడీ ముఠా అరెస్టు
- నగదు, నాటు తుపాకులు, బుల్లెట్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులు చూపిస్తున్న సీపీ రవీందర్

వరంగల్ అర్బన్ క్రైం, జనవరి 23: ఈజీ మనీ కోసం దారిదోపిడీల బాట పట్టారు.. బాటసారులను బెదిరించేందుకు నాటు తుపాకులను చేతపట్టారు.. చట్టవిరుద్ధమని తెలిసినా, యూట్యూబ్ వీడియోలు చూస్తూ నాటు తుపాకుల తయారీ చేపట్టారు.. పోలీసులు రంగంలోకి దిగడంతో వారి ఆటకట్టయింది. జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి సమీపంలో జరిగిన దారిదోపిడీ కేసును వరంగల్ కమిషనరేట్ పోలీసులు ఛేదించారు. సంక్రాంతి రోజు(ఈనెల 15)న అర్ధరాత్రి బ్రాందీషాపు మూసివేసి వస్తున్న ముగ్గురు మద్యం దుకాణం నిర్వాహకులను నాటు తుపాకులతో బెదిరించిన ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5.56 లక్షల నగదుతో పాటు 3 నాటు తుపాకులు, 10 బుల్లెట్లు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం హన్మకొండ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సీపీ రవీందర్ వివరాలను వెల్లడించారు. జనగామ జిల్లా కొడకండ్ల మండలం మాంగ్యా చెరువు తండాకు చెందిన ఇస్లావత్ శంకర్, నల్గొండ జిల్లా పిట్టంపెల్లికి చెందిన నారబోయిన మల్లేశ్, అదే జిల్లాకు చెందిన గంగారపు స్వామి, జనగామ జిల్లా చెన్నూరుకు చెందిన పిట్టల శ్రీనివాస్, చీలూరి రమేశ్, నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం కొత్తపల్లికి చెందిన సరపంగి విప్లవ్‌లు ఈ దారి దోపిడీకి పాల్పడినట్లు తెలిపారు. ఘటనాస్థలిలో పరిసరాల్లోని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించినట్లు పేర్కొన్నారు. వారిలో స్వామి, శంకర్‌లు మాజీ నక్సలైట్లు కావడంతో తుపాకులపై అవగాహన ఉందని నిర్ధారించారు. వారిని విచారించగా సులువుగా డబ్బులు సంపాదించేందుకు యూట్యూబ్ చూసి తుపాకులు, బుల్లెట్లు తయారు చేశామని ఒప్పుకున్నట్లు సీపీ వివరించారు. త్వరగా కేసు ఛేదించిన పోలీసు సిబ్బందిని ఆయన ప్రశంసించారు.



కొడుకు ప్రశాంత్‌తో జమదగ్ని, శిరీష దంపతులు

మా కొడుకు ప్రాణాలు నిలబెట్టండి సారూ!

- సీఎం కేసీఆర్‌కు యక్షగాన కళాకారుడి వినతి
- స్టినోసిస్ వ్యాధితో కుమారుడికి అస్వస్థత

చేర్యాల, జనవరి 23: పొట్ట నింపకున్నా అంతరించిపోతున్న చిందు, యక్షగాన కళకు దివిటీ అయి.. తెలంగాణ ఉద్యమంలో గజ్జెగట్టి ఆడి పాడి యువతలో స్ఫూర్తినింపిన ఆ నిరుపేద కళాకారుడికి పెద్ద కష్టమే వచ్చిపడింది. నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కన్నబిడ్డకు వైద్యం చేయించలేక.. అతడు ఎదుర్కొంటున్న అవస్థను చూడలేక సతమతమవుతున్నాడు. పాట పాడితే గానీ తనకు పూట గడవదని.. తన కుమారుడికి పునర్జన్మ కలిగించాలని సీఎం కేసీఆర్‌ను వేడుకుంటున్నాడు సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరుకు చెందిన గజ్జెల జమదగ్ని. అతని చిన్న కొడుకు ప్రశాంత్ కొన్నాళ్ల క్రితం అస్వస్థతకు గురికాగా స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా నయం కాకపోవడంతో హైదరాబాద్‌లో చూపించారు. ప్రశాంత్ స్టినోసిస్ జబ్బు బారిన పడ్డాడని.. వెంటనే ఆపరేషన్ చేయాలని, అందుకు రూ.5లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో అంత డబ్బు ఎలా తెచ్చేదంటూ జమదగ్ని దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు. సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు చొరవ చూపి తమ కుమారుడి ప్రాణాలు నిలబెట్టాలని వేడుకుంటున్నారు. దాతలు 9701805782, 9963717718 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆ మహిళలు అక్కాచెల్లెళ్లు

- 'మూసీ' మృతులు బాలాపూర్‌కు చెందినవారు
- కూరగాయల విక్రయం.. కల్లు కాంపౌండ్లలో సంచారం
- పౌర్ణమి, అమావాస్యకు ప్రత్యేక పూజలు
- బాలాపూర్-మూసీ వరకు సీసీ ఫుటేజీల పరిశీలన



యాదమ్మ, సుమిత్ర(ఫైల్)

లంగర్‌హౌజ్/సరూర్‌నగర్/హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ అత్తాపూర్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి మూసీ నదిలో దారుణహత్యకు గురైన ఇద్దరు మహిళల వివరాలు తెలిశాయి. 'మూసీలో నరబలి?' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తలోని ఫొటోల ఆధారంగా మృతులను బాలాపూర్‌కు చెందిన అక్కాచెల్లెళ్లు సుమిత్ర, యాదమ్మగా వారి కుటుంబసభ్యులు గుర్తించారు. ఈ మేరకు సుమిత్ర కూతురు నవనీత బుధవారం ఉదయం లంగర్‌హౌజ్ పోలీసు స్టేషన్‌కు వచ్చి వివరాలు వెల్లడించారు. కల్లు తాగేందుకు వెళ్తున్నామని చెప్పి సోమవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. కాగా, రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం దెబ్బడగూడకు చెందిన సుమిత్ర, యాదమ్మ కుటుంబసభ్యులు బతుకుదెరువు కోసం పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలసవచ్చారు. బాలాపూర్‌లోని అయోధ్యనగర్‌లో ఉంటూ స్థానిక బస్తీల్లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే, వారు ఎప్పుడు చూసినా కల్లు తాగి, మత్తులో కనిపించేవారని స్థానికులు తెలిపారు. సోమవారం పిసల్‌బండ రోడ్డులోని కల్లు కంపౌండ్‌లో కల్లు తాగి, ఆటోలో ఎక్కడికో వెళ్లిపోయారన్నారు. కాగా, అమ్మవారి భక్తురాలైన సుమిత్ర.. పౌర్ణమి, అమావాస్యలకు ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు మహిళల మృతదేహాలు లభ్యమైన మూసీ నది ప్రాంతంలో డాగ్‌స్క్వాడ్ సహాయంతో పోలీసులు బుధవారం మరోసారి తనిఖీ చేశారు. హత్యకు వాడిన ఆయుధాల కోసం గాలించారు. బాలాపూర్ చౌరస్తా నుంచి మూసీ నది వరకు సీసీ టీవీ ఫుటేజీలను సేకరిస్తున్నారు. ఈ ఇద్దర్ని ఎవరు హత్య చేశారు? నరబలి కోణం ఏమైనా ఉందా అనే కోణంలోనూ ప్రత్యేక దర్యాప్తు చేపడుతున్నట్లు లంగర్‌హౌజ్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.